ఈనాడు

హైదరాబాద్ 15-2-2018 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 186

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 18+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



ఎదురుచూపులు ఎన్నాళ్లు

కెరమెరి మండలం గోయగాంలో పింఛనుదారుల నిరీక్షణ



సాహసం సేయరా

దస్నాపూర్‌లో సిగ్నల్ కోసం ట్యాంకు ఎక్కిన డీలరు, మహిళ. కింద వేచి ఉన్న లబ్ధిదారులు



కష్టాల 'ముద్ర'

తిమ్మాపూర్‌లో మండుటెండలో డాబాపైన వేలిముద్రలు తీసుకుంటున్న డీలరు

'కర్ర'వదలని విక్రమార్కులు



తిమ్మాపూర్‌లో సిగ్నల్ కోసం తీగను ఇలా కర్రకు కట్టి పట్టుకున్న యువకుడు

ఏడి 'పింఛను'.. ఎత్తులెక్కితేనే రేషను

యంత్రాలకు అంతర్జాల సంకేతాలు సక్రమంగా అందని తీరు..పేదలకు కొత్తకష్టాలు తెచ్చిపెడుతోంది. రేషన్ సరకులు, పింఛను పంపిణీ చేసే డీలర్లు, అధికారులు సాంకేతాల కోసం ఈపాస్ యంత్రాలతో నీళ్లట్యాంకులు, చెట్లు, మేడలపైకి వెళ్తుండగా..వేలిముద్ర వేసే క్రమంలో వారిని అనుసరించేందుకు వృద్ధులు, మహిళలు నానాపాట్లు పడుతున్నారు. అయినా సంకేతాలు అందుతాయన్న నమ్మకం లేకపోవడంతో.. ఒక్కోసారి రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితీ ఉందని లబ్ధిదారులు వాపోతున్నారు. నిర్మల్ జిల్లా కడెం మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన ఏదుల లస్మవ్వ మంగళవారం వేలిముద్ర వేసేందుకు మేడ మీదకెళ్లి కిందికి దిగుతూ జారిపడి అక్కడికక్కడే మృతిచెందింది కూడా. ఏజెన్సీ ప్రాంతాలైన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలం, ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం తిమ్మాపూర్, ఇంద్రవెల్లి మండలం దస్నాపూర్‌లలో లబ్ధిదారుల కష్టాలకు ఈ చిత్రాలే దర్పణం.

- న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి, కెరమెరి, ఇచ్చోడ గ్రామీణం

పైసలిస్తేనే ఫైలు కదిలేది

- ప్రతి రిజిస్ట్రేషన్‌కు లంచం తప్పదు
- సక్రమమైనా వేలకు వేలు ముట్టజెప్పాల్సిందే
- అక్రమ రిజిస్ట్రేషన్లయితే సిబ్బందికి పండగే
- నడిపించేది దస్తావేజు లేఖర్లే
- సాయంత్రానికి లెక్క వేసి ఎవరి వాటా వాళ్లకు
- అవినీతి విలువ ఏటా కనీసం రూ.300 కోట్లు

సక్రమం..

నల్గొండ జిల్లాకు చెందిన రైతు రెండెకరాల వ్యవసాయ భూమి కొన్నారు. రిజిస్ట్రేషన్ కోసం దస్తావేజు రాసేవారిని సంప్రదించగా ఎకరాకు అదనంగా రూ.1500 ఇస్తేనే రిజిస్ట్రేషన్ అవుతుందని తేల్చిచెప్పారు. స్టాంపు డ్యూటీ సహా అన్నీ చెల్లించారు. అయినా దస్తావేజులు రాసినందుకు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో చెల్లించేందుకు అదనంగా రూ.5000 ఇస్తేనే రిజిస్ట్రేషన్ పూర్తయింది.



అక్రమం..

సంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక వ్యక్తి రామచంద్రాపురంలో ఎకరం ప్రభుత్వ భూమిపై కన్నేశాడు. ఆ భూమికి నకిలీపత్రాలను సృష్టించాడు. వీటి ఆధారంగా సమీప బంధువుల పేరుతో మార్చేందుకు రంగం సిద్ధం చేశాడు. సర్వే నెంబర్‌లో ఉన్న గందరగోళాన్ని ఆసరాగా చేసుకుని రెవెన్యూ అధికారుల సహకారంతో నకిలీ నిరభ్యంతర పత్రాన్ని సృష్టించారు. వీటి ఆధారంగా సబ్‌రిజిస్ట్రార్ ద్వారా పనిని చక్కబెట్టుకున్నాడు. ఆ అధికారికి పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టజెప్పాడు.

ఈనాడు, హైదరాబాద్: లా మీరు ఏ రకమైన ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి రిజిస్ట్రేషన్ కార్యాలయం గడప తొక్కినా లంచం ఇవ్వాల్సిందే. అక్రమంగా ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకుంటే లక్షల్లో ముట్టజెప్పాలి. అన్నీ సక్రమంగా ఉన్నా ఎంతో కొంత సమర్పించుకోకుంటే ఫైలు కదలదు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి వ్యవస్థీకృతం. అపార్ట్‌మెంట్‌కి ఒక రేటు.. ఎకరం వ్యవసాయ భూమి అయితే మరో రేటు.. వాణిజ్య సముదాయాలకు వేరే రేట్లు.. అవకతవకలున్నవి అయితే ప్యాకేజీ. అంతా సక్రమంగా ఉన్నా చట్టబద్ధంగా చెల్లించే మొత్తంతో సమానంగా డబ్బులిస్తేనే దస్త్రం ముందుకు కదులుతుంది. లేదంటే ఏదో ఒక అభ్యంతరంతో ఆపేస్తారు. లంచం ఇవ్వకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిని వేళ్లపై లెక్కించవచ్చంటే అతిశయోక్తి కాదు. తెలంగాణలో మెజారిటీ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతి నిలయాలుగా మారాయి. వీటిలో ఏటా లంచాలుగా ఇచ్చుకుంటున్నది రూ.300 కోట్లపై మాటే అని అంచనా. సబ్‌రిజిస్ట్రార్ల పేరు చెప్పి దళారులుగా వ్యవహరిస్తున్న కొందరు దస్తావేజుల లేఖర్లు రిజిస్ట్రేషన్ల కోసం వచ్చేవారి నుంచి వేలకు వేలు వసూలు చేస్తున్నారు. పర్యవేక్షణ లోపం, నిబంధనల (మిగతా 2లో)

కాపు కోటాకు అభ్యంతరం

- కేంద్ర హోంశాఖకు లేఖ రాసిన సిబ్బంది శాఖ
- రిజర్వేషన్లు 50% మించరాదని సుప్రీం చెప్పిందని వెల్లడి
- తెలంగాణ పేరు ప్రస్తావనతో గందరగోళం

ఈనాడు - అమరావతి, హైదరాబాద్

కాపుల రిజర్వేషన్ల అంశానికి కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీఓపీటీ) అభ్యంతరం వ్యక్తం చేసింది. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు ఇటీవలే ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఒక బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపిన విషయం తెలిసిందే. దీనిపై కేంద్ర హోం మంత్రిత్వశాఖ వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల అభిప్రాయాన్ని కోరింది. వాటిలో సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీఓపీటీ) కూడా ఒకటి. దీనిపై డీఓపీటీ తాజాగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ- రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న సుప్రీంకోర్టు తీర్పును గుర్తు చేసింది. 1992 నవంబరు 16న ఇందిరా సాహ్ని కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం- రిజర్వేషన్లు 50 శాతానికి మించటానికి లేదనీ, ఒకవేళ అంతకు మించి కల్పించాలంటే అందుకు బలమైన ప్రాతిపదికగానీ, అసాధారణ పరిస్థితులు గానీ అవసరమని పేర్కొంది. అయితే తాజా బిల్లు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అలాంటి బలమైన ప్రాతిపదికలు ఏమిటో స్పష్టం చేయలేదని అభిప్రాయపడింది. అలాగే రిజర్వేషన్లనేవి ఆయా వర్గాలకు 'సముచిత రీతిలో' కల్పించాలే తప్ప జనాభా ప్రాతిపదికన కాదన్న (మిగతా 2లో)



జలసౌధలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషిని సన్మానిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో సాగునీటి శాఖ ఉన్నతాధికారులు మురళీధర్‌రావు, వికాస్‌రాజ్ తదితరులు

కృష్ణాలో 575 టీఎంసీలు కేటాయించాలి

- గోదావరి, కృష్ణాలో తెలంగాణకు న్యాయమైన వాటా ఇవ్వాలి
- పట్టిసీమలోనూ 45 టీఎంసీలు మావే
- పోలవరం ముంపు సమస్యలపై అధ్యయనం చేయాలి: మంత్రి హరీశ్‌రావు

2లో

హామీ ప్రకారం పరిహారం చెల్లించాల్సిందే

- భూసేకరణ విషయంలో తెలంగాణకు స్పష్టం చేసిన హైకోర్టు
- వచ్చే బడ్జెట్‌లో రూ.458 కోట్లను విడతలవారీగా చెల్లిస్తామన్న ప్రభుత్వం
- ఆంధ్రప్రదేశ్ నివేదికపై సందేహాలున్నాయన్న ధర్మాసనం

6లో



'భారతీయుడు-2' చివరి సినిమా

- కమల్‌హాసన్

16లో

పీఎన్‌బీలో ఘరానా మోసం

- రూ. 11వేల కోట్ల కుంభకోణం
- వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీపై సీబీఐకి ఫిర్యాదులు
- మరో ఆభరణాల కంపెనీపైనా అనుమానాలు
- 10 మంది అధికారులపై సస్పెన్షన్ వేటు

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)కి చెందిన ముంబయిలోని ఒక శాఖలో 1.77 బిలియన్ డాలర్ల (సుమారు రూ.11,400 కోట్ల) మేర మోసం వెలుగుచూసింది. అత్యంత సంపన్నుడైన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, మరో ఆభరణాల కంపెనీ ఈ మేరకు మోసపూరిత లావాదేవీలకు పాల్పడినట్లు బ్యాంకు వర్గాలు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి ఫిర్యాదు చేశాయి. ఈ కంపెనీకి, నీరవ్‌కి సంబంధం ఉందా అనేది వెంటనే తెలియరాలేదు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖులు ధరించే ఆభరణాలను సమకూర్చే ఈ వ్యాపారిపై రూ.280 కోట్ల మోసానికి సంబంధించి ఈ నెల 5న పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచే అందిన ఒక ఫిర్యాదుపై విచారణ (మిగతా 2లో)



నీరవ్ మోదీ

ఇదీ సంగతి!



నాదేం తప్పు సార్, ఎక్కువ కార్డులు ఉంటే పేదలకు ఎక్కువ లబ్ధి చేకూరుతోందని ఇచ్చాను.

విత్తన పత్తికి భారీగా బ్యాంకు రుణం

- ఎకరానికి రూ. 1.26 లక్షలు
- సాధారణ పత్తికిచ్చేది రూ.35 వేలే
- వరి విత్తన పంట వేస్తే రూ.42 వేలు
- మిరప పంటకు రూ.45 వేల నుంచి 58 వేలకు పెంపు
- పంట రుణ పరిమితిని ఖరారు చేసిన రాష్ట్ర బ్యాంకర్ల సమితి

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్రంలో రైతులను విత్తన పంటల సాగువైపు మళ్లించేందుకు వ్యవసాయశాఖ బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే జూన్ నుంచి మొదలయ్యే వానాకాలం(ఖరీఫ్) సీజన్‌లో విత్తన పంటలు సాగుచేసే రైతులకు భారీగా పంట రుణం ఇప్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి కొత్త రుణ పరిమితి(స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)ను వ్యవసాయశాఖ సూచనల మేరకు విత్తన, సాధారణ పంటలకు కలిపి రూపొందించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2017-18) వరకూ ఇలా విత్తన పంటలకు ప్రత్యేకంగా పంటరుణ పరిమితి లేదు. సాధారణ పంటలతో పాటు వీటికి ఎంత ఇవ్వాలనే వివరాలను తాజాగా సమితి ప్రకటించింది. సాగువ్యయం కన్నా రుణపరిమితి తక్కువగా ఉండటం గమనార్హం.

■ రాష్ట్రంలో కీలకమైన పత్తి పంట సాగును పెద్దగా ప్రోత్సహించకూడదని వ్యవసాయశాఖ యోచిస్తోంది. అందుకే ప్రస్తుత ఏడాది మాదిరిగానే వానాకాలంలో సైతం రూ.35 వేలు మాత్రమే ఎకరానికి (మిగతా 2లో)

మైనింగ్ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాలి

- రాష్ట్రాలకు కేంద్ర సహకారం
- కేంద్ర గనులశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్
- పర్యావరణానికి హాని జరగకుండా చూడాలి: గవర్నర్
- టెక్నాలజీతో అక్రమాలకు అడ్డుకట్ట : కేటీఆర్
- ప్రారంభమైన మైనింగ్‌టుడే 2018 సదస్సు



జ్యోతి వెలిగించి మైనింగ్‌టుడే సదస్సును ప్రారంభిస్తున్న గవర్నర్ నరసింహన్, చిత్రంలో కేంద్ర, రాష్ట్ర గనులశాఖ మంత్రులు నరేంద్రసింగ్ తోమర్, కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: దేశంలో వ్యవసాయం తర్వాత అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్నది మైనింగ్ రంగమని కేంద్ర గనులశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ పేర్కొన్నారు. ఖనిజ సంపద అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే పేదరికం ఎక్కువగా ఉందని, ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరముందన్నారు. 17 వరకు జరిగే నాలుగురోజుల 'మైనింగ్‌టుడే 2018 సదస్సు, ఎగ్జిబిషన్' బుధవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ప్రారంభమైంది. తెలుగురాష్ట్రాల గవర్నర్ నరసింహన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన సదస్సుకు తోమర్‌తో పాట రాష్ట్ర గనులశాఖ మంత్రి కేటీఆర్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తోమర్ మాట్లాడుతూ గనుల అనుమతులు, తవ్వకాల విషయంలో కేంద్ర సహకారం రాష్ట్రాలకు సంపూర్ణంగా ఉంటుందన్నారు. కేంద్రం, రాష్ట్రాలు కలిసి ఈ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు.

'దేశ జీడీపీలో మైనింగ్‌ది కీలకస్థానం. 2014కు ముందు పరిస్థితుల్ని నరేంద్రమోదీ సర్కారు పూర్తిగా మార్చింది. పారదర్శకత, జవాబుదారీతనం తీసుకువచ్చింది. గనుల కేటాయింపులో ఈ-వేలం విధానం తెచ్చాం. రూ.1.35 లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. రాష్ట్రాల వాటాగా రూ.1.04 లక్షల కోట్లు ఇస్తున్నాం. దేశంలో ఎనిమిది లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఖనిజసంపద ఉంటే అందులో ఒక శాతం విస్తీర్ణంలోనే తవ్వకాలు జరుగుతున్నాయి. ఇది 10 శాతానికి చేరుకుంటే జీడీపీలో మైనింగ్ రంగం వాటా పెరిగి మరిన్ని ఉద్యోగాలు వస్తాయి.'

ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

గనుల తవ్వకాల్లో పనిచేసేవారి ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యమివ్వాలని గవర్నర్ నరసింహన్ పేర్కొన్నారు. 'గనులు అధికంగా ఉండే అటవీప్రాంతాల్లో ప్రభావితమయ్యే ఆదివాసీలకు సరైన పునరావాసం అందించాలి. తవ్వకాల కారణంగా పర్యావరణానికి హాని జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గనుల కేటాయింపు, తవ్వకాల వివరాలు ప్రజలకు తెలిసేలా వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు పొందుపర్చాలి. మైనింగ్ రంగంలో తెలంగాణ ప్రభుత్వం లాగా టెక్నాలజీని వాడుకోవాలి'

తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర

తెలంగాణ అభివృద్ధిలో మైనింగ్ రంగం పాత్ర కూడా కీలకమని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. 'తెలంగాణలో అపారమైన గ్రానైట్, సున్నపురాయి, ఇనుపఖనిజ సంపద ఉంది. దక్షిణాదిలోనే అతి పెద్ద గని సింగరేణి ఇక్కడే ఉంది. టీఎస్ఐపాస్ ద్వారా మైనింగ్ రంగంలో పెట్టుబడుల ఆకర్షణకు ప్రయత్నిస్తున్నాం. ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటుచేయాలి. కేంద్రంతో, ఎన్ఎండీసీతో చర్చించాం. ఛత్తీస్‌గఢ్‌లోని బైలడిల్లా వరకు రైల్వే లైన్ సర్వేకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.రెండు కోట్లు మంజూరు చేసింది. సూర్యాపేట జిల్లాలో మూడు గనులకు రికార్డుసమయంలో మూడునెలల్లో అనుమతులొచ్చాయి. నేరుగా ఇంటికే ఇసుక చేర్చేందుకు శాండ్‌ట్యాక్సీ విధానం అమలుచేస్తున్నాం. సంస్కరణల కారణంగా రాష్ట్రానికి మైనింగ్ ఆదాయం పెరుగుతోంది. 2016-17లో రూ.3,170 కోట్లు వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3,500 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. పర్యావరణ అనుకూల పద్ధతుల్ని తవ్వకాల్లో అనుసరించాలి' అన్నారు. కేంద్ర గనులశాఖ కార్యదర్శి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. మైనింగ్ వల్ల ప్రభావితమవుతున్న ప్రాంతాలు, ప్రజల సంక్షేమం కోసం రూ.13,600 కోట్లు ఖర్చుచేస్తున్నామన్నారు. సదస్సులో తెలంగాణ పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఎ.కె.కోఠారి, ఫిక్కి డైరెక్టర్ జనరల్ దిలీప్ చెనాయ్, సదస్సు ఛైర్మన్ బి.ఆర్.వి.సుశీల్‌కుమార్ ప్రసంగించారు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, దక్షిణాఫ్రికా దేశాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి మైనింగ్ ప్రతినిధులు, తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి హాజరయ్యారు. వివిధ రకాల ఖనిజాలు, గనుల తవ్వకాల్లో ఉపయోగించే యంత్రాలతో హైటెక్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తొలిరోజు సదస్సు అనంతరం గవర్నర్ నరసింహన్ ప్రారంభించారు.

విత్తన పత్తికి భారీగా బ్యాంకు రుణం

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తారు.

- తెలంగాణలో విత్తన పత్తి పంటను పెద్దయెత్తున ప్రైవేటు కంపెనీలు సాగుచేయిస్తున్నాయి. ఈ పంటకు ఇంతకాలం ప్రత్యేకంగా బ్యాంకులు రుణం ఇవ్వనందున కంపెనీల నుంచి అప్పులు తీసుకుని తిరిగి వాటికే తక్కువ ధరకు విత్తన పంట అమ్ముకుని రైతులు నష్టపోతున్నారు. ఈ కష్టాల నుంచి వారిని గట్టెక్కించడానికి ఇకనుంచి విత్తన పంటలకు విడిగా రుణాలివ్వాలని సంకల్పించారు. విత్తన పత్తి పంటకు ఎకరానికి రూ.1,26,000 ఇస్తారు. అదే వరి విత్తన పంట అయితే రూ.42 వేలు ఇస్తారు.
- సాగునీటి వసతి ఉన్న భూముల్లో సాగుచేసే వరి పైరుకు పంటరుణాన్ని అదనంగా రూ.3 వేలు పెంచారు. శ్రీవరి సాగుచేసే వారికి రూ.32 వేలు ఇస్తారు.
- గత ఖరీఫ్‌తో పోలిస్తే వచ్చే ఏడాదికి భారీగా పంట రుణ పరిమితి పెంచిన పంట మిరప. దీని రుణాన్ని ఏకంగా రూ.45 వేల నుంచి 58 వేలకు పెంచారు.

ఈ రుణంతో పంట సాగు సాధ్యమా

బ్యాంకర్ల సమితి ఖరారు చేసిన పంటరుణం పరిమితికి, పంట సాగు వ్యయానికి చాలా వ్యత్యాసముండటంతో రైతులకు మళ్లీ ప్రైవేటు అప్పులు తీసుకోక తప్పని పరిస్థితి ఏర్పడనుంది. ఒక్కో పంట సాగుకు ఎంత వ్యయమవుతుందనే లెక్కలను వ్యవసాయశాఖ శాస్త్రీయంగా నిర్ధారించి ఇటీవల 'జాతీయ వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్'(సీఏసీపీ)కి ఇచ్చింది. ఈ వ్యయాలకు చాలా దూరంగా కొత్త పంటరుణం నిర్ణయించడం గమనార్హం.

- ఉదాహరణకు వరి ఏ గ్రేడ్ ధాన్యం పండించాలంటే ఎకరానికి రూ.49,101 ఖర్చు అవుతున్నట్లు వ్యవసాయశాఖ తేల్చింది. పంటరుణం రూ.34 వేలు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించారు.
- పత్తి పంట సాగుకు రూ.48,614 వ్యయమవుతుంది. గత జూన్‌లో పత్తికి రూ.35 వేల పంటరుణమిచ్చిన బ్యాంకులు ఈ ఏడాదీ దానినే కొనసాగించాలని నిర్ణయించారు. అంటే పత్తి రైతు పెట్టుబడికి ప్రైవేటు అప్పుపై ఆధారపడక తప్పని పరిస్థితి.

వానాకాలం పంటలకిచ్చే బ్యాంకురుణం (ఎకరాకు రూ.ల్లో)

పంట	2018–19	2017–18
వరి	34,000	31,000
కంది	18,000	16,000
మినుము	14,000	12,000
పెసర	15,000	14,000
సెనగ	19,000	18,000
వేరుసెనగ	23,000	22,000
మొక్కజొన్న	28,000	27,000
జొన్న	18,000	15,000
పొద్దుతిరుగుడు	18,000	17,000
నువ్వులు	13,000	12,000
ఆముదం	14,000	12,000
సోయాచిక్కుడు	18,000	12,000
ఆయిల్‌పాం	35,000	32,000
మిరప	58000	45000
చెరకు	55,000	55,000
పసుపు	60,000	55,000
బత్తాయి	45,000	40,000
అరటి	45,000	40,000
మునగ	25,000	22,000
టమాటా	35,000	25,000

కాపు కోటాకు అభ్యంతరం

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యాంగ నిబంధనను సుప్రీంకోర్టు ప్రస్తావించిన అంశాన్నీ గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో కాపుల రిజర్వేషన్ల బిల్లుపై ఆమోద ముద్ర వేయాల్సిన అవసరం లేదని హోం శాఖ రాష్ట్రపతికి సూచించొచ్చని అభిప్రాయపడింది. మరోవైపు ఇదే లేఖలో- ఓబీసీల్లో ఉప వర్గీకరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దిల్లీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తితో ఒక కమిషన్‌ను నియమించిన విషయాన్ని కూడా డీఓపీటీ గుర్తు చేసింది. ఆ కమిషన్ ఓబీసీల ఉప వర్గీకరణ శాస్త్రీయంగా చేయటానికి అవసరమైన విధివిధానాలను, ఇతర ఏర్పాట్లను ఖరారు చేసే పనిలో ఉందని పేర్కొంది.

లేఖలో తెలంగాణ ప్రస్తావన!

కాపుల రిజర్వేషన్‌కు సంబంధించిన ఈ లేఖలో 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం' అని ఉండాల్సిన చోట 'తెలంగాణ ప్రభుత్వం' అని అచ్చు కావటంతో కొంత గందరగోళం నెలకొంది. తెలంగాణ ప్రభుత్వం గత ఏప్రిల్‌లో ముస్లిం రిజర్వేషన్లను 4 శాతం నుంచి 12 శాతానికి, ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచే బిల్లును శాసనసభలో ఆమోదించి, రాష్ట్రపతి ఆమోదం కోసం కేంద్రానికి పంపింది. ఇంతవరకు దీనిపై కేంద్రం నుంచి ఎలాంటి సమాచారం తెలంగాణ ప్రభుత్వానికి అందలేదు.

తెలంగాణ గురించి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లిన అధికారులు..

తాజా లేఖ నేపథ్యంలో తెలంగాణలో ముస్లింలు, గిరిజనులకు రిజర్వేషన్ల పెంపుదలకు సంబంధించి కేంద్రం ఆమోదంపైనా అనిశ్చితి నెలకొంది. కాపు రిజర్వేషన్ల అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పంపిన లేఖలో కోటా 50 శాతానికి పెంచకూడదన్న సుప్రీం తీర్పునే ప్రస్తావించడం.. రిజర్వేషన్లకు జనాభా ప్రాతిపదిక కాదని అభిప్రాయపడడంతో ఇవే నిబంధనలతో తెలంగాణ విన్నపానికి కూడా విఘాతంగా తయారవ్వచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలు పరచడం. . ఆ రాష్ట్రాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూలులో చేర్చడం వంటి అంశాలను కూడా కేంద్రానికి పంపిన లేఖలో వివరించామని తెలంగాణ అధికార వర్గాలు చెప్పాయి. ఈ లేఖలోని విషయాలను తెలంగాణ అధికారులు దిల్లీలో ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీనిపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నుంచి స్పష్టత తీసుకోవాలని సీఎం కేసీఆర్ రాష్ట్ర అధికారులను, ఎంపీలను ఆదేశించినట్లు సమాచారం.

తీరంలో భారీ కాగిత పరిశ్రమ!

కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం పరిశీలించాలన్న చంద్రబాబు

ఈనాడు, అమరావతి: 'కాగితం తయారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తాం. సముద్ర తీరానికి దగ్గరలో 2,500 ఎకరాలు కేటాయించండి. భూమిచ్చిన రెండున్నరేళ్లలో ఉత్పత్తి ప్రారంభిస్తాం. రోజుకు సగటున 4వేల టన్నుల సామర్థ్యంతో అందుబాటులోకి తెస్తాం' అని ఆసియా పల్ప్ పేపర్ (ఏపీపీ) ప్రతినిధులు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సంస్థ ప్రతినిధి బృందం సమావేశమైంది. ఆసియాలోనే అతి పెద్ద కాగిత తయారీ పరిశ్రమను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తామని వారు పేర్కొన్నారు. చైనా మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని తూర్పు తీరంలోనే పరిశ్రమ పెట్టాలని వివరించారు. ముడిపదార్థాల దిగుమతికీ ఇక్కడైతే అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీఎం కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం నౌకాశ్రయాల ప్రాంతాలను పరిశీలించాలని సూచించారు.

అభయహస్తం విస్తరణ

- 78 లక్షలమందికి కొత్తగా బీమా సౌకర్యం
- మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో అభయహస్తం పథకాన్ని విస్తరించి, 20 లక్షలమంది సభ్యుల కుటుంబాలకు చెందిన మొత్తం 78 లక్షలమందికి వర్తించేలా కొత్తగా బీమా సౌకర్యం కల్పించనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ప్రమాదవశాత్తూ మరణించిన వారికి రూ.4 లక్షలు, సహజ మరణమయితే రూ.75 వేల సాయం అందుతుందని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వ పథకాలపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. "టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆసరా, అభయహస్తం ఇతర పథకాల గురించి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసింది. వారు 29.21 లక్షలమందికి మాత్రమే పింఛన్లు ఇవ్వగా.. మా ప్రభుత్వం దానిని 39.77 లక్షలమందికి విస్తరించింది. తెలంగాణ ప్రభుత్వ పథకాల్లో అధికశాతం మహిళలే ఉన్నారు. కాంగ్రెస్ 14 ఏళ్లలో మహిళా సంఘాలకు రూ.16 వేల కోట్ల రుణాలను ఇచ్చింది. మేం మూడున్నరేళ్ల లోనే రూ.22,300 కోట్ల రుణాలను అందజేశాం. పేదలకు ఉపయోగపడేలా ఆసరా పథకం సమర్థంగా అమలు చేస్తున్నాం. కొంతమంది అభయహస్తం లబ్ధిదారులు ఆసరాలోకి మారారు. దీనిని పరిగణనలోనికి తీసుకొని అభయహస్తం పథకాన్ని మరింత మెరుగ్గా, ప్రయోజనకారిగా మార్చాలని భావిస్తున్నాం. ఇందుకోసం బీమా పథకాన్ని తెస్తున్నాం. త్వరలోనే దీనిని అమలులోకి తెస్తాం" అని జూపల్లి అన్నారు.

మైనారిటీలకు అండగా తెరాస ప్రభుత్వం: జితేందర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం మైనారిటీలకు అన్ని విధాలుగా అండగా ఉందని, సీఎం కేసీఆర్ దేశంలోనే వినూత్నమైన పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నారని తెరాస లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణభవన్‌లో మైనారిటీ ఉద్యోగుల, కార్మికుల సంఘం రాష్ట్ర శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మైనారిటీలకు అన్ని రకాల పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు రిజర్వేషన్ల పెంపునకు సీఎం కేసీఆర్ చొరవ తీసుకుంటున్నారని చెప్పారు.

కృష్ణాలో 575 టీఎంసీలు కేటాయించాలి

- నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన వాటాపై గట్టిగా పోరాడాలని ప్రభుత్వం నిర్ణయించింది. కృష్ణాలో తెలంగాణకు 575 టీఎంసీలు కేటాయించి న్యాయం చేయాలని కోరనుంది. తెలంగాణ రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగించేలా ఏపీ చేసే ప్రతిపాదనలు తిప్పికొట్టాలని అధికారులను ఆదేశించింది. పోలవరం బ్యాక్‌వాటర్‌తో ప్రభావితమయ్యే ప్రాంతాలు, తలెత్తే సమస్యలపై అధ్యయనం చేయాలంటూ పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించింది. పట్టిసీమపై కేంద్రానికి ఫిర్యాదు చేయనుంది. ఈ ప్రాజెక్టులోనూ తెలంగాణకు 45 టీఎంసీల వాటా ఉందన్న విషయాన్ని విన్నవించనుంది. గురువారం దిల్లీలో కేంద్ర జలవనరులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై బుధవారమిక్కడ జలసౌధలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, అధికారులతో మంత్రి సమావేశమయ్యారు. పోలవరం బ్యాక్‌వాటర్‌తో గోదావరి పరీవాహక ప్రాంతంలో 124 కి.మీ మేర ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతం ఉంటుందని మంత్రి తెలిపారు. భద్రాచలం సీతారాముల ఆలయంతో సహా పలు గ్రామాలు, బొగ్గు గనులు, మణుగూరు భారజల కేంద్రం ముంపు బారిన పడుతాయన్నారు. ఈ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. బచావత్ ట్రైబ్యునల్ అవార్డు ప్రకారం పోలవరానికి కేంద్ర జల వనరుల సంఘం అనుమతిచ్చిన తరువాత సాగర్ ఎగువనున్న రాష్ట్రాలకు 45 టీఎంసీల నీటిని వినియోగించుకునే హక్కు దక్కుతుందన్నారు. కేంద్రమే పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా చేపట్టినందున ఆ 45 టీఎంసీల నీటిని తెలంగాణకు కేటాయించాలని కోరారు. ఆర్‌డీఎస్ కాలువల ఆధునికీకరణకు ఏపీ కావాలని అడ్డంకులు సృష్టిస్తున్న విషయాన్ని ప్రస్తావించనున్నారు. శ్రీశైలం, సాగర్‌లో టెలిమెట్రిక్ మిషన్లను కేఆర్ఎంబీ ఏర్పాటు చేయలేదని విమర్శించారు. 2017 ఫిబ్రవరిలో తొలివిడతలో పెట్టిన 19 టెలిమెట్రీమిషన్లు పనిచేయడం లేదన్నారు. రెండో విడత జాబితాను ఖరారు చేయలేదని, దీంతో పోతిరెడ్డిపాడు కింద అధిక నీటిని అక్రమంగా తరలిస్తున్నట్లు ఆరోపించారు.

ఏఐబీపీ ప్రాజెక్టులు వెంటనే పూర్తిచేయాలి: సత్వర సాగునీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ) కింద తెలంగాణలో చేపట్టిన ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. జూన్ నాటికి బీమా, నీల్వాయి, కుమురంభీం ప్రాజెక్టులను పూర్తిచేయాలన్నారు. గొల్లవాగును మార్చి, పాలెంవాగును మే నాటికి పూర్తిచేయాలని సూచించారు. 2019 మార్చి నాటికి దేవాదుల, జూన్‌కి ఎస్సారెస్పీ వరదకాలువ అందుబాటులోకి రావాలన్నారు.

తెలంగాణ పౌరుడిగా పనిచేస్తున్న సీఎస్: తెలంగాణ పునర్నిర్మాణంలో నీటిపారుదలశాఖ వ్యవహారాలు పర్యవేక్షించి, అత్యంత బాధ్యతాయుతంగా సీఎస్ ఎస్కే జోషి పనిచేశారని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆయన చిత్తశుద్ధిని సీఎం గుర్తించారని చెప్పారు. ఆయన ఒక ఐఏఎస్, పాలనాధికారిలా కాక తెలంగాణ పౌరుడిగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి, నీటిపారుదల శాఖ అధికారులు జోషిని సన్మానించారు. తన 34 ఏళ్ల సర్వీసులో హరీశ్‌రావు లాంటి మంత్రిని చూడలేదని జోషి చెప్పారు. సమావేశంలో నీటిపారుదల ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, ఈఎన్‌సీలు మురళీధర్‌రావు, నాగేందర్‌రావు, సీఈలు పాల్గొన్నారు.

రబీలో 19 లక్షల ఎకరాలకు సాగునీరు: వివిధ ప్రాజెక్టుల కింద రబీలో 19 లక్షల ఎకరాలకు సాగునీరందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. శ్రీరాంసాగర్ కింద 6 లక్షలు, సాగర్ కింద 5 లక్షలు, నిజాం సాగర్ కింద 2 లక్షలు, మీడియం ప్రాజెక్టుల కింద 6 లక్షల ఎకరాలకు నీరందిస్తామన్నారు. ఈ లక్ష్యాలను సాధిస్తూనే మిషన్ భగీరథకు కేటాయించిన 12 టీఎంసీల నీటిని జలాశయాలలో కాపాడుకోవాలని సూచించారు. ప్రాజెక్టుల నిర్వాహణ, ఆయకట్టు, మిషన్ భగీరథ తదితర అంశాలపై మంత్రి చీఫ్ ఇంజనీర్లు, ఎస్ఈలతో సమీక్షించారు. ఏప్రిల్ 5న సాగర్ ఎడమ కాలువ, ఏప్రిల్ 16న ఎస్ఆర్ఎస్పీ కాలువ, మార్చి 20న ఎల్ఎండీ కాలువ మూసివేయాలని మంత్రి ఇంజినీర్లను ఆదేశించారు. పులిచింతల పునరావాస పనులను 2018 జూన్‌లోగా పూర్తి చేయాలని సూర్యాపేట జేసీకి చెప్పారు.

సీతారామ.. పురోగతిపై అసంతృప్తి: సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పురోగతిపై వారు సమీక్షించి పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్యాకేజీల వారీగా మాట్లాడారు. మూడు పంప్ హౌజ్‌లను ఎప్పటిలోగా పూర్తి చేయనున్నారో తేదీల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

పదేళ్లుగా పరారీలో ఉన్న ఐఎమ్ ఉగ్రవాది పట్టివేత

- 165 మంది ప్రాణాలు తీసిన బాంబుపేలుళ్లలో ప్రమేయం



అరిజ్ ఖాన్

దిల్లీ: పదేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న ఇండియన్ ముజాహిదీన్(ఐఎమ్) కీలక ఉగ్రవాది ఆరిజ్‌ఖాన్(32)ను దిల్లీ పోలీసులు పట్టుకున్నారు. భారత్-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో అతన్ని అరెస్టు చేసినట్లు డీసీపీ (ప్రత్యేక విభాగం) ప్రమోద్‌సింగ్ కుష్వా బుధవారం తెలిపారు. ఐఎమ్ ఉగ్రవాదసంస్థకు బాంబుల తయారీలో ఆరితేరిన ఆరిజ్‌ఖాన్‌కు 2007-08 మధ్య దిల్లీ, అహ్మదాబాద్, జైపుర్ తదితర ప్రాంతాల్లో జరిపిన వరుస బాంబుపేలుళ్లతో సంబంధం ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటనల్లో 165 మంది ప్రాణాలు కోల్పోగా.. 535 మంది గాయపడ్డారు. 'సిమీ'తోనూ సంబంధాలున్న ఆరిజ్‌ఖాన్‌పై రూ. 15 లక్షల రివార్డు ఉంది. ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీసు కూడా జారీ చేసింది. 2008లో దిల్లీలోని బటలాహౌస్ వద్ద జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో మరో నలుగురితో కలిసి కనిపించిన ఆరిజ్‌ఖాన్ నాటి నుంచి పరారీలో ఉన్నాడు. నేపాల్‌కు పారిపోయి.. సలీమ్ పేరిట పౌరసత్వ కార్డు, పాస్‌పోర్టు సంపాదించాడు. రెస్టారెంటును నడిపేందుకు ప్రయత్నించి.. తర్వాత నేపాల్‌లోని కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. అనంతరం ఐఎమ్ వ్యవస్థాపకుడు రియాజ్ భత్కల్‌తో సంబంధాలు పెంచుకుంటూ అతడి ప్రోద్బలంతో 2014లో సౌదీఅరేబియా వెళ్లి ఉగ్రవాదసంస్థకు నిధుల సేకరణలో కీలకపాత్ర పోషించాడు. తిరిగి గతేడాది మార్చిలో నేపాల్ చేరుకున్న ఆరిజ్‌ఖాన్ అప్పుడప్పుడూ భారత్‌కు వచ్చేవాడని కుష్వా వెల్లడించారు. అతడ్ని పట్టుకోవడం పోలీసులు సాధించిన ఘనతగా పేర్కొన్నారు. వరుస పేలుళ్లతో ప్రమేయం ఉన్న మరో కీలకవ్యక్తి తౌఖీర్‌ను గత నెలలో అరెస్టు చేసినట్లు తెలిపారు.

కెరటాలు మింగేశాయి..

కుమారుడిని కాపాడి ప్రాణాలొదిలిన ఇద్దరు మిత్రులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: కుమారుడిని కాపాడడానికి తండ్రి.. ఆయన్ని కాపాడదామని స్నేహితుడు.. సముద్రం అలల్లో ముందుకెళ్లారు. కుమారుడు సురక్షితంగా బయటపడగా.. తండ్రి, ఆయన స్నేహితుడు తనువు చాలించారు. విశాఖపట్నానికి చెందిన శివరామప్రసాద్ (48), కె.రమణ (45) స్నేహితులు. మహాశివరాత్రిని పురస్కరించుకొని సముద్ర స్నానాలు ఆచరించటానికి వీరు కుటుంబసభ్యులతో కలిసి బుధవారం ఉదయం తీరానికి వచ్చారు. 20 ఏళ్ల వయసు కుమారుడు అలల్లో చిక్కుకోవటంతో రక్షించటానికి తండ్రి శివరామప్రసాద్ ప్రయత్నించి కెరటాల్లో చిక్కుకున్నాడు. స్నేహితుడిని రక్షించటానికి వెళ్లి రమణ కూడా అలల్లో మునిగిపోయాడు. ఎక్కువ నీరు తాగేయడంతో వీరిద్దరూ మృత్యువాత పడ్డారు.

పైసలిస్తేనే ఫైలు కదిలేది..

(మొదటి పేజీ తరువాయి)

లొసుగులు, కీలకమైన స్థానాల్లో ఖాళీలుండడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతి మూడు రిజిస్ట్రేషన్లు.. ఆరు లంచాలుగా వర్ధిల్లుతోంది.

దస్తావేజు లేఖర్లే కీలకం

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దస్తావేజులు రాసే వారే అవినీతిలో కీలక పాత్రధారులు. రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వానికి చెల్లించే మొత్తంతోపాటు సబ్‌రిజిస్ట్రార్ నుంచి అటెండర్ వరకు డబ్బులివ్వాల్సిందే అని లెక్కలేసి మరీ వసూలు చేస్తున్నారు. చాలాచోట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం దగ్గర ఉండే దస్తావేజు లేఖర్లు ఎన్ని రిజిస్ట్రేషన్లు అయ్యాయో సాయంత్రానికి లెక్కవేసి ఎవరి వాటా వారికి ముట్టజెబుతున్నారు. ప్రతి రిజిస్ట్రేషన్‌కు కనీసం రూ.3వేలు అదనంగా చెల్లిస్తే తప్ప పని చేయడం లేదు. తెలంగాణలో ఏటా సుమారు 10 లక్షలకు పైగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అంటే ఈ లెక్కన కనీసం 300 కోట్ల రూపాయలు లంచాలుగా ఇవ్వాల్సి వస్తోంది.

ఆన్‌లైన్ వచ్చినా ఆగని అవినీతి

- రిజిస్ట్రేషన్లలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు.. రిజిస్ట్రేషన్లతోపాటు స్టాంపులు- రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా అందించే దాదాపు అన్ని సేవలను ఆన్‌లైన్ చేశారు.
- రిజిస్ట్రేషన్ చేయించే వ్యక్తికి సంబంధించిందే ఆస్తి అని నిర్ధారణతోపాటు కొనుగోలు చేసే వ్యక్తి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఒకరి ఆస్తులను మరొకరు రిజిస్టర్ చేయించకుండా కఠిన నిబంధనలు తీసుకువచ్చారు.
- ప్రభుత్వ భూములు, దేవాదాయ భూములు, అసైన్డ్, వక్ఫ్ ఆస్తులు, పరిశ్రమలకు కేటాయించినవి, ఇతర అవసరాలకు నిర్దేశించినవని స్పష్టం చేస్తూ నిషేధిత ఆస్తుల జాబితా ప్రతి సబ్‌రిజిస్ట్రార్‌కు అందుబాటులోకి తెచ్చారు. ఇవేవీ అవినీతిని ఆపలేకపోతున్నాయి.

అక్రమమా.. చెప్పరేం మరి!

అసైన్డ్, ప్రభుత్వ, నిషేధిత జాబితాలోని భూములను ఒకసారి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే చాలు తర్వాత న్యాయపరంగా ముందుకెళ్లి దక్కించుకోవచ్చని కొందరు అక్రమార్కులు ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి వారికి సబ్‌రిజిస్ట్రార్లు అండగా నిలుస్తున్నారు. ఏదో ఒక కాగితాన్ని లేదా లొసుగును ఆధారంగా చేసుకుని ఆ భూముల్ని రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ నగరాలు, ప్రధాన పట్టణాల్లో ఆస్తుల విలువ భారీగా పెరగడంతో రిజిస్ట్రేషన్లలో అక్రమాలు భారీగా జరుగుతున్నాయి.

- మియాపూర్ భూకుంభకోణం వెలుగులోకి వచ్చినా ఇంకా బహిర్గతం కానివి ఎన్నో ఉన్నాయి.
- సంగారెడ్డి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వేదికగా అసైన్డ్ భూములు, నిషేధిత భూములను అక్రమ రిజిస్ట్రేషన్ చేసేశారు.
- రామచంద్రాపురం మండలంలో 57 ఎకరాల అసైన్డ్ భూమికి రిజిస్ట్రేషన్లు చేశారు. నిరభ్యంతర పత్రాలు లేకున్నా నిషేధిత ఆస్తుల్లోని భూములను రిజిస్ట్రేషన్లు చేయడం గమనార్హం. ఈ వ్యవహారాలకు సహకరించిన సబ్‌రిజిస్ట్రార్లకు భారీ మొత్తంలో డబ్బులతోపాటు ప్రయోజనాలు అందినట్లు తెలిసింది.

పీఎన్‌బీలో ఘరానా మోసం

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతోంది. తాజా మోసంతో 10 మంది బ్యాంకు అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది.

బీఎస్ఈకి సమాచారం

బ్యాంకు శాఖలో 'అనధికార లావాదేవీ'లు జరిగిన విషయాన్ని బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి (బీఎస్ఈ)కి కూడా పీఎన్‌బీ తెలియపరిచింది. కొంతమంది ఖాతాదారులకు లబ్ధి కలిగించడానికి తమ సిబ్బంది తప్పుడు 'లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్' (ఎల్ఓయూ)ల ద్వారా కుట్ర పన్నినట్లు అనుమానం వ్యక్తం చేసింది. వీటిని చూపించి విదేశాల్లోని భారతీయ బ్యాంకుల నుంచీ రుణాలు పొంది ఉంటారని తెలిపింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లు కూడా ఈ పత్రాల ద్వారా వీరికి రుణాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆభరణాల కంపెనీ పేరును సీబీఐ వెల్లడించలేదు. వాస్తవంగా ఎలాంటి అక్రమం జరిగిందో అధికారులెవరూ బయటపెట్టలేదు. డిప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయి అధికారుల ప్రమేయంతో 2011 నుంచి ఇది జరుగుతూ వస్తోందని మాత్రం తెలుస్తోంది. గీతాంజలి, గిన్ని, నక్షత్ర వంటి భారీ ఆభరణ విక్రయదారుల కార్యకలాపాలపై దర్యాప్తు సంస్థల దృష్టి పడిందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. వివిధ బ్యాంకులతో వీటికి ఉన్న అవగాహన, డబ్బు చివరకు ఎక్కడకు చేరిందనే విషయాలపై సీబీఐ, ఈడీ దృష్టి సారించాయని చెప్పారు. ఇలాంటి లావాదేవీలు పునరావృతం కాకుండా బ్యాంకులన్నీ సమీక్షించుకుంటున్నాయనీ, సాధ్యమైనంత త్వరగా స్థాయీ నివేదికను అవి సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. మోసపూరిత లావాదేవీలపై హాంకాంగ్ సహకారాన్ని అభ్యర్థించాలని ఆర్‌బీఐ, సెబీ భావిస్తున్నాయి.

అతని పేరే ఒక బ్రాండ్

ఆభరణాలకు చూడచక్కని ఆకృతులనిచ్చే నీరవ్ మోదీ... ప్రపంచంలో వజ్రాలకు రాజధానిగా చెప్పే బెల్జియంలోని యాంట్వెర్ప్‌లో పెరిగిన వ్యక్తి. తన పేరిటే ఒక బ్రాండును సృష్టించుకున్నారు. జాతీయ, అంతర్జాతీయ ప్రసిద్ధ వ్యక్తుల్లో ఒకరిగా స్థానం పొందారు. రూ.280 కోట్ల మేర బ్యాంకును మోసగించి, తప్పుడు సంతకాలు చేశారంటూ అతనితో పాటు భార్య అమీ మోదీ, సోదరుడు నిశాల్ మోదీ, గీతాంజలి పేరుతో గొలుసుకట్టు ఆభరణాల దుకాణాలు నిర్వహించే మెహుల్ ఛోక్సీ (నీరవ్ మామ)లపైనా ఈ నెలారంభంలో సీబీఐ కేసు నమోదయింది. వీరంతా వివిధ కంపెనీల్లో భాగస్వాములుగా ఉన్నారు. బ్యాంకు వ్యవస్థలో ఎక్కడా వివరాలు నమోదు కాకుండా నీరవ్ సంస్థల్లోకి రూ.280 కోట్లు వెళ్లేలా ఎనిమిది ఎల్ఓయూలను తప్పుడు పద్ధతుల్లో బ్యాంకు సిబ్బందే రూపొందించారని తొలి ఫిర్యాదులో పీఎన్‌బీ తెలిపింది. దిగుమతి చేసుకున్న సరకుకు గానూ విదేశాల్లోని సరఫరాదారులకు చెల్లింపులు జరపాలంటూ ఈ మోసానికి పాల్పడినట్లు చెప్పింది. నీరవ్ మోదీ 2016లో ఫోర్బ్స్ ఇండియా కుబేరుల జాబితాలో చోటు సంపాదించడం విశేషం. అతని నికర ఆస్తుల విలువ 1.74 బిలియన్ కోట్లు (సుమారు రూ.11,658 కోట్లు) ఉంటుందని ఫోర్బ్స్ తేల్చింది. క్రిస్టీ, సోథిబే వంటి ప్రఖ్యాత సంస్థల వేలంపాటల్లో తరచూ పాల్గొనడం నీరవ్‌కు అలవాటు.

గ్రహం అనుగ్రహం

15–2–2018 గురువారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; బహుళ పక్షం
అమావాస్య: రా. 2-02 తదుపరి
ఫాల్గుణ మాసం శుక్లపక్ష పాడ్యమి
శ్రవణం నక్షత్రం: ఉ. 7-29 తదుపరి ధనిష్ఠ
అమృత ఘడియలు: రా. 9-59 నుంచి 11-41 వరకు
వర్జ్యం: ఉ. 11-45 నుంచి 1-27 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-19 నుంచి 11-05 వరకు
తిరిగి మ. 2-54 నుంచి 3-40 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6-31; సూర్యాస్తమయం: సా.5-57


చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	14.5	31.0
కరీంనగర్	15.0	31.5
మెదక్	15.2	34.8
నిజామాబాద్	17.0	32.0
హన్మకొండ	18.0	30.5
విశాఖపట్నం	18.6	32.6
హైదరాబాద్	18.7	30.5
రామగుండం	18.8	31.2
మహబూబ్‌నగర్	19.5	33.0
సూర్యాపేట	23.0	35.0
ఖమ్మం	23.0	36.0

దశలవారీగా ప్రీపెయిడ్ విద్యుత్తు మీటర్లు

- తొలుత ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు
- ఏప్రిల్ నుంచి బిగింపునకు డిస్కం సన్నాహాలు

ఈనాడు – హైదరాబాద్



ఓల్డ్ బోయిన్‌పల్లిలో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రీపెయిడ్ మీటరు(పాత చిత్రం)

వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల్లో ప్రీ పెయిడ్ విద్యుత్తు మీటర్లను ఏర్పాటు చేయడానికి దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ(డిస్కం) సిద్ధమవుతోంది. ఏడాది క్రితం హైదరాబాద్‌లో మధ్య, ఉత్తర సర్కిల్ పరిధిలోని కొన్ని కార్యాలయాలు, పాఠశాలల్లో ప్రీపెయిడ్ మీటర్లను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసింది. సాధారణ మీటర్‌తో పాటూ ప్రీపెయిడ్ మీటర్ల పనితీరును విశ్లేషించిన డిస్కం లోటుపాట్లను సరి చేసి పూర్తి స్థాయిలో ప్రీపెయిడ్ మీటర్లను బిగించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి సర్కిళ్ల వారీగా అవసరమైన సింగిల్, త్రిఫేజ్ మీటర్లను గుర్తించి ఇదివరకే టెండర్లను పిలిచారు. మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ పూర్వ జిల్లాల పరిధిలోని 22,116 ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రీపెయిడ్ మీటర్లు అవసరమని గుర్తించారు. 'ప్రీ పెయిడ్ మీటర్లు సిద్ధంగా ఉన్నాయి. ఏప్రిల్ నుంచి ఎల్‌టీ కనెక్షన్లు ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు ప్రీపెయిడ్ మీటర్లను బిగించనున్నాం. మూడేళ్లలో గృహ, వాణిజ్య, ఇతర విభాగాలు సైతం ప్రీపెయిడ్‌లోకి మారనున్నాయి' అని డిస్కం అధికారి ఒకరు తెలిపారు. నష్టాలు తగ్గించుకునేందుకు విద్యుత్తు సంస్కరణల్లో భాగంగా కేంద్ర విద్యుత్తు సంస్థ మార్గదర్శకాల ప్రకారం క్రమంగా అన్ని వర్గాలకు ప్రీపెయిడ్ విద్యుత్తులోకి తీసుకురానున్నారు.

బకాయిల సమస్యతోనే..

విద్యుత్తు బిల్లుల చెల్లింపుల్లో ప్రభుత్వ కార్యాలయాలు పెద్ద ఎత్తున బకాయిపడుతున్నాయి. వీటి వసూళ్లు డిస్కంలకు పెద్ద తలనొప్పిగా మారింది. బిల్లులు చెల్లించకపోతే ప్రైవేటు వినియోగదారుల మాదిరిగా ప్రభుత్వ సంస్థలకు కనెక్షన్ తొలగిస్తే ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తోంది. పైగా చాలావరకు అత్యవసర విభాగాల కేంద్రాలుంటున్నాయి. ప్రభుత్వ బకాయిలు కోట్లలో ఉంటున్నాయి. ప్రీపెయిడ్ మీటర్లతో వీటికి అడ్డుకట్ట వేయవచ్చని మొదటగా ప్రభుత్వ సంస్థల్లోని విద్యుత్తు కనెక్షన్లకు వీటిని బిగిస్తున్నారు. మెరుగైన విద్యుత్తు సరఫరాపై దృష్టి పెట్టాల్సిన డిస్కం.. వీటి వసూళ్ల కోసం మానవ వనరుల్ని వినియోగించాల్సి వస్తోందని వాపోతుంది. ఈ దృష్ట్యా ప్రీపెయిడ్ విద్యుత్తు మీటర్ల బిగింపుతో తొలుత డబ్బులు చెల్లించి రూ.500 మొదలు కొని రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుంది.

నేపాల్ రాష్ట్రపతి, ప్రధానితో జనరల్ రావత్ భేటీ

కాఠ్‌మాండూ: భారత సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ బుధవారం నేపాల్ రాష్ట్రపతి బిద్యాదేవి భండారీ, ప్రధాని షేర్ బహాదుర్‌దేవ్‌బాతో... సైనిక, ద్వైపాక్షిక సంబంధాల మెరుగుకున్న మార్గాలపై చర్చించారు.

వాళ్ల కడుపు కొడతానంటారా?

తితిదే పరిధిలో హిందూయేతర్లకు నోటీసులపై హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: హిందూయేతర్లు తిరుమల తిరుపతి దేవస్థానం(తితిదే), ఆ దేవస్థానం పరిధిలోని దేవాలయాల్లో ఉద్యోగం చేయడానికి వీల్లేదనే కారణంతో పలువురు ఉద్యోగులకు ఈవో సంజాయిషీ నోటీసులు ఇవ్వడాన్ని హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. ఇన్నేళ్లు సర్వీసు అందించిన వాళ్లను ఉద్యోగం నుంచి తీసేస్తామనడం అన్యాయమని వ్యాఖ్యానించింది. ఉద్యోగం నుంచి తొలగించి వారి కడుపు కొడతారా? అంటూ ప్రశ్నించింది. ఉద్యోగ ప్రకటన జారీచేసినప్పుడు ఆ ఉద్యోగాలకు హిందూయేతర్లు అనర్హులని పేర్కొననప్పుడు.. ఇప్పుడెలా వారిని తొలగిస్తారని అడిగింది. డ్రైవర్లు, అటెండర్లు, తోటమాలిలు, పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేసే వాళ్లను హిందూయేతర్లన్న కారణంతో తొలగిస్తామనడం ఎంతమాత్రం సరికాదని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఉద్యోగ ప్రకటనలో హిందూయేతర్లకు తావులేదని పేర్కొనని అప్పటి ఈవో, దిగువ స్థాయి బాధ్యులైన అధికారులపై ముందు చర్యలు తీసుకోండి, ఆ తర్వాతే పిటిషనర్ల గురించి ఆలోచించండని వ్యాఖ్యానించింది. వచ్చే బుధవారం వరకు ఎలాంటి ఉత్తర్వులు జారీచేయొద్దని తితిదే ఈవోను ఆదేశిస్తూ.. పూర్తి వివరాలు సమర్పించేందుకు విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

మలానీ వారసులే లేరు...

- సీసీఎస్‌కు కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ
- గచ్చిబౌలిలో 40 ఎకరాలు పదిలం
- రూ.వెయ్యి కోట్ల విలువైన ఆ భూములు ప్రభుత్వానివే

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో దాదాపు రూ.వెయ్యి కోట్ల విలువైన శరణార్థుల భూముల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టతిచ్చింది. దానికి హక్కుదారుగా చెప్పుకుంటున్న మలానీ వారసులు ఎవరూ లేరని తేల్చి చెప్పింది. మలానీ వారసులమంటూ గచ్చిబౌలి, పుప్పాలగూడలో 1500 ఎకరాల భూములను కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలతో స్వాధీనం చేసుకోవాలని 15 ఏళ్ల క్రితం ప్రయత్నించారు. గచ్చిబౌలిలోని 40 ఎకరాల భూమి తమదేనన్నారు. దీనిపై రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు రెండేళ్ల క్రితం న్యాయస్థానాన్ని ఆశ్రయించగా అవి ప్రభుత్వానిదేనంటూ తీర్పునిచ్చింది. తప్పుడు పత్రాలు సృష్టించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించింది. దీంతో ఏడాదిన్నర క్రితం సెంట్రల్ క్రైమ్ పోలీస్ (సీసీఎస్) అధికారులు కేసు నమోదు చేశారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. మలానీ వారసులుగా చెప్పుకుంటున్న వారిని విచారించారు. తప్పుడు పత్రాలు సృష్టించారని గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శరణార్థుల గజెట్‌లో మలానీ వారసుల వివరాలివ్వాలని కోరారు. మలానీ వారసులెవరూ లేరంటూ కేంద్ర హోం మంత్రిత్వశాఖ అధికారులు సమాధానం పంపారని డీసీపీ (నేర పరిశోధన) అవినాశ్ మహంతి తెలిపారు.

ఇదీ కథ

ఉత్తర భారతదేశంలో వేర్వేరు రాష్ట్రాలకు చెందిన మలానీ వంశస్థులు పాకిస్థాన్‌లో స్థిరపడ్డారు. ఇందులో ఒకరైన పరశురామ్ రామ్ చంద్ మలానీ సింధ్ ప్రావిన్స్‌లో ఉండేవారు. దేశ విభజన సమయంలో దిల్లీకి వచ్చారు. అతడికి కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 80 ఎకరాలు కేటాయించింది. 1956లో హైదరాబాద్‌కు వచ్చిన మలానీ.. కొన్నేళ్ల తర్వాత బోయిన్‌పల్లి పరిసర ప్రాంతాల్లో 40 ఎకరాల భూమిని విక్రయించారు. తనకు మరో 40 ఎకరాలు రావాలంటూ విజ్ఞప్తి చేసుకోగా గచ్చిబౌలిలో కేటాయించారు. ఈ భూమిని సొంతం చేసుకోకుండానే మలానీ కుటుంబంతోపాటు హైదరాబాద్ నుంచి వెళ్లిపోయారు. పదిహేనేళ్ల క్రితం పరశురామ్ రమేష్ మలానీ అనే వ్యక్తి ఈ భూములు తనవంటూ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాడు. దస్తావేజులు చూపించి తానే వారసుణ్నని చెప్పుకోవడంతో ప్రభుత్వం అంగీకరించింది. విలువైన భూములు కబ్జా కోరల్లోకి వెళ్తున్నాయంటూ రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కేసు విచారించి తప్పుడు పత్రాలు సృష్టించారని 2016 మార్చిలో తీర్పునిచ్చింది.

తెర వెనుక కార్పొరేట్ కంపెనీ!

గచ్చిబౌలిలో 40 ఎకరాలు కబ్జా చేసేందుకు ఓ కార్పొరేట్ కంపెనీ ప్రయత్నాలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రమేష్ పరశురామ్ 40 ఎకరాల భూమి తనదేనంటూ పత్రాలు సృష్టించడం వెనుక ఆ కార్పొరేట్ సంస్థ ప్రతినిధితోపాటు ఓ రాజకీయ నాయకుడి బంధువు కూడా ఉన్నారని గుర్తించారు. మలానీకి ఐదుగురు కొడుకులున్నారని, వీరు అమీర్‌పేటలో ఉంటున్నారని, తనకు జీపీఏ చేశారంటూ రమేష్ తప్పుడు పత్రాలు సృష్టించారు. మలానీ వారసులు కమల్ పరుశురామ్ మలానీ, రాజేష్ పరశురామ్ మలానీ, సునంద పరశురామ్ మలానీ, మాలిని పద్మ పరుశురామ్ మలానీలను విచారించేందుకు పోలీసులు అమీర్‌పేట్‌కు వెళ్లారు. రమేష్ చెప్పిన చిరునామాలో ఆ పేర్లతో ఎవరూ లేరని స్థానికులు చెప్పారు. ఇవన్నీ రికార్డు చేసిన సీసీఎస్ పోలీసులు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు.

అటవీ సిబ్బందికి అపోలో వైద్యం

ఫిలింనగర్, న్యూస్‌టుడే: అటవీ సిబ్బందికి వైద్యం అందించేందుకు అపోలో ఆస్పత్రి, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని పొడిగిస్తున్నట్లు అపోలో హాస్పిటల్స్ ఫౌండేషన్ వైస్ ఛైర్‌పర్సన్ ఉపాసన కామినేని కొణిదల, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ సీఓఓ కరణ్‌భల్లా తెలిపారు. ఫిలింనగర్ అపోలో ఆసుపత్రి ప్రాంగణంలో బుధవారం జరిగిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ మేరకు ఉపాసన, కరణ్‌భల్లా ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. అనంతరం ఉపాసన మీడియాతో మాట్లాడుతూ అటవీ సిబ్బందికి వైద్య సదుపాయాలు కల్పించడం అత్యంత ప్రాధాన్య అంశమని చెప్పారు. ఇటీవలే నల్లమల అడవుల్లో శిబిరాలు నిర్వహించామనీ, పదకొండు మంది మధుమేహ రోగులను గుర్తించామన్నారు. వారందరికీ అపోలో అత్యుత్తమ చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. ఈ ఒప్పందంలో భాగంగా 18 రాష్ట్రాల్లోని అటవీ గార్డులకు వైద్య శిబిరాలను నిర్వహించడం ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రోగనిర్ధరణ చికిత్స సేవలను అందిస్తామన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న అపోలో హాస్పిటల్స్ ఫౌండేషన్ వైస్ ఛైర్‌పర్సన్ ఉపాసన, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ సీఓఓ కరణ్‌భల్లా

విభజన చట్టం అమలుపై 21న సమీక్ష

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం అమలుపై కేంద్రహోంశాఖ ఈనెల 21న సమీక్ష సమావేశం తలపెట్టింది. ఇరు తెలుగురాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు ఆహ్వానం పంపింది. 9, 10వ షెడ్యూళ్లలోని సంస్థల విభజన, ఉద్యోగుల పంపిణీ, ఏపీ భవన్, హైకోర్టు విభజన, దానికోసం ఏపీప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, 13వ షెడ్యూల్‌లో చెప్పిన వివిధ హామీల అమలు తీరు గురించి ఆరోజు హోంశాఖ కార్యదర్శి రాజీవ్‌గాబా ఇరురాష్ట్రాల సీఎస్‌లను అడిగి తెలుసుకోనున్నారు. వివిధ అంశాల్లో కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకూ జారీచేసిన ఆదేశాల అమలు పురోగతిని సమీక్షించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేయాల్సిన కేంద్ర, గిరిజన విశ్వవిద్యాలయాల పురోగతిని ఏపీ ప్రభుత్వం ఈ సమావేశంలో ప్రస్తావించే అవకాశం ఉంది. తెలంగాణ ప్రభుత్వమూ గిరిజన విశ్వవిద్యాలయం గురించి ప్రస్తావించే అవకాశం ఉంది.

'కియా'లో భారీగా ఉద్యోగాలు.. ఉద్యోగార్థులకు శిక్షణ

ఈనాడు, అమరావతి: అనంతపురంలో ఏర్పాటు చేయనున్న కియా మోటార్స్‌లో రాష్ట్రానికి చెందిన వారికే ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), కియా మోటార్స్‌తో ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈ మేరకు బుధవారం విజయవాడలోని ఏపీ ఎస్ఎస్‌డీసీ సీఈవో, ఎండీ కె.సాంబశివరావు, కియా మోటార్స్ భారత సీఈవో, ఎండీ కుక్ హ్యూమ్ షిమ్, ముఖ్య పాలనాధికారి జిన్, శిక్షణ, అభివృద్ధి డీజీఎం కిమ్‌లతో సమావేశమయ్యారు. ప్రధానంగా కార్ల కంపెనీలో పని చేయడానికి అవసరమైన సాంకేతిక, సాంకేతికేతర(నాన్‌టెక్నికల్) సిబ్బంది నియామకాలకు సంబంధించి ఎలాంటి శిక్షణ ఇవ్వాలన్న దానిపై చర్చించారు. ఈ సందర్భంగా కియా మోటార్స్ ప్లాంట్‌లలో జరుగుతున్న నిర్మాణ పనులను ఆ సంస్థ ప్రతినిధులు ప్రజంటేషన్ రూపంలో వివరించారు. సాంబశివరావు మాట్లాడుతూ.. కియా సంస్థలో పనిచేసేందుకు అవసరమయ్యే నైపుణ్యం గల అభ్యర్థుల ఎంపిక, విధివిధానాలను పరిశ్రమల శాఖ సమన్వయంతో రూపొందిస్తామన్నారు. సిబ్బందిని ఎంపిక చేసుకోవడం కోసం సహకరించేందుకు ఏపీఎస్ఎస్‌డీసీ ముందుకురావడం సంతోషంగా ఉందని కియా మోటార్స్ సీఈవో, ఎండీ షిమ్ తెలిపారు.

గ్రూపు-I మార్కులు బహిర్గతం

- విచారణకు ఏపీపీఎస్సీ సిద్ధం

ఈనాడు, అమరావతి: గ్రూపు-1 (2011 నోటిఫికేషన్) అభ్యర్థులు ప్రధాన పరీక్షల్లో సాధించిన మార్కులు బహిర్గతం కావడం వివాదస్పదమైంది. కీలకమైన ఈ ఉద్యోగాల భర్తీకి మౌఖిక పరీక్షలు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో 15 రోజుల నుంచి జరుగుతున్న నేపథ్యంలో గోప్యంగా ఉండాల్సిన మార్కులు బయటపడ్డాయి. దీనిపై ఏపీపీఎస్సీ అంతర్గత, పోలీసు శాఖ ద్వారా విచారణ జరిపించేందుకు సిద్ధమవుతోంది. ప్రధాన పరీక్షల్లో అభ్యర్థులు సాధించిన మార్కుల ప్రతిపాదికనే మౌఖిక పరీక్షలకు ఎంపిక చేస్తారు. ఈ సమయంలో అభ్యర్థులు సాధించిన మార్కులను బహిర్గతం చేయరు. ఇది ఏపీపీఎస్సీలో సంప్రదాయంగా వస్తోంది. మౌఖిక పరీక్షలు ముగిసి, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తయిన అనంతరం అభ్యర్థులు సాధించిన మార్కులను వెల్లడిస్తారు. ప్రస్తుతం ఇందుకు భిన్నంగా జరిగింది. గ్రూపు-1 ప్రధాన పరీక్షల్లో ఒకటైన గణాంకాల విశ్లేషణ పేపరు ప్రశ్నపత్రంలో తప్పులు దొర్లాయి. వీటిని తొలగించి మూల్యాంకనం చేసేందుకు అనుసరించాల్సిన 'స్కేలింగ్' విధానానికి భిన్నంగా జనవరి 2017లో 290 మంది అభ్యర్థులతో ఓ జాబితాను తయారు చేశారు. జరిగిన తప్పును గమనించిన అనంతరం మరో జాబితాను రూపొందించారు. అప్పుడు 294 మంది అభ్యర్థులు మౌఖిక పరీక్షకు ఎంపికయ్యారు. మార్కులతో ప్రస్తుతం బహిర్గతమైన జాబితా 2017 జనవరికి చెందినదిగా భావిస్తున్నారు. ఈ జాబితాలో 290 మంది అభ్యర్థుల హాల్‌టిక్కెట్ నెంబరు, పేరు, జోన్, కమ్యూనిటీ, పేపర్ల వారీగా సాధించిన మార్కులు ఉన్నాయి.

మలయాళ దర్శకుడు ఉమర్‌లులూపై కేసు

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: తన కనుసైగలతో ఇంటర్‌నెట్ ప్రపంచాన్ని ఉర్రూతలూగిస్తూ.. ఒక్క కంటి చూపుతో దేశం మొత్తాన్ని తన వైపు తిప్పుకున్న మలయాళ నటి ప్రియా వారియర్‌పైనా.. ఆమె నటించిన సినిమా దర్శకుడిపైనా హైదరాబాద్‌లో కేసులు నమోదయ్యాయి. దర్శకుడు ఉమర్‌లులూ తెరకెక్కించిన మలయాళ సినిమా 'ఒరు అదుర్ లవ్' చిత్రంలోని ఓ సన్నివేశంలో హీరో, హీరోయిన్ల మధ్య కనుసైగల టీజర్‌కు దేశవ్యాప్తంగా విశేష ఆదరణ వస్తున్న విషయం తెలిసిందే. ఒక్కరోజులో దేశంలోనే ప్రముఖురాలైపోయింది ప్రియా వారియర్. అయితే ఆ సినిమాలో అభ్యంతరకర సన్నివేశాలున్నందున దర్శకుడు, హీరోయిన్‌పై చర్యలు తీసుకోవాలంటూ హైదరాబాద్‌లోని కాలాపత్తర్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఓ పాటలో వాడిన పదాలు ముస్లింల మనోభావాలు కించపరిచేలా ఉన్నాయంటూ దర్శకుడు ఉమర్‌లులూపై హైదరాబాద్‌లోనే ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్లో మరో కేసు నమోదైంది. ఓ పాటను ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా చిత్రీకరించారని దర్శకుడు ఉమర్‌లులూపై పాతబస్తీ ఫలక్‌నుమా వట్టేపల్లికి చెందిన విద్యార్థి మహ్మద్ ముఖీద్(20) బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ పాటలో మహమ్మద్ ప్రవక్త గురించి, మక్కా గురించి అభ్యంతరకరమైన పదాలు వాడారని పేర్కొన్నారు. దీంతో పోలీసులు ఉమర్‌లులూపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అభ్యంతరకరమేదీ లేదు: దర్శకుడు

తిరువనంతపురం: తాము చిత్రీకరించిన పాటలో ఎలాంటి అభ్యంతరకరమైన పదాలు వాడలేదని దర్శకుడు ఉమర్‌లులూ తెలిపారు. బుధవారం ఆయన తిరువనంతపురంలో ఓ వార్త సంస్థతో మాట్లాడుతూ.. కొన్ని దశాబ్దాల నుంచి కేరళలోని కొన్ని ప్రాంతాల్లో ఈ పాటను ముస్లింలు సైతం పాడుతున్నారని చెప్పారు. అప్పటి నుంచి లేని అభ్యంతరం ఇప్పుడెందుకని ఆయన ప్రశ్నించారు.

ఈనాడు

ఉగ్రవాదంపై విశ్వవ్యూహం

ఉగ్రవాద శక్తుల్ని ముద్దుచేసి కంటికి రెప్పలా కాచుకొనే ఔదార్యం పాకిస్థాన్ పాలకశ్రేణిది. మిత్రరాజ్యం మాట మీరజాలనట్లు జగమెరిగిన ఉగ్రవాదులపైనా ఆ ముద్రపడకుండా ఐక్యరాజ్య సమితి స్థాయిలో చక్రం తిప్పే మంత్రాంగం చైనా అధినాయకులది. ఈ నయవంచక జుగల్‌బందీకి తెరదించక తప్పని పరిస్థితుల్లో- జమాతుద్ దవా (జేయూడీ), లష్కరే తొయిబా వంటి ఉగ్రసంస్థలపైనా, వాటి పెద్దదిక్కు హఫీజ్ సయీద్ పైనా పాక్ నిషేధాస్త్రం ప్రయోగించింది. 1997నాటి ఉగ్రవాద నిర్మూలన చట్టానికి గుట్టుచప్పుడు కాకుండా చేసిన సవరణల అనుసారం- ఐక్యరాజ్య సమితి భద్రతామండలి చిట్టాలో చోటుదక్కించుకొన్న ఉగ్రసంస్థలు, టెర్రరిస్టులందరిపైనా పాక్ చర్యలు చేపట్టడం తప్పనిసరి! పదేళ్ల నాటి భయానక ముంబయి ముట్టడి ప్రధాన సూత్రధారిగా హఫీజ్ సయీద్‌ను విచారించి ఉగ్ర చట్టాల కింద శిక్షించాలని భారత్ చిరకాలంగా కోరుతున్నా అతగాడిని రక్షించడానికి ఎన్నెన్నో చేసిన ఇస్లామాబాద్ ఇప్పుడిలా నాలుక మడతేసి, ఉగ్ర ముద్ర వెయ్యడానికి బలమైన కారణమే ఉంది. మనీలాండరింగ్, ఉగ్ర నిధుల సరఫరాల్ని నిలువరించడానికి తగు చర్యలు తీసుకోని పాకిస్థాన్‌ను బోనెక్కించాల్సిందేనని అమెరికా, యూకే, ఫ్రాన్స్, జర్మనీలు ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) సదస్సులో తీర్మానాన్ని ప్రతిపాదించాయి. పారిస్‌లో వచ్చేవారం జరగనున్న సదస్సు ఆ తీర్మానాన్ని ఆమోదించి, పాకిస్థాన్‌ను నిశిత పరిశీలన అవసరమైన దేశాల జాబితాలో చేర్చినా- అది ఇస్లామాబాద్ వ్యాపార అనుకూలతల్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. 2012 ఫిబ్రవరి నుంచి మూడేళ్లపాటు ఆ తరహా శిక్ష అనుభవించిన పాకిస్థాన్, పొంచి ఉన్న ముప్పునుంచి తప్పించుకోవడానికే సయీద్ సారథ్యంలోని సంస్థల ఆస్తుల జప్తును సంకల్పిస్తోంది. మనం మనం బరంపురం అంటూ ఉగ్రవాదులతో భుజం భుజం కలిపి సాగుతున్న పాకిస్థాన్ చేపట్టే ఇలాంటి చర్యలు- అంతర్జాతీయ సమాజం కళ్లకు గంతలు కట్టే నయా దుస్తంత్రాలు!

మరికొద్ది నెలల్లో పాకిస్థాన్‌లో సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న వేళ, కీలక సరిహద్దుల్లో జమ్మూకశ్మీర్‌పై ఉగ్రనాగులు భయానకంగా కోర చాస్తున్నాయి. పాక్ మిలిటరీ దన్నుతో మిల్లీ ముస్లింలీగ్ అనే రాజకీయ పార్టీ పెట్టి వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధపడుతున్న సయీద్ జమ్మూకశ్మీర్లో మరింత ఉద్ధృతంగా నెత్తుటి నెగళ్లు ఎగదోయనున్నట్లు నిఘా వర్గాల సమాచారం ఇప్పటికే ఎంతో పోగుపడి ఉంది. జమ్ము సరిహద్దుల్లో సుంజువాన్ సైనిక స్థావరం మీద, శ్రీనగర్‌లోని సీఆర్‌పీఎఫ్ శిబిరంపైనా దాడులకు తెగబడింది తామేనని లష్కరే తొయిబా ప్రకటించుకొంది. నిరుడు ఆగస్టులోనే అధీనరేఖ దాటివచ్చిన పాక్ ముష్కరులు స్థానిక శక్తుల తోడ్పాటుతోనే ఇంతకాలం మాటువేసి తాజాగా దాడికి తెగబడ్డారని జాతీయ నిఘా సంస్థ స్పష్టీకరిస్తోంది. ఓ జవాను తండ్రితో సహా ఆరుగుర్ని బలిగొన్న ఆ ఘాతుకం- అయిదేళ్ల క్రితంనాటి అఫ్జల్ గురు ఉరితీతకు ప్రతీకారంగా జరగడం గమనార్హం. పాకిస్థాన్ లష్కరే కమాండర్ నవీద్ జుత్ ఈ నెల ఎనిమిదిన ఇద్దరిని చంపి కశ్మీర్ పోలీసు కస్టడీ నుంచి తప్పించుకోవడం- ప్రతీప శక్తులు ఇంతలా చెలరేగిపోవడానికి ఊతమిచ్చిందన్నది వాస్తవం. 2002 మే నెలలో కలూచక్ సైనిక స్థావరంపై దాడికి పాల్పడి 31 మందిని ఉగ్రవాదులు పొట్టన పెట్టుకొన్న కిరాతకాన్ని తాజా దాడి గుర్తుచేస్తోంది. 2016లో పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై ఉగ్రదాడి దరిమిలా మోదీ ప్రభుత్వం లెఫ్టినెంట్ జనరల్ ఫిలిప్ కంపోజ్ సారథ్యంలో కమిటీ వేసి అన్ని సైనిక ప్రాంగణాల ఆడిటింగ్ జరిపించింది. అత్యంత కీలకమైన 600 స్థావరాలు సహా మొత్తం 3,000 ప్రాంగణాల్ని సుభద్రం చెయ్యడానికి రూ.1,487 కోట్ల కార్యాచరణకు పచ్చజెండా ఊపింది. 2001లో జమ్ము-కశ్మీర్ అసెంబ్లీ ప్రాంగణంపై జరిగిన భీకర ఆత్మాహుతి దాడి తరహాలో మరో మహా విధ్వంసానికి ఉగ్రమూకలు సన్నద్ధమవుతున్నాయన్న హెచ్చరికల నేపథ్యంలో- రెప్పవాల్చని నిఘాయే రక్షాకవచమవుతుంది!

ప్రపంచవ్యాప్తంగా మూడింట రెండొంతుల దేశాలు ఉగ్రదాడులకు గురవుతున్నాయని మూడు నెలల నాటి అంతర్జాతీయ అధ్యయనం వెల్లడించింది. 2016లో ఉగ్రదాడి మృతులు 9,765 మందితో ఇరాక్ తొలిస్థానంలో నిలువగా- అఫ్గానిస్థాన్, నైజీరియా, సిరియా, పాకిస్థాన్లు దాని వెన్నంటి ఉన్నాయి. టెర్రరిజం కాటుకు అసహాయంగా తాను బలైపోతున్నానని మొసలి కన్నీళ్లు కార్చే పాకిస్థాన్- అటు అఫ్గానిస్థాన్‌లోనూ, ఇటు ఇండియాలోనూ ఉగ్రమూకల మృత్యుహేలకు బాసటగా నిలుస్తోంది. ఉగ్రవాదుల్ని మంచి-చెడుగా వర్గీకరించే పెడధోరణుల కారణంగానే ఆ మహమ్మారిపై ఉమ్మడి పోరు దేవతావస్త్రంగా మారింది. 'ఐసిస్'ను ఉమ్మడి శత్రువుగా పరిగణించి దాని అంతానికి నాలుగంచెల వ్యూహం అనుసరించనున్నట్లు కువైట్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సు తీర్మానించింది. ఇరాక్‌లో ఓటమిపాలైన ఐసిస్ సిరియాలోనే అక్కడక్కడా ఉనికి చాటుకొంటోందని సదస్యులు చెబుతున్నా- పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, మాల్దీవుల్లో దాని ఆనుపానుల్ని గుర్తించకపోతే ఎట్లా? తాలిబన్, బోకోహరామ్, ఐసిస్, అల్‌ఖైదా, జమాతుద్ దవా... ఇలా నామధేయాల మార్పేగాని అమాయక జనహననంలో, ప్రజాస్వామ్య వ్యవస్థల విధ్వంసంలో అన్నింటిదీ ఒకటే పంథా! ఈ పరిస్థితుల్లో భిన్న నామరూపాలతో చలామణీ అవుతున్న ఉగ్రవాద సంస్థలన్నింటిపైనా ఉక్కుపాదం మోపే పటిష్ఠ అంతర్జాతీయ కార్యాచరణ తక్షణావసరం. ఏ ఎండకాగొడుగు పట్టే పాకిస్థాన్ కపట నైజాన్నీ గుర్తించి, సయీద్ లాంటి ఉగ్రశక్తులు రేపు అక్కడ అధికార పీఠానికి ఎగబాకితే ఎంత వినాశమో ఊహించి ముందస్తు జాగ్రత్తలకు ఉపక్రమించడం అందరికీ శ్రేయస్కరం!

ఒత్తిళ్ల బలిపీఠంపై విద్యార్థి లోకం



విద్యార్థి దశలోనే అర్ధాంతరంగా తనువు చాలిస్తున్న విద్యాకుసుమాలను చూసి దేశం నివ్వెరపోతోంది. ఒత్తిడి తట్టుకోలేకపోవడమే బలవన్మరణాలకు ప్రధాన కారణం. కేంద్ర హోంశాఖ ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2016లో దేశవ్యాప్తంగా 9,474 మంది విద్యార్థులు అర్ధాంతరంగా తనువు చాలించారు. 2011-16 మధ్య ఇలా చనిపోయినవారు 49,229 మంది ఉన్నారు. పరీక్షల ఒత్తిడే కాకుండా కుటుంబ సమస్యలు, అనారోగ్యం, వివాహ సంబంధ కారణాలు, ఆర్థిక ఇబ్బందులు, ప్రేమ వ్యవహారాలు వంటివీ బలవన్మరణాలకు కారణాలవుతున్నాయి. విద్యార్థుల బలవన్మరణాలు దేశ ప్రధాని నరేంద్ర మోదీని సైతం కదిలించాయి. పరీక్షల ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో తెలియజేస్తూ 'ఎగ్జామ్ వారియర్స్' అనే పుస్తకాన్ని ప్రధాని స్వయంగా రాశారు. 10, 12వ తరగతుల విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని ఎలా జయించాలనే విషయాన్ని ఈ పుస్తకంలో విశ్లేషించారు. మార్కులకన్నా తమకు సహజంగా ఉండే నైపుణ్యాలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. పుస్తకం రాయడమే కాదు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులను కలిసి ఆయన రేపు దిల్లీలో స్వయంగా మాట్లాడబోతున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా సన్నద్ధం కావాల్సిన అవసరాన్ని ఆ సందర్భంగా ఆయన వివరిస్తారు. సామాజిక మాధ్యమాల ద్వారా దేశవ్యాప్తంగా విద్యార్థులు అడిగే ప్రశ్నలకు సమాధానమిస్తారు. దేశంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని కేంద్ర మానవ వనరుల శాఖ రాష్ట్రప్రభుత్వాలను కోరింది.

కొరగాని పరీక్షలు

ప్రాచీన భారతీయ విద్యావిధానంలో కళలకు చక్కటి స్థానం ఉండేది. ఆచరణాత్మక పరీక్షా విధానాలను అవలంబించేవారు. నలంద, తక్షశిల విశ్వవిద్యాలయ పరీక్షల్లో పాల్గొనేందుకు విదేశాల నుంచి విద్యార్థులు తరలివచ్చేవారు. మౌఖిక విధానంలో ఆ పరీక్షలు ఉండేవి. అప్పట్లో తరగతి గదుల్లో తక్కువగా బోధించేవారు. ప్రయోగాత్మక విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. రోజువారీ అనుభవాల మేరకు జ్ఞానసముపార్జన జరిగేది. లక్ష్యాలకు, అభ్యసనకు మధ్య సమన్వయం తప్పనిసరి. జ్ఞాపకశక్తిపై ఆధారపడి నిర్వహించే పరీక్షలు జీవితంపై అవగాహన కలిగించడానికి ఏ రకంగానూ ఉపయోగపడవు. దురదృష్టవశాత్తు ఇప్పటి విద్యావిధానానికి ఇదే ప్రాతిపదికగా మారింది. జ్ఞాన సముపార్జన అప్రస్తుతంగా మారింది. అధిక మార్కులతో ఉత్తీర్ణులు కావడమే ప్రధానమైపోయింది. దీనివల్ల విద్యార్థులు తరగతి గదుల్లో బందీలుగా మారిపోతున్నారు. విస్తృతమైన పాఠ్య ప్రణాళిక, బండెడు పాఠాల మాటున విద్యార్థులు తార్కిక సామర్థ్యాలు, నైపుణ్యాలు, జీవిత విలువలకు పూర్తిగా దూరమైపోతున్నారు.

నేటి విద్యావ్యవస్థలో మౌలిక వసతుల లేమి అందరికీ తెలిసిందే. ఉపాధ్యాయుల కొరత దీర్ఘకాలిక సమస్య. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు అర్థం కాక తరగతి గదిలో క్షోభననుభవిస్తున్న విద్యార్థులకు లెక్కేలేదు. మనదేశంలో పరీక్షల్లో మార్కులు సాధించకపోతే భవిష్యత్తే లేదన్న భావన నేటి విద్యార్థుల్లోను, తల్లిదండ్రుల్లోనూ నాటుకుపోయింది. దీనివల్ల ఇటు ఇంట్లో, ఆటు బడిలో మానసిక ఒత్తిడికి గురవుతున్న విద్యార్థుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. పరీక్షలు చదువులకే తప్ప, జీవితానికి కారాదు. అందువల్లే 'పోటీ ఇతరులతో కాదు- మీతో మీకే' అంటూ మన్‌కీబాత్‌లో ప్రధాని మోదీ విద్యార్థులకు హితవు పలికారు. ఆ మాటల వెనక పరమార్థాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అవగతం చేసుకోవాల్సిన సమయమిది!

తరగతి గదిలో విన్న పాఠం సరిగ్గా అవగాహన కావడం లేదంటే విద్యార్థి అభ్యసన సామర్థ్యంలో లోపం ఉన్నట్లే. దీన్ని అంచనా వేయడానికి ఉపాధ్యాయుడికి మానసిక శాస్త్రంపై అవగాహన అవసరం. అందుకోసం ఉపాధ్యాయ విద్యలో ఈ అంశానికి ప్రాధాన్యం కల్పించాలి. కాలానుగుణంగా వాటిలో మార్పులు తీసుకురావాలి. ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు ఈ అంశంలో నిపుణులతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. వాస్తవానికి ఇవేవీ క్షేత్రస్థాయిలో సరిగ్గా అమలు కావడమే లేదు. దేశంలో అయిదు నుంచి ఆరు లక్షల ప్రైవేటు పాఠశాలల్లో రెండున్నర లక్షల మంది శిక్షణలేని ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి స్వయంగా పార్లమెంటులో ప్రకటించడం మన విద్యావ్యవస్థలోని లోపాన్ని వెల్లడిస్తోంది. హాజరు పలికినప్పుడు మాత్రమే తరగతి గదిలో మన విద్యార్థులు నోరు విప్పే పరిస్థితి ఉంది. బోర్డు



బతుకు నిలిపే చదువు కావాలి

వైపు తిరిగి ఉపాధ్యాయుడు పాఠం చెబుతూపోతుంటే అందులో విద్యార్థులకు అవగాహన అయ్యేది బహు తక్కువ. విద్యార్థులను ప్రేరేపించి, ఆకట్టుకునే రీతిలో పాఠాలు చెప్పగల ఉపాధ్యాయులు తగ్గిపోతున్నారు. విద్యార్థుల సందేహాలను సరైన రీతిలో నివృత్తి చేయగల ఉపాధ్యాయులే కరవవుతున్నారు. విలువలులేని విద్య నిరర్థకమని మహాత్మా గాంధీ వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయుడంటే విద్యార్థికి తాత్వికుడు, మార్గనిర్దేశకుడు, స్నేహితుడు! విద్యార్థి పరిపూర్ణ వికాసానికి అనుగుణంగా పాఠ్యప్రణాళిక ఉండాలని, వయసుకు తగ్గ పాఠాలు, అనుభవపూర్వక అభ్యసన ఉండాలని 'కొఠారి కమిషన్' సూచించింది. భిన్న సంస్కృతులు గల భారతదేశంలో పాఠ్యాంశాలను సమగ్రంగా రూపొందించే కసరత్తు

దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆత్మహత్యలు

సంవత్సరం	ఆత్మహత్యలు
2016	9,474
2015	8,934
2014	8,068
2013	8,423
2012	6,654
2011	7,696

ఆధారం: జాతీయ నేర నమోదు సంస్థ గణాంకాలు

అవసరం. అమెరికాలోనూ దేశమంతటా ఒకే విధమైన పాఠ్యప్రణాళిక లేదు. రాష్ట్రాలు, ప్రాంతాలు, స్థానిక పరిస్థితుల అవసరాల ప్రకారం శాస్త్రీయంగా అక్కడ పాఠ్యాంశాలను రూపొందిస్తారు. ప్రాథమిక విద్య స్థాయిలోనే పిల్లల స్వభావాన్ని, అభిరుచులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అంచనా వేయాలి. వారి సహజ సామర్థ్యాలను, ఆసక్తులను అవగతం చేసుకోవాలి. సంబంధిత మార్గంలో విద్యార్థి పాఠ్య ప్రణాళికను ఎంచుకోవాలి. దీనివల్ల విద్యార్థి చదువు ఉత్తేజభరితంగా సాగుతుంది. అమెరికా, సహా ఐరోపాలోని అనేక దేశాలు అనుసరిస్తున్న మార్గమిది. ఒక దశ దాటిన తరవాత విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలను ఆయా రంగాల నిపుణుల సమక్షంలో విశ్లేషిస్తారు. వారి సలహాల మేరకు తమ పిల్లలు విద్యారంగంలో ఎటువైపు వెళ్లాలో తల్లిదండ్రులు నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. మనదేశంలో సరిగ్గా కొరవడుతోంది ఇదే. తల్లిదండ్రులు తమ భావాలను పిల్లలపై బలవంతంగా రుద్దుతున్నారు. ఇంజినీరింగో, మెడిసినో చదివేయాలని ముందుగా నిర్ణయానికి వచ్చేస్తున్నారు. పిల్లల్లోని సహజ సామర్థ్యాలను కాసింతైన గుర్తించలేక పోతున్నారు. మంచి గృహ వాతావరణం నుంచి వచ్చిన విద్యార్థుల నైపుణ్యాలు మెరుగ్గా ఉంటున్నాయన్న మానసిక నిపుణుల అభిప్రాయాలను తల్లిదండ్రులు గమనించాలి. మానసిక ఆరోగ్యం, ఆనందం లేనిచోట పిల్లలు చదువుల్లో రాణించలేరన్నది నిష్ఠుర సత్యం. అందువల్లే ప్రతి విద్యాసంస్థలో మానసిక విశ్లేషకుల ఆవశ్యకతను నేడు ప్రపంచం గుర్తించింది. కానీ, దేశంలో మానసిక వైద్యులు, విశ్లేషకుల కొరత 87 శాతం మేర ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి ఇటీవల లోక్‌సభలో తెలియజేశారు.

మారాలి విధానాలు

పాఠ్యాంశాలు ఆచరణాత్మకంగా లేకుంటే ఫలితాలూ అంతంతమాత్రంగానే ఉంటాయి. నేటి పాఠ్యాంశాలు జీవన వికాసాన్ని విస్మరించే విధంగా ఉన్నాయి. జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను ఎలా అధిగమించాలన్నది విద్యార్థి దశలోనే నేర్పిస్తే భవిష్యత్ మీద వారికి భరోసా కలుగుతుంది. క్రీడలు, పుస్తక పఠనం, సంగీతం, చిత్రలేఖనం, వస్తువుల తయారీకి పాఠ్యప్రణాళికలో తప్పనిసరి ప్రాధాన్యం ఇవ్వాలి. వక్తృత్వం, వ్యాసరచన, ప్రహేళికల వంటి అంశాల్లో వారు రాణించేలా చేయాలి. ఇలాంటివి ఉన్నప్పుడే విద్యార్థులకు ఒత్తిళ్ల నుంచి ఉపశమనం కలుగుతుంది. సమగ్ర విద్యాబోధనలోని రహస్యమిదే. గృహ వాతావరణం దాటి వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు కొత్త వాతావరణంలో సర్దుకుపోవడానికి ఆయా విద్యాసంస్థలు ముందస్తుగానే ప్రత్యేక దృష్టి పెట్టాలి. రాజస్థాన్‌లోని కోటలోని శిక్షణా సంస్థల్లో చేరుతున్న విద్యార్థులు పెద్దసంఖ్యలో ఆత్మహత్యలకు ఒడిగడుతున్న వైనాన్ని అక్కడి ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. విద్యార్థుల ఆత్మహత్యలపై ఉమ్మడి రాష్ట్రంలో నీరజా రెడ్డి కమిటీ, నవ్యాంధ్రలో చక్రపాణి కమిటీలు అందజేసిన నివేదికలను పరిశీలించాలి. విద్యార్థులను విపరీతమైన ఒత్తిడికి గురిచేస్తున్న ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలపై ప్రభుత్వపరమైన నిఘా పర్యవేక్షణలు పెరగాలి. పాఠ్యాంశాలు, పాఠ్యప్రణాళిక, సమయ పట్టిక; అభ్యసన, బోధన విధానాలు, ఇంటి పని ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారమే జరగాలి. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు ఇంజినీరింగ్ ప్రవేశపరీక్షస్థాయి బోధన సరికాదు. వసతి గృహాల్లో సమయానికి మించి విద్యాబోధనను నిలువరించాలి. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఒత్తిడిలేని విద్యావిధానాల రూపకల్పన దిశగా మేధావులు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రతి గంటకు ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడటం కచ్చితంగా జాతికి పెను విపత్కర పరిస్థితే. ఈ విపత్తు నుంచి విద్యార్థి లోకాన్ని బయటపడేయడానికి ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన ముందుకు కదలాలి!

– డాక్టర్ గుజ్జు చెన్నారెడ్డి

(రచయిత– సహాయ ఆచార్యులు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం)



వీరేంద్ర కపూర్

రాహుల్ దక్షతపై సందేహాలు

ఇటీవల కొన్నాళ్లుగా పార్లమెంటు లోపల, వెలుపల రాహుల్ గాంధీ హడావుడి ఎక్కువైంది. దీన్నిబట్టి 2019 పార్లమెంటు ఎన్నికలకు కాంగ్రెస్ ఇప్పటినుంచే సమాయత్తమవుతోందని అనుకోవచ్చు. బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించినప్పుడు సభలో పేట్రేగిన ఆవేశకావేషాలు- పాలక ప్రతిపక్షాల మధ్య ఘర్షణ వాతావరణం ముదరనుందన్న సంకేతాలిస్తున్నాయి. ప్రభుత్వం ముందరికాళ్లకు ప్రతిపక్షం, ముఖ్యంగా కాంగ్రెస్ పదేపదే బంధాలు వేయడానికి ప్రయత్నిస్తుండటం కనిపిస్తుంది. దీనివల్ల ప్రభుత్వ కార్యాచరణకు ఇబ్బందులు ఎదురైనా ప్రధాని మోదీ వెనక్కు తగ్గదలచుకోలేదు. పార్లమెంటు ప్రసంగంలో కాంగ్రెస్ మీద, నెహ్రూ-ఇందిర కుటుంబం మీద విరుచుకుపడి, వారికి గుక్కతిప్పుకోనివ్వకుండా చేశారు. రాజస్థాన్ ఉపఎన్నికల్లో ఓటమి వల్ల నీరసపడిన భారతీయ జనతా పార్టీ శ్రేణులకు పార్లమెంటులో మోదీ జోరు మళ్ళీ హుషారెత్తించింది. మరోవైపు తాము రాజస్థాన్‌లో సాధించిన గెలుపు మున్ముందు హిందీ రాష్ట్రాలన్నింటిలోనూ పునరావృతమవుతుందనే ఆశ రాహుల్ అంతేవాసుల్లో వెల్లివిరియసాగింది. అంతలోనే మోదీ దూకుడు కాంగ్రెస్ ఆశలను దెబ్బతీసింది. రేపు ఎన్డీయేకి వ్యతిరేకంగా ఏర్పాటు చేయదలచిన ప్రతిపక్ష కూటమికి రాహుల్ గాంధీ సహజ నాయకుడనే అంచనాలను పలచన చేసింది.

చెరగని మరకలు

కేవలం ఇంటిపేరు తప్ప మరే గొప్పదనం లేని రాహుల్‌ను తమ నాయకుడిగా శరద్ పవార్, మమతా బెనర్జీల వంటి ఉద్దండులు నెత్తిన మోస్తారా అంటే, సందేహమే. ఎన్డీయే వ్యతిరేక కూటమి పగ్గాలు చేపట్టడానికి తామే అర్హులమని పవార్, బెనర్జీలు లోలోన భావిస్తుండవచ్చు. రాహుల్‌కు పస లేదని మోదీ తేల్చేయడం వారికి వీనుల విందైన అంశమే. భారతదేశంలో అతి ప్రాచీన పార్టీ అయిన కాంగ్రెస్‌కు రాహుల్ గాంధీ వంటి వ్యక్తి నాయకత్వం వహించడం ఏమాత్రం ఆమోదనీయం కాదని పాత్రికేయుల రామచంద్ర గుహ వాపోవడం గమనార్హం. కాంగ్రెస్ గద్దె నెహ్రూ-ఇందిర కుటుంబ జాగీరు అని వందిమాగధులు కీర్తించినా, సొంత బలం ఉన్న శరద్ పవార్ వంటివారు వంతపాడతారా అన్నది సందేహమే. నేడు నెహ్రూ-ఇందిర కుటుంబానికి చెందినవారు కాకుండా మరెవరైనా కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహిస్తూ ఉండి రఫేల్ ఒప్పందంలో అవినీతి అంటూ విరుచుకుపడి ఉంటే, దానికి విలువ ఉండేది. రాహుల్, ఆయన తల్లి సోనియాకు అవినీతి గురించి మాట్లాడే అర్హతే లేదు. ప్రధాని మోదీ ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లినప్పుడు కుదుర్చుకున్న రఫేల్ ఒప్పందం ఆ దేశంలో రక్షణ పరిశ్రమ దెబ్బతినకుండా నిలబెట్టింది. తద్వారా వేలాది ఫ్రెంచి ఉద్యోగులూ తమ ఉపాధి కాపాడుకున్నారు.

రాహుల్ ఈ ఒప్పందంలో తప్పులు ఎన్నుతున్నారు. ఇక్కడ గమనించాల్సినదేమంటే రాహుల్ అమెరికా సందర్శనకు వెళ్లివచ్చిన తరవాత రఫేల్ ఒప్పందానికి వంకలు పెట్టడం మొదలైంది. భారత్‌కు రఫేల్ బదులు తమ యుద్ధవిమానాలను అమ్మాలని ఉబలాటపడుతున్న ఒక పోటీ సంస్థ ప్రతినిధులు రాహుల్‌ను కలిసి అవినీతి అంటూ సూచనలు వదిలినట్లుంది. అసలు



యూపీఏ నేతృత్వం ఎవరిదో?

రక్షణ ఒప్పందాల్లో అవినీతికి పాల్పడిన చరిత్ర ఎంతో ఇందిర కుటుంబానికి ఉంది. బోఫోర్స్ కేసును తిరగదోడాలని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) భావిస్తున్నట్లు తెలిసి, రఫేల్‌ను రాహుల్ తెరమీదకు తెచ్చారు. 1980లలో స్వీడన్ ప్రధానమంత్రి ఒలాఫ్ పామే భారత సందర్శనకు వచ్చినప్పుడు అప్పటి ప్రధాని తన నివాసంలో ఆయనకు విందు ఇచ్చారు. ఆ విందులో మన ప్రధాని భార్య స్వయంగా పామేకి 'పేస్టా' వడ్డించారు కూడా. విందు ఆరగించిన ఇతర అతిథుల్లో అట్టావియో ఖత్రోచీ అనే దళారి కూడా ఉన్నారు. ఈ విందు సమావేశంలోనే బోఫోర్స్ ఒప్పందం కుదిరింది. ఈ వ్యవహారంలో ముడుపులు చేతులు మారడంలో ఖత్రోచీ పాత్ర ఉందని ఆరోపణలు వచ్చినా మాజీ ప్రధాని కుటుంబం అదేమీ లేదని బుకాయించింది. రాహుల్ అంతటితో ఆగకుండా అవినీతి మరకే లేని ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై రఫేల్ ఒప్పందంలో బురద అంటించాలని చూస్తున్నారు. అసలు రఫేల్ విమానాల అమ్మకం-కొనుగోలుకు నేరుగా భారత్, ఫ్రాన్స్ ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరిందని మరచిపోకూడదు. ఇందులో దళారుల ప్రమేయం లేనప్పుడు ముడుపులు చేతులు మారే ప్రసక్తి ఎక్కడ?

ఏదిఏమైనా బడ్జెట్ రోజునే వెలువడిన ఉపఎన్నికల ఫలితాలు ప్రధాని మోదీకి హెచ్చరిక సంకేతమని ఒప్పుకోవలసిందే. రైతులు, వృద్ధుల సంక్షేమానికి, పేదల ఆరోగ్య సంరక్షణకు బడ్జెట్‌లో మోదీ సర్కారు ప్రతిపాదించిన పథకాలు ప్రశంసనీయమే. ఇవన్నీ సక్రమంగా సకాలంలో అమలై రాబోయే ఎన్నికల్లో ఓట్ల వర్షం కురిపిస్తాయని ఆశించవచ్చునా అన్నది ప్రశ్న. రాజస్థాన్ ఉపఎన్నికల ఫలితాలు హిందీ రాష్ట్రాల్లో నివురుగప్పిన నిప్పులా రగులుతున్న అసంతృప్తికి సంకేతం కావచ్చు. పశ్చిమ్ బంగ ఉప ఎన్నికల్లో సీపీఐ(ఎం), కాంగ్రెస్‌లు మూడు, నాలుగో స్థానాలకు పరిమితమైనా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అవి రెండూ చేతులు కలిపే అవకాశమే హెచ్చు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో ప్రభుత్వ వ్యతిరేకత బలంగా ఉన్నందువల్ల అక్కడ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాకు విజయం నల్లేరు మీద నడక కాకపోవచ్చు.

మధ్యతరగతి వర్గమే కీలకం

చివరకు ఓటర్లపై మోదీకున్న పట్టు ఆ పార్టీకి శరణ్యమయ్యేలా ఉంది. అవతలివైపు రాహుల్ నేతృత్వంలో ప్రతిపక్షాలు సమైక్య కూటమిగా ఏర్పడే అవకాశాలు బొత్తిగా లేవని చెప్పకతప్పదు. మోదీ సమర్థ నాయకత్వంలో ఉత్సాహం ఉరకలెత్తే నాయకులు, కార్యకర్తల సైన్యం భాజపా సొంతం. తలో దిక్కుకు లాగే ప్రతిపక్ష కూటమి నుంచి మోదీకి గట్టి పోటీని ఆశించలేం. ఇటీవల జరిగిన ప్రతిపక్ష నాయకుల సమావేశానికి రాహుల్ అధ్యక్షత వహించాలని చూడగా అసమ్మతి ధ్వనులు వినవచ్చాయి. దాంతో అస్వస్థతతో బాధపడుతున్న సోనియా గాంధీని తీసుకొచ్చి సమావేశం నిర్వహించాల్సి వచ్చింది. రేపు ఆమె రంగం నుంచి వైదొలగితే ప్రతిపక్షాలకు తామే అధినాయకులమని శరద్ పవార్, మమతా బెనర్జీలు పోటీపడకుండా ఉంటారా? మోదీ కూడా సొంత ఇంటిని చక్కదిద్దుకోవలసి ఉంది. అసలే భాజపా చిరకాల ఓటు బ్యాంకు అయిన మధ్యతరగతి ప్రజానీకం హిందుత్వ శక్తుల వీరంగంపై చిరాకుపడుతోంది. బడ్జెట్ తమకు వరాలేమీ ఇవ్వలేదన్న ఆగ్రహం వారిలో గూడుకట్టింది. వారిని ప్రసన్నుల్ని చేసుకోవాలంటే హిందుత్వవాదులకు కళ్లాలు బిగించాలి. వస్తుసేవల పన్ను, పెద్దనోట్ల రద్దుల దుష్ప్రభావం నుంచి దేశం ఇప్పుడిప్పుడే తేరుకుంటూ ఆర్థికాభివృద్ధి వైపు వడివడిగా అడుగులు వేస్తోంది. దీన్ని అవకాశంగా తీసుకుని మధ్యతరగతికి తగు వరాలు ఇవ్వాలి. సామాజిక, సాంస్కృతిక రంగాల్లో భాజపా తిరోగమన వైఖరులను వదలించుకుని ప్రగతిశీల దృక్పథాన్ని ప్రదర్శించాలి. సానుకూల వైఖరితో ప్రజల ముందుకువెళ్తేనే వచ్చే ఎన్నికల్లో వారి ఆదరణ చూరగొనగలుగుతుంది!

ఫాల్గుణ మాసం

వసంత పంచమి నుంచి ఫాల్గుణ పూర్ణిమ వరకు ప్రకృతికన్య రోజూ ఓ రంగు చీర సింగారించుకుంటుంది. చిలుకలు వాలిన జామచెట్టులా ఉండే ప్రకృతి- పంచవన్నెల రామచిలకలా కనువిందు చేస్తుంది.

చలి పూర్తిగా తగ్గదు. నులివెచ్చదనం ప్రాణానికి హాయి కలిగిస్తుంటుంది. ఫాల్గుణ మాసం ప్రారంభానికి అదే గుర్తు!

త్రేతాయుగంలో రావణాసురుడితో యుద్ధానికి శ్రీరాముడు ఫాల్గుణ బహుళ పాడ్యమి నాడే కదిలాడు. వానర సైన్యాన్ని వెంటబెట్టుకొని లంకకు తరలివెళ్లాడు. లక్ష్మణుడు ఇంద్రజిత్తుతో సమరాన్ని ఫాల్గుణ బహుళ ఏకాదశి నాడు ప్రారంభించాడు. త్రయోదశి దాకా అది కొనసాగింది. రావణుణ్ని రాముడు అమావాస్యనాడు వధించాడు. ద్వాపర యుగంలో- పాండవులు, కౌరవుల్లోనూ కొందరు ఫాల్గుణ మాసంలో జన్మించినట్లు చెబుతారు.

దేవతలైన హరిహర సుత అయ్యప్పస్వామి, లక్ష్మీదేవి; మహాత్ములైన శ్రీకృష్ణ చైతన్యులు, రామకృష్ణ పరమహంస, స్వామి దయానంద సరస్వతి ఈ మాసంలోనే జన్మించారు. ఇదే నక్షత్రాన జన్మించాడు కనుక, అర్జునుడికి 'ఫల్గుణ' అనే పేరుంది. పిడుగుల భయం పోవడానికి 'ఫల్గుణ' అంటూ ఆయన నామాల్ని స్మరిస్తారు. ధర్మరాజు ఫాల్గుణ బహుళ అష్టమిన, భీముడు ఫాల్గుణ శుద్ధ త్రయోదశిన జన్మించారంటాయి పురాణాలు. అదేరోజున దుర్యోధనుడు, దుశ్శాసనుడు పుట్టారు.

ఫాల్గుణం శ్రీమహావిష్ణువుకు ఇష్టమైన మాసం. పూర్ణిమ తిథిలో చంద్రుడు పూర్వ ఫల్గుణి లేదా ఉత్తర ఫల్గుణి నక్షత్ర సమీపంలో సంచరిస్తే, ఆ మాసాన్ని 'ఫాల్గుణి'గా పిలుస్తారు. గోవింద వ్రతాలు విరివిగా చేస్తుంటారు. విష్ణుపూజకు పేరొందిన 'పయో వ్రతం' విశిష్టమైంది. ఇది శుద్ధ పాడ్యమినాడు ప్రారంభమై పన్నెండు రోజులు సాగుతుంది. సమీపంలోని నదిలో స్నానంచేస్తూ, పవిత్ర నదులన్నింటినీ స్మరిస్తారు. లక్ష్మీనారాయణుల్ని పూజిస్తారు.

సూర్యుడికి అర్ఘ్యమిచ్చి, విష్ణువును షోడశోపచారాలతో అర్చించాలి. పాలను నైవేద్యంగా సమర్పించడం సంప్రదాయం. పయస్సు అంటే పాలు. అదితి ఈ వ్రతం చేయడంవల్ల వామనుడు జన్మించాడని పురాణాలు చెబుతాయి. లక్ష్మీనారాయణులు లేదా పార్వతీ పరమేశ్వరుల్ని శుద్ధ తదియ నాడు పూజించి నైవేద్యం సమర్పిస్తారు. ఈ మాసంలో రెండు రోజులు



వినాయకుణ్ని ఆరాధిస్తారు. కాశీలో, ద్రాక్షారామంలో వెలసిన డుండి గణపతికి సంబంధించిన పూజ అది. శుక్ల పాడ్యమి, చతుర్థినాడు అవిఘ్న; పుత్ర గణపతి వ్రతాల్ని ఆచరిస్తారు. పయోవ్రతం చివరిరోజు శుద్ధ ద్వాదశిన నరసింహస్వామి పూజ చేస్తారు.

దివ్య ఔషధంగా భావించే ఉసిరిని శుద్ధ ఏకాదశినాడు పూజించి, ఆ చెట్టు వద్దనే 'అమలక ఏకాదశి' వ్రతం నిర్వర్తిస్తారు. దీన్ని 'అమృత ఏకాదశి'గా పరిగణిస్తారు. మదురైలోని మీనాక్షీ సుందరేశ్వరుల కల్యాణం రోజు ఇది. అందుకే శివపూజ జరుపుతారు.

పలు వ్రతాల్లో ఎక్కువగా విష్ణుపూజ ఉంటుంది. ఫాల్గుణ మాసంలో అతి ముఖ్యమైనది 'వసంతోత్సవం'. ఇది కాముని పండుగగా, హోలికా పూర్ణిమగా, కామ దహనంగా ప్రఖ్యాతి చెందింది. శుద్ధ త్రయోదశి- కాముని పండుగగా ప్రసిద్ధి చెందింది. ఈ పర్వదినాన శివుడు, మన్మథుడు, కృష్ణుడు, లక్ష్మీదేవి పూజలందుకుంటారు. సత్యనారాయణస్వామి వ్రతాలూ జరుగుతాయి.

ఫాల్గుణమాసంలో ప్రతి తిథికీ ఒక ప్రత్యేకత ఉంది. చవితినాడు 'సంకట గణేశ' వ్రతం ఆచరిస్తారు. బహుళ అష్టమినాడు సీతాదేవి భూమి నుంచి ఆవిర్భవించింది. ఆ రోజు రామాయణాన్ని చదివి, సీతారాముల్ని కొలుస్తారు. బహుళ అమావాస్యనాడు పితృదేవతలకు పిండప్రదానం జరిపి అన్నదానం చేస్తారు. ఆనందకరమైన వాతావరణంలో మహాపురుషుల జయంతుల్ని పాటిస్తారు. పౌరాణిక సంప్రదాయాల్ని సంరక్షించుకొనేందుకు తగిన మాసం ఇది!

– డాక్టర్ పులిచెర్ల సాంబశివరావు

శ్రద్ధాంజలి



డా॥ బోళ్ళ బుల్లి రామయ్య గారు

మాజీ కేంద్ర వాణిజ్యశాఖా మంత్రివర్యులు,
ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్
వెంకటరాయపురం, తణుకు - 534 215
పశ్చిమగోదావరి జిల్లా, (ఆం.ప్ర.)
09.07.1926 - 14.02.2018

మీ ధృడసంకల్పం, కార్యదక్షత మాకు ఆదర్శనీయం
మీ ఆలోచనా ధృక్పధం మాకు స్ఫూర్తిదాయకం
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

కుటుంబ సభ్యులు
యాజమాన్యము మరియు సిబ్బంది

ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్

తణుకు • తాడువాయి • భీమడోలు • కొవ్వూరు • సగ్గొండ • గుంటూరు

ది ఆంధ్రా పెట్రోకెమికల్స్ లిమిటెడ్
విశాఖపట్నం

జోసిల్ లిమిటెడ్
డోకిపర్రు

శ్రీ అక్కమాంబ టెక్స్టైల్స్ లిమిటెడ్
వెంకటరాయపురం

శ్రీ సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్ లిమిటెడ్
వెంకటరాయపురం

ది ఆంధ్రా ఫారం కెమికల్స్ కార్పొరేషన్ లిమిటెడ్
కొవ్వూరు

జయలక్ష్మి ఫెర్టిలైజర్స్
వెంకటరాయపురం

హామీ ప్రకారం పరిహారం చెల్లించాల్సిందే

ఈనాడు, హైదరాబాద్: ప్రాజెక్టుల భూసేకరణ నిమిత్తం చెల్లించాల్సిన రూ.458 కోట్ల పరిహారాన్ని... వచ్చే బడ్జెట్ ఏడాది నుంచి ఆరు వాయిదాల్లో చెల్లించాల్సిందేనని తెలంగాణ ప్రభుత్వానికి ఉమ్మడి హైకోర్టు బుధవారం స్పష్టం చేసింది. హామీ ప్రకారం చెల్లించకపోతే పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. కోర్టుల్లో పరిహారానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ సర్కారు సమర్పించిన వివరాలపై సందేహం వెలిబుచ్చింది. పెద్దమొత్తంలో ప్రాజెక్టులు చేపడుతున్నపుడు భారీగా భూసేకరణ జరిగి ఉంటుందనీ... చెల్లించాల్సిన పరిహారం కేవలం రూ.62 కోట్లుగా పేర్కొనడం సందేహం కలిగిస్తోందని వ్యాఖ్యానించింది. జిల్లా కోర్టుల్లోని అపరిష్కృత వ్యాజ్యాల్లో చెల్లించాల్సిన మొత్తంతో దీనిని పోల్చి చూడాల్సి ఉందంది. భూపరిహారానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌లలో చెల్లించాల్సిన మొత్తంపై రెండు తెలుగు రాష్ట్రాల్లోని జిల్లా కోర్టుల నుంచి సమాచారం తెప్పించి తమ ముందుంచాలని రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా వేసింది.

భూసేకరణ ప్రక్రియలో పరిహారం పెంపు నిమిత్తం కింది కోర్టులు ఇచ్చిన ఉత్తర్వులను ఆయా జిల్లా కలెక్టర్లు అమలు చేయడంలేదనీ, వాటిని అమలు చేయాలంటూ పిటిషన్లు (ఈపీలు) ఎక్కువగా వస్తున్నాయంటూ మహబూబ్‌నగర్ జిల్లా జడ్జి గత జూన్ 24న లేఖరాశారు. దీనిని హైకోర్టు సుమోటో ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణించింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె. విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం ముందుకు బుధవారం ఇది విచారణకు వచ్చింది. 'భూమిని సేకరించిన తర్వాత పరిహారం చెల్లించకపోతే ఎలా! పరిహారం చెల్లించాల్సిందే'నని ధర్మాసనం స్పష్టం చేసింది.

గత ఆదేశాల మేరకు రెండు రాష్ట్ర ప్రభుత్వాల తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు నివేదికలను సమర్పించారు. తెలంగాణలోని అన్ని జిల్లా సివిల్ కోర్టుల్లో 1,669 ఈపీలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటికి రూ. 457.79 కోట్లు చెల్లించాల్సి ఉందని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. ఈపీలు నీటిపారుదల, గృహనిర్మాణ తదితర శాఖలకు సంబంధించినవి అపరిష్కృతంగా ఉన్నాయనీ, ఈ మొత్తం చెల్లించడానికి ఎక్కువ బడ్జెట్ అవసరమన్నారు. ఏప్రిల్ 1- డిసెంబరు 31 బడ్జెట్ ఏడాదిలో ఆరు వాయిదాల్లో నిధులను విడుదల చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ధర్మాసనం స్పందిస్తూ- ఇదే హామీని రికార్డు చేస్తున్నామని, హామీ ప్రకారం చెల్లించకపోతే పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని విస్పష్టం చేసింది.

మూడు నెలల గడువు కావాలి...

'ఆంధ్రప్రదేశ్‌లో ఫిబ్రవరి 5 నాటికి 918 ఈపీలు పెండింగులో ఉన్నాయి. వీటికి రూ.84.32 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇందులో ఇప్పటికే రూ.21.55 కోట్లు డిపాజిట్ చేశాం. మరో రూ.62.88 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తాన్ని డిపాజిట్ చేసి, ఈపీలను మూసివేయడానికి మూడునెలల గడువు అవసరం' అని ఆ రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. ఇందుకు ధర్మాసనం స్పందిస్తూ- 'రెండు రాష్ట్రాల్లో పెద్దఎత్తున ప్రాజెక్టులు చేపడుతుండటంతో భూసేకరణ కూడా అదేవిధంగా జరిగి ఉంటుంది. తెలంగాణలో రూ.458 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఏపీలో ఇవ్వాల్సింది కేవలం రూ. 62 కోట్లేనా' అని సందేహం వ్యక్తం చేసింది. ఏపీ ప్రభుత్వ న్యాయవాది సమాధానమిస్తూ... ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడిప్పుడే కొత్త ప్రాజెక్టులు చేపడుతున్నామనీ, భూసేకరణ ప్రక్రియ ఇంకా ఈపీల దశకు చేరలేదన్నారు. అయినా దీనిపై సందేహాలున్నాయన్న ధర్మాసనం... తాము కోర్టుల నుంచి సమాచారం తెప్పించి పోల్చి చూడాలనుకుంటున్నామని పేర్కొంది.

భూసేకరణకు సంబంధించి కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న ఎగ్జిక్యూటివ్ పిటిషన్‌ల వివరాలను తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు హైకోర్టుకు సమర్పించారు. తెలంగాణలో మొత్తం 1,669 ఈపీలకుగాను రూ.457,78,89,622... ఆంధ్రప్రదేశ్‌లో 918 ఈపీలకు రూ.62.88 కోట్లు చెల్లించాల్సి ఉందని నివేదికల్లో పేర్కొన్నారు.

తెలంగాణ,ఏపీ ప్రభుత్వాలు సమర్పించిన వివరాలు www.eenadu.netలో

అర్హత లేని వైద్యంతో ప్రాణాల మీదకు..

రెండేళ్ల పాటు వైద్యుడిపై టీఎస్ఎంసీ వేటు

ఈనాడు, హైదరాబాద్: స్పెషలిస్టు వైద్యసేవల్లో అర్హత లేకపోయినా వైద్యం చేయడంతో ఓ రోగి ప్రాణాల మీదకొచ్చింది. అత్యవసరంగా మరో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స అందించడంతో బతికి బయటపడినా.. ఒక కన్ను కోల్పోవాల్సి వచ్చింది. ఇందుకు కారణమైన వైద్యుడిపై తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి(టీఎస్ఎంసీ) బుధవారం వేటు వేసింది. టీఎస్ఎంసీ ఛైర్మన్ డాక్టర్ రవీందర్‌రెడ్డి వెల్లడించిన ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ మహ్మద్ ఇస్రాతుల్లా వెంట్రుకల మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించి బట్టతలపై వెంట్రుకలు రప్పించే వైద్యుడిగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇది స్పెషలిస్టు వైద్యవిద్య పూర్తిచేసిన నిపుణులే చేయాల్సి ఉంటుంది. డాక్టర్ మహ్మద్ ఇస్రాతుల్లా ఎంబీబీఎస్ వైద్యుడు మాత్రమే. సంబంధిత స్పెషలిస్టు వైద్యంలో అర్హత లేకపోయినా .. తారీఖ్ ఖుస్రూ అనే వ్యక్తికి వెంట్రుకల మార్పిడి శస్త్రచికిత్స చేశారు. మధుమేహంతో బాధపడుతున్న ఆ రోగికి చికిత్స విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడంవల్ల తీవ్ర ఇన్‌ఫెక్షన్‌తో ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. మరో ఆసుపత్రిలో చికిత్స పొందడంతో ప్రాణాలు దక్కినా ఇన్‌ఫెక్షన్‌తో ఒక కన్ను దెబ్బతింది. తనకు జరిగిన అన్యాయంపై బాధితుడు టీఎస్ఎంసీని ఆశ్రయించారు. 2016లో నమోదైన ఈ కేసుపై విచారణ చేపట్టిన టీఎస్ఎంసీ విచారణ జరిపి, వైద్య నిర్లక్ష్యమని తేల్చింది. ఎంబీబీఎస్ పట్టాతో స్పెషలిస్టు వైద్యం చేస్తున్నట్లు నిర్ధరించింది. రెండేళ్ల పాటు వైద్యసేవల్లో పాల్గొనకుండా డాక్టర్ మహ్మద్ ఇస్రాతుల్లాపై నిషేధం విధించింది. రెండేళ్ల అనంతరం కూడా స్పెషలిస్టు వైద్యవిద్యలో పట్టా పొందిన తర్వాతే సంబంధిత వైద్యాన్ని చేయాలని సూచించింది. ఈ వైద్యుడితో పాటు మరికొందరిపైనా మందలింపు చర్యలు తీసుకున్నట్లు వైద్యమండలి ఛైర్మన్ రవీందర్‌రెడ్డి తెలిపారు. రేడియేషన్ ఆంకాలజిస్టుగా పట్టాపొంది మెడికల్ ఆంకాలజిస్టుగా రోగులకు ఔషధాలను సూచిస్తున్న ఓ వైద్యుడికీ, వైద్య విద్యార్థులను దుర్భాషలాడుతూ అగౌరవపరుస్తున్న మరో వైద్యుడికి తమప్రవర్తనను మార్చుకోవాలని టీఎస్ఎంసీ సూచించింది.

మండల స్థాయిలోనే పంచాయతీ ఎన్నికల సామగ్రి పంపిణీ

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల సామగ్రి మండల స్థాయిలో పంపిణీ కానుంది. పంచాయతీ స్థాయి ఎన్నికల అధికారులు మండల కేంద్రం నుంచి సామగ్రిని తీసుకెళ్తారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఓట్లను లెక్కించి విజేతలకు ధ్రువీకరణ పత్రాలు ఇస్తారు. అనంతరం ఉప సర్పంచి ఎన్నికలు నిర్వహిస్తారు. మండల కేంద్రాల్లో ఎన్నికల సామగ్రి పంపిణీకి, ఓట్ల లెక్కింపునకు అనువైన భవనాలను వెంటనే గుర్తించాల్సిందిగా కలెక్టర్లను ఆదేశిస్తూ. .తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను వెలువరించింది.

సైన్యం మతాల ప్రాతిపదికన వేరుచేయదు

లెఫ్టినెంట్ జనరల్ అంబూ వ్యాఖ్య

ఉధమ్‌పుర్: జవాన్లను మతాల ప్రాతిపదికన భారత సైన్యం వేరుచేయదని నార్తర్న్ కమాండు చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ డి.అంబూ వ్యాఖ్యానించారు. "సైన్యంలో ఎక్కడికెళ్లినా ఇదే విషయం కనబడుతుంది. సైన్యం అంతర్గత పనితీరుపై అవగాహన లేనివారే.. అర్థం లేని వ్యాఖ్యలు చేస్తుంటారు" అని ఆయన అన్నారు. ఇటీవల సుంజ్వాన్ సైనికశిబిరంపై జరిగిన ఉగ్రదాడిలో ఆరుగురు సైనికులు అమరులయ్యారు. అయితే వీరిలో నలుగురు కశ్మీరీ ముస్లింలూ ఉన్నారన్న విషయాన్ని.. ముస్లింల దేశభక్తిని ప్రశ్నిస్తున్నవారు ఎందుకు విస్మరిస్తున్నారంటూ ఎమ్ఐఎమ్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ మంగళవారం వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే అంబూ స్పందించారు. ఇటీవల షోపియాన్ జిల్లాలో సైనిక వాహనశ్రేణిపై తీవ్రస్థాయిలో రాళ్లదాడికి తెగబడ్డ జనసమూహంపై.. మేజర్ ఆదిత్యకుమార్ కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి.. ఆదిత్యకుమార్‌పైనే పోలీసులు అభియోగపత్రం నమోదు చేశారు. సైన్యంపై దీని ప్రభావం ఉంటుందా అన్న ప్రశ్నకు.. సైనికుల ధైర్యవిశ్వాసాలకు ఈ ఉదంతం ఏమాత్రమూ నష్టం కలిగించలేదని అంబూ బదులిచ్చారు.

ఉగాది నుంచి తెలంగాణ కరదీపిక పంపిణీ

- **రమణాచారి, దేశపతి, హరికృష్ణల వెల్లడి**



సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, సీఎం ప్రత్యేకాధికారి దేశపతి శ్రీనివాస్, సాంస్కృతిక సంచాలకుడు మామిడి హరికృష్ణ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణకు సంబంధించిన సమస్త అంశాల సమాహారంగా కరదీపికలాంటి పుస్తకాన్ని ముద్రించి, ఉగాది పర్వదినమైన మార్చి 18 నుంచి ఇంటింటికీ పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, సీఎం కార్యాలయ ప్రత్యేకాధికారి, ప్రముఖ కవి దేశపతి శ్రీనివాస్, సాంస్కృతిక సంచాలకుడు మామిడి హరికృష్ణ తెలిపారు. బుధవారం సచివాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. "ప్రపంచ మహాసభల సందర్భంగా ముద్రించిన 'మన తెలుగు' పుస్తకం స్ఫూర్తిగా తెలంగాణ చరిత్ర, భాష, కళలు, సాహిత్యం వంటి అంశాలతో కూడిన చిన్న పుస్తకం ముద్రించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. దేశపతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ పుస్తకాన్ని రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) ముద్రిస్తోంది." అని రమణాచారి తెలిపారు. దేశపతి మాట్లాడుతూ "నిపుణులతో కూడిన కమిటీ దీనిని రూపొందించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమోదం అనంతరం ముద్రణ ప్రారంభమవుతుంది. పుస్తకం పేరును సీఎం ఖరారు చేస్తారు. సాహిత్య అకాడమీ ఛైర్మన్ నందిని సిధారెడ్డి, గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ అయాచితం శ్రీధర్, అధికార భాషా సంఘం అధ్యక్షుడు దేవులపల్లి ప్రభాకర్‌రావు, తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ఎస్వీ సత్యనారాయణ, కవులు, రచయితల సలహాలు, సూచనలకు అనుగుణంగా దీనిని రూపొందిస్తున్నాం. రాష్ట్రంలో కోటి మూడు లక్షల కుటుంబాలు ఉండగా, అందరికీ పుస్తకాన్ని చేరుస్తాం. ప్రతీ పాఠశాల, గ్రామపంచాయతీ సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు ఉచితంగా అందిస్తాం." అని చెప్పారు. తెలుగు భాషలో ప్రభుత్వ ఉత్తర్వుల జారీకి ప్రయత్నాలు జరుగుతున్నాయనీ, శాసనసభలోనూ అనువాదాలు వాడుక భాషలో ఉండేలా చర్యలు తీసుకుంటామని రమణాచారి, దేశపతి శ్రీనివాస్‌లు తెలిపారు.

19 నుంచి అందుబాటులో టీఆర్‌టీ హాల్‌టికెట్లు

16వ తేదీ ఉదయం 5 వరకు ఎడిట్‌కు అవకాశం

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్‌టీ) హాల్‌టికెట్లు ఈ నెల 19 నుంచి అందుబాటులోకి వస్తాయని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ.వాణిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల వ్యక్తిగత వివరాల్లో పొరపాట్లు సరిదిద్దుకునేందుకు, పూర్వజిల్లాల ప్రాతిపదికన ప్రాధాన్యతాక్రమం మార్చుకునేందుకు 'ఎడిట్' అవకాశమిస్తున్నట్లు పేర్కొన్నారు. పొరపాట్లను సరిదిద్దుకునేందుకు గురువారం ఉదయం 5 గంటల నుంచి శుక్రవారం(ఈ నెల 16) ఉదయం 5 గంటల వరకు ఎడిట్ అవకాశం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. గడువు తరువాత మరోసారి అవకాశమివ్వమని ఆమె స్పష్టం చేశారు.

అటవీ రేంజ్ అధికారుల రాతపరీక్ష తుది 'కీ' విడుదల

అటవీ రేంజ్ అధికారుల పోస్టులకు నిర్వహించిన రాతపరీక్షల తుది కీ విడుదల చేసినట్లు కమిషన్ కార్యదర్శి తెలిపారు. ఇది ఈ నెల 15నుంచి టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి శిక్షణ: ఎన్టీఆర్ ట్రస్ట్

ఈనాడు, హైదరాబాద్: స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలనుకునే మహిళలకు నిపుణులతో వంటల తయారీలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈఓ విష్ణువర్ధన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బేకరీ, చైనీస్, రెస్టారెంట్ వంటలను ఇంటివద్దే తయారు చేసి పంపడంపై శిక్షణ ఇస్తామని పూర్తి వివరాలకు 040-30145800కు ఫోన్ చేయాలని ఆయన పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ గడువు పొడిగించండి

- **సీఈఓను కోరిన టీపీసీసీ నేతలు**

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణలోని గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా సవరణ గడువు మరో నెలరోజులు పొడిగించాలంటూ కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరారు. బుధవారం టీపీసీసీ ఎన్నికల విభాగం కన్వీనర్ మర్రి శశిధర్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రతినిధులు సీఈఓ అనూప్‌సింగ్‌ను కలిశారు. ఫిబ్రవరి 4, 14 తేదీల్లో 83 నియోజకవర్గాల పరిధిలో నిర్వహించిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సక్రమంగా జరగలేదని, బూత్ స్థాయి అధికారులు చాలాచోట్ల అందుబాటులో లేరని, రాజకీయ పార్టీలకు ముసాయిదా ఓటర్ల జాబితా అందించలేదని వివరించారు. క్షేత్రస్థాయిలో అనేక లోపాలు ఉన్నందున సవరణ గడువు మరో నెల రోజులు పొడిగించాలని కోరారు. తమ విన్నపానికి సీఈఓ సానుకూలంగా స్పందించారని, కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసి తదుపరి నిర్ణయం వెల్లడిస్తానని చెప్పారని కాంగ్రెస్ నేతలు తెలిపారు.

కోర్టు ధిక్కరణగా ఎందుకు పరిగణించకూడదో చెప్పండి?

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌బాబుకు హైకోర్టు ఆదేశం

గన్‌ఫౌండ్రీ వద్ద ఉన్న ఏపీ ఎన్జీవో భవన్‌లోని నాలుగు గదులు, ఒక సమావేశ మందిరాన్ని భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో అసోసియేషన్‌కు అప్పగించే విషయంలో కోర్టు ఉత్తర్వులను అనుసరించకపోవడాన్ని కోర్టు ధిక్కరణగా ఎందుకు పరిగణించకూడదో స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు అశోక్‌బాబుకు హైకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసు(ఫామ్-1) జారీచేసింది. ధిక్కరణ వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరిస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె. ఉమాదేవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. కోర్టు ఆదేశాల మేరకు ఏపీఎన్జీవో భవన్‌లోని కొన్ని గదులను వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలంటూ హైకోర్టు ఆదేశించిన ఉత్తర్వులకు ఏపీఎన్జీవో కట్టుబడలేదని పేర్కొంటూ భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్ హైకోర్టులో కోర్టుధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరిస్తూ నోటీసులు జారీచేసింది.

రూ.2,700 కోట్లతో 52 ఆర్వోబీలు

- **రాష్ట్ర ప్రభుత్వ వాటా కేటాయిస్తాం**
- **పనులు వేగంగా చేయాలని రైల్వే అధికారులకు మంత్రి హరీశ్ వినతి**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో గుర్తించిన రైల్వే లెవల్ క్రాసింగ్స్ వద్ద వంతెనల(రోడ్ ఓవర్ బ్రిడ్జి- ఆర్వోబీ) నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మంత్రి హరీశ్‌రావు దక్షిణ మధ్య రైల్వే అధికారులను కోరారు. పెండింగు పనులపై దక్షిణ మధ్య రైల్వే అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జలసౌధలో నిర్వహించింది. సమావేశానికి హరీశ్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 460 లెవల్ క్రాసింగ్స్‌పై వంతెనలను దశల వారీగా నిర్మించాలని కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.2,700 కోట్లతో 52 వంతెనల నిర్మాణానికి అవసరమైన రాష్ట్ర ప్రభుత్వ వాటాను కేటాయిస్తామన్నారు. మెదక్- అక్కంపల్లి రైలు మార్గాన్ని ఈ ఏడాది చివరిలోగా పూర్తి చేయాలని కోరారు. ఎంఎంటీఎస్ రెండో దశను కూడా ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలన్నారు. పలు జిల్లాల కలెక్టర్లతో మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు సమావేశం నుంచే మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో భూ సేకరణను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. 16 ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ఆర్వోబీల తీరును కూడా సమీక్షించారు. హైదరాబాద్ శివారులో ప్రతిపాదించిన నూతన టెర్మినల్స్ పనులు త్వరితంగా చేపట్టాలన్నారు.

వంతెనల నిర్మాణం చేపట్టేందుకు సిద్ధం:తుమ్మల

ఆర్వోబీల నిర్మాణాన్ని చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఆయా నిర్మాణాలను రైల్వే శాఖ ప్రస్తుతం పర్యవేక్షిస్తుంది. వంతెనలు రైల్వే శాఖ చేపడితే అనుసంధాన మార్గాల(అప్రోచ్ రోడ్స్)ను రహదారులు-భవనాల శాఖ నిర్మిస్తుంది. అన్నింటినీ ఒకే శాఖ పరిధిలోకి తీసుకువస్తే బాగుంటుందని సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ ప్రతిపాదించటంతో మంత్రి తుమ్మల సుముఖత వ్యక్తం చేశారు. ట్రాఫిక్ చిక్కుముడులున్న చోట ఆర్వోబీలను నాలుగు వరుసలుగా విస్తరించాలన్నారు. పాత వాటిని విస్తరించేందుకు రైల్వే అధికారులు నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌కుమార్, రైల్వే, ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

మాజీ సభాపతి సురేశ్‌రెడ్డి విమర్శ

హైదరాబాద్, న్యూస్‌టుడే: పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలవుతున్నాయని మాజీ సభాపతి కె.ఆర్.సురేశ్‌రెడ్డి విమర్శించారు. మాజీ విప్ అనిల్, రాజారాం యాదవ్‌లతో కలిసి ఆయన బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మద్దతు ధర కల్పించనందుకు నిరసనగా ఎర్రజొన్న, పసుపు రైతులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. పాలకుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గురువారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో రైతులు మహాధర్నాకు పిలుపునిచ్చారని, రాజకీయాలకు అతీతంగా ఈ ధర్నా జరుగుతుందన్నారు. రైతులను మోసం చేసిన నకిలీ విత్తన వ్యాపారులపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సురేశ్‌రెడ్డి ప్రశ్నించారు.

★ కల్తీ విత్తనాల వెనక తెరాస ఎమ్మెల్సీ హస్తం ఉందని మాజీ కేంద్రమంత్రి పి.బలరాం నాయక్ ఆరోపించారు. రైతు సమస్యలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించాలన్నారు. బయ్యారం, గూడూరులలో పోడు భూములను హరితహారం పేరిట అటవీ అధికారులు లాక్కుంటున్నారని, దీంతో బాధిత గిరిజన రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని మాజీ ఎంపీ రవీంద్రనాయక్ డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లో ఆయన నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు.

క్యాబినెట్ హోదాపై కౌంటరు దాఖలు చేయండి

తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: చట్ట, రాజ్యాంగ విరుద్ధంగా పలువురికి క్యాబినెట్ హోదాను కల్పిస్తూ జీవోలు జారీ చేయడానికి సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలంటూ తెలంగాణ ప్రభుత్వానికి బుధవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై మరోసారి గడువు కోరడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ప్రతివాదుల్లో ఇంకా ఎవరికైనా నోటీసులు అందని పక్షంలో అందజేయాలంటూ పిటిషనర్ రేవంత్‌రెడ్డికి సూచించింది. రాజ్యాంగంలోని అధికరణ 164(1ఎ)కు విరుద్ధంగా ప్రభుత్వం తనకు నచ్చినవారికి క్యాబినెట్ హోదా కల్పించిందని, దాన్ని రద్దు చేయాలని కోరుతూ గతేడాది జనవరిలో రేవంత్‌రెడ్డి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. లాభదాయక పదవుల్లో కొనసాగుతున్నారంటూ దిల్లీలో 20మంది ఆప్ ఎమ్మెల్యేలపై ఎన్నికల సంఘం(ఈసీ) అనర్హత వేటు వేసిన నేపథ్యంలో తన వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ చేపట్టాలంటూ ఇటీవల రేవంత్‌రెడ్డి అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గతంలో విచారించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తితోపాటు ధర్మాసనంలోని న్యాయమూర్తి జస్టిస్ విజయలక్ష్మి తప్పుకోవడంతో బుధవారం జస్టిస్ రామసుబ్రమణియన్, జస్టిస్ టి. అమరనాథ్‌గౌడ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం ఇప్పటివరకు కౌంటరు దాఖలు చేయలేదని, ఆప్ ఎమ్మెల్యేలపై ఈసీ వేటు వేసిన నేపథ్యంలో దీనిపై సత్వరమే విచారణ చేపట్టాలని కోరారు. వాదనలను విన్న ధర్మాసనం మార్చి 14వ తేదీకి వాయిదా వేస్తూ ఆ లోగా కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

రైతుల సమస్యల్ని గాలికొదిలేసిన ప్రభుత్వం: రావుల

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు రైతుల సమస్యలను గాలికొదిలేసి రాజకీయాలపైనే దృష్టి పెట్టడం రైతులకు శాపంగా మారిందని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలపై సమీక్షించడానికి సీఎంకు గానీ, మంత్రులకు గానీ సమయం ఉండటం లేదన్నారు. కంది, ఎర్రజొన్న పంటలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వకుండా ఇప్పుడు కేంద్రంపై నెపం నెట్టాలని చూస్తోందన్నారు. కందులు అమ్మిన రైతులకు ప్రభుత్వం బకాయిలు పెట్టిందని, రంగారెడ్డి జిల్లాలోనే రూ.120 కోట్లు ఇవ్వాలన్నారు. సుబాబుల్ కలపను ప్రైవేటు మిల్లు కొనకుండా రైతులను వేధిస్తోందని, దీనికి మద్దతు ధర ఇచ్చి కొనాలని మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లాలని కోరితే అధ్యయనం చేసి చెబుతామన్నారని, అది ఎక్కడిదాకా వచ్చిందో చెప్పాలని కోరారు. సుబాబుల్ రైతుల సమస్యలను వివరించడానికి సీఎంను తెదేపా బృందం కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరుతూ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య లేఖ రాసినట్లు తెలిపారు.

ఆలోచన అద్భుతం.. సాగు వినూత్నం..!

నీళ్లు కనిపించనిస్థాయిలో విస్తరించిన గుర్రపు డెక్కకు తోడు మురుగు నీటితో కాలుష్యకాసారంగా మారిన చెరువును శుద్ధిచేసి.. సేంద్రియ విధానంలో చేపట్టిన కూరగాయలు, పూల సాగు సత్ఫలితాలిస్తోంది. ఓ స్వచ్ఛంద సంస్థ మదిలో మొగ్గ తొడిగిన ఈ అలోచనకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ నుంచి అందిన ఆర్థిక సహకారంతో ఈ అద్భుతం సాకారమైంది. రంగారెడ్డి జిల్లా నార్సింగి మండలం నెక్నాంపూర్ గ్రామపరిధిలోని చెరువు ఈ వినూత్న సాగుకు వేదికైంది. ఈ విధానంలో చెరువులోని నీటిలో కొంత విస్తీర్ణం మేర థర్మాకోల్‌షీట్లు పరిచి.. వాటిల్లో మట్టి నింపి టమాటా, వంకాయ సహా వివిధ కూరగాయలు, పూలజాతి మొక్కల పెంపకాన్ని ఇటీవల ప్రారంభించారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ విజయవంతమై.. ఆయా మొక్కలన్నింటికీ కూరగాయలు, పూలు కాసి చూపరులను అలరిస్తున్నాయి. ఇన్నాళ్లు కాలుష్యంతో దుర్గంధం వెదజల్లిన చెరువు పరిసరాలూ నూతన శోభతో స్థానికులను ఆకట్టుకుంటున్నాయి. *-ఈనాడు, రంగారెడ్డి జిల్లా*




నెక్నాంపూర్ చెరువులో థర్మాకోల్ షీట్లపై చేపట్టిన కూరగాయలు, పూల సాగు

makarandam@eenadu.in

7 హైదరాబాద్, గురువారం , ఫిబ్రవరి 15, 2018 ఈనాడు

మా చిరునామా: **మకరందం,** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

మేళాలు.. తాళాలు.. పందిళ్లు.. సందళ్లు.. సంబరాలు.. సంతోషాలు.. వివాహ వేళ భౌతికంగా కనిపించే ఆనంద హేల ఇది. ఇరు హృదయాలను పెనవేసే వైదిక క్రతువు వివాహం. రెండు కుటుంబాలను గౌరవంగా కలిపే సంప్రదాయ విధి పెళ్లి. ఎదుర్కోళ్లు మొదలు అప్పగింతల వరకు పెళ్లితంతులో ప్రతిదీ పరమార్థంతో కూడుకున్నదే! గృహస్థాశ్రమంలోకి ప్రవేశిస్తున్న కొత్త దంపతులు వివాహ ఔన్నత్యాన్ని తెలుసుకోవాలి. ఒకరికొకరు అనే సత్యాన్ని అర్థం చేసుకోవాలి. కల్యాణ ముహూర్తాలు సమీపిస్తున్న శుభవేళ... పరిణయ సందేశం మీ కోసం..



యుగచ్ఛిద్రాభిషేకం

కొన్ని ప్రాంతాల్లో పెళ్లి తంతులో ఎడ్ల బండికి కట్టే కాడిని వధువు తలకు కొంచెం ఎత్తులో పట్టుకుని ఉండటం చూస్తుంటాం! ఈ ప్రక్రియను యుగచ్ఛిద్రాభిషేకం అంటారు. యుగం అంటే రెండు. ఛిద్రమంటే రంధ్రాలు. రెండు రంధ్రాలు కలిగిన బండి కాడిని తెచ్చి.. దానిని వధువు శిరస్సుపై కొంచెం ఎత్తులో ఉంచుతారు. కాడి రంధ్రంలో మంగళ సూత్రాన్ని ఉంచుతారు. దర్భలతో గుండ్రంగా ఒక చక్రాన్ని తయారుచేసి వధువు శిరసుపై ఉంచుతారు. తర్వాత మంత్రాలు చదువుతూ కాడి రంధ్రంలో ఉంచిన మంగళసూత్రం గుండా వధువు శిరస్సుపై పడేవిధంగా నీరు పోస్తారు. దీనిని అపాలమని పిలుస్తారు. ఇలా చేయడం వల్ల వధువుకు వర్చస్సు కలుగుతుంది. ఆరోగ్యం సిద్ధిస్తుంది. ఐశ్వర్యం కలుగుతుంది. వివాహ ప్రక్రియలో ఇది మూడో ముహూర్తం. అయితే అన్ని ప్రాంతాల్లో ఆచరణలో లేదు.

యోక్త్రం..

ముప్ఫయ్‌రెండు అంగుళాల పొడవు కలిగిన దర్భలతో పేనిన తాడును యోక్త్రం అంటారు. అందులో కూడా 24 దర్భలు ఉండాలని నియమం. మంత్రాలు చెబుతూ దీనిని వరుని చేత వధువు నడుముకు కట్టిస్తారు. ఇలా చేయడం వల్ల గర్భ దోషాలు నశిస్తాయని చెబుతారు.



బాఢం కరోమి..

సన్నికల్లు (గంధం, పసుపు కొమ్ములు నూరే రాయి) మీద కాలు పెట్టిన సమయంలో "బాఢం కరోమి" అని వధూవరులు ప్రయాణం చేసే విధానం ఉన్నది. పెళ్లి సమయంలో చేసిన ప్రమాణాలను అన్నింటినీ చక్కగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేయడం అన్నమాట. ఇద్దరూ ఎవరికి వారుగా కాక ఒకరికి ఒకరుగా చేసే ప్రేమైక సహజీవన ప్రయాణంలో మొట్టమొదటి మెట్టు అది. ఈ ప్రమాణం అమలు చేసే విషయంలో జీవితంలో అప్పుడప్పుడు కొన్ని ఒడిదొడుకులు ఎదురైనా చలించకుండా ప్రేమగా కలిసి ఉంటామని చెప్పే సంకేతమే సన్నికల్లు తొక్కడం.



సఖా కలిసి నడుద్దామా!

పెళ్లిలో మూడు ముళ్లకు ఎంత ప్రాధాన్యమో.. ఏడడుగులకూ అంతే ప్రాముఖ్యం ఉంది. వధూవరులు కలిసి ఏడు అడుగులు వేయడాన్నే సప్తపది అంటారు. అడుగడుగున భగవానుడిని ఆశీర్వాదాలు కోరుతుంది కొత్త జంట. మొదటి అడుగుతో శారీరక బలాన్ని ప్రసాదించాలనీ, రెండో అడుగు వేస్తూ మనోధైర్యాన్ని కలిగించాలని, తరువాత గృహస్థ ధర్మాన్ని కలకాలం పాటించాలనీ, ఐహిక సంపదలు అనుభవించాలనీ, పాడి సమృద్ధిగా ఉండాలి, ప్రకృతి ఫలాలు పొందాలనీ కోరుతూ ఏడో అడుగు వేస్తూ.. ఇవన్నీ లభించేలా ఆశీర్వదించాలని మంత్రపూర్వకంగా అడుగుతారు. సప్తపది చివరిలో.. 'సఖా సప్తపదా భవా' అన్న మంత్రాలు చెబుతాడు వరుడు. చిరకాలం భార్యాభర్తలు మధ్య ఉండాల్సిన మైత్రికి సంకేతమిది.

మనసున మనసై!

మన దేశానికి బలం కుటుంబ వ్యవస్థ. దీనికి మూలం వివాహం. రెండు నిండు జీవితాలను కలిపే వివాహం ఒక పవిత్రమైన విధి. భార్య, భర్తలో సగభాగం అవుతుంది కాబట్టే ఆమెను అర్ధాంగి అన్నారు. పార్వతీదేవి పరమ శివుడి శరీరంలోని ఎడమ భాగాన్ని పొందిందని సౌందర్యలహరిలో శ్రీ శంకరులు స్తుతించారు. వారి దాంపత్యం అందరికీ ఆదర్శప్రాయమని వర్ణించారు. పద్మ పురాణమైతే భార్యను తీర్థంగా చెప్పింది. అంటే తరింపజేసేదని అర్థం. మనిషి జీవన విధానాన్ని నాలుగు దశలుగా విభజించారు. వీటిలో మొదటిది, శ్రేష్ఠమైంది గృహస్థాశ్రమం. 'చతుర్ణాం ఆశ్రమాణాంహి గార్హస్త్యం శ్రేష్ఠముత్తమం' అని తీర్పు చెప్పింది రామాయణం. గృహస్థు లేనినాడు ఆహారమే దొరకదని వేదాలు కూడా వల్లించాయి. ఇలాంటి ఉన్నతమైన గృహస్థాశ్రమ స్వీకారానికి స్త్రీపురుషులను మంత్రాలతో సంస్కరించడమే వివాహం.

ఆకాశం, భూమి తమంత తాముగా ఫలవంతం కావు. సృష్టి నడవాలంటే భూమి, ఆకాశాల మధ్య ఒక సంబంధం ఉండాలి. ఆకాశం నుంచి పడే వాన భూమిని తడిపి అందులోని అంకురాలను మొలిపించి వృక్షాలుగా మార్చి చైతన్యవంతం చేస్తుంది. స్త్రీ పురుషుల జీవితాలు కూడా అంతే. వివాహం వల్ల చైతన్యవంతమవుతాయి. రెండు జీవితాలూ ఏకమై సార్థక్యాన్ని పొందుతాయి. అందుకే సర్వజగత్తులో ఉన్న చైతన్యానికి మూలంగా పెళ్లిని చెబుతారు. వివాహ బంధం ద్వారా ఒక్కటైన స్త్రీ, పురుషుడు కలిసి, మెలిసి జీవించాలని, పరస్పర సౌఖ్యాన్ని, సంతోషాన్ని పెంచుకుంటూ, పంచుకుంటూ తరించాలని శాస్త్రాలు నిర్దేశించాయి. 'ఓ వధూవరులారా! మీరు ఈ లోకంలో చిరకాలం సఖ్యతతో జీవించండి. కొడుకులతో, మనుమలతో సంతోషంగా వర్ధిల్లండి అని ఋగ్వేదం కూడా ఆశీర్వదిస్తుంది. జీవితాలను ఎలా పండించుకోవాలో వేదమంత్రాల రూపంలో వెల్లడించడం వివాహ క్రతువులోని అంతరార్థం. కన్యాదాన సమయంలో కన్యాదాత 'ఈ వధువును స్నేహంగా చూసుకో' అని వరుణ్ణి మంత్రపూర్వకంగా అభ్యర్థిస్తాడు. సప్తపది ప్రక్రియలో ఏడో అడుగులో వరుడు, వధువును స్నేహితురాలిగా సంబోధిస్తాడు. పెళ్లింటి వీధి గుమ్మం దగ్గర వధూవరులను అడ్డగించి పేర్లు చెప్పిస్తారు. లౌకిక వ్యవహారంగా కనిపించే ఈ ఆచారం నిజానికి వేదసమ్మతం. అలా ఒకరినొకరు పలకరించుకునే క్రమంలో పరస్పరం మిత్రులవుతారని ఈ సందర్భంలో చెప్పే మంత్రార్థం. బిందెడు నీళ్లలో పడేసిన ఉంగరాన్ని తీసే క్రమంలో స్పర్శ తాలూకు స్నేహ పూర్వకమైన సాన్నిహిత్యం చిగురిస్తుంది.

మనిషి శరీరాన్ని ఆశ్రయించుకుని ఉన్న జీవుడు పొందాల్సినవి నాలుగు. వాటిని పురుషార్థాలు అంటారు. వీటిలో మొదటిది ధర్మం. తరువాతి రెండూ అర్థం, కామం. ఈ రెండింటినీ ధర్మంగా పొందితే చివరిదైన మోక్షానికి దారిదొరుకుతుందని చెబుతారు. అర్థం ధర్మబద్ధం కావాలి. అంటే సంపాదన, ఖర్చు రెండూ ధార్మికంగా ఉండాలి. మనం ఏ పని చేసినా అది ధర్మచట్రంలో ఇముడుతుందా అనే విషయాన్ని పరిశీలించిన తర్వాతే ముందడుగు వేయాలంటారు. కామం కూడా ఇంతే. ఇది సాధించాలంటే జీవితం ఒక క్రమ పద్ధతిలో సాగాలి. దీనికి సూత్రీకరణే వివాహం.

లోకంలోని ధర్మాల్లో దాంపత్య ధర్మం చాలా విశిష్టమైంది. 'ఏది సుఖదుఃఖాల్లో ఏకరూపంగా ఉంటుందో, కష్టాల్లో ఉన్న హృదయాలకు గొప్ప ఊరటనిస్తుందో, దేని మాధుర్యాన్ని వార్ధక్యం కూడా హరించలేదో, ఇంద్రియాల శక్తి తగ్గేకొద్దీ ఏది పెరుగుతుందో, కాలం గడిచేకొద్దీ ఏది మరింతగా బలపడుతుందో అలాంటి దాంపత్య ధర్మం భద్రమగుగాక' అని భవభూతి ఉత్తర రామాయణంలో అన్నారు. వివాహ సంస్కారంలో వధువు, వరుడు తమ హృదయాలు నీరులా స్వచ్ఛంగా, ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటారు. అంటే మిగిలిన జీవితమంతా మిత్రులుగా ఉండాలంటుంది వివాహ ధర్మం. వైవాహిక జీవితంలో ఆనందానికి, సుఖానికి పునాది ఇద్దరి మనసుల్లో నుంచి పుడుతుంది. తమ ఇష్టమే నెగ్గాలనుకోవడం కన్నా ఎక్కడ తగ్గాలో తెలుసుకోవడం ముఖ్యం. దంపతులకు సహనం చాలా అవసరం. వివాహ జీవితానికి ప్రేమ ఉద్యానవనం వంటిది. అయస్కాంతం ఇనుమును ఆకర్షించినట్లే దంపతుల మధ్య ఉండే ప్రేమ చావు వరకు దంపతులను కలిపి ఉంచుతుంది. దీనికే హృదయ గ్రంథి అని పేరు. ప్రేమ అనేది ఒక దివ్యమైన ఆత్మానుభూతి. భార్యాభర్తలు ఒకరి కోసం ఒకరు చేసే త్యాగం వల్లనే ఈ అనుభూతి సొంతమవుతుంది. ఇద్దరూ ఒకరినొకరు గెలిపించుకోవడంలో ఉన్న ఆనందాన్ని గుర్తెరిగితే ఆ ఇల్లు సుఖసంతోషాల సారమవుతుంది. అలాంటి ఇళ్లున్న సమాజం, దేశం ఆనంద నిలయాలవుతాయి.

– శ్రీ విజయదుర్గ

సందర్భం

యాదగిరిపై కల్యాణఝురి

అణువణువునా భగవంతుడు ఉన్నాడనే భక్తుడి మాటను నిలిపేందుకు స్తంభంలో ఉద్భవించిన అవతారమూర్తి నరసింహస్వామి. ప్రహ్లాదుడి పిలుపుతో ప్రకటితమైన ఉగ్రనారసింహుడు తెలుగు రాష్ట్రాల్లో కొండల్లో.. కోనల్లో.. ఎన్నో చోట్ల వెలసి భక్తుల పూజలు అందుకుంటున్నాడు. అలాంటి దివ్య క్షేత్రాల్లో ప్రముఖమైనది తెలంగాణలోని యాదాద్రి. ఈ క్షేత్ర మహిమను భృగు మహర్షి సహసాలనీక చక్రవర్తికి తెలిపినట్టు స్కాందపురాణ వచనం.



ఋష్యశృంగ మహర్షి పుత్రుడు యాదర్షి. బాల్యం నుంచి అతడు నిరంతరం హరినామ స్మరణ చేసేవాడు. యాదర్షి తపస్సుకు మెచ్చిన స్వామి నారసింహుడిగా జ్వాలాకారుడిగా, భయంకర ధ్వనులతో దర్శనమిచ్చాడట. యాదర్షి కోరిక మేరకు ఆతడు తపస్సు చేసిన ప్రదేశంలో అర్చామూర్తిగా వెలిశాడని స్థలపురాణం. యాదర్షి తపస్సు చేసిన ప్రదేశమే ఇప్పటి యాదాద్రి. ఈ క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామి. ఆ స్వామి ఆజ్ఞ మేరకే యాదర్షి ఇక్కడ తపస్సు చేశాడని కథనం. నరసింహుడి ఆలయ సమీపంలోనే ప్రసన్నాంజనేయ స్వామి దర్శనమిస్తాడు.

ఇక్కడ విష్ణుభగవానుడు జ్వాలా నరసింహ, ఉగ్ర నరసింహ, యోగ నరసింహ, లక్ష్మీ నరసింహ, గండభేరుండ నరసింహ ఇలా పంచ నారసింహుడిగా ఏక శిలపై అవతరించినట్టు స్థలపురాణం చెబుతోంది. కృతయుగం నాటి నుంచే ఇక్కడ స్వామి పూజలు అందుకుంటున్నాడని విశ్వసిస్తారు. క్రీస్తుశకం 12వ శతాబ్దం వరకు మునులు, యోగులు, సాధకులు, సిద్ధులు మాత్రమే స్వామిని దర్శించుకునేవారట. అందుకే స్వామికి సాధక తారకుడనే పేరు వచ్చింది. 12వ శతాబ్దిలో పశ్చిమ చాళుక్యులలో ప్రసిద్ధుడైన త్రిభువనమల్లుడు తన రాజ్యవిస్తరణలో భాగంగా భువనగిరిలో కోటను నిర్మించుకొని స్వామిని సేవించినట్టు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.

ఒకప్పుడు ఈ క్షేత్రమంతా దట్టమైన అరణ్యంగా ఉండేది. క్రూరమృగాలు ఉండేవి. అప్పుడు కూడా భక్తులు గుంపులు గుంపులుగా కలిసి వచ్చేవారు. భజనలు చేస్తూ, నారసింహుడి నామం స్మరిస్తూ.. కొండపైకి చేరి ఉత్సవాలు చేసేవారు. సుమారు 150 సంవత్సరాల కిందట కొండపైకి కాలిబాట ఏర్పడింది. మూలవిరాట్టు వద్దకు వెళ్లి అభిషేకాలు చేసేవారు.

తరలి వచ్చిన శివుడు..

జ్వాలానరసింహుడి క్షేత్ర మహిమ తెలుసుకున్న పరమేశ్వరుడు యాదిగిరి శిఖరాగ్రంలో స్వయంభువుగా వెలిశాడని భక్తుల నమ్మకం. వైష్ణవ క్షేత్రంలో శివాలయం నిర్మించి పూజించడం.. శివకేశవుల అభేదత్వానికి ప్రతీకగా కనిపిస్తుంది.

ఈ క్షేత్రంలో మొదట్లో మూడురోజులు ఉత్సవాలు చేసేవారు. తర్వాతి కాలంలో ఐదు రోజులు చేశారు. కాలక్రమంలో నవాహ్నిక దీక్షతో 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరగడం మొదలైంది. ఏటా ఫాల్గుణ శుద్ధ విదియ నుంచి ద్వాదశి వరకు బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 17న బ్రహ్మోత్సవాలు మొదలుకానున్నాయి. అందులో భాగంగా 23న ఎదుర్కోలు ఉత్సవం జరగనుంది. 24న తిరుకల్యాణ మహోత్సవం కన్నులపండువగా సాగుతుంది. 25న దివ్య విమాన రథోత్సవం. 26న రథోత్సవం, 27న శతఘటాభిషేకం జరుగుతాయి. అదే రోజు పుష్కరిణిలో చక్రస్నాన ఘట్టం అద్భుతంగా సాగుతుంది. శృంగార డోలోత్సవంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం అవుతాయి.

– చిమ్మపూడి శ్రీరామమూర్తి




ఆదిదంపతుల గిల్లికజ్జాలు

ఈ సకల సృష్టికీ తల్లిదండ్రులుగా భావించే ఆదిదంపతులు పార్వతీపరమేశ్వరులు. అయినా వాళ్లూ ఆలుమగలే కదా! అందుకే వారి మధ్యా గిల్లికజ్జాలకు కొదవ లేదు. ఓసారి పరమేశ్వరుడు వస్తానన్న సమయానికి ఇంటికి రాలేదు. పార్వతికి కోపం వచ్చింది. భర్తను నిలదీయాలనీ, ఇంట్లోకి రానివ్వకూడదనీ నిశ్చయించుకుంది. తలుపులు బిడాయించి శివుడు ఎప్పుడు వస్తాడా..? ఎప్పుడు అడగాల్సిన నాలుగు మాటలూ అడగాలా..? అని ఎదురుచూస్తోంది. ఇంతలో శివుడు వచ్చాడు. అప్పుడు ఆ భార్యాభర్తల మధ్య జరిగిన సంవాదాన్ని ఓ సంస్కృత కవి ఇలా వర్ణించాడు..

"కస్త్వం? శూలీ! మృగయ భిషజం, నీలకంఠే ప్రియేహం!
కేకామేకాం కురు, పశుపతిః నైవ దృశ్యే విషాణే
స్థాణుర్ముగ్ధే నవదితి తరుః జీవితేశ శ్శివాయః
గచ్ఛాటవ్యామితిహత వచః పాతువశ్చంద్ర చూడః"

వారి సంభాషణ ఎలా సాగిందంటే.. శివుడు తలుపు కొట్టగానే.. పార్వతి "కస్త్వం" (ఎవరు నువ్వు) అంది. దానికి శివుడు "శూలీ" (శూలం ధరించినవాణ్ణి) అన్నాడు. శూలీ అంటే తలనొప్పి అని కూడా అర్థముంది. పార్వతి దానిని ముందుకు తెస్తూ.. "మృగయ భిషజం" (వైద్యుణ్ణి వెతుక్కో?) అని వెటకారమాడింది. పార్వతి కోపాన్ని గ్రహించిన శివుడు "నీలకంఠే ప్రియేహం" (ప్రియా! నేను నీలకంఠుణ్ణి) అంటూ ఆలిని ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు.



నీలకంఠః అంటే నెమలి కూడా! వెంటనే "కేకామేకాం కురుః" (నెమలివా! అయితే అరవ్వేం!) అని మళ్లీ ఇరుకునపెట్టింది. ఓపిక నశించిన శివుడు.. "పశుపతిః" అని గద్దించినంత పని చేశాడు. పశుపతి అంటే ఎద్దు అని మరో అర్థం. "నైవదృశ్యే విషాణే!" (కొమ్ములెక్కడ?) అని మరో ప్రశ్న సంధించింది పార్వతి. ఎలాగైనా భార్యను ప్రసన్నం చేసుకోవాలని "స్థాణుర్ముగ్ధే" (ఓ ముగ్ధా! నేను అంతటా నిండి ఉన్నవాడిని.. స్థాణువును) అని మళ్లీ పరిచయం చేసుకున్నాడు శివుడు. స్థాణువు అంటే చెట్టు అన్న అర్థాన్ని తీసుకుంది పార్వతి. "నవదితి తరుః" (చెట్టా ఎక్కడ?) అని మరోసారి పరిహసించింది. చివరి ప్రయత్నంగా శివుడు "జీవితేశ శ్శివాయః" (నీ జీవితేశ్వరుడైన శివుడిని) అని బదులు పలికాడు. పార్వతి ఇంకా శాంతించలేదు. శివా అంటే మృగం అనే అర్థం కూడా ఉంది. "గచ్ఛాటవ్యాం" (ఇక్కడికి ఎందుకొచ్చావ్! అడవుల్లో తిరుగు) అని గేళి చేసింది. చివరగా "ఇతి హత వచః పాతువశ్చంద్ర చూడః" (ఇలా మాటల్లో ఓడిన శివుడు రక్షించుగాక) అంటూ వింత శ్లోకం ముగించాడా కవి. సర్వ జగత్తుకూ మాతాపితరులైన పార్వతీపరమేశ్వరుల సంవాదం కూడా మనకు దీవనే!

డాక్టర్ పార్నంది రామ్‌కుమార్

కథాస్రవంతి

ఆమె కోసం

భారతీయ వివాహ వ్యవస్థకు ఒక ప్రత్యేకత ఉంది. ఆత్మీయానుబంధాలు, ప్రేమానురాగాలే తప్ప భార్యాభర్తల నడుమ పేద, ధనికభావం ఉండదు. పెళ్లికి ముందు ఒకరు పేద కుటుంబం నుంచి, మరొకరు ధనిక కుటుంబం నుంచి వచ్చి వివాహ బంధంతో ఒకటైన తర్వాత ఏ భేదం లేకుండా ఒకరినొకరు గౌరవించుకుంటూ జీవితాన్ని కొనసాగించాలని మన పురాణాలు చెబుతున్నాయి.

పూర్వం కర్దముడు అనే మహాముని ఉండేవాడు. అతని దగ్గర విష్ణు భక్తి, తపశ్శక్తి ఉన్నాయే తప్ప సంపదలు, ధన రాశులు లేవు. అతనికి స్వయంభువ మనువు కుమార్తె దేవహూతితో పెళ్లయింది. దేవహూతి సంపన్న కుటుంబం నుంచి వచ్చినా కర్దముడితో కలిసి అతి సాధారణమైన ఆశ్రమ జీవితాన్ని గడుపుతోంది. తన భర్తకు అనుగుణంగా మసలుకుంటోంది. కర్దముడు దేవహూతి పరిచర్యలన్నిటినీ గమనించాడు. అంతఃపురంలో చెలికత్తెల మధ్య సుకుమారంగా బతకాల్సిన ఆమె తనకు భార్య అయినందుకు ఇలాంటి జీవితాన్ని గడుపుతోందన్న విషయం అతని మనసును కలచివేసింది. తన భార్యకు సకల భోగభాగ్యాలు సమకూర్చాలని అనుకున్నాడు. కానీ ముని దగ్గర డబ్బు లేదు. తన మామ స్వాయంభువ మనువునో, మరెవరినో అడిగి తెచ్చి ఖర్చు పెట్టాలని అతడనుకోలేదు. భార్యకు తన స్వశక్తితో సంపాదించిన సొమ్ముతోనే సౌకర్యాలు కల్పించాలనుకున్నాడు. తాను తపశ్శక్తి సంపన్నుడు కాబట్టి తన శక్తితోనే తన భార్యకు కావాల్సిన వాటిని సమకూర్చాడు. భోగభాగ్యాలు అమర్చాడు. సరస్వతీ నదీ జలంతో ఏర్పడిన బిందు సరస్సులో ఆమెను స్నానం చేయడానికి తీసుకెళ్లాడు. కర్దముడి తపశ్శక్తి వల్ల దివ్యాంగనలు వచ్చి ఆమెకు స్నానం చేయించారు. ఇదంతా తన భర్త తపశ్శక్తి వల్ల వచ్చిన భోగభాగ్యాలేనని తెలుసుకుని దేవహూతి ఎంతో ఆనందించింది.

ఇది భాగవతం తృతీయ స్కంధంలో కనిపించే కథా సందర్భం. గృహస్థాశ్రమాన్ని స్వీకరించబోయేవారికి ఓ మంచి మార్గదర్శక సూత్రంలా ఉంటుంది. వివాహం అనే దైవేచ్ఛ ప్రకారం జరుగుతుంది. అలా జరిగినప్పుడు భార్య వైపు ఉన్న వారి సిరిసంపదలు ఎవరూ ఆశించకూడదు. స్వశక్తితో తన భార్యను సంతోషపెట్టాలి. భార్యగా వచ్చిన పిల్ల కూడా అప్పటిదాకా ఓపిక పట్టాలి. ధనం బాగా సంపాదించగానే అంతకాలం తనను నమ్ముకుని ఉన్న భార్యకు కావాల్సిన భోగభాగ్యాలను సమకూర్చాలి. ఈ మార్గదర్శకాలనే వివాహ వ్యవస్థ ఏర్పరిచింది.

–యాల్లాప్రగడ మల్లికార్జునరావు

ఇస్లాం సందేశం

సామాజిక బాధ్యత

ముస్లిం సంప్రదాయంలో రెండు పదాల ఉచ్చారణతో పెళ్లి ప్రక్రియ ముగుస్తుంది. దీనినే ఏజాబె ఖుబూల్ (అంగీకారం) అని అంటారు. ఇద్దరిలో ఏ ఒక్కరికి అంగీకారం లేకపోయినా పెళ్లి జరగదు. పెళ్లి విషయంలో అమ్మాయి ఇష్టానిష్టాలను తప్పకుండా పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు ప్రవక్త (స). "స్త్రీల అనుమతితో వారి వివాహం చేయాలి" అని ఉద్ఘాటించారు. ఇస్లాం ధర్మంలో పెళ్లి ఒక సామాజిక, ధార్మిక అవసరం. పవిత్రమైన సమాజం నిర్మాణం వైవాహిక వ్యవస్థద్వారానే సాధ్యమవుతుంది. దాంపత్య బంధం ద్వారా స్త్రీ, పురుషుల్లో బాధ్యత పుడుతుంది.

– ఖైరున్నీసాబేగం

GH

ఈనాడు సినిమా


అనుష్క

తప్పులకు భయపడను

"సెట్లో తప్పు చేస్తానేమో అనే భయం చాలా మందికి ఉంటుంది. అయితే నాకు అలాంటి భయాలేం ఉండవు... తప్పు చేస్తేనే కదా, ఒప్పేంటో తెలుసుకునేది" అంటోంది అనుష్క. ఇటీవలే 'భాగమతి'గా వచ్చి మరో విజయాన్ని అందుకుంది. అనుష్క మాట్లాడుతూ "తప్పు చేస్తామేమో అనే భయమే తెలియకుండా మనతో తప్పుల్ని చేయిస్తుంటుంది. మనలోని అసలైన ప్రతిభకు ఇలాంటి భయాలు అడ్డుకట్ట వేస్తుంటాయి. పనిచేస్తూ, నేర్చుకోవడం చాలా మంచి అభ్యాసం. అలా మనల్ని మనం సరిదిద్దుకుంటూ వెళ్తే... చేసిన తప్పు మరోసారి చేయం. పైగా తప్పుడు నిర్ణయాలు, ఆలోచనలు ఎంత అనర్థం తీసుకొస్తాయో మనకు అనుభవపూర్వకంగా అర్థం అవుతుంది. పొరపాట్లు సహజం. నేర్చుకునే ప్రయత్నంలో అదే భాగం" అని చెప్పుకొచ్చింది.


పూజా హెగ్డే, శ్రీనివాస్

ప్రేమకు 'సాక్ష్యం'

వానకు చినుకు సాక్ష్యం. పెళ్లికి పంచభూతాలు సాక్ష్యం. పేదరికానికి ఆకలి సాక్ష్యం. మరి బెల్లంకొండ సాయిశ్రీనివాస్ చెప్పే 'సాక్ష్యం' ఎందుకోసం, ఎవరి కోసం? తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. శ్రీవాస్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. పూజా హెగ్డే కథానాయిక. అభిషేక్ నామా నిర్మాత. ప్రేమికుల రోజు సందర్భంగా బుధవారం బెల్లంకొండ శ్రీనివాస్, పూజా హెగ్డేల లుక్‌ని విడుదల చేశారు. ప్రస్తుతం రామోజీ ఫిలింసిటీలో చిత్రీకరణ జరుగుతోంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "ఇప్పటి వరకూ శ్రీవాస్ అంటే.. కమర్షియల్ సినిమాలే గుర్తొచ్చేవి. 'సాక్ష్యం'లో ఆయనలోని కొత్త దర్శకుడు కనిపిస్తాడు. కథానాయకుడు, నాయిక పాత్రల్ని తీర్చిదిద్దిన విధానం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. పీటర్ హెయిన్స్ తీర్చిదిద్దిన యాక్షన్ సన్నివేశాలు ప్రధాన బలం. ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నాం" అన్నారు.

శీతాకాలం ప్రేమించుకుని.. వేసవిలో విడిపోతే


నితిన్

నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న 25వ చిత్రం 'ఛల్ మోహన్ రంగ'. పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, శ్రేష్ఠ్ మూవీస్ సంస్థలు తెరకెక్కించాయి. మేఘా ఆకాష్ కథానాయిక. సుధాకర్‌రెడ్డి నిర్మాత. కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. బుధవారం టీజర్‌ని విడుదల చేశారు. "మేము వర్షాకాలంలో కలుసుకుని, శీతాకాలంలో ప్రేమించుకుని, వేసవి కాలంలో విడిపోయాం" అనే నితిన్ డైలాగ్ ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "ఓ పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. ఆ పాటని హైదరాబాద్‌లో తెరకెక్కిస్తున్నాం. శేఖర్ మాస్టర్ నృత్య రీతులు అందిస్తున్నారు. ఏప్రిల్ 5న ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు.

అక్కతో సినిమా చేస్తానేమో


పి.కిరణ్, సంజయ్ స్వరూప్, మహేష్‌బాబు, జాన్వి, మంజుల, అమైరా దస్తూర్, సందీప్ కిషన్

"అక్క ఓ సినిమాకి దర్శకత్వం వహిస్తోందంటే తెలిసి ఆశ్చర్యపోయాను. ఆ తరవాత గర్వంగా అనిపించింది. భవిష్యత్తులో నేను కూడా తన దర్శకత్వంలో ఓ సినిమా చేస్తానేమో" అన్నారు మహేష్‌బాబు. మంజుల దర్శకత్వం వహించిన చిత్రం 'మనసుకు నచ్చింది'. సందీప్ కిషన్, అమైరా దస్తూర్, త్రిదా చౌదరి ప్రధాన పాత్రలు పోషించారు. సంజయ్ స్వరూప్ - పి.కిరణ్ నిర్మాతలు. శుక్రవారం ఈ చిత్రం విడుదల అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ముందస్తు విడుదల వేడుక నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మహేష్‌బాబు మాట్లాడుతూ "ఓసారి తను ఏదో రాసుకుంటుంటే.. కవిత్వం అనుకున్నా. సినిమా స్క్రిప్టు అని తెలిసి షాక్ తిన్నాను. నా వంతుగా ఈ చిత్రానికి గాత్రదానం చేశాను. విజువల్స్ చాలా బాగున్నాయి. తప్పకుండా ఈ చిత్రం అందరికీ నచ్చుతుందన్న నమ్మకం ఉంద"న్నారు. "ఈ చిత్రానికి వాయిస్ ఓవర్ కావాలని అడిగిన వెంటనే మహేష్ ఒప్పుకున్నాడు. కానీ కొన్ని మార్పులు చెబుతుంటే 'వేరే వాళ్లతో చెప్పించుకో' అనేశాడు. ఓసారి గౌతమ్ 'ఆంటీ దర్శకత్వంలో ఎప్పుడు నటిస్తావ్ నాన్నా?' అని మహేష్‌ని అడిగాడట. 'అదే నా ఆఖరి సినిమా అవుతుంద'ని మహేష్ సరదాగా చెప్పాడట. ఇలానే నన్ను ఆటపట్టిస్తుంటాడు. కానీ ఒక్కటి మాత్రం నిజం.. మా నాన్న, మహేష్ గర్వపడేలా ఈ సినిమా ఉంటుంద"ని మంజుల చెప్పారు. "మంజుల పరిచయం, ఆమె దర్శకత్వంలో పనిచేయడం ఓ అదృష్టంగా భావిస్తున్నా"నని సందీప్‌కిషన్ తెలిపారు. "ప్రతి ప్రేక్షకుడికీ నచ్చే చిత్రమిది. మంజులకు దర్శకురాలిగా ఇదే తొలి సినిమా అంటే నమ్మబుద్ధికావడం లేదు. అంత బాగా తెరకెక్కించారామె" అన్నారు కిరణ్. కార్యక్రమంలో జాన్వి, అమైరా దస్తూర్ తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి ఆశ్చర్యపోయారు



బాపినీడు, విద్యుల్లేఖ రామన్, రాశీఖన్నా, వరుణ్‌తేజ్, వెంకీ అట్లూరి, దిల్‌రాజు, బీవీఎస్ఎన్‌ప్రసాద్

"తొలిప్రేమ సినిమా చూసి చిరంజీవిగారు ఆశ్చర్యపోయారు. తొలి సినిమా దర్శకుడు ఇంత బాగా తీశాడా.. అని షాక్ తిన్నార"న్నారు వరుణ్ తేజ్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'తొలిప్రేమ'. రాశీ ఖన్నా నాయిక. బీవీఎస్ఎన్‌ప్రసాద్ నిర్మించారు. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి వస్తున్న స్పందన పట్ల చిత్రబృందం సంతోషం వ్యక్తం చేస్తూ బుధవారం హైదరాబాద్‌లో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసింది. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ "అప్పుడు పవన్ కల్యాణ్ చేసిన 'తొలిప్రేమ'లానే, ఇప్పుడు వరుణ్‌తేజ్ చేసిన 'తొలిప్రేమ' కూడా యువతరాన్ని ఆకట్టుకుంటోంది. మూడు పార్శ్వాలున్న పాత్రలో వరుణ్ చాలా చక్కగా నటించాడ"న్నారు. "రీ రికార్డింగ్ చేస్తున్నప్పుడే సినిమా నాకు బాగా నచ్చింది. అందుకే మరింత ఇష్టంతో పనిచేశా"నన్నారు సంగీత దర్శకుడు తమన్. ఈ చిత్రంతో తనకు మహిళా అభిమానుల సంఖ్య పెరిగిందని రాశీ ఖన్నా చెప్పింది. "వరుణ్ నమ్మకంతోనే ఈ సినిమా పురుడు పోసుకుంది. రాశీఖన్నాని తమింట్లో అమ్మాయిలా అందరూ ఆదరిస్తుంటే ఆనందంగా ఉంద"న్నారు దర్శకుడు. కథని నమ్మి చేసిన ప్రయత్నం విజయవంతమైనందుకు ఆనందంగా ఉందని నిర్మాత తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపినీడు, హైపర్ ఆది, కిరణ్, స్వప్న, విద్యుల్లేఖ రామన్ తదితరులు పాల్గొన్నారు.



ఐశ్వర్యరాయ్ అదరగొట్టేసింది!

ఐశ్వర్యరాయ్ బచ్చన్ అందం ఎవర్‌గ్రీన్ అంటూ మురిసిపోతున్నారు ఆమె అభిమానులు. తాజాగా విడుదలైన ఆమెకు సంబంధించిన కొత్త లుక్ నెటిజన్లను ఆకర్షిస్తోంది. ఆమె ప్రస్తుతం 'ఫన్నే ఖాన్' చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రంలో ఐశ్వర్యరాయ్‌కు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. నల్లరంగు టాప్, దానిపై పచ్చరంగు మిలటరీ జాకెట్, కళ్లజోడుతో స్టైలిష్ లుక్‌లో అదరగొట్టేసిందంటున్నారు ఐశ్వర్య అభిమానులు. సంగీతం నేపథ్యంగా సాగే ఈ చిత్రంలో ఐశ్వర్య ఓ గాయనిగా నటిస్తోంది. డచ్ చిత్రం 'ఎవ్రీబడీస్ ఫేమస్' ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. అనిల్ కపూర్, రాజ్‌కుమార్ రావ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అతుల్ మాంజ్రేకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని రాకేష్ ఓం ప్రకాష్ నిర్మిస్తున్నారు.

పంచ్ డైలాగ్

దక్కేది దక్కక మానదు. దక్కనిది ఎన్నటికీ దక్కదు.

చిత్రం: ముత్తు

- పంపినవారు: ఎస్.మోహన్‌రెడ్డి, కదిరి

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్- 501512

మెయిల్ ఐడీ: cinema@eenadu.net


నందు, పునర్నవి

ఇదెందుకో.. ఎవరి కోసమో

నందు, నోయల్, పునర్నవి ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'ఎందుకో ఏమో'. కోటి వద్దినేని దర్శకుడు. మాలతి వద్దినేని నిర్మాత. ఈ చిత్రంలోని తొలి గీతాన్ని హైదరాబాద్‌లో ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నందు మా 'జయజానకి నాయక'లో నటించాడు. తానెంత మంచి నటుడో నాకు తెలుసు. కథానాయకుడిగా నందుకు ఈ చిత్రం మంచి పేరు తీసుకురావాల"న్నారు. "నాలుగు పాటలున్నాయి. ప్రవీణ్ మంచి సంగీతం అందించారు. టీజర్‌కి మంచి స్పందన వస్తోంద"న్నారు దర్శక నిర్మాతలు.

'శివకాశీపురం' గీతావిష్కరణ


శ్రీ చక్రవర్తి, ప్రియాంక శర్మ

సంగీత దర్శకుడు చక్రవర్తి మనవడు రాజేష్ శ్రీ చక్రవర్తి కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'శివకాశీపురం'. ప్రియాంక శర్మ కథానాయిక. హరీష్ వట్టికూటి దర్శకత్వం వహిస్తున్నారు. మోహన్‌బాబు పులిమామిడి నిర్మాత. పవన్ శేష స్వరాలు సమకూర్చిన ఈ చిత్రంలోని గీతాలు హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. తొలి సీడీని ప్రముఖ దర్శకనిర్మాత గుణ్ణం గంగరాజు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "సంగీత దర్శకుడు శ్రీ నా తొలి సినిమాకి స్వరాలు అందించారు. వారి అబ్బాయి రాజేష్ శ్రీ చక్రవర్తి కథానాయకుడిగా పరిచయం కావడం ఆనందంగా ఉంది. భవిష్యత్తులో మంచి కథానాయకుడిగా ఎదగాలని కోరుకొంటున్నా. ఈ సినిమా పాటలు, ప్రచార చిత్రాలు చాలా బాగున్నాయి" అన్నారు. రాజేష్ శ్రీ చక్రవర్తి మాట్లాడుతూ "నటనలో శిక్షణ తీసుకొని సినిమా చేద్దామనే ప్రయత్నాల్లో ఉన్నప్పుడే దర్శకనిర్మాతలు కలిసి ఈ కథ చెప్పారు. దర్శకుడు హరీష్ ఎంతో సహజంగా చిత్రాన్ని తీర్చిదిద్దార"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "చక్రవర్తి సంగీతానికి పెద్ద అభిమానిని నేను. ఆయన మనవడిని కథానాయకుడిగా పరిచయం చేస్తూ సినిమా చేయడం సంతోషంగా ఉంది. రాజేష్ ఎంతో అనుభవమున్న నటుడిలా ఈ చిత్రం చేశాడు. పవన్ శేష సంగీతం చిత్రానికి ప్రధాన బలం. సైకలాజికల్ థ్రిల్లర్ కథకి, నవతరం ప్రేమాయణాన్ని జోడించి పల్లెటూరి నేపథ్యంలో తెరకెక్కించిన చిత్రమిది"అన్నారు. "దర్శకుడు హరీష్ తీసిన 'బతుకుబాట' లఘు చిత్రంతో సంగీత దర్శకుడిగా పరిచయమయ్యా. ఇది నా మూడో చిత్రం. ఇందులో నాలుగు పాటలున్నాయి. ఎస్పీ బాలు పాడిన అమ్మ పాట బాగుంటుంది" అన్నారు పవన్‌శేష. ఈ కార్యక్రమంలో పి.సునీల్ కుమార్ రెడ్డి, వందేమాతరం శ్రీనివాస్, అరుణ, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.


శ్రావ్య, సాయి రోనక్

నమ్మలేని కథ

సాయి రోనక్, శ్రావ్య, శిరీషా వంకా ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'మసక్కలి'. నబి యెనుగుబాల దర్శకత్వం వహించారు. సుమిత్‌సింగ్ నిర్మాత. బుధవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమం జరిగింది. తమ్మారెడ్డి భరద్వాజ, మధుర శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ "అందమైన ప్రేమకథతో తెరకెక్కించిన ఈ చిత్రం సైకలాజికల్‌గా ఓ కొత్త అనుభూతినిస్తుంది. కొన్నింటిని విని నమ్ముతాం. కొన్ని చూసి నమ్ముతాం. కొన్ని మాత్రం చూసినా నమ్మలేని విధంగా ఉంటాయి. అలాంటిదే ఈ కథ" అన్నారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ "మంచి కథలతో వస్తున్నారు కొత్త దర్శకులు. ట్రైలర్ బాగుంది. దర్శకుడిలో ప్రతిభ ఉంది. సినిమా బాగా తీసుంటాడని నమ్ముతున్నా" అన్నారు. "ట్రైలర్ నాకు బాగా నచ్చింది. అందుకే ఈ చిత్రంలోని పాటల్ని మా మధుర సంస్థ ద్వారా విడుదల చేస్తున్నాం" అన్నారు మధుర శ్రీధర్. ఇంతకుముందు ఇలాంటి కథని తెలుగులో చూడలేదన్నారు చిత్ర నిర్మాత.

'మెహబూబా' ఎప్పుడంటే...


ఆకాష్

పూరి జగన్నాథ్ తనయుడు ఆకాష్ పూరి కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'మెహబూబా'. పూరి జగన్నాథ్ స్వీయ దర్శకత్వం వహిస్తున్నారు. నేహా శెట్టి కథానాయిక. చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. వేసవిలో 'మెహబూబా'ని విడుదల చేస్తారు. "1971 నేపథ్యంలో సాగే కథ ఇది. ఇండో పాకిస్థాన్ యుద్ధం సమయంలో జరిగిన ఓ ప్రేమకథ. టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. సందీప్ చౌతా చక్కటి సంగీతం అందించార"ని చిత్రబృందం తెలిపింది. ఛాయాగ్రహణం: విష్ణుశర్మ, కూర్పు: జునైద్ సిద్ధిఖీ. సమర్పణ: లావణ్య పూరి


ఒక అమ్మాయి మనసుతో...


సంచిత, విద్యాసాగర్

విద్యాసాగర్ రాజు కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'రచయిత'. సంచిత పదుకొణే కథానాయిక. కల్యాణి ధూళిపాళ్ల నిర్మాత. చిత్రం ఈ నెల 16న విడుదలవుతోంది. బుధవారం హైదరాబాద్‌లో ముందస్తు విడుదల వేడుక జరిగింది. నిర్మాత కె.ఎల్.దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ "గీత రచయిత చంద్రబోస్ చక్కటి సాహిత్యాన్ని సమకూర్చారు. జగపతిబాబు ఈ చిత్రం కోసం పలు నగరాల్లో వాకింగ్ చేసి ప్రచారం చేశార"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "విడుదల విషయంలో చాలా సమస్యలొచ్చాయి. నిర్మాతలు దామోదర్‌ప్రసాద్, రామదాసు, నటుడు జగపతిబాబు సాయంతో వాటిని అధిగమించాం" అన్నారు. "ఒక అమ్మాయి మనసు లోతు ఎంత ఉంటుందో ఈ చిత్రంలో చూపించాం. ఎమోషనల్ థ్రిల్లింగ్ అనే కాన్సెప్టుతో రూపొందిన ఈ చిత్రం అందరికీ నచ్చుతుంది" అన్నారు విద్యాసాగర్ రాజు. "దర్శకుడు కథ చెప్పగానే భావోద్వేగానికి గురయ్యా. కథకు అనుగుణంగా అన్ని పాటలకూ సాహిత్యం అందించా" అన్నారు గీత రచయిత చంద్రబోస్.

‘ఎందుకో నెలసరి సరిగ్గా రావట్లేదు...’
‘ ఈ మధ్య జుట్టు బాగా రాలుతోంది...’
‘బరువు పెరిగిపోయాను...’
కంప్యూటర్ ముందు కూర్చుంటాను కదా.. మెడా, చేతి నొప్పులూ..! ’’ మనం ఈ మధ్య ఎక్కువగా వింటున్న మాటలివి.

కదలకుండా కూర్చోవడం, సరిగ్గా నీళ్లు తాగకపోవడం, నిద్రలేమీ, బయటి భోజనం తినడం, నైట్‌షిఫ్టులూ, పని ఒత్తిడి.. ఇన్ని సమస్యలున్నప్పుడు ఆరోగ్యం మీద వాటి ప్రభావం ఉండటం అతిశయోక్తి కాదు. అయితే వీటన్నింటికీ పరిష్కారాలున్నాయంటున్నారు నిపుణులు. ఆ సమస్య తీవ్రం కాక ముందే గుర్తించి.. అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకోవడం మంచిది.



అలా కూర్చుండిపోతే ఎలా!

ఉద్యోగం చేస్తున్నంత మాత్రాన ఆరోగ్యం పాడుచేసుకోడానికి అర్హత తెచ్చుకున్నట్లు కాదు. ఒకవేళ సమస్యలొస్తే ఉద్యోగం మానేయడమో, లేదంటే వేరే ఉద్యోగం వెతుక్కోవడమో కూడా సరైన పరిష్కారం కాదు. మన అలవాట్లూ, దినచర్యా, పెంచుకునే ఒత్తిడీ... వంటివన్నీ సమస్యలు తెచ్చిపెడుతుంటాయి.

బరువుతో మొదలు...

పని ఒత్తిడీ, నిద్రలేమీ, వేళకు ఆహారం తీసుకోకపోవడం, ఏది పడితే అది తినడం వల్ల హార్మోన్ల స్థాయుల్లో ఎక్కువగా హెచ్చుతగ్గులు వస్తుంటాయి. పైగా ఎక్కువసేపు కదలకుండా ఒకేచోట కూర్చోవడం మనలో చాలామంది చేసే పని. వీటన్నింటివల్లా ఎదురయ్యే సమస్య బరువు పెరగడం. అది అంతటితో ఆగిపోదు. మరిన్ని అనారోగ్య సమస్యలూ చుట్టుముడతాయి. మొదటగా కనిపించే సమస్య నెలసరిలో మార్పులు. ఓ పద్ధతిలో రాదు. లేదా విపరీతమైన రక్తస్రావం కూడా కావచ్చు. హార్మోన్లలో మార్పుల కారణంగా మన శరీరంలో తక్కువ మోతాదులో ఉండాల్సిన టెస్టోస్టిరాన్ హార్మోన్ ఎక్కువగా విడుదలవుతుంది. అది కొన్నిసార్లు పీసీఓడీ (పాలిసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్)కు దారితీయొచ్చు. అవాంఛిత రోమాలూ, జుట్టు రాలడం, బరువు తగ్గకపోవడం, నెలసరిలో తేడాలు దాని ప్రధాన లక్షణాలు. ముఖ్యంగా తల మధ్యలో జుట్టు ఊడిపోతుంటుంది. అదే గనుక ఉంటే.. వైద్యులు సూచించే మాత్రలు వాడుతూ... బరువును అదుపులో ఉంచుకునేందుకు ప్రయత్నించాలి. అప్పుడు ఈ సమస్యలన్నింటికీ చెక్ పెట్టొచ్చు.

వ్యాయామంతో మార్పు: నిజమే.. మనకు క్షణం తీరిక ఉండకపోవచ్చు. కానీ సరైన ప్రణాళిక వేసుకోగలిగి, వ్యాయామానికి రోజూ కనీసం అరగంట సమయం పెట్టుకోగలగాలి. ఈ రోజుల్లో చాలా సంస్థలు ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ఆఫీసులోనే జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నాయి. అలాంటి సౌకర్యం ఉంటే గనుక ఉపయోగించుకునే ప్రయత్నం చేయొచ్చు. ఉద్యోగ రీత్యా ఎక్కువసేపు కూర్చొని ఉండటం ఎలాగో తప్పదు. కానీ ప్రతి గంటకోసారి అయిదు నిమిషాలు అలా నడిచిరావడం కూడా అలవాటు చేసుకోవాలి. లేదంటే కూర్చున్నచోటే సులువుగా చేసే రెండు మూడు వ్యాయామాలు చేయొచ్చు. తరచూ తలాడిస్తుండటం, చేతులూ, కాళ్లూ గుండ్రంగా తిప్పడం వల్ల ఎంతో కొంత వ్యాయామం అందినట్లు అవుతుంది. హైదరాబాద్ కేపీహెచ్‌బీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే దీప్తి రోజూ కనీసం గంట సేపు సైక్లింగ్ చేస్తుంది. ‘నేను ఆఫీసులో ఉత్సాహంగా ఉండటమే కాదు. అలసిపోను. ఇప్పటిదాకా ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాలేదు’ అంటుందామె. ‘రోజూ కనీసం గంటసేపు వ్యాయామం చేయడం వల్ల శరీరం ఫిట్‌గా ఉండటమే కాదు. మెదడూ చురుగ్గా పనిచేస్తుంది...’ అంటుంది డీఎక్స్‌సీ టెక్నాలజీస్‌లో చేసే అనూష. ఇలా రోజులో కొంచెం సేపు వ్యాయామం కోసం కేటాయించడం వల్ల చాలా ఇబ్బందుల్ని తరిమికొట్టచ్చు. అందుకే ఉద్యోగినులు కొన్ని విషయాల్లో జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి.



డా. పి. బాలాంబ, గైనకాలజిస్టు

కంటి సమస్యలూ తప్పవు...

మౌస్ మీద పెట్టిన చెయ్యి, కుర్చీకి ఆనించిన తల.. ఎంతసేపటికీ కదల్చకపోతే మెడ పట్టేసినట్లవుతుంది. అంతేనా.. చేతులూ, కాళ్ల కండరాలు పట్టేస్తాయి. మనలో చాలామంది చేసే మరో పొరపాటు.. కుర్చీలో నిటారుగా కూర్చోకపోవడం.. ఇది కూడా మన ఆకృతిపై ప్రభావం చూపిస్తుంది. ఇక, మానిటర్ స్క్రీన్‌ను కూడా ఎక్కువసేపు కన్నార్పకుండా చూస్తుంటాం. ఇది కళ్లు పొడిబారేలా చేస్తుంది. కళ్ల మంటా, ఎరుపెక్కడం వంటివీ తప్పవు.



నిల్చున్నా నిటారుగా: అవును... ముందు మనం దీన్ని పాటించాలి. నిల్చున్నా, కూర్చున్నా నిటారుగా ఉండేలా చూసుకోవాలి. మెడ పట్టేయకుండా ఐదు నుంచి పదినిమిషాలు చేసే చిన్నచిన్న వ్యాయామాలు యాప్‌ల రూపంలో అందుబాటులో ఉన్నాయి. వాటిని ఎంచుకుని వీలున్నప్పుడల్లా చేయొచ్చు. కంటిచూపు బాగుండాలంటే.. ముందు కంప్యూటరు తెర మనకు ఎదురుగా ఉండేలా చూసుకోవాలి. పని మధ్యలో 20:20:20 సూత్రం అమలు చేయాలి. ఇందులో ప్రతి ఇరవైకీ ఓ వివరణ ఉంది. ప్రతి ఇరవై నిమిషాలకూ.. ఇరవై సెకన్లు, ఇరవై అడుగుల దూరంలో ఉన్న వస్తువును చూడాలి. కళ్లకి సాంత్వన దొరుకుతుంది. దృష్టిలోపం లేకపోయినా సరే కంప్యూటర్ స్క్రీన్ రేడియేషన్ నుంచి కళ్లను కాపాడే అద్దాలను పెట్టుకుంటే మంచిది. భవిష్యత్తులో చూపు ఆరోగ్యంగా ఉంటుంది.

మంచినీరు తాగడంలో..

పనిలో పడి మనలో చాలా మంది నీళ్లు తాగాలనే విషయాన్నే మర్చిపోతాం. దీనివల్ల శరీరం డీహైడ్రేషన్‌కి గురికావడమే కాదు, చర్మం కూడా నిర్జీవంగా మారుతుంది. పైగా ఎన్నో రకాల అనారోగ్యాలనీ అదుపులో ఉంచుకోవచ్చు. మూత్రపిండాలు ఎప్పటికప్పుడు శుభ్ర పడాలంటే మన శరీరానికి అవసరమైన నీరు అందాల్సిందే. దాహం వేసినా వేయకపోయినా ప్రతి గంటకోసారి గ్లాసు నీళ్లు తాగుతూ ఉండాలి. రోజులో కనీసం రెండు నుంచి మూడు లీటర్ల నీళ్లు తాగడం మీ దినచర్యలో భాగమైపోవాలి. అలా తాగడం గుర్తుండకపోతే మనం ఎన్ని నీళ్లు తాగామో, ఇంకా ఎన్ని తాగాలో చెప్పే యాప్ కూడా ఉంటుంది. “వాటర్ డ్రింక్ రిమైండర్”అందులో ఒకటి. ఇదనే కాదు.. మన చేతుల్లో ఉండే చిన్నచిన్న సమస్యల్ని పరిష్కరించుకోగలిగితే... ఆరోగ్యం మన చేతుల్లో ఉన్నట్లే.

– కౌటిక్ ప్రణయశ్రీ,ఈనాడు డిజిటల్

దానికీ ఓ పద్ధతుంది...!

- తలా, కంప్యూటర్ ఒకే ఎత్తులో ఉండాలి. మెడను కిందికీ, మీదకు వంచకుండా ఒకేసారి స్క్రీన్ మొత్తం కనిపించేలా మీరు కూర్చునే ఎత్తు ఉండాలి. లేదా కంప్యూటర్‌ను సరిచేసుకోవాలి.
- కీబోర్డూ, మౌస్ పక్కపక్కనే ఒకే ఎత్తులో ఉండేలా చూసుకోవాలి. అలాగే కీబోర్డు హోమ్‌రో.. చేతులు వంచకుండానే చేరుకునేలా ఉండాలి.
- కూర్చున్నప్పుడు మోకాళ్లకన్నా కాస్త పైకి నడుము ఉండేలా కుర్చీ ఎత్తు సరిచేసుకోవాలి. మన పాదాలు నేలపై లేదంటే ఫూట్ రెస్ట్‌పై ఆనించాలి.

మన చేతుల్లోనే..

- ఉద్యోగం చేసే మహిళలు ఎప్పుడూ చెప్పే మరో సమస్య.. ‘సమయం సరిపోవట్లేదు’ అని...! సమయం ఎప్పుడూ సరిపోదు..దాన్ని సరిపెట్టుకునేట్లుగా మన ప్రణాళిక ఉండాలి. ఏ పనికి ఎంత సమయం పెట్టుకుంటున్నామనేది గమనించుకోవాలి. ముఖ్యమైన పనులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. ఒత్తిడి ఉండదు.
- ఎన్ని పనులున్నా నిద్రకు నిర్ణీత సమయం కేటాయించుకోండి. ఆఫీసుకు బస్సులో వెళ్లేట్లయితే అప్పుడు కూడా ఫోనుకు అతుక్కుపోకుండా విశ్రాంతి తీసుకునేలా చూసుకోవాలి. లేదంటే నిద్రలేమి మర్నాటి దినచర్యపై పడుతుంది.
- కొంతమంది వంటచేసే సమయం లేదని ఎక్కువగా బయటే భోజనం చేస్తుంటారు. దానివల్లా బరువు పెరగొచ్చు. కాబట్టి వీలైనంతవరకూ ఇంటిభోజనం ఉండేలా చూసుకోవాలి. తక్కువ సమయంలో పూర్తయ్యే పోషకాహారానికి సంబంధించిన యాప్‌లూ, వెబ్‌సైట్లూ ఇప్పుడు బోలెడు.
- ఒత్తిడిని అదుపులో ఉంచుకునేందుకు ధ్యానం సరైన మార్గం. రోజూ పది నిమిషాలు చాలు. దీనివల్ల మానసిక ప్రశాంతత సొంతం కావడమే కాదు, మనసూ ఉల్లాసంగా ఉంటుంది.

నిద్రపుచ్చండిలా!

మెదడు చురుగా పనిచేయాలన్నా, ఆరోగ్యంగా ఉండాలన్నా, తగినంత నిద్ర అవసరం. మరీ ముఖ్యంగా చిన్నపిల్లల్లో నిద్రలేమి లేకుండా చూసుకోవాలి.

- పిల్లల్లో వయసును బట్టి నిద్ర వేళలు మారుతుంటాయి. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి మూడేళ్ల వయసు చిన్నారులకు రోజులో దాదాపు 12 నుంచి 14 గంటలు నిద్ర కావాలి. మూడు నుంచి ఆరేళ్ల బుడతలకు దాదాపు పది-పన్నెండు గంటలు నిద్ర అవసరం. ఆరు నుంచి పన్నెండేళ్ల అమ్మాయిలు, అబ్బాయిలు సుమారుగా పదకొండు గంటలు నిద్రకు కేటాయించాల్సిందే. టీనేజ్ పిల్లలు ఎంత లేదన్నా ఎనిమిది నుంచి పది గంటలు నిద్రపోయేలా చూసుకుంటే వారు ఉత్సాహంగా ఉండగలుగుతారు.
- ఎదుగుతున్న వారి మెదడుకూ, శరీరానికి నిర్ణీత పరిమాణంలో నిద్ర ఉండాల్సిందే. కాబట్టి మీ చిన్నారులు తగినంత నిద్ర పోయేలా చూడండి. వారు నిద్రపోయిన తరువాత మెదడు ఆ రోజు జరిగిన సంఘటనల జ్ఞాపకాలను ఒక క్రమపద్ధతిలో నిక్షిప్తం చేస్తుంది. ఈ జ్ఞాపకాలు కావాల్సిన సమయంలో వారికి ఉపయోగపడతాయి.

మెలితిప్పి... మెరిపిద్దాం

జడ అల్లాల్సిన పనిలేదు. అలాగని అక్కడక్కడా రబ్బరుబ్యాండ్లూ పెట్టుకోనక్కర్లేదు. చిన్నగా రెండు పాయల్ని మెలితిప్పితే చాలు... ఆకట్టుకునే కేశాలంకరణను వేసుకోవచ్చు. చూడండోసారి.



1 జుట్టునంతా నడినెత్తిపైకి వచ్చేలా దువ్వుకుని బిగుతుగా పోనీటెయిల్ వచ్చేలా రబ్బరుబ్యాండు పెట్టుకోవాలి. తరువాత దీనిపైనుంచి సన్నటి రెండు పాయలను తీసుకోవాలి. ఒకదాన్ని మెలితిప్పాలి. ఇదే విధంగా రెండోదీ చేసుకోవాలి. తరువాత రెండింటినీ కలిపి మరోసారి మెలితిప్పి పైన క్లిప్పు పెట్టుకోవాలి.




2 పోనీటెయిల్ అడుగునుంచీ మరో రెండు పాయలు తీసి ఇదేవిధంగా చేసుకుని అడుగున రబ్బరుబ్యాండు పెట్టుకోవాలి.


సిగ సింగారం

3 ఇప్పుడు మిగిలిన పోనీటెయిల్‌ను రెండు భాగాలుగా చేసుకుని ఆ రెండింటినీ మెలితిప్పినట్లు చుట్టుకుని రబ్బరుబ్యాండు పెట్టుకోవాలి. నడినెత్తిన క్లిప్ పెట్టుకున్న పాయల్నీ, అడుగున ఉన్నదాన్నీ మిగిలిన జుట్టు మీదనుంచి మెలితిప్పినట్లుగా చేసుకుని అడుగున మరో రబ్బరుబ్యాండు పెట్టుకుంటే చాలు.





ఈ అలంకరణకి సంబంధించిన వీడియోను www.eenadu.netలోని వసుంధర విభాగంలో చూడొచ్చు.



కేతా శోభారాణి
కేశాలంకరణ నిపుణురాలు

బంగారం వెండి

14న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,889	2,900
వెండి (గ్రా)	41.30	42.40



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	-------	-------	31,200	-------	31,150	-------	30,890	30,910	31,140	30,960
ఆర్నమెంట్	-------	-------	29,000	-------	28,850	-------	28,890	28,910	28,960	28,790
వెండి(కిలో)	-------	-------	39,600	-------	39,500	-------	38,700	38,900	39,900	39,900

సుధామూర్తే స్ఫూర్తి...!

ఇటీవల హిందీలో విడుదలైన ‘ప్యాడ్‌మ్యాన్’ చిత్రం మహిళలు నెలసరి సమయంలో పడే ఇబ్బందులకు అద్దం పట్టింది. ప్యాడ్‌మ్యాన్‌గా అక్షయ్‌కుమార్ ఈ సినిమా ద్వారా ప్రజల్లో ముఖ్యంగా మహిళల్లో అవగాహన తెస్తున్నారు. అచ్చం సినిమాలోలా సూరత్‌లోని 62 ఏళ్ల మహిళ ‘ప్యాడ్ వాలీ దీదీ/దాదీ’గా అక్కడి పాఠశాలల అమ్మాయిలూ, మహిళలకు సుపరిచితం. నెలసరి సమయంలో శానిటరీ న్యాప్‌కిన్లు అందించడంతోపాటు వ్యక్తిగత శుభ్రత కోసం ‘హెల్తీ కిట్’ను నెల నెలా వారికి అందిస్తోంది మీనా మెహతా.



మాది సూరత్. నేనో సాధారణ గృహిణిని. ఒక రోజు కారులో వెళుతుండగా ఇద్దరమ్మాయిలు చెత్తకుండీల్లో ఏదో వెతుకుతున్నారు. కాసేపటి వారికి కావాల్సింది దొరికింది. అలా కాసేపు చూసి అదేంటని ప్రశ్నించిన నాకు వారు చెప్పిన సమాధానంతో కళ్లలో నీళ్లు చిప్పిల్లాయి. వారు వెతికింది వాడి పారేసిన శానిటరీ న్యాప్‌కిన్ల కోసం. వాటినే శుభ్రం చేసుకుని మళ్లీ వాడుకుంటామని చెప్పినప్పుడు నా నోట మాట రాలేదు. ఇలాంటి పేద అమ్మాయిలకు శానిటరీ ప్యాడ్‌లు ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నా. నా భర్త అతుల్ మెహతాతో కలిసి 2012లో ఈ కార్యక్రమం మొదలుపెట్టా. మొదట సూరత్ మున్సిపల్ జోనల్ అధికారిని కలిసి మా ఆలోచన చెప్పాం. ఆయన అనుమతి ఇవ్వడంతో ఒక స్కూల్లో శానిటరీ ప్యాడ్‌ల పంపిణీతో పాటు నెలసరి సమయంలో తలెత్తే ఇబ్బందుల గురించి అక్కడ వివరించాం. ప్రస్తుతం దాదాపు ముప్ఫైఐదు పాఠశాలల్లోని 2000 మంది అమ్మాయిలతోపాటు మురికివాడల్లోని పేద మహిళలకూ వాటిని అందిస్తున్నాం.

లోదుస్తులు కూడా... అలాంటి సమయంలోనే వారికి లోదుస్తులు కూడా సరిగ్గా లేవనే విషయం తెలిసింది. దాంతో బాగా ఆలోచించి న్యాప్‌కిన్లతోపాటూ లోదుస్తుల్ని కూడా ఇవ్వాలని నిర్ణయించుకున్నా. ‘హెల్త్ కిట్’ పేరుతో నెలసరి సమయంలో అవసరమయ్యే వస్తువులను అందివ్వడం మొదలుపెట్టా. ఈ కిట్‌లో జత లోదుస్తులూ, సబ్బూ, నాలుగు షాంపూలూ, ఎనిమిది న్యాప్‌కిన్లూ ఉంటాయి.

ఆ సంఘటన బాధ కలిగించింది... ప్యాడ్‌లు ఉచితంగా అందిస్తున్నామని సాయం కావాలని కోరినప్పుడు చాలామంది హేళన చేశారు. మరికొందరు అసలు పట్టించుకోలేదు. మా వారు రూ.25,000 ఇచ్చి వెన్ను తట్టారు. ఆ తరువాత హేళన చేసినవారే మెల్లిగా మారడం మొదలుపెట్టారు. ఆ తరువాత ప్రతినెలా స్నేహితులూ, బంధువులతోపాటు వారు కూడా కొంత సాయం చేసేవారు. మానుని పేరుతో ఫేస్‌బుక్ పేజీ ద్వారా కూడా విరాళాలు సేకరిస్తున్నా. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా దాతలు స్పందించి సాయం చేస్తున్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎనిమిది లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేసింది. ఈ మొత్తంతో 2017లో మానునీ పేరుతోనే ట్రస్టును రిజిస్టర్ చేయించా.

సుధామూర్తే ప్రేరణ... ‘2004లో తమిళనాడులో సునామీ వచ్చినప్పుడు బాధిత మహిళలకు సుధామూర్తి శానిటరీ న్యాప్‌కిన్లను పంచిపెట్టారు. సాధారణంగా అలాంటి సమయంలో అందరూ ఆహారం, నీళ్లు లాంటివి ఇస్తారు. కానీ ఆ అవసరాన్ని ఎవరు గుర్తిస్తారు.. ఎవరు సాయం చేస్తారు...’ అన్న సుధామూర్తి మాటలే నాలో మార్పు తెచ్చాయి. ప్రతి ఒక మహిళా తన వంతుగా ప్రతినెలా ఇద్దరు నిరుపేద అమ్మాయిలకు ప్యాడ్‌లను అందించగలిగితే ఈ సమస్యకు కొంత పరిష్కారం లభిస్తుంది. మీరూ ఆ జాబితాలో చేరతారా మరి.

బియ్యప్పిండి పూత వేద్దామా!

ముఖాన్ని ప్రతిరోజూ నీటితో కడుక్కుంటాం. సబ్బు లేదా ఫేస్‌వాష్‌తో శుభ్రం చేస్తాం. అయినా చర్మరంధ్రాల్లో పేరుకుపోయిన మురికి ఓ పట్టాన పోదు. మరి వాటన్నింటిని తీసేయాలంటే అసలైన మార్గం స్క్రబ్. దీనివల్ల ముఖంపై పేరుకున్న మురికితోపాటు మృతకణాలూ పోతాయి. చర్మం కూడా నునుపుగా మారుతుంది.

కొబ్బరిపాలూ, బాదంతో... రెండు చెంచాల ముల్తానీమట్టిలో చెంచా ఓట్స్, టేబుల్‌స్పూను కొబ్బరిపాలు కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఇరవై నిమిషాల తరువాత చల్లటి నీటితో కడిగేస్తే సరి. ముఖం మృదువుగా, కాంతిమంతంగా మారుతుంది.



బియ్యం, తేనెతో... రెండు చెంచాల బియ్యాన్ని బరకగా మిక్సీ పట్టి అందులో తగినంత తేనె వేసి బాగా కలపాలి. ముఖాన్ని ఒకసారి కడిగి తరువాత దీన్ని పూతలా వేసుకుని అరగంటాగి గోరువెచ్చటి నీటితో కడిగేయాలి. బియ్యం ముఖంపై ఉండే మురికిని తొలగించి మెరిసేలా చేస్తుంది. తేనె చర్మానికి కావాల్సిన తేమను అందిస్తుంది.

టొమాటో, పెరుగుతో... చర్మంపై ఉన్న నలుపు పోవాలంటే పెరుగు ఎంచుకోవాలి. ఇది సహజ బ్లీచ్‌లా పనిచేసి మీ చర్మాన్ని మెరిపిస్తుంది. రెండు చెంచాల చొప్పున టొమాటో గుజ్జూ, పెరుగూ, చెంచా నిమ్మరసం తీసుకుని అన్నింటినీ కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. పూర్తిగా ఎండిపోయాక కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుండటంతో నలుపు పోవడంతోపాటూ చర్మం మెరుస్తుంది.

email:
vasundhara
@eenadu.net

ఎంతో గొప్ప అనుకునే మన ఐఐటీలు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఎక్కడో ఉంటున్నాయి. ఎందరో మేధావులు విదేశాలకు వలసలు వెళ్లిపోతున్నారు. కారణం మన దేశంలో తగిన ప్రోత్సాహకాలు లేకపోవడమే. ఈ లోపాలను సరిదిద్దే క్రమంలో ప్రభుత్వం పీఎంఆర్ఎఫ్ (ప్రైమ్ మినిస్టర్ రిసెర్చ్ ఫెలోస్) పథకాన్ని ప్రవేశపెట్టింది. శాస్త్రసాంకేతిక రంగాల్లో కొత్త కొత్త పరిశోధనలకు ప్రాణం పోస్తోంది. నాణ్యమైన విద్యను బోధించే ఆచార్యులను అందిస్తోంది.



ఎన్‌సీసీ కీలకం

ఐఐటీలు, ఐఐఎస్సీల నుంచి 7 లేదా 8 మంది డైరెక్టర్లు కలిసి జాతీయ సమన్వయ కమిటీ (ఎన్‌సీసీ)గా ఏర్పడతారు. ఈ స్కీమ్ వీరి పర్యవేక్షణలో ఉంటుంది. సీజీపీఏతో సహా వివిధ అర్హతలు, నిబంధనలకు సంబంధించి మార్పులను ఎన్‌సీసీ సూచించవచ్చు. మొత్తంమీద అంశాలవారీగా గరిష్ఠం లేదా కనిష్ఠంగా ఎన్ని రిసెర్చ్ ప్రాజెక్టులు ఉండాలనేది ఎన్‌సీసీ నిర్ణయిస్తుంది.

ప్రధానమంత్రి ఫెలోషిప్‌ను నిర్ణీత కాలవ్యవధులకు సమీక్షించడం, పర్యవేక్షించడం లాంటివన్నీ ఎన్‌సీసీ చేస్తుంది. అలాగే కేంద్ర మానవవనరుల శాఖకు దీనికి సంబంధించి నివేదికలు పంపుతుంది. దీనికోసం ఏడాదికి రెండుసార్లు అంతర్గత సమీక్షలు నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థులందరితో ఏడాదికి ఒకసారి జాతీయస్థాయి సమావేశం ఏర్పాటు చేస్తారు. ఇందులో వివిధ పరిశ్రమలు పాల్గొనడానికి అవకాశం కల్పిస్తారు. ఇండస్ట్రీ ఇంటరాక్షన్‌కు ఇది ఒక వేదికగా ఉపయోగపడుతుంది.

ఎన్‌సీసీ ఒక వెబ్‌సైట్ ఏర్పాటుచేస్తుంది. ఇందులో ప్రతి పరిశోధక విద్యార్థి ఏ అంశంలో పరిశోధనలు చేస్తున్నారు, ఎంతవరకు వచ్చింది తదితర వివరాలను పొందుపరుస్తారు.

ప్రతిభావంతులకు పీఎం ఫెలోషిప్‌లు

■ నెలకు రూ.70 వేల నుంచి రూ.80 వేలు స్టైపెండ్

■ ఏడాదికి రూ. 2 లక్షలు రిసెర్చ్ గ్రాంట్

సువిశాల ప్రాంగణాలు, ఆకాశాన్ని తాకే భవనాలు ఎన్ని ఉన్నా నాణ్యమైన విద్యను అందించకపోతే ఏ విద్యాసంస్థలోనూ జీవకళ కనిపించదు. ఇప్పటికీ మన ఐఐటీల్లో 35, ఎన్ఐటీల్లో 47, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో 53 శాతం ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఒక అంచనా. ఈ పరిస్థితుల్లో ఉన్నతవిద్య తన ఔన్నత్యాన్ని కోల్పోతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులను పరిశోధనల దిశగా నడిపించడానికి ప్రభుత్వం ప్రధానమంత్రి ఫెలోషిప్‌ను ప్రకటించింది. దేశ సర్వతోముఖాభివృద్ధికి బలమైన విద్యావ్యవస్థను అందించడం, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడమే ఈ పథకం ఉద్దేశం. దీని వల్ల శాస్త్రసాంకేతిక రంగాల్లో దేశ అవసరాలు తీరడంతోపాటు, ప్రతిష్ఠాత్మక సంస్థలకు ఫ్యాకల్టీ కొరత కూడా తగ్గుతుంది. ఇలాంటి ఎన్నో సమున్నతాశయాలతో ప్రధానమంత్రి ఫెలోషిప్ తుది రూపాన్ని సంతరించుకుంది. 2018-19 విద్యా సంవత్సరం నుంచి ఇది మొదలవుతోంది. ఏడాదికి వెయ్యి మంది చొప్పున వరుసగా మూడేళ్లలో మూడువేల మందికి అవకాశం కల్పిస్తారు. నెలకు రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకు ప్రతి ఒక్కరికీ ఆర్థికసాయం అందిస్తారు. ఏటా రిసెర్చ్ గ్రాంట్ రూపంలో మరో రూ.2 లక్షలు ఇస్తారు.

ఇవీ అర్హతలు

■ ఐఐఎస్సీ, ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఎస్ఈఆర్‌లు, ట్రిపుల్ఐటీల్లో బీటెక్ లేదా ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ లేదా ఎమ్మెస్సీ కోర్సులను సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో పూర్తిచేసిన వారు పీఎంఆర్ఎఫ్‌కు అర్హులు. ప్రస్తుతం ఆఖరు సంవత్సరం కోర్సులు చదువుతున్నవాళ్లు కూడా ఫెలోషిప్‌కి దరఖాస్తు చేసుకోవచ్చు.

■ అభ్యర్థులు సంబంధిత కోర్సుల్లో కనీసం 8 క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ ఏవరేజ్ (సీజీపీఏ) సాధించాలి.

■ గత అయిదేళ్లలో ఆయా కోర్సులను పూర్తిచేసినవాళ్లే అర్హులు.

ఇలా చేయాలి

అభ్యర్థులు ముందుగా ఏ అంశంలో పరిశోధన చేయాలనుకుంటున్నారో తెలియజేయాలి. ఆ అంశం/ సబ్జెక్టుపై తన ఆసక్తి, ఎందుకు పరిశోధన సాగించాలని అనుకుంటున్నారో స్థూలంగా వివరించాలి. ఆ ప్రతిపాదిత ప్రాజెక్టు ద్వారా అభ్యర్థి విశ్లేషణ సామర్థ్యాన్ని, పరిశోధన నైపుణ్యాలను తెలపాలి. అలాగే ఆ అంశంలో పరిశోధన ఎందుకు అవసరమో, అది జాతీయ ప్రయోజనాలకు ఎలా ఉపయోగపడుతుందో విశ్లేషించాలి. ఎంచుకునే అంశం ప్రస్తుత దేశీయ అవసరాలకు, టెక్నాలజీ, సైన్స్‌లకు సంబంధించినదై ఉండాలి. ప్రతిపాదనలో ఇద్దరు నిపుణుల పేర్లను రిఫరెన్సుగా చూపాలి. అవసరమనుకుంటే నియామక కమిటీ ఈ నిపుణుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటుంది. ప్రతి విభాగం/ సబ్జెక్టుకు సీట్ల పరిమితి ఉంటుంది. ఏదైనా అంశంలో అవసరమైన పీహెచ్‌డీలు లేకపోతే వాటికి ప్రాధాన్యం ఉంటుంది.



వడపోత ఇలా!

అభ్యర్థులు నిర్ణీత గడువులోగా తమ ప్రాజెక్టుకు సంబంధించిన స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ (ఎస్ఓపీ) లేదా ప్రాజెక్ట్ అబ్‌స్ట్రాక్ట్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సెంట్రల్ పోర్టల్‌లోకి అప్‌లోడ్ అయిన ప్రాజెక్టులు ఆటోమేటిక్‌గా నోడల్ ఇన్‌స్టిట్యూట్‌లకు చేరతాయి. ప్రతిపాదిత ప్రాజెక్టు ఎందుకు, ఏ విధంగా ఉపయోగపడుతుంది, ఎలా చేయాలి, అందుకు అభ్యర్థి ఏ విధంగా తగిన వ్యక్తి తదితర వివరాలను ఎస్ఓపీ తెలియజేస్తుంది.

అభ్యర్థుల ప్రాజెక్ట్ ప్రతిపాదనలను నిపుణుల సాయంతో నోడల్ ఇన్‌స్టిట్యూట్‌లు పరిశీలిస్తాయి. మెరుగైన వాటిని ఎంపిక చేసి అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలుస్తారు. అవసరం అనుకుంటే వీడియో కాన్ఫరెన్స్‌లు కూడా నిర్వహిస్తారు.

చేరిన తర్వాత!

ఫెలోగా ఎంపికైన అభ్యర్థులకు ఏటా కొన్ని లక్ష్యాలను సంబంధిత డిపార్ట్‌మెంట్ నిర్దేశిస్తుంది. అందరూ వాటిని సాధించాల్సి ఉంటుంది. వారు ఎంచుకున్న అంశం/ విషయం ఆధారంగానే ఈ లక్ష్యాలను నిర్ణయిస్తారు. ప్రతి సంవత్సరం అభ్యర్థుల ప్రగతిని పరిశీలిస్తారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటేనే తర్వాతి ఏడాది ఫెలోషిప్ కొనసాగుతుంది. ఒకవేళ లక్ష్యాలను చేరుకోలేకపోతే అభ్యర్థులను సాధారణ ఫెలోషిప్‌లోకి మారుస్తారు. లేదా పూర్తిగా తొలగిస్తారు.

ఆర్థిక చేయూత

ప్రధానమంత్రి ఫెలోషిప్‌లు (నెలకు) మొదటి రెండు సంవత్సరాలు రూ.70,000 ఉంటుంది. మూడో సంవత్సరం రూ.75,000. చివరి రెండేళ్లు రూ.80,000. ఇవే కాకుండా ప్రతి ఒక్కరూ రిసెర్చ్ గ్రాంట్ కింద ఏడాదికి రూ.2 లక్షల వరకు పొందవచ్చు. అంటే అయిదేళ్లకుగానూ రూ.10 లక్షలు రిసెర్చ్ గ్రాంట్ రూపంలో లభిస్తాయి.

ఇంటిగ్రేటెడ్ కోర్సుల నుంచి వచ్చినవారికి రిసెర్చ్ వ్యవధి నాలుగేళ్లు. బీటెక్ అభ్యర్థులకైతే అయిదేళ్లు. పీజీ అనంతరం ఫెలోషిప్‌లోకి చేరినవాళ్లు మూడేళ్లలో పీహెచ్‌డీ ప్రోగ్రాం పూర్తిచేయాల్సి ఉంటుంది.

ప్రధానమంత్రి ఫెలోషిప్ కార్యక్రమంలో ఇండస్ట్రీ భాగస్వామ్యాన్నీ అనుమతిస్తారు. సంబంధిత సంస్థలు సీఎస్ఆర్ ఫండింగ్ కింద వీలైనంత మందికి ఫెలోషిప్‌లను అందించవచ్చు. నాలుగేళ్ల పరిశోధన అనంతరం సంబంధిత ఇన్‌స్టిట్యూట్‌లు సమీక్షించి అయిదో సంవత్సరానికి ఫెలోషిప్ కొనసాగించాలా, వద్దా అనేది నిర్ణయిస్తాయి.

నోడల్ ఇన్‌స్టిట్యూట్‌లు

ప్రతి సబ్జెక్టు/ విభాగానికి సంబంధించి ఏదో ఒక ఐఐటీ లేదా ఐఐఎస్సీ నోడల్ ఇన్‌స్టిట్యూట్‌గా వ్యవహరిస్తుంది. రెండేళ్ల తర్వాత సంబంధిత సబ్జెక్టు / విభాగంలో నోడల్ ఇన్‌స్టిట్యూట్‌గా మరో సంస్థకు అవకాశం కల్పిస్తారు. మొదటి రెండేళ్లు ఏ సబ్జెక్టు / విభాగానికి ఏ సంస్థ నోడల్‌గా వ్యవహరిస్తుందో నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్‌సీసీ) నిర్ణయిస్తుంది.

ఇదీ ఎంపిక విధానం

ప్రధానమంత్రి పరిశోధన ఫెలోషిప్ (పీఎంఆర్ఎఫ్)కు ఎంపిక కావడానికి రెండు దశలు దాటాల్సి ఉంటుంది. మొదట అభ్యర్థులు ఎంచుకున్న ప్రాజెక్టు నమూనాను నిపుణులు రివ్యూ చేస్తారు. ఇలా తొలిదశ వడపోతలో ఎంపికైన అభ్యర్థులను సెలక్షన్ కమిటీ ఇంటర్వ్యూ చేస్తుంది. ఎంపికైన అభ్యర్థుల కోరిక మేరకు లేదా పరిశోధనలకు తగిన వనరుల అందుబాటును దృష్టిలో ఉంచుకొని ఇన్‌స్టిట్యూట్‌ను డాక్టోరల్ స్టడీ కోసం కేటాయిస్తుంది.

Fan the flames... అంటే?

ఇద్దరు పోట్లాడుకుంటుంటే విడదీయకుండా వారిని ఇంకా రెచ్చగొట్టే పని చేస్తుంటారు కొందరు. పరిస్థితి ఇంకా దిగజారటానికి వీళ్లు కారణమవుతుంటారన్న మాట. ఇలా రెచ్చగొట్టటాన్ని వర్ణించటానికి ఇంగ్లిష్‌లో ఒక వ్యక్తీకరణ ఉంది. ఏమిటది?



ఎం. సురేశన్

Arjun: I have the latest news for you. Chalam and his wife have fallen apart. They had sued for a divorce and were separated (నీకో తాజా వార్త ఉంది నాదగ్గర. చలం, అతని భార్య పోట్లాడుకున్నారు. వాళ్లు విడాకులు తీసుకుని విడిపోయారు).

Anjan: That is bad news really. Why has their marriage fallen apart? What caused it? (అది నిజంగా చెడు వార్త. ఎందుకు వాళ్ల పెళ్లి పెటాకులైంది? కారణం ఏమిటి?)

Arjun: For a long time, they had not been able to see eye to eye with each other. They thought they had better sue for a divorce than live together with differences (చాలాకాలంగా వాళ్లకు అభిప్రాయ భేదాలున్నాయి. మనస్పర్థలతో కలిసి ఉండటం కంటే విడాకులు మంచిదని వాళ్లు అనుకున్నారు).

Anjan: That is a real pity. I think Chalam is responsible for it. He is no good at loving. Most of the time he speaks non-sense and that should have worried his wife Ahalya. As far as I know she is very patient (అది నిజంగా బాధాకరమైన విషయమే. చలమే దానికి కారణమనుకుంటున్నాను. ప్రేమ విషయంలో అతడిలో అంత మంచితనం లేదు. చాలామటుకు అర్థంలేని విషయాలు మాట్లాడుతాడు, అది అతని భార్య అహల్యకు ఇబ్బంది కలిగించి ఉంటుంది. నాకు తెలిసినంతవరకు ఆవిడ చాలా ఓర్పు కలది).



English language skills

Arjun: Yea, I heard about it too. His mother must have goaded him to nag his wife. That must be the reason (అవును. నేను కూడా అది విన్నాను. భార్యను నస పెట్టమని అతడి తల్లి ప్రోత్సహించి ఉంటుంది. అదీ కారణమై ఉండొచ్చు).

Anjan: Any way, it is very sad news. Is he going for a second marriage? (ఏదేమైనా ఇది విచారకరం. అతను రెండో పెళ్లి చేసుకోబోతున్నాడా?)

Arjun: Are you sure that the second marriage will be a success? I am doubtful about it (ఆ రెండో పెళ్లి కూడా బాగా సాగుతుందని అనుకుంటున్నావా? నాకు సందేహమే).

Anjan: His mother will again fan the flames, and that marriage will also be a wreck (అతని తల్లి మళ్లీ అతన్ని రెచ్చగొడుతుంది, ఆ రెండో పెళ్లి కూడా దెబ్బతింటుంది).

Arjun: Any way let us wish him the best of luck (ఏదేమైనా అతనికి మంచి జరగాలనే కోరుకుందాం).

Now look at the expressions from the conversation above:

1) Fallen apart – the past participle (V3) of fall apart = Quarrel with each other / have differences of opinion (పోట్లాడుకోవడం, అభిప్రాయ భేదాలుండటం)

Dharmaraj: The two partners of the company have separated. They no longer carry on their business together (ఆ కంపెనీ ఇద్దరు భాగస్వాములూ వేరుపడ్డారు. వాళ్లు కలిసి వ్యాపారం చేయడం లేదు).

Anand: I heard of it too. But I don't know the reason why they have fallen apart (నేనూ విన్నాను అది. కానీ ఎందుకు వాళ్లు వేరుపడ్డారో నాకు తెలీదు).

2) See eye to eye with each other = Agree with each other / have no differences of opinion (అభిప్రాయ భేదాలు లేకపోవడం).

Krishnamurthy: The two partners Syam and Mohan are very closely united. That is why their business is so successful (ఆ ఇద్దరు భాగస్వాములూ.. అంటే శ్యామ్, మోహన్ చాలా ఐకమత్యంతో ఉంటారు. అందుకనే వాళ్ల వ్యాపారం చాలా విజయవంతంగా సాగుతోంది).

Sundaresh: Yea, they have no problem at all. There is no question of their not seeing eye to eye with each other (అవును, వాళ్లకి ఏ సమస్యలూ లేవు. అసలు అభిప్రాయ భేదాలే రావు).

3) Fan the flames = Say / do something that makes a bad situation worse (చెడు పరిస్థితిని ఇంకా అధ్వానం చేయడం- పోట్లాడుకుంటున్న ఇద్దరిని ఇంకా రెచ్చగొట్టడం).

Trimurthy: Somu and Veeraraju are no longer the dear friends they were. They have differences (సోము, వీర్రాజు అంత సన్నిహితమైన స్నేహితులు కారిప్పుడు. వాళ్లకు మనస్పర్థలు వచ్చాయి).

Sivaram: For the past six months they have had differences of opinion. Did any one fan the flames between them to make the bad situation worse? (గత ఆరు నెలలుగా వాళ్లకు మనస్పర్థలు ఉన్నాయి. వాళ్లిద్దరినీ ఎవరైనా రెచ్చగొట్టారా, వాళ్ల మధ్య ఉన్న పరిస్థితిని అధ్వానం చేసేలా?)

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఏపీ పోస్టల్ సర్కిల్‌లో 245 ఖాళీలు

పోస్టులు: పోస్టుమ్యాన్-234, మెయిల్‌గార్డ్-11
అర్హత: పదోతరగతి ఉత్తీర్ణత.
వయసు: 18-27 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ **దరఖాస్తు ఫీజు:** రూ.500
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది: 15.03.2018
ఫీజు చెల్లించడానికి చివరితేది: 16.03.2018
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: 20.03.2018
వెబ్‌సైట్: http://appost.in/

ఎన్ఐటీ ఉత్తరాఖండ్‌లో 38 టీచింగ్ పోస్టులు

1) ప్రొఫెసర్/ అసోసియేట్ ప్రొఫెసర్
2) అసిస్టెంట్ ప్రొఫెసర్
అర్హత: పీహెచ్‌డీతోపాటు బోధన/ పరిశోధన రంగాల్లో అనుభవం.
ఎంపిక: పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్. **దరఖాస్తు ఫీజు:** రూ.1000 **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** 13.03.2018
హార్డ్ కాపీలను పంపడానికి చివరితేది: 20.03.2018
వెబ్‌సైట్: http://nituk.ac.in/

ఐడబ్ల్యూఏఐ, నోయిడా

ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 02
అర్హత: నిబంధనల ప్రకారం. **వయసు:** 30 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్.
చివరితేది: 23.03.2018 **వెబ్‌సైట్:** www.iwai.nic.in

బామర్ లారీ అండ్ కంపెనీ, కోల్‌కతా

పోస్టులు: సేల్స్ కోఆర్డినేటర్-03, ఆపరేషన్ అసిస్టెంట్-04.
వర్క్ లొకేషన్లు: హైదరాబాద్, బెంగళూరు, కరూర్
అర్హత: ఏదైనా డిగ్రీ/ ఎంబీఏ.
వయసు: 35 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్
దరఖాస్తు ఫీజు: రూ.500 **చివరితేది:** 01.03.2018
వెబ్‌సైట్: http://www.balmerlawrie.com/

ఎన్ఐఆర్‌టీ, చెన్నై

వాక్ ఇన్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రిసెర్చ్ ఇన్ ట్యుబర్‌కులోసిస్ (ఎన్ఐఆర్‌టీ) సైంటిస్ట్ తదితర పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
పోస్టులు: సైంటిస్ట్-బి (మెడికల్)-01, ప్రాజెక్ట్ టెక్నికల్ అసిస్టెంట్-02
అర్హత: ఎంబీబీఎస్/ ఎండీ, కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ/ పీజీ.
వయసు: సైంటిస్టు పోస్టుకు 35 ఏళ్లు, ప్రాజెక్ట్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుకు 30 ఏళ్లు. **ఇంటర్వ్యూ తేది:** 2018 ఫిబ్రవరి 28, మార్చి 1.
వేదిక: ఎన్ఐఆర్‌టీ, చెన్నై. **వెబ్‌సైట్:** www.nirt.res.in

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

లైబ్రరీ

ఆర్ఆర్‌బీ లోకో పైలెట్స్

ఆర్ఆర్‌బీ- లోకో పైలెట్స్, టెక్నీషియన్స్ స్టడీ మెటీరియల్
పేజీలు: 136, ధర: రూ.75.
ప్రచురణ: ఉద్యోగ సోపానం



ఏపీటెట్



1) ఏపీటెట్ పేపర్-2; శిశు వికాసం-అధ్యాపనం, పేజీలు: 230; తెలుగు (కంటెంట్, పెడగోజీ), పేజీలు: 512; ఇంగ్లిష్ (కంటెంట్, పెడగోజీ), పేజీలు: 418, ధర: రూ. 405 (మూడు పుస్తకాలు కలిపి)

2) పేపర్-1 శిశువికాసం - అధ్యాపనం, పేజీలు: 230; తెలుగు (కంటెంట్, పెడగోజీ), పేజీలు: 468; ఇంగ్లిష్ (కంటెంట్, పెడగోజీ), పేజీలు: 396, ధర: రూ. 396 (మూడు పుస్తకాలు) 3) పేపర్-1 గణితశాస్త్రం (కంటెంట్, పెడగోజీ), పేజీలు: 612, ధర: రూ. 270

4) పేపర్-2 గణితశాస్త్రం (కంటెంట్, పెడగోజీ), పేజీలు: 796, ధర: రూ. 360

5) పేపర్-2 సైన్స్ (కంటెంట్, పెడగోజీ), పేజీలు: 764, ధర: రూ. 360

ప్రచురణ: వీజీఎస్ బుక్ లింక్స్

7 శాతం పెరిగిన ఆహార ధాన్యాల సాగు

వ్యవసాయశాఖ నివేదిక

ఈనాడు, హైదరాబాద్: యాసంగి ప్రస్తుత సీజన్‌లో ఆహార ధాన్యాల పంటలను సాధారణంగా 7 శాతం, వరి నాట్లు 20 శాతం అధికంగా వేసినట్లు వ్యవసాయ శాఖ బుధవారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. ఆహార ధాన్యాల పంటల సాధారణ సాగు విస్తీర్ణం 9.65 లక్షల హెక్టార్లకుగాను 10.33 లక్షల హెక్టార్లలో విత్తనాలు, నాట్లు వేశారు. కానీ గతేడాది ఇదే సమయానికి ఇంకా అదనంగా మరో 20 వేల హెక్టార్లు సాగు కావడం గమనార్హం. గతేడాదికన్నా వరి సాగు పెరిగినట్లు చెబుతున్నా ఇతర ఆహార పంటల సాగు తగ్గింది. మొక్కజొన్న, మినుము, పెసర, జొన్న వంటి పంటలివే సాధారణ స్థాయిలో వేయలేదు. వరి సాధారణ విస్తీర్ణం 6.15 లక్షల హెక్టార్లకుగాను 7.41 లక్షల హెక్టార్లలో నాట్లు వేశారు. గతేడాదికన్నా 57 వేల హెక్టార్లు పెరిగింది. వానాకాలంలో రెండు వారాల క్రితం వరకూ వరి సాగు బాగా తక్కువగా ఉన్నట్లు వ్యవసాయ శాఖ చూపింది. దీనిపై వ్యవసాయ మంత్రి గట్టిగా ప్రశ్నించడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగినట్లు తాజా నివేదికలో వెల్లడించింది. యాసంగిలో వరి, సెనగ, వేరుసెనగ, మొక్కజొన్న, జొన్న ప్రధాన పంటలు. వరి, సెనగ మాత్రమే సాధారణ స్థాయిలో వేశారు. నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి నూనెగింజల పంటల సాగు బాగా తగ్గింది. బోర్లు ఉన్న రైతులు అధికంగా వరి సాగు చేశారని వ్యవసాయాధికారులు తెలిపారు. అన్ని రకాల పంటల సాధారణ విస్తీర్ణం 12.77 లక్షల హెక్టార్లకుగాను 12.56 లక్షల హెక్టార్లలో సాగయింది. గతేడాది ఇదే సమయానికి సాగైన 13.01 లక్షల హెక్టార్లతో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది.

మేఘాలపై శాస్త్ర మథనం!

- నింగిలోకి బెలూన్ ద్వారా పది పరిశోధన పరికరాలు
- టీఐఎఫ్‌ఆర్ ప్రయోగం విజయవంతం

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి, కాప్రా - న్యూస్‌టుడే



మేఘాల్లో అధికమవుతున్న నైట్రేట్, బ్లాక్ కార్బన్, దుమ్ముధూళి కణాలపై అధ్యయనం కోసం ఇటీవల హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చి (టీఐఎఫ్‌ఆర్‌) చేపట్టిన బెలూన్ ప్రయోగం విజయవంతమైంది. వాతావరణ మార్పుల అంశంపై భాగస్వామ్యంతో ఇస్రోతో భారత్ వాతావరణ పరిశోధన ప్రయోగశాల (ఎన్ఏఆర్ఎల్), నాసా(అమెరికా), సీఎన్ఆర్ఎస్(ఫ్రాన్స్) సంస్థలు భారత్‌లో మరికొన్ని పరిశోధన సంస్థల సహకారంతో సరికొత్త ప్రయోగాన్ని మొదలుపెట్టాయి. 2015-17 సంవత్సరాల మధ్య ఈ సంస్థలు చేపట్టిన పరిశోధనలతో మేఘాల్లో నైట్రేట్, బ్లాక్ కార్బన్ వాయువులు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. నైట్రేట్ భూ ఉపరితలం నుంచి నింగిలోకి వెళ్లి వర్షాకాలంలో చురుకైన రుతుపవనాలపై ప్రభావం చూపడంతో, భూవాతావరణంలో ఉష్ణోగ్రతల్లో పెను మార్పులు సంభవిస్తున్నట్లు గుర్తించారు. వీటన్నింటి వల్ల వర్షాలు కురవడంలో మార్పులు సంభవిస్తున్నాయి. వాతావరణ కాలుష్యం, మానవ తప్పిదాల వల్ల భూవాతావరణం నుంచి నింగికి వెళుతున్న నైట్రేట్, బ్లాక్ కార్బన్‌పై మరింత లోతుగా 2020 దాకా అధ్యయనం చేపట్టాలని ఈ సంస్థలు నిర్ణయించాయి. దుమ్ముధూళి కణాలపై కూడా పరిశోధన సాగనుంది. ఈ మేరకు నింగిలో వాతావరణ పరిస్థితులను పరిశోధించేందుకు టీఐఎఫ్ఆర్ 'బెలూన్ బోర్న్ ఏషియన్ ట్రోపోపాస్ ఏరోసోల్ లేయర్ (బాటల్)' పేరిట బెలూన్‌తో ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఈ బెలూన్‌లో పది రకాల పరిశోధన పరికరాలతో కూడిన బాటిల్ పేలోడ్‌ను ఈ నెల 10వ తేదీ తెల్లవారు జామున 2.20 గంటలకు కుషాయిగూడలోని టీఐఎఫ్‌ఆర్ ప్రాంగణం నుంచి నింగిలోకి ప్రయోగించారు. 70-110 కిలోల పేలోడ్‌ను 16-17.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకువెళ్లే సామర్థ్యం ఉండటం టీఐఎఫ్ఆర్ బృందం రూపొందించిన హైబ్రిడ్ బెలూన్ ప్రత్యేకత. ఈ సందర్భంగా టీఐఎఫ్ఆర్ బెలూన్ ఫెసిలిటీ కమిటీ ఛైర్‌పర్సన్ ఆచార్య దేవేందర్‌కుమార్ ఓజా మాట్లాడుతూ.. పది వేర్వేరు వాతావరణ శాస్త్ర పరిశోధన పరికరాలను ఒకే బెలూన్ ('పేలోడ్')లో అమర్చి నింగిలోకి పంపించామని, ఇది ప్రపంచ చరిత్రలో మొదటిసారి అని పేర్కొన్నారు. టీఐఎఫ్ఆర్ బెలూన్ ఫెసిలిటీ సైంటిస్ట్ ఇంఛార్జి బూరుదు సునీల్‌కుమార్ మాట్లాడుతూ 'పేలోడ్‌లోని ఉపకరణాలను నింగిలో రెండు గంటలపాటు వాతావరణ పరిశోధనలను నిర్వహించాయని, ప్రయోగానంతరం 10వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో పేలోడ్‌ను మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం తిరుమలగండి గ్రామంలో ప్యారాచూట్ సాయంతో సురక్షితంగా దించామని వెల్లడించారు. ఎన్ఏఆర్ఎల్ సంస్థ శాస్త్రవేత్త డా.వెంకటరత్నం మాట్లాడుతూ.. పరిశోధనల ద్వారా సేకరించిన పూర్తి సమాచారాన్ని విశ్లేషణ కోసం ఎన్ఏఆర్ఎల్, పీఆర్ఎల్ పరిశోధన సంస్థలకు పంపించనున్నట్లు తెలిపారు. ఈ పరిశోధనలతో వచ్చిన ఫలితాలు.. భవిష్యత్తులో వాతావరణ పరిశోధన ఉపగ్రహం తయారీలో ఉపకరిస్తాయన్నారు.





అనిశాకు చిక్కిన ఉపసంచాలకులు పెరుక యాదయ్య, వసతిగృహ సంరక్షణాధికారి శ్యాంసుందర్ ★ స్వాధీనం చేసుకున్న డబ్బు

అనిశా వలలో అవినీతి చేపలు

- గుత్తేదారు నుంచి రూ.లక్ష తీసుకుంటుండగా పట్టివేత
- ఎస్సీ సంక్షేమశాఖ డీడీ, సంక్షేమాధికారిపై కేసు

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: వసతిగృహాల కూరగాయలు, క్యాంటీన్ గుత్తేదారు నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటూ... షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఉపసంచాలకుడు పెర్క యాదయ్య, వసతి గృహ సంక్షేమాధికారి శ్యాంసుందర్‌లు అవినీతి నిరోధకశాఖకు చిక్కారు. అనిశా డిప్యూటీ డైరెక్టర్ టి.సుదర్శన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ సుభాష్‌నగర్‌లోని ఎస్సీ బాలికల; కార్ఖానగడ్డ, రాంనగర్‌లలోని ఎస్సీ బాలుర వసతి గృహాలకు నిరుడు కూరగాయలు, క్యాంటీన్ నిర్వహణ గుత్తేదారుగా బాకం కనుకయ్య వ్యవహరించారు. జూన్‌లో వసతిగృహాలకు మళ్లీ టెండర్లు నిర్వహించారు. తిరిగి ఈ టెండరు దక్కాలంటే రూ.1.30 లక్షలు ఇవ్వాలని యాదయ్య కోరాడు. ఇందుకు కనుకయ్యతో ఒప్పందం చేసుకున్నాడు. ఈ క్రమంలోనే టెండర్లలో సుభాష్‌నగర్, రాంనగర్ వసతి గృహాల క్యాంటీన్ బాధ్యతలు కనుకయ్యకు దక్కాయి. తర్వాత తనకు రావాల్సిన సుమారు రూ.5 లక్షల విలువైన బిల్లులను చెల్లించాలంటూ కనుకయ్య డీడీ కార్యాలయం చుట్టూ తిరుగుతుండగా... టెండర్ల సమయంలో ఒప్పుకొన్న రూ.1.30 లక్షలు ఇవ్వాలని యాదయ్య వేధింపులకు దిగాడు. అంతటితో ఆగకుండా, కనుకయ్య పనిచేస్తున్న వసతిగృహ సంక్షేమాధికారి శ్యాంసుందర్‌రావుకు విషయం చెప్పి, డబ్బులు వసూలు చేయాలని అతనిపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో శ్యాంసుందర్‌రావు డబ్బుల విషయమై కనుకయ్యను మందలించాడు. విసిగిపోయిన బాధితుడు... పదిరోజుల కిందట అనిశా డీఎస్పీ కిరణ్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. బుధవారం కనుకయ్య శ్యాంసుందర్‌రావు ఇంటికి వెళ్లి, ఆయనకు లక్ష రూపాయలను అందజేశాడు. డబ్బులు అందిన విషయాన్ని ఆయన యాదయ్యకు ఫోన్‌చేసి చెప్పగా... 'నీ దగ్గరే పెట్టుకో. రాత్రి తీసుకుంటా'నని సమాధానమిచ్చాడు. అప్పటికే అక్కడ మాటువేసిన అవినీతి నిరోధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.సుదర్శన్‌గౌడ్, అనిశా డీఎస్పీ కిరణ్‌కుమార్‌లు ఆ డబ్బులను స్వాధీనం చేసుకుని... అధికారులిద్దరినీ తమ కార్యాలయానికి తీసుకెళ్లారు. నిందితులు ఇద్దరిపైనా కేసు నమోదు చేశామనీ, గురువారం అనిశా కోర్టులో హాజరుపరుస్తామని వారు తెలిపారు.

శ్రీశైలంలో వైభవంగా రథోత్సవం



శ్రీశైల పురవీధుల్లో రథోత్సవం. అంతరచిత్రంలో స్వామిఅమ్మవార్లు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల తొమ్మిదో రోజైన బుధవారం శ్రీశైలంలో శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లకు వైభవంగా రథోత్సవం జరిగింది. శ్రీస్వామి అమ్మవార్లను వెండి పల్లకీలో రథశాల వద్దకు తీసుకువచ్చి.. రథాంగహోమం, రథాంగ బలి సమర్పించి రథంపై ఆశీనులను గావించారు. వేలాది మంది భక్తజనుల శివనామస్మరణ నడుమ శ్రీస్వామిఅమ్మవార్లకు శ్రీగిరి పురవీధుల్లో రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. రథోత్సవం ఎదుట కళాకారులు నృత్యప్రదర్శనలతో అలరించారు.



కొమురవెల్లిలో వైభవంగా 'పెద్దపట్నం'

చేర్యాల, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో 'పెద్దపట్నం' కార్యక్రమం వైభవంగా జరిగింది. 40వేల మందికిపైగా భక్తులు తరలివచ్చారు. ఒగ్గుపూజారుల ఆధ్వర్యంలో ఆలయం పరిధిలోని కల్యాణ మండపం వద్ద 'పెద్దపట్నం' మంగళవారం రాత్రి ప్రారంభమై బుధవారం తెల్లవారుజాము 4గంటల వరకూ కొనసాగింది. క్వింటాళ్ల కొద్ది పసుపు (బండారి), కుంకుమ, బియ్యపు పిండి, తంగేడు ఆకుల చూర్ణం, గులాబి రంగులు వినియోగించారు. తెల్లవారుజామున 4.15 గంటలకు స్వామివారి ఉత్సవ విగ్రహాలను పెద్దపట్నంపైకి తీసుకొచ్చి పూజలు చేశారు. పూనకాలతో ఊగిపోతున్న భక్తులు పట్నంపై నృత్యాలు చేశారు. చూర్ణాన్ని తీసుకోవడానికి జరిగిన తోపులాటలో ఒకరికి కాలు విరిగింది.

నీట్ ర్యాంకుల ద్వారానే ఆయుష్ సీట్ల భర్తీ

ఈనాడు, హైదరాబాద్: వచ్చే వైద్య విద్యా సంవత్సరంలో ఆయుష్ సీట్లను నీట్ ర్యాంకుల ప్రాతిపదికనే భర్తీ చేయనున్నట్లు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ కరుణాకరరెడ్డి తెలిపారు. హోమియో, ఆయుర్వేద, యునానీ, ప్రకృతి వైద్యంలో సీట్లన్నింటినీ నీట్ ర్యాంకుల ద్వారానే భర్తీ చేస్తామన్నారు. ఆయా కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు తప్పనిసరిగా నీట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నియంత్రణ రేఖ వెంబడి మళ్లీ పాక్ కాల్పులు

జమ్ము: సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఒప్పందానికి పాకిస్థాన్ బలగాలు మరోసారి తూట్లు పొడిచాయి. జమ్ము కశ్మీర్‌లోని రాజౌరీ జిల్లా నౌషెరా సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి పౌరుల నివాస ప్రాంతాలపై బుధవారం భారీగా మోర్టార్ షెల్‌లను ప్రయోగించాయి. కాల్పులకూ తెగబడ్డాయి. పాక్ దళాల దాడిని మన సైన్యం దీటుగా తిప్పికొట్టిందని రక్షణశాఖ అధికార ప్రతినిధి తెలిపారు.

విశ్వవిద్యాలయాలకు మరింత స్వేచ్ఛ

యూజీసీ అనుమతి లేకుండానే కొత్త కోర్సులు, విభాగాలు

ఈనాడు, హైదరాబాద్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు మరింత స్వయం ప్రతిపత్తి కల్పించాలని యూజీసీ నిర్ణయించింది. న్యాక్-ఏ డబుల్ ప్లస్, ఏ ప్లస్ గుర్తింపు ఉన్నా లేదా ప్రపంచ గుర్తింపు పొందిన టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్, క్యూఎస్ ప్రపంచ ర్యాంకింగ్‌లో 500లోపు ర్యాంకు దక్కించుకున్న విద్యా సంస్థలకు వివిధ అంశాల్లో స్వేచ్ఛ ఇవ్వనుంది. ఈ మేరకు గ్రాంట్ ఆఫ్ గ్రేడెడ్ అటానమీ రెగ్యులేషన్స్-2018 పేరిట ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం న్యాక్-ఏ ప్లస్ హోదా దాటిన విశ్వవిద్యాలయాలు యూజీసీ అనుమతి లేకున్నా కొత్త కోర్సులు, విభాగాలను ప్రారంభించుకోవచ్చు. న్యాక్-ఏ డబుల్ ప్లస్ ఉంటే విదేశీ ఆచార్యులను కూడా నియమించుకోవచ్చు. కళాశాలలకుఐదు సంవత్సరాలు మాత్రమే స్వయం ప్రతిపత్తి ఉండగా..10 ఏళ్లకు పెంచుతూ యూజీసీ నిర్ణయం తీసుకుంది. ఉన్నత విద్యాసంస్థల్లో వినియోగదారుల వ్యవహారాలను ఐచ్ఛిక పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలని మార్గదర్శకాలిచ్చింది. విద్యా సంస్థల మధ్య ఆరోగ్యకర పోటీని నెలకొల్పడం ద్వారా నాణ్యమైన విద్యను అందించాలన్నదే కేంద్ర ఉద్దేశమని యూజీసీ సభ్యుడు ఆచార్య గోపాల్‌రెడ్డి చెప్పారు.

చేప పిల్లల కొనుగోలుకు టెండర్లు: తలసాని

వచ్చే ఏడాది చెరువులు, జలాశయాల్లో వదిలే చేప పిల్లల కొనుగోలుకు జిల్లాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని, వచ్చే నెలలో టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల అధికారులతో మాట్లాడారు. చేపల పెంపకంలో అధునాతన పరిజ్ఞానాన్ని అందరికీ తెలిపేందుకు వచ్చే నెలలో హైదరాబాద్‌లో ఆక్వా ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది 51 కోట్ల చేప పిల్లలను నీటి వనరుల్లో వదలడం వల్ల 1.58 లక్షల టన్నుల ఉత్పత్తి జరిగి రూ.1900 కోట్ల ఆదాయం రానుందని మంత్రి చెప్పారు. గొర్రెల పంపిణీలో వెనుకబడిన జిల్లాల్లో రాష్ట్ర అధికారులు పర్యటించి పరిస్థితులను సమీక్షించాలని ఆయన ఆదేశించారు. కామారెడ్డి, ఆసిఫాబాద్, జగిత్యాల జిల్లాల్లో తొలుత ఇచ్చిన ఏ జాబితాల్లోని వారికి గొర్రెల పంపిణీ పూర్తయినందున ఇకనుంచి బీ జాబితాలోని వారికి పంపిణీ చేయాలన్నారు. త్వరలో గొర్రెల పెంపకందారులు, మత్స్యకార సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని తలసాని ప్రకటించారు.

ఉపాధికి, ఉద్యోగానికి బాసట

EDUCATION | EMPLOYABILITY | ENTREPRENEURSHIP
TASK
TELANGANA ACADEMY FOR SKILL AND KNOWLEDGE

- సత్ఫలితాలనిస్తున్న టాస్క్ శిక్షణ
- విద్యార్థిగానే పరిశ్రమతో కలిసి ముందుకు
- నిరుద్యోగులకూ ప్రత్యేక శిక్షణ
- వరంగల్ ప్రాంతీయ కేంద్రంతో మెరుగైన ఫలితాలు
- పట్టణాల్లోనూ ప్రత్యేక శిక్షణకు శ్రీకారం

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంచి ఉపాధి కల్పనకు దోహదపడుతున్న తెలంగాణ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (టాస్క్) ప్రాంతీయ కేంద్రాల ఏర్పాటుతో మరింత చేరువవుతోంది. వరంగల్‌లో టాస్క్ ప్రాంతీయ కేంద్రం సత్ఫలితాలనిచ్చింది. దీంతో విద్యార్థులకు, చదువు పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నవారికి తోడ్పాటు అందించే కార్యక్రమాలను విస్తృతం చేస్తోంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులను నిర్వహిస్తోంది. డిమాండ్ ఉన్న రంగాల్లో ఉద్యోగాలపై ఆసక్తి చూపుతున్న వారికి ప్రత్యేక కోర్సులను రూపొందించి అమలు చేస్తోంది.

గత అక్టోబర్‌లో టాస్క్ వరంగల్‌లో ఏర్పాటు చేసిన ప్రాంతీయ కేంద్రం పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాల విద్యార్థులతో పాటు చదువు పూర్తి చేసి ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నవారికి ఆంగ్ల భాషలో నైపుణ్యం, సాఫ్ట్‌స్కిల్స్, వృత్తి నైపుణ్యంపై శిక్షణ ఇచ్చింది. దీంతో పలువురు ఉద్యోగాలు పొందారు. పాలిటెక్నిక్, డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులు చదువు పూర్తి చేసుకోగానే ఉపాధి పొందేలా టాస్క్ ప్రత్యేక శిక్షణ ఉపయోగపడుతోంది. ఏఏ ఎడ్యుటెక్ సంస్థతో కలిసి నాలుగు బ్యాచ్‌లుగా ఇప్పటికి 180 మందికి పైగా పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆంగ్లభాషలో నైపుణ్యం, సాఫ్ట్‌స్కిల్స్ నేర్పిస్తున్నారు.



టాస్క్ ప్రాంతీయ కేంద్రంలో శిక్షణ పొందిన అభ్యర్థులు

బహుళజాతి సంస్థలతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు పొందేందుకు ఇవి దోహదపడనున్నాయి.

పరిశ్రమతో కలిసి పనిచేస్తూ

విద్యార్థులు చదువుతోపాటు పరిశ్రమతో కలిసి పనిచేసేలా వరంగల్ టాస్క్ కేంద్రం కార్యక్రమాలు అమలు చేసింది. సుమారు 220 మందికి పైగా విద్యార్థులు తొలి విడతలో శిక్షణ పొందారు. పరిశ్రమ ఎలాంటి అభ్యర్థులను కోరుకుంటోంది? విద్యార్థులు ఎలాంటి నైపుణ్యాలు సాధించాలో తెలుసుకుని, వాటిపై శిక్షణ ఇస్తున్నారు. బోధన సిబ్బంది కూడా పరిశ్రమతో కలిసి పనిచేసేలా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. బాగా డిమాండ్ ఉన్న సేల్స్ ఉద్యోగాలపై దృష్టి సారించింది. వరంగల్ కేంద్రం ద్వారా సేల్స్‌కు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో ఇక్కడ శిక్షణ పొందిన వారిలో 70 శాతం మంది ఉద్యోగాలు సాధించారు. మొదటి బ్యాచ్ పూర్తి చేసుకున్న వారికి ఐసీఐసీఐ, బాటా, బిగ్‌బజార్, కార్వీ, షాపర్స్‌స్టాప్ సహా అనేక ప్రముఖ సంస్థలు కొలువులిచ్చాయి.

జగిత్యాలలో జీఎస్టీ కోర్సు

పలు పట్టణాలను ఎంపిక చేసుకుని బీకాం చివరి సంవత్సరం విద్యార్థులకు ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టారు. జగిత్యాలలో బీకాం మూడో సంవత్సరం విద్యార్థులకు కొత్తగా అమల్లోకి వచ్చిన వస్తు,సేవల పన్ను (జీఎస్టీ)పై సర్టిఫికేషన్ కోర్సు నిర్వహించారు. జీఎస్టీ రిటర్న్‌ల దాఖలు సహా ఈ అంశానికి సంబంధించి పూర్తిగా అవగాహన కలిగించి స్వయంగా ఉపాధిని పొందేలా కోర్సును రూపొందించారు. చదువుకుంటూ సంపాదించడం లేదా చదువు పూర్తవగానే ఉపాధి పొందడం అనే లక్ష్యాలతో ఈ కోర్సులను అమలు చేస్తున్నారు.

మరింత చేరువ కావడమే లక్ష్యం

వరంగల్ ప్రాంతీయ కేంద్రం ద్వారా వచ్చిన సత్ఫలితాల నేపథ్యంలో వివిధ ప్రత్యేక శిక్షణలపై దృష్టి సారించాం. తెలంగాణలో 588 కళాశాలలు టాస్క్‌లో నమోదు చేసుకున్నాయి. 1.24 లక్షల మంది విద్యార్థులకు, 3300 మందికి పైగా బోధన సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. సిరిసిల్లలో విద్యార్థులకు జీఎస్టీ సర్టిఫికేషన్ కోర్సును నిర్వహిస్తాం. సాధ్యమైనంత ఎక్కువ మందికి చేరువవడమే లక్ష్యంగా ముందుకెళుతున్నాం. ఇంజినీరింగ్ కళాశాలల్లో మహిళా అధ్యాపకులకు నైపుణ్యం, సామర్థ్యం పెంపు తదితర అంశాలపై అవగాహన కోసం హైదరాబాద్ ఐఐటీతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

— సుజీవ్‌నాయర్, టాస్క్ సీఈఓ



ప్రేమికుల దినోత్సవం నిర్వహించొద్దంటూ హైదరాబాద్‌లోని పార్కు హోటల్‌లో భజరంగ్‌దళ్ ఆందోళనలో ధ్వంసమైన పుష్పాలంకరణ

ప్రేమికుల దినోత్సవానికి వ్యతిరేకంగా ఆందోళన

ఖైరతాబాద్, కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: ప్రేమికుల దినోత్సవం సందర్భంగా సోమాజిగూడలోని పార్కు హోటల్‌లో ఉత్సవాలు చేస్తున్నారని తెలిసి భజరంగ్‌దళ్ కార్యకర్తలు ఆందోళన చేశారు. బుధవారం రాత్రి హోటల్‌లో ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుసుకుని అక్కడ పెద్ద సంఖ్యలో కార్యకర్తలు బైఠాయించారు. పంజాగుట్ట పోలీసుల జోక్యంలో ప్రేమికుల దినం నిలిపివేస్తున్నామని మేనేజర్‌తో చెప్పడంతో భజరంగ్‌దళ్ కార్యకర్తలు శాంతించారు. మరోవైపు కేపీహెచ్‌బీలోని మంజీరమాల్‌లోని షాపర్స్ స్టాప్ దుకాణంలో బెలూన్లతో హృదయాకారంలో ఏర్పాటు చేసిన అలంకరణను భజరంగదళ్ కార్యకర్తలు ధ్వంసం చేశారు. దుకాణయజమాని ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు చెప్పారు.

ప్రేమికుల దినోత్సవ వారంలో పెరుగుతున్న గర్భధారణలు

లండన్: ప్రేమికుల దినోత్సవం గర్భధారణకు పెట్టిందిపేరని తాజా అధ్యయనం చెబుతోంది. సరిగ్గా తొమ్మిది నెలల తర్వాత స్వల్పంగా 'బుజ్జాయిల జనాభా విస్ఫోటానికి' ఇది కారణం అవుతోందని వివరిస్తోంది. బ్రిటన్‌లోని నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్‌ఎస్) నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. 2015 ఏడాదిలో జననాలను వారు విశ్లేషించారు. దీంతో ప్రేమికుల దినోత్సవ వారంలో 16,263 మంది గర్భందాలుస్తున్నట్లు గుర్తించారు. ఆ మరుసటి వారమూ 16,344 మంది కడుపు పండుతున్నట్లు గమనించారు. వారంలో సగటు గర్భధారణ (15,427) కంటే ఇది 5 శాతం ఎక్కువని కనిపెట్టారు. 'క్రిస్మస్ వారంలో మహిళలు ఎక్కువగా గర్భందాలుస్తుంటారు. ఆ తర్వాతి స్థానంలో ప్రేమికుల వారం ఉంటున్నట్లు మా పరిశోధనలో తేలింది'అని పరిశోధకులు శారా జేన్ మార్ష్ తెలిపారు.

లగేజీ స్కానర్‌లోకి దూరివెళ్లిన చైనా మహిళ!

షాంఘై: హ్యాండ్‌బ్యాగ్‌తో సహా స్కానర్‌లోకి దూరి వెళ్లిన ఓ చైనా మహిళ కథ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. హ్యాండ్‌బ్యాగ్‌లో డబ్బుంది అది పోతే ఎలా అనుకుంటూ ఆమె అతికష్టం మీద రైల్వేస్టేషన్‌లో లగేజీని తనిఖీ చేయడానికి ఉపయోగించే స్కానర్‌లోకి బ్యాగుతో సహా దూరేసిన వీడియోను ఇప్పటికే 30 లక్షల మంది వీక్షించారు. చైనాలోని రవాణా కేంద్రాల్లోనూ ఎక్స్-రే స్కానర్లుంటాయి. అందులోకి లగేజీని పంపి అవతలి వైపు నుంచి తీసుకోవాలి. అయితే, ఈ చైనా మహిళ ఎంతో కష్టపడి చిన్నపాటి ఆ ఎక్స్-రే స్కానర్ గుండా పాకుతూ అవతలి వైపునకు వెళ్లారు. డోన్‌గువాన్ రైల్వే స్టేషన్‌లో ఈ ఘటన అక్కడి సీసీ టీవీ కెమెరాల్లో నమోదైంది.

తెరాస, కాంగ్రెస్‌తో పొత్తు ప్రసక్తే లేదు: తమ్మినేని

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో తెరాస, కాంగ్రెస్ సహా ప్రధాన రాజకీయ పార్టీలతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. మహాకూటమి ఒకటి ఏర్పాటు కాబోతోందని, అందులో సీపీఎం చేరబోతోందనే ప్రచారాన్ని కొందరు చేస్తున్నారని, ఇందులో వాస్తవం లేదన్నారు. బహుజన వామపక్ష కూటమిని ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా కృషిచేస్తున్నామని చెప్పారు. రెండురోజుల పాటు జరిగిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను బుధవారం విలేకరులకు తమ్మినేని వెల్లడించారు. బహుజన వామపక్ష కూటమిని ఎలా ముందుకు తీసుకెళ్లాలనేది తమ ముందున్న కర్తవ్యమన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 22న సంగారెడ్డిలో, 25న మహబూబ్‌నగర్‌లో భారీగా సమావేశాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కోదండరాం పార్టీ ప్రకటన స్వాగతనీయమని..అయితే ఆ పార్టీ విధి విధానాలు, రాజకీయ వైఖరి, ఏ పార్టీతో పొత్తులు పెట్టుకుంటుందనే అంశాలను బట్టి తమ నిర్ణయం ఉంటుందన్నారు. ఎన్నికల నాటికి పవన్ కల్యాణ్ వైఖరిని బట్టి సీపీఎం విధానాలుంటాయని వివరించారు. సమావేశంలో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు జ్యోతి, వెంకట్, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

పురుషోత్తంరెడ్డి కేసులో ప్రజాప్రతినిధులు!

- బినామీలతో కలిసి వ్యాపారాలు
- ఆధారాలతో ప్రభుత్వానికి వివరాలు
- అనిశా కసరత్తు

ఈనాడు, హైదరాబాద్: చిన్న గుమస్తా నుంచి హెచ్ఎండీఏ సంచాలకుల స్థాయికి ఎదిగిన పురుషోత్తంరెడ్డి అవినీతి కేసులో... మరికొందరు ప్రముఖుల బండారం బయటపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీరిలో పలువురు ప్రజాప్రతినిధులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. పురుషోత్తంరెడ్డి బినామీలతో కలిసి వారు వ్యాపారాలు చేశారనీ, దీనికి సంబంధించిన దస్త్రాలను అవినీతి నిరోధకశాఖ(అనిశా) అధికారులు సేకరించారనీ తెలిసింది. ఆధారాలతో సహా వారి వివరాలను ప్రభుత్వానికి సమర్పించే యోచనలో అధికారులున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... ఒకరిద్దరు శాసనసభ్యులతో కలిసి పురుషోత్తంరెడ్డి వ్యాపార లావాదేవీలు నిర్వహించేవాడని, తనకు బినామీలుగా ఉన్న బంధువులతో పాటు వివిధ దస్త్రాల్లో వారిపేర్లు కూడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పురుషోత్తంరెడ్డికి సంబంధించిన మరికొన్ని విలువైన ఆస్తులను అధికారులు కనుగొన్నట్లు తెలుస్తోంది. అనిశా దాడులను ముందే ఊహించిన పురుషోత్తంరెడ్డి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అధికారులు మాత్రం దాడులు కొనసాగించి... ఇప్పటివరకూ దాదాపు రూ.30 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించారు. నిశాంత్‌రెడ్డి, యాదవరెడ్డిలను బినామీలుగా పెట్టుకొని పురుషోత్తంరెడ్డి కథ నడిపించాడు. స్థిరాస్తి సంస్థలను స్థాపించి, ఎడాపెడా వెంచర్లు వేశాడు. అమీర్‌పేటలో పురుషోత్తంరెడ్డికి చెందిన దాదాపు రూ.95 లక్షల విలువైన భవనాన్ని అనిశా అధికారులు కనుగొన్నారు. మార్కెట్ ధర ప్రకారం ఇది రూ.కోట్లలోనే ఉంటుంది. మొదట్లో ఇది పురుషోత్తంరెడ్డితోపాటు ఒక ప్రముఖ ప్రజాప్రతినిధి పేరుమీద ఉండేదనీ... సుమారు రెండేళ్ల క్రితం ఆ ప్రజాప్రతినిధి పేరును తొలగించి తన బినామీ యాదవరెడ్డి పేరును జతచేయించినట్లు అనిశా గుర్తించింది. ప్రస్తుతం ఈ భవనంలో ప్రముఖ వస్త్ర దుకాణం నడుస్తోంది. బినామీలు స్థాపించిన సంస్థల్లో అనేక మంది ప్రముఖులు తమ నల్లధనాన్ని పెట్టుబడిగా పెట్టి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. ఇప్పుడు వారి వివరాలను సేకరిస్తున్నారు. ఇది పూర్తవడానికి కొంత సమయం పడుతుందనీ, అప్పుడు ఎవరి వాటాలు ఎంతో తేలిపోతుందని అధికారులు చెబుతున్నారు. పురుషోత్తంరెడ్డి తన బినామీల ద్వారా మరో మూడు వెంచర్లు వేసినట్లు దర్యాప్తులో తేలిందని సమాచారం. మంచిరేవులలో రూ.30 కోట్ల విలువైన వెంచర్‌ను ఇది వరకే గుర్తించారు.

కూతురి పెళ్లికి రూ.కోటికిపైగా చెల్లింపులు

పురుషోత్తంరెడ్డి బినామీ యాదవరెడ్డి నిర్వహిస్తున్న స్థిరాస్తి సంస్థ, వియ్యంకుడు రాధాచరణ్‌రెడ్డి సంస్థలో స్వాధీనం చేసుకున్న పత్రాలను మంగళ, బుధవారాల్లో అనిశా అధికారులు పరిశీలించారు. స్థిరాస్తి సంస్థలో పురుషోత్తంరెడ్డి పెట్టుబడికి సంబంధించిన ఆధారాలు లభించాయి. మరోవైపు తన కుమార్తె పెళ్లికి సంబంధించి.. వియ్యంకుడి కార్యాలయంలో పెళ్లి ఖర్చుల చెల్లింపు కాగితాలు, నగదు లావాదేవీలను గుర్తించినట్లు సమాచారం. వివాహవేదిక, ఫోటోగ్రఫీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులకు పురుషోత్తంరెడ్డి నగదు ఇవ్వాల్సి ఉండగా... వాటిని వియ్యంకుడి ఖాతాల్లోంచి ఇప్పించినట్లు రూ.1.10 కోట్లకు రసీదులున్నాయని తెలిసింది. వీటిపై మరింత స్పష్టత కోసం వివాహవేదిక నిర్వాహకులు, ఫోటోగ్రఫీ ఏజెన్సీ ప్రతినిధుల నుంచి అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. పురుషోత్తంరెడ్డి కేసులో అరెస్టయిన బినామీలు యాదవ్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డిలను ఏసీబీ అధికారులు గురువారం కస్టడీకి తీసుకోనున్నారు. పురుషోత్తంరెడ్డి ఆర్థిక మూలాలపై మరిన్ని వివరాలు వీరి వద్ద ఉన్నాయంటూ ఏసీబీ ప్రత్యేక కోర్టును అభ్యర్థించగా, న్యాయమూర్తి అంగీకరించి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

టీవీఎస్ వినూత్న స్కూటర్

● తొలిసారి 125 సీసీ ● ధర రూ.61,450

బెంగళూరు: టీవీఎస్ మోటార్స్ సంస్థ తొలిసారిగా 125 సీసీ విభాగంలో స్కూటర్‌ను (టీవీఎస్ ఎన్‌టార్క్) ఆవిష్కరించింది. బెంగళూరులో బుధవారం కంపెనీ ప్రతినిధులు దీన్ని విడుదల చేశారు. ఎక్స్-షోరూం ధర (బెంగళూరు) రూ. 61,450లుగా నిర్ణయించారు. ప్రధానంగా యువతరాన్ని దృష్టిలో ఉంచుకొని దీన్ని ప్రత్యేకంగా రూపొందించినట్లు, సీవీటీఐ-ఆర్ఈవీవీ 3 వాల్వ్ ఇంజిన్‌తోపాటు స్మార్ట్‌కనెక్ట్ అనే బ్లూటూత్ సాంకేతిక పరిజ్ఞానం వాడినట్లు సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ప్లేస్టోర్ నుంచి ఎన్‌టార్క్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని జత చేసుకోవాలి. సంస్థ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) అనిరుధ హల్దార్ మాట్లాడుతూ 'మన దేశంలో తొలిసారిగా తయారైన బ్లూటూత్ కనెక్టెడ్ స్కూటర్ ఇది. స్మార్ట్‌కనెక్ట్ సాంకేతిక పరిజ్ఞానం వాడటం కూడా ఇదే మొదటిసారి' అని తెలిపారు. స్మార్ట్‌కనెక్ట్ సాంకేతికత పరిజ్ఞానంతో స్కూటర్ ఎక్కడికి వెళుతుందో (నావిగేషన్ సౌలభ్యం) తెలుసుకోవచ్చు. అధిక వేగాన్ని రికార్డు చేసే సదుపాయం ఇందులో ఉంది. ఫోన్ బ్యాటరీ సామర్థ్యం ఎంత ఉందో తెలుసుకొనే డిస్‌ప్లే, చివరగా స్కూటర్‌ను ఎక్కడ ఆపామో తెలుసుకొనే వెసులుబాటు, స్కూటర్‌కు సర్వీస్ ఎప్పుడు చేయించాలి? ట్రిప్ మీటర్, మల్టీరైడ్ స్టాటిస్టిక్స్‌తోపాటు. మరిన్ని ప్రయోజనాలు ఉన్నాయని సంస్థ తెలిపింది.



ఎన్‌టార్క్ స్కూటర్ ఆవిష్కరణలో పాల్గొన్న జాతీయ సేల్స్ మేనేజర్ మంత్రాలయ నిశాసన్, బ్రాండ్ మేనేజర్ మణిగోయెల్

అంత సుంకం అవసరమా..




హార్లే డేవిడ్‌సన్ బైక్‌ల విషయంలో భారత్‌పై ట్రంప్ అసంతృప్తి

వాషింగ్టన్: హార్లే డేవిడ్‌సన్, ట్రయంఫ్ బైక్‌లపై భారత్ అధిక దిగుమతి సుంకం విధిస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. ఇదే కొనసాగితే, తమ దేశంలోకి దిగుమతి అయ్యే భారతీయ బైక్‌లపైనా దిగుమతి సుంకం విధిస్తామని హెచ్చరించారు. ఉక్కు రంగంపై చట్టసభ కాంగ్రెస్ సభ్యులతో ట్రంప్ చర్చించిన సందర్భంలో ఈ ప్రస్తావన వచ్చింది. భారత్ నుంచి దిగుమతి అవుతూ వేలసంఖ్యలో విక్రయమవుతున్న మోటార్‌సైకిళ్లపై తాము పన్నే విధించని నేపథ్యంలో, అమెరికా నుంచి దిగుమతి చేసుకునే హార్లే డేవిడ్‌సన్ బైక్‌లపై కస్టమ్స్ సుంకాన్ని భారత్ ఇటీవలే 75 శాతం నుంచి 50 శాతానికి తగ్గించడం సరిపోదన్నారు. అనేక ఇతర దేశాల నుంచి వచ్చే ఉత్పత్తులపై తాము దిగుమతి సుంకం వసూలు చేస్తున్నామని, తమ ఉత్పత్తులపై ఆయా దేశాలూ పన్ను విధిస్తున్నాయని.. ఈ పరిస్థితి భారత్‌కు రాకూడదనేదే తన భావనగా ట్రంప్ పేర్కొన్నారు. దీనిపై ఇటీవలే భారత ప్రధానితో మాట్లాడటాన్ని ట్రంప్ ప్రస్తావించారు. రెండు దేశాలూ ఒకే తరహా ఉత్పత్తులపై, ఒకేరకమైన పన్నులు విధించాలనే ఆకాంక్షను ట్రంప్ వ్యక్తం చేశారు. అందుకు భిన్నంగా జరగడం న్యాయ సమ్మతం కాదని పేర్కొన్నారు. 'ఒకే రకమైన ఉత్పత్తులపై ఒకే రకంగా పన్ను ఉండటం న్యాయబద్ధం. స్వేచ్ఛా వాణిజ్యానికి అదే దర్పణం. మీరు పన్ను విధిస్తే, మేమూ విధిస్తాం. మీరు వసూలు చేయకపోతే, మేమూ అదేవిధంగా ప్రతిస్పందిస్తాం' అని ట్రంప్ తెలిపారు.

వినోద అంకురాలకు అండ

● 'యాంథిల్ స్టూడియో' ప్రారంభం ● సురేశ్ ప్రొడక్షన్స్, యాంథిల్ వెంచర్స్ జట్టు



ఈనాడు, హైదరాబాద్: వినోదం, మీడియా రంగంలో వినూత్న సాంకేతిక సొల్యూషన్లను అభివృద్ధి చేయడానికి ముందుకు వచ్చే అంకుర కంపెనీలకు హైదరాబాద్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యాంథిల్ వెంచర్స్, సురేశ్ ప్రొడక్షన్స్ మద్దతు ఇవ్వనున్నాయి. ఈ రంగంలో వినూత్న ఉత్పత్తులను అభివృద్ధి చేసే ప్రయత్నంలో ఉన్న యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం 'యాంథిల్ స్టూడియో' పేరుతో బిజినెస్ యాక్సిలిరేటర్ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. నటుడు, సినీ నిర్మాత, ఇన్వెస్టరు దగ్గుబాటి రానా, యాంథిల్ వెంచర్స్ వ్యవస్థాపకుడు వంగా ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు. చిత్ర వినోదం, టెలివిజన్, గేమింగ్, డిజిటల్ మీడియా తదితర రంగాల్లో ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చ్యువల్ రియాలిటీ (ఏఆర్, వీఆర్), కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), విజువల్ ఎఫెక్ట్స్ (వీఎఫ్ఎక్స్), రియల్ టైమ్ క్లౌడ్ రెండరింగ్, బిగ్ డేటా వంటి సాంకేతిక పరిజ్ఞానాల్లో కొత్త సొల్యూషన్లు, ఉత్పత్తులను అభివృద్ధి చేసే అంకుర కంపెనీలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తారు. 'గత 15 ఏళ్లలో సినీ నిర్మాణ వ్యాపారం భారీ మార్పునకు లోనైంది. కేవలం ఒక్క సాంకేతిక పరిజ్ఞానం వల్లే వైవిధ్యాన్ని తీసుకురాగలుగుతున్నాం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న స్టూడియోలు వీఎఫ్ఎక్స్, ఏఆర్, వీఆర్, స్ట్రీమింగ్, క్లౌడ్ టెక్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలను సమకూర్చుకుంటున్నాయి. సినిమాల నిర్మాణంలో కొత్తగా తీసుకు వచ్చే సాంకేతిక పరిజ్ఞానం ఎంత ప్రభావం చూపుతుందో కళ్లారా చూశాం. బాహుబలి, రోబో, ఈగ అరుంధతి చిత్రాలే ఇందుకు నిదర్శనాలు. మా అండతో రూపుదిద్దుకునే కొత్తతరం సాంకేతిక పరిజ్ఞానాలు వినోదం, మీడియా రంగంలో సరికొత్త మార్పును తీసుకురాగలవని భావిస్తున్నానని' రానా అన్నారు.

ఒక్కో కంపెనీకి రూ.6.5 కోట్లు!: అభివృద్ధి తొలిదశలో ఉండి.. ఎదుగుతున్న అంకుర కంపెనీల్లో యాంథిల్ వెంచర్స్ పెట్టుబడి పెడుతుంది. ప్రభావితం చేసే సొల్యూషన్లు అభివృద్ధి చేసే/చేస్తున్న మీడియా, వినోద అంకుర కంపెనీల్లో (ఒక్కొక్క దానిలో) 10 లక్షల డాలర్ల (దాదాపు రూ. 6.5 కోట్లు) పెట్టుబడులు పెట్టడానికి యాంథిల్ వెంచర్స్, దాని నెట్‌వర్క్ ఇన్వెస్టర్లు సిద్ధంగా ఉన్నారు. దగ్గుబాటి రానా, సురేశ్ ప్రొడక్షన్స్‌తో చేతులు కలిసి 'యాంథిల్ స్టూడియో'ను ప్రారంభించడం గర్వంగా ఉందని యాంథిల్ వెంచర్స్ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి వంగా ప్రసాద్ అన్నారు. 'యాక్సిలరేటర్ కార్యక్రమం ద్వారా వినోదం, మీడియా రంగ సాంకేతిక పరిజ్ఞానంలో నిష్ణాతులైన వారి మార్గదర్శనాన్ని అంకుర కంపెనీలకు అందుబాటులోకి తీసుకువస్తాం. యాంథిల్ వెంచర్స్ పెట్టబోయే 10 కోట్ల డాలర్ల నిధి మీడియా, వినోద పరిశ్రమలోని అంకురాలపై ప్రత్యేక దృష్టి పెడుతుందన్నా'రు. యాంథిల్స్ స్టూడియో యాక్సిలిరేటర్ కార్యక్రమం కాల పరిమితి 3 నెలలు. ప్రపంచ వ్యాప్తంగా వినోద రంగంలోని అంకుర కంపెనీలు కొత్త సాంకేతిక పరిజ్ఞానాలు, సొల్యూషన్లు అభివృద్ధి చేయడానికి అన్ని విధాల అండగా నిలుస్తుంది.

జాతీయ పింఛను పథకంపై ఆ ప్రభావం లేదు

దీర్ఘకాల మూలధన లాభాల పన్నుపై పీఎఫ్‌ఆర్‌డీఏ ఛైర్మన్ హేమంత్ కాంట్రాక్టర్

కోల్‌కతా: జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్)పై దీర్ఘకాల మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ) ప్రభావం పెద్దగా ఉండదని పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి సంస్థ (పీఎఫ్‌ఆర్‌డీఏ) ఛైర్మన్ హేమంత్ కాంట్రాక్టర్ తెలిపారు. 'ఎన్‌పీఎస్‌లో పెట్టుబడులు ఎన్‌పీఎస్ ట్రస్ట్ ద్వారా పెడుతున్నాం. ఆ ట్రస్టుకు పన్ను మినహాయింపులు ఉన్నాయి. అందువల్ల పింఛను పెట్టుబడులకు సంబంధించి ఎల్‌టీసీజీ ఆందోళన అవసరం లేదు' అని వివరించారు. అయితే పింఛనేతర ఖాతాలపై ఆ ప్రభావం ఉంటుంది కానీ, ఇందులో కార్పస్ చాలా తక్కువ ఉంటుందని తెలిపారు.

- ✦ ఎన్‌పీఎస్‌లో 2 కోట్ల మంది చందాదార్లుండగా, మొత్తం కార్పస్ రూ. 2.25 లక్షల కోట్లుగా ఉంది. ఏడాదికి చందాదార్ల సంఖ్య 27-28 శాతం చొప్పున పెరుగుతోంది. గత మార్చిలో చందాదార్ల సంఖ్య 1.54 కోట్లు కాగా, ఇప్పుడు 2 కోట్లకు చేరింది.
- ✦ పీఎఫ్‌ఆర్‌డీఏ నిర్వహిస్తున్న ఆస్తుల విలువ కూడా వచ్చే ఏడాది 45-47 శాతం పెరుగుతుందని సంస్థ అంచనా వేస్తోంది.
- ✦ అటల్ పెన్షన్ యోజన కింద 88 లక్షల మంది చందాదార్ల నుంచి రూ. 4,000 కోట్ల మొత్తం ఉంది. మార్చి 31 నాటికి చందాదార్ల సంఖ్య కోటికి చేరుతుందని సంస్థ ఆశిస్తోంది.

ఎంసీఎల్ఆర్‌ను తగ్గించిన ఆంధ్రా బ్యాంకు

ఈనాడు, హైదరాబాద్: రుణాల వడ్డీ రేట్లకు సంబంధించిన మార్జినల్ కాస్ట్ లెడింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను ఆంధ్రా బ్యాంకు తగ్గించింది. ఒకరోజు వ్యవధి రుణాల వడ్డీ రేటు 15 బేసిస్ పాయింట్లు తగ్గి, 8.00 శాతం నుంచి 7.85 శాతానికి చేరింది. నెలవారీ ఎంసీఎల్ఆర్ 8.05% నుంచి 7.95% చేరింది. ఈ సవరణలు ఫిబ్రవరి 15 నుంచి వర్తిస్తాయని ఒక ప్రకటనలో పేర్కొంది. 3, 6 నెలలు, ఏడాది కాలానికి సంబంధించిన ఎంసీఎల్ఆర్‌కు ఎలాంటి మార్పులూ చేయలేదు. ప్రస్తుతం ఏడాది వ్యవధి ఎంసీఎల్ఆర్ 8.40శాతంగా ఉంది.

ఆసుపత్రుల్లో అందించే ఆహారానికి జీఎస్‌టీ లేదు

దిల్లీ: ఆసుపత్రుల్లో చేరిన రోగులకు(ఇన్ పేషంట్స్) సదరు ఆసుపత్రులు అందించే ఆహారంపై జీఎస్‌టీని వసూలు చేయమని ప్రభుత్వం తెలిపింది. అయితే ఆసుపత్రుల్లో చేరని రోగులు మాత్రం మొత్తం ఆహారం విలువపై పన్ను చెల్లించాల్సి ఉంటుందని రెవెన్యూ విభాగం ఒక ప్రశ్నోత్తరావళి(ఎఫ్ఏక్యూ)లో స్పష్టం చేసింది. అదే సమయంలో సీనియర్ డాక్టర్లు/కన్సల్టెంట్లు/సాంకేతిక నిపుణులు అందించే సేవలపైనా జీఎస్‌టీ విధించమని తెలిపింది. ఆసుపత్రుల్లో ఇన్ పేషంట్లకు అందించే ఆహారంపై ప్రత్యేకంగా పన్ను వేయలేమని.. ఎందుకంటే అది సంవిధాన ఆరోగ్య సంరక్షణ కిందకు వస్తుందని వివరించింది.

మొండి ఘటాలు.. తలొగ్గాల్సిందే..

- ● ఆర్‌బీఐ కొత్త నియమావళి నేపథ్యం
- ● బకాయిలను బ్యాంకులూ దాచిపెట్టలేవు
- ● నిరర్థక ఆస్తులపై సత్వర పరిష్కారం దిశగా చర్యలు
- ● కలిసొస్తున్న ప్రభుత్వ మూలధన ప్రణాళికలు



భారత బ్యాంకింగ్ వ్యవస్థను గత కొన్నేళ్లుగా మొండి బకాయిలు పట్టిపీడిస్తున్నాయి. ఆర్థిక సంక్షోభం తర్వాత కంపెనీల పరిస్థితి పూర్తిగా దిగజారడంతో అవి బకాయిలు కట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఆ తర్వాత కూడా అవి బాగుపడాలని మళ్లీ రుణాలు ఇచ్చిన బ్యాంకులు.. ఇపుడు ఇబ్బందుల్లో పడ్డాయి. ఇటీవల దివాలా స్మృతిని అమలు చేసిన అనంతరం నిరర్థక ఆస్తుల విషయంలో కొద్దిగా మార్పు కనబడుతోంది. తాజాగా సోమవారం ఆర్‌బీఐ పలు కఠిన నిబంధనలను జారీ చేసింది. వీటితో మొండి బకాయిలకు ముకుతాడు పడుతుందా అన్నది ఇపుడు జగమొండి ప్రశ్న.

ఈనాడు వాణిజ్య విభాగం

కొంత ఆలస్యమైనా ఆర్‌బీఐ మంచి పనే చేసింది. పేరుకుపోతున్న మొండి బకాయిలు బ్యాంకులకే కాదు.. ఆర్థిక వ్యవస్థకూ గుదిబండేనని గుర్తించింది. ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా నిరర్థక ఆస్తుల(ఎన్‌పీఏ) సమస్యకు పరిష్కారం చూడకపోతే పరిస్థితి చేయిదాటి పోతుందని గ్రహించింది. అందుకే కఠిన నిబంధనలను జారీ చేసింది. ఈ నిబంధనల వల్ల బ్యాంకులు నిరర్థక ఆస్తులను బయటపెట్టకుండా దాచిపెట్టలేవు. ఎస్‌బీఐ తన త్రైమాసిక ఫలితాల్లో.. అదనపు మొండి బకాయిలున్నట్లు ప్రకటించిన సమయంలోనే కొత్త నియమావళి అమల్లోకి రావడాన్ని మార్కెట్ వర్గాలు ఆసక్తిగా చర్చించుకుంటున్నాయి.

ఏంటీ ఎన్‌పీఏ

ఆర్‌బీఐ నిబంధనలు సమస్యను ఎలా గట్టెక్కిస్తాయని తెలుసుకోవడానికి ముందు మొండి బకాయిలంటే ఏమిటో తెలుసుకుందాం. ఏదైనా బకాయి 90 రోజులు అంత కంటే ఎక్కువ రోజుల పాటు చెల్లించకుండా ఉంటే దానిని నిరర్థక ఆస్తి లేదా ఎన్‌పీఏగా పరిగణిస్తారు. అంటే మీరు రుణం తీసుకున్న అనంతరం నిర్దిష్ట సమయంలో అసలు లేదా వడ్డీని చెల్లించకపోతే ఎన్‌పీఏలు ఎక్కువవుతాయన్నమాట. రుణం తీసుకున్న వ్యక్తి ఆ రుణాన్ని చెల్లించలేని/ చెల్లించని పరిస్థితి తలెత్తితే తనఖా పెట్టిన ఆస్తిని నగదీకరించుకుంటారు. కానీ ఆ తనఖా పెట్టిన ఆస్తిని విక్రయించినా బ్యాంకుకు సరైన విలువ దక్కని పక్షంలో ఆ ఎన్‌పీఏను మొండి బకాయి లేదా మొండి ఆస్తిగా పరిగణిస్తారు.

కొత్త నిబంధనలు ఎందుకంటే..

ఈ మొండి బకాయిల సమస్య పరిష్కారానికి రఘురామ్ రాజన్ హయాంలో కొన్ని పథకాలను ఆర్‌బీఐ ప్రవేశపెట్టింది. అవే కార్పొరేట్ రుణ పునర్నిర్మాణం(సీడీఆర్), వ్యూహాత్మక రుణ పునర్నిర్మాణం(ఎస్‌డీఆర్), సస్టెయినబుల్ స్ట్రక్చరింగ్ ఆఫ్ స్ట్రెస్డ్ అసెట్స్(ఎస్4ఏ). ఈ పథకాల ద్వారా బ్యాంకులు ఆ మొండి బకాయిల ద్వారా వచ్చే నష్టాన్ని (బకాయిలో నుంచి తనఖా పెట్టిన ఆస్తి విలువను తీసివేయగా వచ్చేది) భరించొచ్చన్న మాట. కానీ అది కూడా బ్యాంకులకు భారంగానే పరిణమించడంతో ప్రభుత్వం దివాలా చట్టాన్ని తీసుకొచ్చింది. ఇప్పటికే ఈ దివాలా చట్టం సమర్థంగా పనిచేయడం ప్రారంభించింది కూడా.

కొన్ని పెద్ద ఖాతాలు(ఆర్‌బీఐ సిఫారసు చేసినవి) ఇపుడు దివాలా ట్రైబ్యునల్ పరిశీలనలో ఉన్నాయి. త్వరలోనే అవి కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. అయితే పైన మనం చెప్పుకున్న ఆ పథకాలు రుణ స్వీకర్తలకు కొంత వెసులుబాటును కల్పిస్తున్నట్లుగా అనిపించడంతో కొత్త నిబంధనలను ప్రవేశపెట్టింది.

ఇపుడు ఏమవుతుందంటే..

ఈ నిబంధనల కింద పైన పేర్కొన్న పథకాలన్నీ రద్దవుతాయి. దీని స్థానంలోనే అత్యంత నియమావళిని ప్రవేశపెట్టారు. రూ. 2000 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ రుణాల బకాయిలు అందకపోతే 180 రోజుల్లోగా పరిష్కార ప్రణాళిక అమలు జరగాలి. లేదంటే.. 15 రోజుల్లోగా దివాలా ప్రక్రియను మొదలుపెట్టాలి. ఒక వేళ ఆర్‌బీఐ మార్గదర్శకాలను పాటించడంలో విఫలమైతే బ్యాంకులు అపరాధరుసములను ఎదుర్కోవాల్సి వస్తుంది.

పెద్ద ఖాతాల పనితీరుపైనా పర్యవేక్షణ

రూ. 5 కోట్ల కంటే ఎక్కువ రుణం తీసుకున్న వారి విషయంలో వారం వారీ నివేదికలు సమర్పించాలి. ఒక వేళ ఎగవేత జరిగితే బ్యాంకులు 180 రోజుల్లోగా ఒక పరిష్కార ప్రణాళికతో రావాలి. అప్పటికీ ప్రయోజనం లేకుండా.. 15 రోజుల్లోగా ఆ ఖాతాను దివాలా స్మృతి(ఐబీసీ)కి సిఫారసు చేయాలి. అన్ని బ్యాంకులు ఏప్రిల్ 1, 2018 నుంచి నెలవారీ పద్ధతిన తమ నివేదికలను సెంట్రల్ రిపాజిటరీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఆన్ లార్జ్ క్రెడిట్స్(సీఆర్ఐఎల్‌సీ)కు సమర్పించాల్సి ఉంటుంది. ఇక వారంవారీ నివేదిక(రూ. 5 కోట్లు అంత కంటే ఎక్కువ)ల్లో తొలి నివేదికను ఫిబ్రవరి 23, 2018తో ముగిసిన వారానికి దాఖలు చేయాలి. రూ. 2000 కోట్లు అంత కంటే ఎక్కువ రుణాల విషయానికొస్తే పరిష్కార ప్రణాళికను 180 రోజుల్లోగా అమలు చేయాలి.

పరిష్కారం దిశగా..

ఓ వైపు ఆర్‌బీఐ కొత్త పంథా ద్వారా మొండి బకాయిలకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపడానికి ప్రయత్నిస్తుండడం.. మరో వైపు ప్రభుత్వం సైతం బ్యాంకులకు ఇప్పటికే మూలధన పునర్నిర్మాణ పథకాన్ని(రీక్యాపిటలైజేషన్) ప్రకటించడం కూడా బ్యాంకింగ్ వ్యవస్థకు మంచిచేసేదేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఇదీ మన 'మొండి'తనం

- ✦ సెప్టెంబరు 2017 నాటికి భారత బ్యాంకుల్లో మొత్తం స్థూల నికర నిరర్థక ఆస్తులు రూ. 9 లక్షల కోట్లకు చేరాయి.
- ✦ రూ. 2000 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ బకాయిలున్న 50 పెద్ద ఖాతాల రుణాలే రూ. 2.5 లక్షల కోట్లుగా ఉన్నాయి.
- ✦ గతేడాది అక్టోబరులో రూ. 2.1 లక్షల కోట్ల మూలధన పునర్నిర్మాణ ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించింది. రెండేళ్లలో అంటే 2017-18, 2018-19 ఏడాదుల్లో ఈ ప్రణాళికను అమలు చేస్తారు.
- ✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 20 ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లకు రూ. 88,139 కోట్ల అదనపు మూలధనాన్ని ప్రభుత్వం ఇవ్వనుంది.



షియోమి నుంచి ఎంఐ ఎల్ఈడీ టీవీ

55 అంగుళాల తెర.. ధర రూ.39,999

దిల్లీ: షియోమి సంస్థ చైనా విపణి తరవాత తొలిసారిగా భారత్‌లోనే 'ఎంఐ ఎల్ఈడీ టీవీ 4'ను పరిచయం చేస్తోంది. బుధవారం దీన్ని ఆవిష్కరించింది. ఈ నెల 22 నుంచి ఫ్లిప్‌కార్ట్, ఎంఐ.కామ్ ద్వారా ఆన్‌లైన్‌లో, ఎంఐ హోమ్స్ స్టోర్లలోనూ అందుబాటులో ఉంటుందని సంస్థ పేర్కొంది. 55 అంగుళాల తెర ఉన్న ఎంఐ టీవీ ధరను రూ. 39,999లుగా నిర్ణయించారు. షియోమి ఇండియా ఎండీ మను జైన్ మాట్లాడుతూ 'స్మార్ట్ ఫోన్ల తరవాత టీవీలకు భారత్‌లో మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం చైనా నుంచి వీటిని దిగుమతి చేస్తున్నాం. మాతో కలిసి నాణ్యమైన టీవీల తయారీకి ఇక్కడ ఎవరైనా ముందుకొస్తే ఇక్కడే తయారీ ప్రారంభిస్తాం. 2-3 ఏళ్ల కిందట స్మార్ట్ ఫోన్లకు ఇక్కడ ఎలాంటి డిమాండ్ ఉండేదో ఇప్పుడు టీవీలకు అలాగే ఉంది. పది శాతం టీవీలు మాత్రమే ఆన్‌లైన్‌లో కొంటున్నారు. అందులోనూ స్మార్ట్ టీవీలు కొనేది చాలా తక్కువ. త్వరలోనే మా వ్యాపారాన్ని ఇక్కడ విస్తరిస్తాం' అన్నారు. స్మార్ట్ టీవీతోపాటు రెడ్‌మి నోట్ 5, రెడ్‌మి నోట్ 5 ప్రో స్మార్ట్ ఫోన్లను కూడా బుధవారం ఆవిష్కరించారు.

జెట్ ఎయిర్‌వేస్ నిరాశాజనకం

దిల్లీ: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్ స్టాండలోన్ ప్రాతిపదికన రూ. 165.25 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ. 305.20 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అధిక వ్యయాలు లాభంపై ప్రభావం చూపాయని కంపెనీ తెలిపింది. అయితే మొత్తం ఆదాయం మాత్రం రూ. 5,940.63 కోట్ల నుంచి రూ. 6,349.34 కోట్లకు పెరిగింది. ఇక మొత్తం వ్యయాలు సైతం రూ. 5,635.43 కోట్ల నుంచి రూ. 6,184.09 కోట్లకు చేరాయి. విదేశీ మారకం హెచ్చు తగ్గుల ద్వారా రూ. 141.51 కోట్ల లాభం వచ్చిందని కంపెనీ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో విదేశీ మారకం రూపేణా రూ. 190.25 కోట్ల నష్టం వాటిల్లింది. విమానాల లీజు సహా కార్యకలాపాల ఆదాయం రూ. 127.82 కోట్ల నుంచి రూ. 8.36 కోట్లకు తగ్గింది.

బీఎస్ఈలో షేరు 2.17 శాతం నష్టంతో రూ.803.45 వద్ద ముగిసింది.

భవిష్యత్తు ఉపాధికి దిక్సూచి

● అంకుర సంస్థల ప్రోత్సాహమే అజెండా ● ప్రపంచ ఐటీ కాంగ్రెస్‌పై పెగా సిస్టమ్స్ ఎండీ సుమన్‌రెడ్డి



ఈనాడు - హైదరాబాద్

సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చే మార్పులకు అనుగుణంగా ఉద్భవించే కొత్త ఉద్యోగాలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సు వేదికగా నిలుస్తుందని ఆ సదస్సు కోర్‌కమిటీ సభ్యుడు, పెగా సిస్టమ్స్ ఎండీ (ఇండియా) ఎడునూరి సుమన్‌రెడ్డి తెలిపారు. ఐటీ పరిశ్రమలు, అధికారులు, వ్యాపారవేత్తలు, నియంత్రణ సంస్థలు, విద్యావేత్తలంతా ఒకే వేదికపైకి వచ్చి చర్చలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రపంచ ఐటీ సమాఖ్యలోని 40 దేశాల నుంచి దాదాపు 2,500 మంది ప్రతినిధులు వచ్చే అవకాశముందని వెల్లడించారు. ఈనెల 19 నుంచి 21 వరకు మూడురోజుల పాటు జరిగే ప్లీనరీల్లో నూతన టెక్నాలజీతో వ్యాపారాల్లో జరిగే మార్పులు, బ్లాక్‌చైన్, క్రిప్టోకరెన్సీ లాంటి విషయాలు చర్చకు వస్తాయని ప్రకటించారు. సదస్సు వేదికగా ఇంటింటికీ ఇంటర్నెట్ అందించే 'టీ-ఫైబర్' పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సు సందర్భంగా ఆయన 'ఈనాడు-ఈటీవీ'తో మాట్లాడారు. ముఖ్యాంశాలివి..

- ✦ సదస్సులో స్మార్ట్‌సిటీ, భద్రత, నూతన టెక్నాలజీలు, స్టార్టప్‌రంగం ఈ నాలుగు అంశాలు ప్రధానంగా ఉన్నాయి. నగరాలను స్మార్ట్‌గా తీర్చిదిద్దేందుకు అందుబాటులోని టెక్నాలజీలు తెలుసుకోవచ్చు. సైబర్ సెక్యూరిటీ - ప్రజల భద్రత కీలకం కానుంది. భవిష్యత్తు టెక్నాలజీలైన ఏఐ, వీఎక్స్, బ్లాక్‌చైన్, క్లౌడ్ తదితరాల గురించి వ్యాపార, సాంకేతిక నిపుణులు, విద్యావేత్తలు చర్చలు నిర్వహిస్తారు. ఇక స్టార్టప్‌లను ప్రోత్సహించడం, సవాళ్లను అధిగమించడం అంశాలు చర్చకువస్తాయి.
- ✦ సదస్సుకు ఫార్చ్యూన్-500 కంపెనీల సీఈవోలు, ప్రతినిధులు హాజరవుతారు. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై కృషిచేసిన డాక్టర్ ఆండ్రూ వస్తున్నారు. సోఫియా రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.
- ✦ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు మూడురోజుల సదస్సుతో పాటు నగర పర్యటనలు ఉన్నాయి. ప్యాలెస్ టూర్లు, పాతబస్తీ మెరుపులు, రామోజీ ఫిల్మ్‌సిటీ పర్యటన, టీహబ్, ఐఎస్‌బీ టూర్లు ఏర్పాటు చేశాము. తద్వారా ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలమైన వాతావరణం ఉన్నట్లు కంపెనీల సీఈవోలు భావిస్తారు.
- ✦ అంకురసంస్థలు భవిష్యత్తుకు కీలకం. మౌలిక సదుపాయాలు ఎక్కడున్నాయి? నియంత్రణ సంస్థల సహకారం, నిధుల సమీకరణ, ఆర్థిక సహాయం తదితర అంశాలపై అవగాహన లభిస్తుంది. ఏఐ ఆధారంగా ఎలాంటి ఉద్యోగాలు వస్తాయి? ఎలా సంసిద్ధత కావాలన్న విషయాలపై సదస్సులో మాట్లాడుతారు. విద్యావేత్తలు రానున్న రెండేళ్లలో విద్యార్థులను ఆ మేరకు తీర్చిదిద్దాల్సిన అవసరముంది.

సెన్సెక్స్ ▼145 **34156**

నిఫ్టీ ▼39 **10501**

రూపాయి 64.09 ▲ (ఒక అమెరికా డాలరుకు) 23 పైసలు

బంగారం 30360 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 285

వెండి 38185 ▲ ముంబయిలో కిలో రూ.లలో 260

ముడి చమురు 63.16 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	24,768	+127
నాస్‌డాక్	7,110	+96
నిక్కీ 225 (జపాన్)	21,154	−91
హాంగ్‌సెంగ్ (హాంకాంగ్)	30,516	+676
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,403	−12
షాంఘై(చైనా)	3,199	+14
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,214	+46
డాక్స్ (జర్మనీ)	12,339	+142

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.34	67.65
పౌండ్ స్టెర్లింగ్	81.17	94.15
యూరో	72.27	83.81
జపనీస్ యెన్/100	54.47	63.18
ఆస్ట్రేలియా డాలరు	46.02	54.07
సింగపూర్ డాలరు	44.23	52.41
థాయ్ బాత్/100	186.1	222.59
బహ్రెయిన్ దీనార్	158.00	181.06
కువైట్ దీనార్	176.66	219.92
ఒమన్ రియాల్	154.72	177.01
సౌదీ రియాల్	15.51	18.39
యూఏఈ దిర్హమ్	15.88	18.56
మలేషియా రింగిట్	14.54	18.39

బుధవారం నిఫ్టీ కదలికలు



జీఎంఆర్ ఇన్‌ఫ్రా నష్టం రూ.566 కోట్లు

భారంగా మారిన విద్యుత్ వ్యాపారం!

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏకీకృత ప్రాతిపదికన రూ.565.94 కోట్ల నికర నష్టాన్ని చవి చూసింది. ఏడాది క్రితం ఇదే కాలంలో రూ.643.44 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2017, సెప్టెంబరుతో ముగిసిన మూడు నెలల నష్టం రూ.404.46 కోట్లతో పోలిస్తే మూడో త్రైమాసికానికి నష్టం మరింతగా పెరిగింది. సమీక్ష త్రైమాసికానికి మొత్తం ఆదాయం రూ.2,587.26 కోట్ల నుంచి రూ.2,295.83 కోట్లకు తగ్గినట్లు కంపెనీ వెల్లడించింది. విభాగాల వారీగా 2017, డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి విమానాశ్రయాల వ్యాపారం ఆదాయం రూ.1,142 కోట్లు, విద్యుత్ విభాగం ఆదాయం రూ.430.54 కోట్లు, ఈపీసీ ప్రాజెక్టుల ఆదాయం రూ.305 కోట్లు, రహదారుల ఆదాయం రూ.148 కోట్ల మేరకు ఉన్నాయి. సమీక్ష త్రైమాసికంలో పన్ను చెల్లింపులకు ముందు విమానాశ్రయాల విభాగం లాభం రూ.371.63 కోట్లు ఉంటే.. విద్యుత్ వ్యాపారంలో రూ.479.20 కోట్ల నష్టాన్ని చవి చూసింది. రెండో త్రైమాసికంతో పోలిస్తే కంపెనీ మొత్తం ఏకీకృత నష్టం పెరగడానికి విద్యుత్ వ్యాపారంలో భారీ నష్టమే కారణంగా కనిపిస్తోంది. 2017, సెప్టెంబరుతో ముగిసిన మూడు నెలల్లో ఈ వ్యాపారంలో నష్టం రూ.207.57 కోట్ల మేరకు ఉంది.

తొమ్మిది నెలలకు: 2017, డిసెంబరుతో ముగిసిన ఏకీకృత ప్రాతిపదికన రూ.7,058.42 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.1,107 కోట్ల నష్టాన్ని కంపెనీ చవి చూసింది. ఏడాది క్రితం ఇదే కాలంలో ఆదాయం రూ.7,135 కోట్లు, నష్టం రూ.485 కోట్ల మేరకు ఉన్నాయి.

శంషాబాద్ విమానాశ్రయం ప్రయాణికుల వృద్ధి 18%

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలలకు హైదరాబాద్ (శంషాబాద్) విమానాశ్రయం నికర లాభం 71% వృద్ధితో రూ.419 కోట్లకు చేరింది. విస్తరణ ప్రణాళికలకు అవసరమైన నిధుల కోసం ఇటీవల శంషాబాద్ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ కంపెనీ అంతర్జాతీయ బాండ్ల ద్వారా 35కోట్ల డాలర్లను సమీకరించింది. కంపెనీలో వాటాను 63% నుంచి 74 శాతానికి పెంచుకోవడానికి మలేషియా ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్, దాని అనుబంధ సంస్థతో జీఎంఆర్ ఒప్పందం కుదుర్చుకుంది. సమీక్ష కాలానికి హైదరాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీ 18% పెరిగి 1.12 కోట్ల నుంచి 1.33 కోట్ల మందికి చేరింది.

సన్‌ఫార్మాకు అమెరికా సెగ

● లాభంలో 75% క్షీణత



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఔషధ దిగ్గజం సన్‌ఫార్మా ఏకీకృత ప్రాతిపదికన రూ.365.39 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ నమోదు చేసిన రూ.1,471.82 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 75 శాతం తక్కువ. అమెరికా పన్ను రేట్లలో మార్పులకు సంబంధించి సర్దుబాట్ల కోసం రూ.513 కోట్లు వెచ్చించడం ప్రభావం చూపిందని కంపెనీ తెలిపింది. ఇక మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.7,925.11 కోట్ల నుంచి రూ.6,653.23 కోట్లకు తగ్గింది. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రథమార్థంతో పోలిస్తే.. మూడో త్రైమాసికంలో లాభదాయకత మెరుగుపరుచుకున్నాం. అమెరికా జనరిక్ ధరల పోటీ పరిస్థితుల్లోనూ రాణించాం' అని సన్ ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ దిలీప్ సంఘ్వీ పేర్కొన్నారు. సమీక్షిస్తున్న త్రైమాసికంలో అమెరికా విపణిలో అమ్మకాలు 35 శాతం తగ్గి 328 మిలియన్ డాలర్లకు చేరాయి. మొత్తం అమ్మకాల్లో వీటి వాటా 32 శాతం. అమెరికా జనరిక్ విపణిలో ధరల పోటీ వల్లే అమ్మకాలు తగ్గాయని సంఘ్వీ తెలిపారు. భారత్‌లో చూస్తే.. బ్రాండెడ్ ఫార్ములేషన్ల అమ్మకాలు 6 శాతం పెరిగి రూ.2,085 కోట్లకు చేరాయని, మొత్తం అమ్మకాల్లో ఇవి 32 శాతానికి సమానమని కంపెనీ వెల్లడించింది. గత త్రైమాసికంలో వర్ధమాన విపణుల్లో అమ్మకాలు 10 శాతం అధికమై 189 మిలియన్ డాలర్లకు పెరిగాయని వివరించింది.

★ అపోలో హాస్పిటల్స్

ఈనాడు, హైదరాబాద్: అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ లాభం తగ్గింది. ఏడాది క్రితం ఇదే కాలంతో పోలిస్తే 2017, డిసెంబరుతో ముగిసిన మూడు నెలలకు 7.4% తగ్గి రూ.72.83 కోట్ల నుంచి రూ.67.44 కోట్లకు చేరిందని కంపెనీ తెలిపింది. వ్యయాలు పెరగడం నికర లాభం తగ్గడానికి కారణంగా కనిపిస్తోంది. సమీక్ష త్రైమాసికానికి మొత్తం ఆదాయం రూ.1,683.69 కోట్ల నుంచి రూ.1,904 కోట్లకు పెరిగింది. తొమ్మిది నెలలకు రూ.5,438.99 కోట్ల ఆదాయాన్ని ఆర్జించగా.. నికర లాభం రూ.173.53 కోట్లుంది.

★ ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్ రూ.426.22 కోట్ల నష్టాన్ని చవి చూసింది. ఏడాది క్రితం ఇదే కాలంలో రూ.388.52 కోట్లు ఉన్నట్లు కంపెనీ తెలిపింది. ఇదే త్రైమాసికానికి ఆదాయం రూ.238.62 కోట్ల నుంచి రూ.17.82 కోట్లకు పరిమితమైంది. తొమ్మిది నెలల ఆదాయం రూ.293.77 కోట్లు ఉందని, నికర నష్టం రూ.2,693 కోట్లని ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్ వెల్లడించింది.

★ గ్రాసిమ్ ఇండస్ట్రీస్

దిల్లీ: గ్రాసిమ్ ఇండస్ట్రీస్ అక్టోబరు- డిసెంబరుకు రూ.786.87 కోట్ల నికర లాభం ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలానికి రూ.952.33 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఆదాయం రూ.9,743.51 కోట్ల నుంచి రూ.15,523.75 కోట్లకు పెరిగింది. అధిక వ్యయాలు, అనుబంధ సంస్థల నుంచి వచ్చిన నష్టంతో లాభం ఏడాది క్రితం త్రైమాసికంతో పోలిస్తే తగ్గిందని సంస్థ వెల్లడించింది. ఆదిత్య బిర్లా నువో విలీనంతోపాటు జేపీ సిమెంట్‌ను అనుబంధ సంస్థ అయిన అల్ట్రాటెక్ సిమెంట్ గత ఏడాది కొనుగోలు చేయడంతో అప్పటి ఫలితాలతో తాజా ఫలితాల్ని పోల్చి చూడలేమని కంపెనీ పేర్కొంది. జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఆదాయాన్ని కూడా పోల్చలేమని సంస్థ తెలిపింది.

జీవీకే పవర్ లాభం రూ.11 కోట్లు

3 అనుబంధ సంస్థల విక్రయానికి ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.10.94 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో రూ.71 లక్షల నష్టం ఉన్నట్లు కంపెనీ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.18.42 కోట్ల నుంచి రూ.21.34 కోట్లకు పెరిగింది. 2017-18 తొలి తొమ్మిది నెలలకు రూ.63.92 కోట్ల ఆదాయంపై రూ.59.22 కోట్ల నికర నష్టాన్ని చవి చూసింది. అనుబంధ కంపెనీలైన గోరిగంగా హైడ్రో పవర్, జీవీకే అయిల్ అండ్ గ్యాస్, జీవీకే ఎనర్జీ వెంచర్స్‌ను అనఘా కన్‌స్ట్రక్షన్, వికిషా కన్‌స్ట్రక్షన్ కంపెనీలకు విక్రయించనుంది. మొత్తం వాటాను ఈ కంపెనీలు కొనుగోలు చేయనున్నాయని, వీటితో వాటా కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకున్నామని జీవీకే తెలిపింది. మార్చి చివరి నాటికి గోరిగంగా హైడ్రో పవర్ నికర విలువ రూ.35.26 లక్షలు, జీవీకే అయిల్ అండ్ గ్యాస్ నికర విలువ రూ.7.54 కోట్లు ఉన్నట్లు తెలిపింది.


ఎన్‌సీసీ లాభం రూ.100 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: అక్టోబరు- డిసెంబరులో ఎన్‌సీసీ కంపెనీ స్టాండ్‌అలోన్ ప్రాతిపదికన రూ.100.36 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.58.27 కోట్లతో పోలిస్తే 72 శాతం పెరిగిందని కంపెనీ వెల్లడించింది. షేరుకు ఆర్జన (ఈపీఎస్) కూడా రూ.1.05 నుంచి రూ.1.81 చేరింది. మొత్తం ఆదాయం రూ.1,943 కోట్ల నుంచి రూ.1,879 కోట్లకు తగ్గింది. 2017, డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు రూ.5,256 కోట్ల టర్నోవరుపై రూ.184.09 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో మొత్తం ఆదాయం రూ.5,846 కోట్లు, నికర లాభం రూ.161.79 కోట్లు ఉందని కంపెనీ వెల్లడించింది. వివిధ విభాగాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలలకు కంపెనీ రూ.21,614 కోట్ల విలువైన పనులను సంపాదించింది. దీంతో చేతిలో మొత్తం రూ.31,627 కోట్ల విలువైన పనులు ఉన్నాయి.

బ్యాంకింగ్ షేర్లు ముంచేశాయ్

ఆర్‌బీఐ నిబంధనల ప్రభావం ● సెన్సెక్స్‌కు 145 పాయింట్ల నష్టం

సమీక్ష



సూచీల లాభాలకు బ్యాంకింగ్ షేర్లు అడ్డుపడ్డాయి. మొండి బకాయిల పరిష్కారానికి ఆర్‌బీఐ నిబంధనలు కఠినతరం చేయడం, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు చెందిన ఒక శాఖలో 1.77 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.11,335 కోట్లు) మోసపూరిత లావాదేవీలు వెలుగుచూడటమే ఇందుకు నేపథ్యం. ఫలితంగా బ్యాంక్ షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తడంతో మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. పీఎన్‌బీ షేరు అత్యధికంగా 10% నష్టపోయింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా షేర్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సానుకూల అంతర్జాతీయ సంకేతాల దన్నుతో సెన్సెక్స్ ఉదయం 34436.98 పాయింట్ల వద్ద మెరుగ్గానే ప్రారంభమైంది. అదే జోరును కొనసాగిస్తూ.. ఇంట్రాడేలో 34,473.43 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది. అనంతరం చివరి గంటన్నర ట్రేడింగ్‌లో లాభాల స్వీకరణతో నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఇంట్రాడేలో 34,028.68 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 144.52 పాయింట్లు కోల్పోయి 34,155.95 దగ్గర స్థిరపడింది. ఇక నిఫ్టీ సైతం 38.85 పాయింట్ల నష్టంతో 10,500.90 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 10,456.65- 10,590.55 మధ్య కదలాడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 18 నష్టాలు చవిచూశాయి. యెస్ బ్యాంక్ 4.40%, ఎస్‌బీఐ 4.06%, యాక్సిస్ బ్యాంక్ 3.35%, ఓఎన్‌జీసీ 2.62%, సన్‌ఫార్మా 2.53%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.29%, టీసీఎస్ 1.94%, పవర్‌గ్రిడ్ 1.31%, ఎన్‌టీపీసీ 1.18%, ఐటీసీ 1.15%, మారుతీ సుజుకీ 1.06% చొప్పున డీలాపడ్డాయి. కోల్ ఇండియా 2.47%, భారతీ ఎయిర్‌టెల్ 2.39%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.94%, విప్రో 1.77% మాత్రం రాణించాయి.

నేటి మార్కెట్

సూచీల నష్టాలు కొనసాగే అవకాశం ఉంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో వెలుగు చూసిన మోసపూరిత లావాదేవీల నేపథ్యంలో సెంటిమెంట్ బలహీనంగా ఉందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు నిరుత్సాహపరిస్తే.. మార్కెట్లకు ప్రతికూల సంకేతంగా మారొచ్చని అంటున్నారు. ద్రవ్యోల్బణం అంచనాలకు మించి నమోదైతే.. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లు వేగం పెంచొచ్చని అంచనా వేస్తున్నారు. నేడు నిఫ్టీ 10380- 10640 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 10450 పాయింట్ల ఎగువన ఉన్నంత కాలం.. భారీ దిద్దుబాటు జరగకపోవచ్చని భావిస్తున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్ల నష్టాలు కొనసాగొచ్చు. నిరుత్సాహకర త్రైమాసిక ఫలితాలతో సన్‌ఫార్మా షేర్లు డీలాపడొచ్చు.

మార్కెట్ కబుర్లు

- **సైయెంట్‌**కు రెండు ఫ్రాస్ట్ అండ్ విట్నీ అవార్డులు లభించాయి. 2017కు ఉత్పాదక పొదుపు, వ్యయ నివారణ అవార్డు, సప్లైయర్ ప్రొడక్టివిటీ ఇన్నోవేషన్ అవార్డు లభించాయని కంపెనీ తెలిపింది.
- అర్హులైన సంస్థాగత ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) మార్గంలో రూ.3,500 కోట్ల విలువైన షేర్ల జారీకి **ఐడియా సెల్యులార్** డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.
- రైలు వంతెన నిర్మాణ నిమిత్తం తూర్పు రైల్వే నుంచి రూ.129 కోట్ల విలువైన ఆర్డరు లభించిందని **జీపీటీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్** తెలిపింది.
- ఉత్తరప్రదేశ్‌లోని దాద్రీ వద్ద ఉన్న నేషనల్ కేపిటల్ పవర్ స్టేషన్ (ఎన్‌సీపీఎస్)కు ఫ్లూ గ్యాస్ డీసల్ఫ్యూరైజేషన్ (ఎఫ్‌జీడీ) వ్యవస్థ ఏర్పాటు నిమిత్తం ఎన్‌టీపీసీ నుంచి **భెల్**కు రూ.560 కోట్ల విలువైన ఆర్డరు లభించింది.
- డీఎల్‌ఎఫ్ సైబర్ సిటీ డెవలపర్స్ లిమిటెడ్ (డీసీసీడీఎల్)కు రూ.9,300 కోట్లు చెల్లించాల్సి ఉండటంతో, ఆ మేరకు విలువైన వాణిజ్య స్థలాలను దానికి విక్రయించనున్నట్లు **డీఎల్‌ఎఫ్** తెలిపింది. సింగపూర్‌కు చెందిన జీఐసీతో కలిసి డీసీసీడీఎల్‌ను డీఎల్‌ఎఫ్ ఏర్పాటు చేసింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2017–18	2016–17	2017–18	2016–17
టాటా పవర్	612	619	7096	6694
ధనూకా అగ్రిటెక్	28.58	26.87	226.13	242.75
సన్‌టెక్ రియాల్టీ	60.20	17.80	201.50	83.70
పీటీసీ ఇండియా	34	83.22	301.97	313.54
మిండా కార్పొరేషన్	37.87	21.28	636.2	544.83
జిందాల్ స్టెయిన్‌లెస్	135	40	2999.69	2261.22
దేనా బ్యాంక్	(380.07)	35.3	2475.96	2999.50
పంజ్‌లాయిడ్	(183.95)	(231.81)	1135.57	1011.10
నెస్లే ఇండియా	311.83	195.41	2589.64	2334.78
కార్బొరండమ్	56.47	46.37	156.69	137.47
కాక్స్ అండ్ కింగ్స్	84.46	22.12	1370.91	1391.91
అలహాబాద్ బ్యాంక్	(1263.79)	75.26	-----	------
ఎస్సార్ షిప్పింగ్	(28.23)	(91.84)	179.97	149.70
భూషణ్ స్టీల్	(1607)	(743)	4407.71	4094.73
భారత్ రోడ్ నెట్‌వర్క్	10.89	0.84	21.42	6.14
మర్కేటర్	(105.29)	30.42	206.90	588.76

ఎన్‌ఎస్‌ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 413.00 (403.35) 3001847
AMBUJA CEMEN 254.15 (256.90) 1060437
ASIAN PAINTS 1139.15 (1144.40) 691596
AUROBIND PHA 602.10 (607.30) 1795631
AXIS BANK LT 543.90 (564.20) 6478108
BAJAJ AUTO L 3109.75 (3154.10) 286070
BAJAJ FINANC 1669.95 (1643.80) 1066036
BHARTI AIRTE 434.80 (424.40) 9434541
BHARTI INFRA 327.40 (338.25) 7362307
BOSCH LTD 19515.10 (19545.85) 6351
BPCL 460.10 (467.55) 4451284
CIPLA 616.15 (621.65) 1306512
COAL INDIA L 306.95 (300.65) 5725179
DR. REDDYS 2183.30 (2204.25) 309833
EICHER MOTOR 28027.60 (27901.40) 37999
GAIL 466.90 (465.00) 4658095
HCL TECH 937.80 (939.15) 1444766
HDFC 1814.00 (1805.45) 3923887
HDFC BANK 1883.15 (1876.65) 894297
HERO MOTOCOR 3596.05 (3611.90) 315246
HINDALCO IND 243.25 (243.25) 7121280
HINDUSTAN UN 1349.40 (1344.45) 857401
HPCL 382.65 (391.45) 4005344
ICICI BANK 318.95 (326.25) 15189066
INDIABULLS H 1348.20 (1314.85) 2308630
INDIAN OIL 377.35 (379.05) 3806473
INDUSINDBANK 1694.45 (1687.80) 884974
INFOSYS LTD 1097.75 (1102.80) 4172856
ITC 266.50 (269.85) 11303222
KOTAK MAHIND 1042.45 (1042.95) 1187333
LARSEN & TOU 1361.20 (1350.50) 2310144
LUPIN 827.60 (840.45) 1135323
M&M 746.95 (746.00) 1207191
MARUTI SUZIK 9001.60 (9117.85) 357737
NTPC LTD 162.95 (164.90) 4101637
ONGC 185.75 (191.00) 4960527
POWER GRID C 195.45 (198.50) 7792834
RELIANCE IND 933.65 (915.50) 10170959
SBI 276.20 (288.75) 45641149
SUN PHARMA 574.80 (589.15) 6630066
TATA CONSULT 2911.80 (2967.30) 1423766
TATA MOTORS 376.85 (371.80) 9623436
TATA STEEL L 708.00 (713.10) 4885951
TECH MAHINDR 611.50 (590.35) 5004415
ULTRATECH 4175.50 (4200.30) 152754
UPL LIMITED 721.90 (726.50) 1446323
VEDANTA LIMI 315.75 (315.55) 7154264
WIPRO 293.45 (288.95) 3023672
YES BANK LTD 320.35 (335.40) 13548524
ZEE ENTERTAI 576.60 (584.50) 672167

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1572.10 (1610.65) 43054
ACC 1629.70 (1651.55) 206639
ASHOK LEYLAN 137.40 (133.30) 27373293
AVENUE SUPER 1201.40 (1187.20) 426463
BAJAJ FINSER 5189.00 (5235.45) 154547
BANK OFBAROD 165.80 (168.65) 28561359
BEL 160.60 (157.75) 5021012
BHEL 97.85 (97.50) 7781773
BRITANNIA 4764.15 (4772.50) 349962
CADILA HEALT 419.60 (423.65) 897280
COLGATE PALM 1096.35 (1093.90) 70696
CONTAINER 1325.10 (1325.30) 532033
CUMMINS INDI 840.45 (845.00) 135968
DABUR INDIA 340.75 (344.75) 825559
DLF LIMITED 230.95 (233.75) 8092805
EMAMI LIMITE 1079.85 (1080.85) 116717
GLAXOSMI CON 6432.10 (5971.10) 36746
GLAXOSMI PHA 2459.05 (2449.05) 10056
GLENMARK PHA 530.45 (535.35) 1116088
GODREJ CONSU 1027.50 (1029.50) 1580718
HAVELLS INDI 514.40 (516.05) 715021
HINDUSTAN ZI 309.10 (307.65) 2014996
ICICI PRU LI 409.85 (416.00) 561586
IDEA CELLULR 84.80 (84.50) 13383664
INTERGLOBE A 1274.95 (1250.85) 895835
JSW STEEL LT 309.55 (310.75) 3992497
LIC HOUS.FIN 525.05 (521.50) 1692968
MARICO LIMIT 315.60 (310.05) 2266519
MCDOWELL 3214.70 (3268.20) 437249
MOTHERSON 357.25 (364.45) 4850146
MRF 72329.20 (71640.90) 10260
NHPC LTD 28.65 (29.50) 7370928
NMDC LTD 133.65 (137.40) 4105258
OIL INDIA 359.25 (360.75) 650316
ORACLE FIN S 4014.35 (4052.70) 31833
P&G HYG&HEAL 9296.15 (9344.10) 2491
PETRONET LNG 252.05 (248.70) 3777313
PIDILITE IND 894.85 (894.50) 652522
PIRAMAL ENTE 2733.30 (2687.30) 95811
PNB 145.85 (161.65) 68396778
POWER FIN CO 111.25 (111.25) 4691167
RURAL ELEC C 154.75 (154.05) 4934123
SAIL 93.55 (95.35) 17516122
SHREE CEMENT 16813.15 (16953.35) 6148
SHRIRAM TRAN 1348.25 (1325.90) 535338
SIEMENS 1275.50 (1255.50) 190815
SUN TV LTD 998.40 (985.10) 1579126
TATA POWER 87.10 (86.75) 8735379
TITAN IND 813.70 (809.05) 2154852
TORRENT PHAR 1429.25 (1430.80) 128238

ఘనం (+)

నిఫ్టీ	14న	మార్పు%
TECH MAHINDRA	611.50	3.58
INDIABULLS HSG	1348.20	2.54
BHARTI AIRTEL	434.80	2.45
ADANI PORT & SEZ	413.00	2.39
COAL INDIA	306.95	2.10
RELIANCE INDUS	933.65	1.98
BAJAJ FINANCE	1669.95	1.59

గ్రహణం (-)

నిఫ్టీ	14న	మార్పు%
YES BANK	320.35	-4.49
SBI	276.20	-4.35
AXIS BANK	543.90	-3.60
BHARTI INFRA	327.40	-3.21
ONGC	185.75	-2.75
SUN PHARMA	574.80	-2.44
HPCL	382.65	-2.25

ADITYA SPIN 8.40 (8.40) 800
AISHWARYA TE 7.49 (7.15) 10090
ALPHAGEO 841.75 (843.30) 1533
AMAR RAJA BA 839.35 (844.95) 24858
ANDHRA BANK 46.90 (48.75) 312128
ANDHRA CEMEN 11.76 (11.88) 30238
ANDHRA PAPER 345.25 (353.30) 10174
ANDHRA PETRO 60.85 (62.45) 270210
ANDHRA SUGAR 517.85 (509.95) 3871
ANJANI PORTL 204.10 (216.55) 4414
ASTRA MICROW 107.40 (107.30) 97366
AUROBINDO PH 601.85 (607.85) 148514
AVANTEL SOFT 595.85 (607.90) 6226
AVANTI FEEDS 2411.60 (2506.25) 14178
AVON ORG 12.70 (12.80) 6878
BALAJI AMIN 672.20 (673) 12061
BARTRONICS 13.81 (13.77) 9677
BHAGIRA CHEM 317.20 (316.20) 4218
BHAGYA NAG 50.55 (48) 124296
BN RATHI SEC 43.25 (44.25) 7342
BRILLIANT SE 13.50 (12.90) 333035
CAMBRIDGE TE 81.55 (83.20) 3500
CIL SECURI 33 (32.40) 1336
COMBAT DRUGS 27.40 (27.40) 40
CONT COFFEE 291.70 (293.30) 3531
COROMAN FERT 533.25 (530.35) 5706
CUBEX TUB 23.70 (24.30) 2916
CYBERMATE 3.53 (3.84) 118323
CYIENT LIMIT 623.70 (626.15) 3416
DECCAN CEMEN 587.20 (580.95) 446
DIVI'S LAB 1050.30 (1035.50) 34236
DIVYA GRANIT 107.50 (108) 202
DR REDDY 2183.10 (2200.05) 27777
FOUR SOFT 93.55 (95.45) 3122
GATI CORPN 115.45 (118.65) 180149
GAYATRI PROJ 223.85 (210.25) 148518
GMR INFRASTR 19.70 (20.05) 3138438
GOLDST INFRA 213.80 (214.65) 61322
GOLDSTONE EN 16 (16) 10672

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

GRANULES (I) 122.25 (122.30) 177734
GSS AMERICA 36.40 (39) 57531
GVK POWER 19.60 (20.60) 3294429
HBL NIFE POW 61.25 (60.05) 117513
HERITAGE FOO 702.05 (713.65) 611
HIND FLUROCA 15 (14.50) 3270
HYD INDUS 1803.30 (1796) 3109
IDL INDUSTRS 583.20 (590.80) 1302
IKF SOFT 0.87 (0.91) 132931
ILFS ENGINEE 50.65 (50.05) 66594
INCAP 98 (102.50) 1271
INNAREDY COM 4 (3.99) 7000
IVRCL INFRAS 4.98 (4.95) 143975
JEEVAN SCIEN 50.50 (50.90) 1818
KAKATIYA CEM 306.90 (311.60) 9709
KALLAM SPG 28.75 (24.65) 328295
KARUNA CABLE 0.13 (0.12) 290
KAVERI SEED 473.60 (479.55) 28072
KCP LTD 139.75 (138.60) 53395
KERNEX MICRO 45.85 (43.70) 5739
KNR CONSTRUC 321.25 (326.85) 98774
KREBS BIO 154 (146.70) 2378
LANCO INDUS 372.60 (377.60) 12418
LANCO INFRAT 1.36 (1.30) 2080229
LAURUS LABS 533.50 (517.90) 11544
LOKESH MACH 70.45 (71.85) 18413
MADHUCON PRO 29.30 (31.10) 69605
MEGA SOFT 15.12 (14.40) 20229
MIC ELECTRON 7.94 (8.33) 55663
MOLD-TEK.TEC 63.05 (63.75) 2650
MOLDTK PLA 348.45 (352.60) 7043
MSR INDIA LT 46.65 (42.05) 26423
NAGARJAGRICH 48.20 (48.15) 38528
NAGARJAGRITE 7.68 (8.08) 733
NATCO PHARMA 782.75 (818.30) 84102
NAVA BH VENT 150 (147.60) 25084
NCC 126.50 (118.50) 2227662
NCL IND 243.90 (244.30) 7089
NEHA INTER 8.04 (8.15) 10556
NETTLINX 87.65 (85.40) 8271
NEULAND LAB 708.30 (700.50) 1850
NILE 899.30 (889.55) 3305
OIL COUNTRY 44.30 (45.10) 12988
PANKAJ POLY 15.35 (14) 7725
PANYAM CEMEN 51.35 (54.65) 95403
PENNER IND 66.10 (64.55) 124323
PHYTOCHEM I 66.20 (70) 13426
PIONEER DIST 189.10 (194.20) 880
PITTI LAMIN 98.20 (91.90) 72949
PL ENTERPRI 2.36 (2.36) 110
POKARNA 216.50 (214.95) 2735
PRAJAY ENGS 14.85 (14.95) 14132
PREMIER EXPL 405.55 (409.80) 1839
PRISM CEMENT 137.95 (136.30) 459476
RAIN INDUSTR 383.55 (392.50) 453269
SAGAR CEM 1012.10 (988.75) 3170
SAMKRG PIST 318.45 (318.15) 3205
SAMPRE NUTRI 60.55 (58.20) 5396
SATVAH. ISPA 24 (24.75) 10050
SMS PHARMA 95.30 (95.50) 4733
SPHERE GLOBA 38.60 (38.70) 2430
SREE RAYAL A 64.60 (65.80) 245686
SUVEN PHARMA 199.90 (199.95) 115639
TAJ GVK HOTE 178.20 (176.70) 39392
TANLA 32.95 (33.20) 39335
TERA SOFTWAR 62.15 (62) 11798
VAMSHI RUBB 55.80 (50) 12010
VIJAY TEXTIL 55.05 (55.45) 12398
VIMTA LABS 212.55 (207.55) 19412
VISAKA IND 717.05 (727.05) 13127
VISTA PHARMA 44.20 (46.10) 102419
VIVIMED LABS 87.05 (87.25) 660966
VST INDUS 3289.85 (3250) 1194
ZENOTECH LAB 44.40 (44.55) 26982
ZENTECH 123.10 (120.90) 45183


52 వారాల గరిష్ఠం (రూ.లలో)

అశోక్ లేలాండ్	138.75
ఆర్తి ఇండస్ట్రీస్	1189.20
అదానీ ఎంటర్‌ప్రైజెస్	223.35
భారత్ ఫోర్జ్	783.30
ఎఫ్ఎస్ఎల్	50.20
జేకుమార్ ఇన్‌ఫ్రా	375.00
లుమాక్స్ ఇండస్ట్రీస్	2437.00

52 వారాల కనిష్ఠం (రూ.లలో)

అలహాబాద్ బ్యాంక్	55.75
దేనా బ్యాంక్	21.90
ఓబీసీ	103.00
ప్రాక్సిస్ హోమ్	189.20

14వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	386	వరంగల్	388
చిల్లరగా (ఒక గుడ్డు)	4.45	విశాఖపట్నం	400
బెంగళూరు	395	చెన్నై	400
15వ తేదీకి...		చిత్తూరు	393
విజయవాడ/గోదావరి	392	నమక్కల్	380

శాస్త్ర పరిశోధనల్లో మనమెక్కడ?



సత్వర అభివృద్ధి సాధించి అగ్రదేశాల సరసన చేరాలనేది మనదేశం కల. దాన్ని సుసాధ్యం చేయాలంటే పరిశోధన- అభివృద్ధి కార్యకలాపాలను పెద్దఎత్తున నిర్వహించాలి. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని కనుగొనాలి. అగ్రరాజ్యమైన అమెరికా, పొరుగున ఉన్న చైనా చేస్తున్నది అదే. కానీ మనదేశం మాత్రం దీనిపై శ్రద్ధ వహించటం లేదు. పరిశోధన- అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కేటాయింపు నానాటికీ తీసికట్టుగా ఉండటం దీనికి ఉదాహరణ.

- అరకొరగా నిధులు....
- నామమాత్రంగా పరిశోధనలు

అరకొర నిధులు

- కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఆర్థిక సర్వే ప్రకారం గత రెండు దశాబ్దాల నుంచి శాస్త్ర పరిశోధనలకు మనదేశం కేటాయిస్తున్న నిధుల్లో పెరుగుదల లేదు.
- మనదేశ జీడీపీ (స్థూల జాతీయోత్పత్తి)లో **0.6%** నుంచి **0.7%** నిధులు మాత్రమే పరిశోధన కార్యకలాపాలకు కేటాయిస్తున్నారు.
- ఇప్పుడు మనదేశానికి ఉన్న జీడీపీ స్థాయిలో ఉన్నప్పుడు అమెరికా **2.5%**, చైనా **1%** నిధులు పరిశోధన- అభివృద్ధి కార్యకలాపాలపై వెచ్చించాయి.
- పరిశోధన- అభివృద్ధి కార్యక్రమాలపై వెచ్చిస్తున్న నిధులు మొత్తం గత కొన్నేళ్లుగా పెరుగుతున్నప్పటికీ, జీడీపీలో శాతంగా చూసినప్పుడు మాత్రం స్థిరంగా ఉంటూ వస్తోంది.
- వెచ్చిస్తున్న ఆ కాస్త సొమ్ము కూడా ప్రభుత్వ రంగ సంస్థలు పెడుతున్నదే. పరిశోధనా వ్యయాల విషయంలో మనదేశంలో ప్రైవేటు రంగం ఎంతో వెనుకబడి ఉంది.

ఇవీ కేటాయింపులు...

స్థూలంగా చూస్తే పరిశోధన- అభివృద్ధిపై మనదేశం ఎక్కువ నిధులు ఖర్చు చేస్తున్నట్లు కనిపిస్తుంది. కానీ జీడీపీలో శాతంగా చూసినప్పుడు మాత్రం పెరుగుదల లేదని స్పష్టమవుతోంది. గత దశాబ్దన్నర కాలంలో జీడీపీ ఎంతో పెరిగింది. కానీ దానికి తగ్గట్లుగా పరిశోధనా కార్యకలాపాలకు నిధుల కేటాయింపు పెరగలేదు.

సంవత్సరం	రూ. కోట్లలో...
2004-05	24,117
2012-13	73,983
2016-17	1,04,864

తూర్పు ఆసియా దేశాల్లో..

తూర్పు ఆసియా దేశాలైన చైనా, జపాన్, దక్షిణ కొరియా పరిశోధన కార్యకలాపాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నాయి. అవి ధనిక దేశాలయ్యే కొద్దీ, కేటాయించే నిధుల మొత్తమూ పెరిగింది.

భారతీయ కంపెనీల వెనుకంజ

ఒక విశ్లేషణ ప్రకారం గత ఏడాదిలో ప్రపంచ వ్యాప్తంగా పరిశోధన- అభివృద్ధి కార్యకలాపాలకు అత్యధికంగా నిధులు ఖర్చు చేస్తున్న **2,500** కంపెనీల్లో భారతీయ కంపెనీలు **26** మాత్రమే ఉన్నాయి. అదే సమయంలో చైనా కంపెనీలు **301** ఉండటం విశేషం. పరిశోధన- అభివృద్ధి కార్యకలాపాలు అధికంగా సాగుతున్న మొదటి **10** రంగాల్లో మనదేశానికి చెందిన ఒక్క సంస్థ కూడా లేదు. చైనా నుంచి ప్రతి రంగంలో ఒక సంస్థ ఉంది.

వివిధ దేశాలు పరిశోధన కార్యకలాపాలకు కేటాయిస్తున్న నిధులు (జీడీపీలో శాతం)

దేశం	శాతం
భారతదేశం	0.6
యూఎస్	2.8
చైనా	2.1
ఇజ్రాయెల్	4.3
కొరియా	4.2

కేంద్ర ప్రభుత్వ వాటా అధికం

పరిశోధనా కార్యకలాపాలకు మనదేశంలో కేంద్ర ప్రభుత్వం కేటాయించే నిధులే దిక్కు. రాష్ట్రాలు నామమాత్రంగానే నిధులు విదిలిస్తున్నాయి. ప్రైవేటు రంగం కొంత పర్వాలేదు.

మొత్తం పరిశోధనా నిధుల్లో ఎవరి వాటా ఎంత?

కేంద్ర ప్రభుత్వం	45%
రాష్ట్ర ప్రభుత్వాలు	7.5%
ప్రభుత్వరంగ సంస్థలు	5.5%
విద్యా సంస్థలు	4%
ప్రైవేటు రంగ సంస్థలు	38%

చైనా దూకుడు

- పరిశోధన- అభివృద్ధి కార్యకలాపాలకు చైనా పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా.. అమెరికా తర్వాత స్థానంలో చైనా ఉంది.
- 'శాస్త్ర పత్రాల సమర్పణ'లో చైనా, ఇప్పటికే అమెరికాను మించిపోయింది. వాటి నాణ్యత ఎలా ఉన్నా పత్రాల సంఖ్య విషయంలో మాత్రం చైనా ముందుంది.
- శాస్త్ర పరిజ్ఞానం ఉన్న కార్మికుల సంఖ్య చైనాలో అత్యధికంగా ఉంది. సైన్సు గ్రాడ్యుయేట్ల సంఖ్య చైనాలో ఉన్నంత అధికంగా ఏ దేశంలోనూ లేరు.
- అత్యాధునిక సాంకేతిక ఉపకరణాలను అసెంబుల్ చేసే స్థాయి నుంచి సూపర్ కంప్యూటర్లు, విమానాలు తయారు చేసే స్థాయికి ఎదిగే ప్రయత్నాల్లో చైనా నిమగ్నమైంది. దీని కోసం పరిశోధన- అభివృద్ధి కార్యకలాపాలపై పెద్దఎత్తున నిధులు ఖర్చు చేస్తోంది.
- కృత్రిమ మేధస్సు, క్వాంటమ్ కమ్యూనికేషన్లు, క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, ఎలక్ట్రిక్ వాహనాల విభాగాల్లో అగ్రగామి కావాలని చైనా ప్రయత్నాలు చేస్తోంది.
- 2020 నాటికి జీడీపీలో **2.5** శాతం సొమ్మును పరిశోధనలపై ఖర్చు చేయాలని చైనా భావిస్తోంది.

> పరిశోధన- అభివృద్ధి కార్యకలాపాలకు భారతదేశం ఇప్పుడు వెచ్చిస్తున్న నిధులు ఎంతో తక్కువ. తన స్థాయి అభివృద్ధితో పోల్చి చూసినా కూడా తక్కువే. అందువల్ల పరిశోధన- అభివృద్ధి వ్యయాలను తక్షణం రెట్టింపు చేయాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా ప్రైవేటు రంగం నుంచి, విశ్వవిద్యాలయాల నుంచి పరిశోధనలకు నిధుల లభ్యత పెరగాలి. సైన్సు, లెక్కల్లో విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి. పరిశోధనలు నిర్వహించే తీరుతెన్నులు మారాలి. *- ఆర్థిక సర్వే, 2018*

అగ్రగామి అమెరికా

- పెద్ద ఎత్తున పరిశోధనలు చేసి పేటెంట్ల కోసం దరఖాస్తులు దాఖలు చేయటంలో అమెరికాదే పైచేయి.
- పీహెచ్‌డీ విద్యార్థుల సంఖ్యలో అమెరికా అగ్రస్థానంలో ఉంది. తెలివైన విదేశీ విద్యార్థులను అధికంగా ఆకర్షించగలుగుతోంది. ఆ దేశం శాస్త్రీయ పరిశోధనల్లో ముందుండటానికి ఇదొక ప్రధాన కారణం.
- ప్రాథమిక శాస్త్ర పరిశోధనల్లో అమెరికాకు ఎదురే లేదు. పరిశోధనల నాణ్యతలో, నిపుణులైన విదేశీ శాస్త్రవేత్తలను ఆకర్షించటంలో, శాస్త్ర పరిశోధనల వాణిజ్యీకరణ (కమర్షియలైజేషన్) విషయంలో అమెరికా అగ్రగామిగా ఉంది.
- గత దశాబ్దకాలంలో ప్రపంచానికి అందుబాటులోకి వచ్చిన సాంకేతిక ఆవిష్కరణలన్నీ దాదాపుగా అమెరికా నుంచి వచ్చినవే.

ఎనిమిది సూత్రాల కార్యక్రమం

అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలవాలంటే మనదేశం పరిశోధన- అభివృద్ధి కార్యకలాపాలను ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయరాదని 'ఆర్థిక సర్వే' తేటతెల్లం చేసింది. దీనికి పాఠశాల విద్య నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటూ, అందుకు అనుగుణంగా ఎనిమిది సూత్రాల కార్యక్రమాన్ని ప్రస్తావించింది. లెక్కల్లో పట్టు సంపాదించటం, పరిశోధనా నైపుణ్యాన్ని పెంచుకోవటం, ప్రైవేటు రంగం, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశోధనలకు ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయించటం, జాతీయ పరిశోధన సంస్థలు- విశ్వవిద్యాలయాలను అనుసంధానం చేయటం.. తదితర అంశాలు ఇందులో ఉన్నాయి.

- ఈనాడు ప్రత్యేక విభాగం

అమ్మో కేంద్ర సేవలా?

- అటు పోయేదిలేదంటున్న ఐఏఎస్‌లు
- పదోన్నతి నిబంధనలు కఠినమని భావన
- తెలంగాణే ముద్దు అంటున్న బాస్‌లు
- పంపడానికి రాష్ట్ర సర్కారూ విముఖత

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులు కేంద్ర సేవలకు వెళ్లడానికి వెనుకాడుతున్నారు. కేంద్రం దిల్లీలోని ఐఏఎస్‌ల పనితీరును సమీక్షించడంతో పాటు పదోన్నతుల నిబంధనలు కఠినతరం చేయడంతో పాటు వసతులు, సౌకర్యాలపై అసంతృప్తితో దిల్లీపై ఆసక్తి చూపడం లేదు. తప్పనిసరిగా రావాలని కేంద్రం నుంచి ఆదేశాలు వచ్చినా స్పందించడం లేదు. తెలంగాణకు కేంద్రం 163 ఐఏఎస్ పోస్టులను కేటాయించగా ఇందులో 146 మంది ప్రస్తుతం పనిచేస్తున్నారు. ప్రతీ ఐఏఎస్ అధికారి విధిగా కేంద్ర సేవల్లో పనిచేయాల్సి ఉంటుంది. దీని కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అధికారులను కేంద్రసర్వీసులకు పంపించాలని లేఖలు రాస్తోంది. తాజాగా కేంద్రంనుంచి మరోసారిలేఖ వచ్చింది. దీని ప్రకారం కనీసం 25 నుంచి 30 మంది అధికారులు కేంద్ర సేవలకు వెళ్లాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమాచారాన్ని ఐఏఎస్‌లకు పంపించింది. ఐఏఎస్‌లు ఒక్కరి నుంచీ సానుకూలత వ్యక్తంకావడం లేదని తెలిసింది.

అవే కారణాలు: గతంలో దిల్లీలో పనిచేయడానికి అధికారులు ఆసక్తి చూపేవారు. దేశరాజధానిలో పనిచేస్తే తమకు జాతీయ స్థాయి గుర్తింపు వస్తుందని భావించేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. కేంద్రం ఐఏఎస్‌ల పనితీరును నిశితంగా పరిశీలిస్తోంది. పదోన్నతుల విధానంలోనూ పలు మార్పులు చేసింది. ఐఏఎస్‌లు ఎలా పనిచేస్తున్నారని నిఘా సంస్థల ద్వారా ఆరా తీస్తోంది. పదోన్నతులకు ముందు వారి పనితీరుపై కిందిస్థాయి ఉద్యోగులను అడిగి తెలుసుకుంటోంది. దీంతో పాటు సందర్శకులతో ఎలా వ్యవహరిస్తున్నారు, వివిధ రాష్ట్రాల అధికారులతో ఎలా మాట్లాడుతున్నారనే విషయాలను పరిశీలించిన తర్వాత పదోన్నతులపై నిర్ణయం తీసుకుంటోంది. దిల్లీలో ఉంటే వసతి, ఇతర సౌకర్యాలు సరిగా ఉండడం లేదు. ఇప్పుడు నామఫలకాలు, విజిటింగుకార్డులు, వెబ్‌సైట్లలోనూ తమ పేర్ల చివర ఐఏఎస్ అని పెట్టవద్దని కేంద్రం సూచించింది. తెలంగాణ నుంచి దాదాపు పది మంది అధికారులు ఇప్పటికే కేంద్ర సర్వీసుల్లో ఉన్నారు. కేంద్రం నిర్ణయాల ప్రభావం వీరిపైనా పడింది. కార్యదర్శి స్థాయి పదోన్నతులు వారికి లభించలేదు. రాష్ట్రం నుంచి వెళ్లిన బినయ్‌కుమార్ కార్యదర్శి పదోన్నతికి అర్హులైనా ఆయనను ప్రత్యేక కార్యదర్శి హోదాకే పరిమితం చేసి, కార్యదర్శికి సమానమైన పోస్టులో నియమించింది. పుష్పా సుబ్రహ్మణ్యం కూడా ప్రత్యేక కార్యదర్శి హోదాతో కార్యదర్శికి సమానమైన పోస్టులో ఉన్నారు. హీరాలాల్ సమారియా, రాజీవ్‌రంజన్ మిశ్రా, రాణికుముదిని, వసుధా మిశ్రా, సంజయ్‌జాజు, సయ్యద్ ముర్తజా రిజ్వీ తదితరులు కేంద్ర సేవల్లో ఇలాంటి సమస్యలనే ఎదుర్కొంటున్నారు. కొంతమంది తమ కిందిస్థాయి అధికారుల కింద పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పదోన్నతులు సరిగా రాకపోవడం వంటి కారణాలవల్లనే కొందరు అధికారులు మధ్యలోనే అక్కడి నుంచి తెలంగాణకు రావాలని భావిస్తున్నారు. ఒక సీనియర్ ఐఏఎస్ రాష్ట్రంలోని కీలక పోస్టు కోసం రాష్ట్ర ప్రముఖులను సంప్రదించినా అప్పటికే ఆలస్యమైంది. తనకంటే జూనియర్ కింద పనిచేయాల్సి వచ్చింది. దీంతో ఆయన రాష్ట్రం రాకుండా దిల్లీలోనే కొనసాగుతున్నారు. ఈ పరిణామాలను గమనించిన రాష్ట్ర ఐఏఎస్‌లు దిల్లీకి వెళ్లడానికి యత్నించడం లేదు. దిల్లీతో పోలిస్తే ఇక్కడే పదోన్నతులు, గుర్తింపు, వసతులు బాగున్నాయని ఐఏఎస్‌లు పేర్కొంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నిరాకరణ: దిల్లీకి అధికారులను పంపించాలని కేంద్రం కోరినా రాష్ట్ర ప్రభుత్వం సైతం దీనిని సుముఖంగా లేదు. రాష్ట్రంలో ఇప్పటికే ఐఏఎస్‌ల కొరత ఉన్నందున కేంద్ర సర్వీసులకు పంపడానికి అంగీకరించడం లేదు. ఈ మేరకు తమ రాష్ట్రంలోని అధికారులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ తాజాగా లేఖ రాయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

మాకు 'మౌలిక' నిధులు ఇవ్వరూ!

జేఎన్‌టీయూ, జేఎన్ఏఎఫ్‌యూ, ఆర్‌జీయూకేటీ ప్రతిపాదన

ఈనాడు, హైదరాబాద్: మిగతా విశ్వవిద్యాలయాల మాదిరిగా తమ విద్యా సంస్థలకు మౌలిక వసతుల కల్పన కోసం బడ్జెట్ కేటాయించాలని రాష్ట్రంలోని మూడు సాంకేతిక విశ్వవిద్యాలయాలు ప్రభుత్వానికి ప్రతిపాదించాయి. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పించాయి. చాలా సంవత్సరాల తర్వాత 2017-18 బడ్జెట్‌లో రాష్ట్రంలోని ఎనిమిది విశ్వవిద్యాలయాల్లో వసతుల కల్పనకు రూ. 420 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. జేఎన్‌టీయూహెచ్‌తోపాటు జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం(జేఎన్ఏఎఫ్‌యూ), రాజీవ్‌గాంధీ సాంకేతిక, వైజ్ఞానిక విశ్వవిద్యాలయం(ఆర్‌జీయూకేటీ-బాసర)లకు మంజూరు చేయలేదు. కేవలం సిబ్బంది వేతనాల కోసం బ్లాక్‌గ్రాంటును మాత్రమే మంజూరు చేసింది. ఈక్రమంలో వచ్చే బడ్జెట్‌లో తమ విశ్వవిద్యాలయాలకు కూడా మౌలిక సదుపాయాల కోసం మొత్తం రూ.356.50 కోట్లు ఇవ్వాలని ముగ్గురు ఉపకులపతులు కోరారు. ఇంక్యుబేటర్ల ఏర్పాటుతోపాటు ఇతర వసతులను మెరుగు పరచాలంటే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అవసరమని పేర్కొన్నారు. వాటితో కలిపి రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ మొత్తం రూ. 617 కోట్లను ప్రతిపాదించింది.

బడ్జెట్ ప్రతిపాదనలు	(రూ.కోట్లలో)
జేఎన్ఏఎఫ్‌యూ:	23
ఆర్‌జీయూకేటీ(బాసర):	89
జేఎన్‌టీయూ హైదరాబాద్:	30.50
జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్:	87
జేఎన్‌టీయూ మంథని:	76
జేఎన్‌టీయూ జగిత్యాల:	51
మొత్తం:	రూ.356.50 కోట్లు

కరాటేలో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

ఈనాడు, హైదరాబాద్: ముంబయిలో ఈనెల 10, 11 తేదీల్లో జరిగిన ఆసియా అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ గురుకులాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. మూడు బంగారు పతకాలతో పాటు రజతం, కాంస్య పతకాలు సాధించినట్లు ఆ సొసైటీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దాదాపు 10 దేశాలకు చెందిన విద్యార్థులు వివిధ విభాగాల పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఖమ్మంజిల్లా కల్లూరు ఎస్సీ గురుకులానికి చెందిన విద్యార్థినులు ఎం.మనీష అండర్-16(45కిలోల)విభాగంలో, యు.దివ్య అండర్-14 (45కిలోలు), ఎం.శిరీష అండర్ -14 (40కిలోలు) బంగారుపతకాలు సాధించారని పేర్కొన్నారు. కె.కృష్ణవేణి అండర్-14 విభాగంలో రజతం పొందారు. గురుకులాల్లోని 500 మంది విద్యార్థినులకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తున్నామని ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు.



మైసూరు పట్టు.. ధర తగ్గేట్టు!

తక్కువ ధరకే అందించాలని నిర్ణయం

ఇక నుంచి కనిష్ఠ ధర రూ.4వేలే

ఈనాడు, బెంగళూరు: మగువలకు శుభవార్త. ఇకపై వారికి తక్కువ ధరలకే మైసూరు పట్టు చీరలు అందనున్నాయి. కర్ణాటక ప్రభుత్వ పట్టు పరిశ్రమ సంస్థ వాటిని ఇక నుంచి అందుబాటు ధరలకే అందించనుంది. ప్రస్తుతం ఆ చీరల వెల తక్కువలో తక్కువగా రూ. 12 వేలు ఉంది. దీంతో సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. ఇప్పుడు ఆ చీరల్ని అన్ని కుటుంబాలకు చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాల్ని ప్రారంభించింది. రూ. 4 వేలకే చీరను అందించేలా ఏర్పాట్లు చేస్తోంది. మరో 2 నెలల్లో ఈ తక్కువ ధరల చీరల విక్రయాలకు శ్రీకారం చుట్టనున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం మైసూరు పట్టు చీరకు సొబగులద్దేందుకు జరీలో వెండి 65శాతం, 0.5 శాతం బంగారం ఉపయోగిస్తున్నారు. ఒక్కో చీరకు దాదాపు 400 గ్రాముల జరీ వాడుతున్నారు. దీంతో వాటి ధర రూ. 12వేల నుంచి రూ. 2.7 లక్షలదాకా ఉంటోంది. ఈ ధరలను తగ్గించి అత్యధికులకు ఈ చీరల్ని అందుబాటులో ఉంచేందుకు వీలుగా జరీ పరిమాణాన్ని తగ్గించి ధరను రూ. 4వేలకు తగ్గించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు సోమశేఖర్ వెల్లడించారు. ప్రస్తుతం ఏటా దేశవ్యాప్తంగా 90వేల చీరల్ని విక్రయిస్తున్నారు. ఎయిర్ ఇండియా గగనసఖులు ధరించే చీరలూ మైసూరు, చెన్నపట్టణ కర్మాగారాల్లో తయారైనవే.

నోరు జారితే.. కటకటాలే

- ఆకాశ రామన్న ఉత్తరాలు... సామాజిక మాధ్యమాలతో బెదిరింపులు, దూషణలకు పాల్పడినా జైలే
- ఐపీసీ సెక్షన్‌లకు సవరణల యత్నాల్లో తెలంగాణ
- కోర్టు అనుమతి లేకుండానే అరెస్టు

ఈనాడు - హైదరాబాద్

నోటిని అదుపులో ఉంచుకోకుండా అడ్డగోలుగా బెదిరింపులకు పాల్పడినా... ఆకాశరామన్న ఉత్తరాలు, సామాజిక మాధ్యమాల ద్వారా కించపరచడం, దూషణలు, బెదిరింపులకు పాల్పడితే ఇకపై ఇబ్బందులు తప్పవు. అదీ నేరపూరిత బెదిరింపులైతే కటకటాలను లెక్కించాల్సిందే. ఐపీసీ సెక్షన్ 506, 507కు సవరణలకు తెలంగాణ ప్రభుత్వం యత్నిస్తోంది. ఇప్పుడున్న భారత శిక్షా స్మృతి (ఐపీసీ) సెక్షన్ 506, 507ల కింద నేరాలకు పాల్పడ్డవారిని అరెస్ట్ చేయాలంటే ముందస్తుగా కోర్టు అనుమతి అవసరం. ఇది చిన్న నేరం (నాన్‌కాగ్నిజబుల్), బెయిలబుల్ కేసు కావడంతో ఎవరైనా ఫిర్యాదు ఇస్తే పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ అరెస్ట్ చేసేవారు కాదు. దర్యాప్తు మాత్రం చేపట్టేవారు. ప్రస్తుతం ఈ సెక్షన్ల సవరణలకు సంబంధించిన ఫైలుపై ముఖ్యమంత్రి ఆమోదం తెలిపిన సంగతి విదితమే. ఇప్పటివరకు ఇవి చిన్న నేరాలుగా పరిగణనలో ఉండగా వీటిని గుర్తించ దగ్గ నేరాలుగా(కాగ్నిజబుల్) ప్రభుత్వం సవరణలు తీసుకువస్తోంది. గతంలో ఈ సెక్షన్ల కింద నమోదైన కేసుల్లో మెజిస్ట్రేట్ల అనుమతితోనే దర్యాప్తు, నిందితుల అరెస్టు ఉండేది. తాజా పరిణామాల నేపథ్యంలో.. ఈ కేసుల్లో పోలీసులు మెజిస్ట్రేట్ల నుంచి అనుమతి పొందాల్సిన అవసరముండదు. ఇప్పటి వరకు ఈ సెక్షన్ల కింద నమోదైన నేరాల్లో దర్యాప్తు, అరెస్టుల విషయంలో మెజిస్ట్రేట్ ద్వారా అనుమతి తీసుకునే అంశం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల విచక్షణాధికారంగా ఉండేది. సాధారణంగా దీనిపై ఫిర్యాదు అందితే కవరింగ్ లెటరుతో పోలీసులు సంబంధిత మేజిస్ట్రేట్ ముందుంచి తదుపరి చర్యల నిమిత్తం అనుమతి కోరుతున్నారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు దర్యాప్తు, అరెస్టులు చేపడతారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు విస్తృతమైన నేపథ్యంలో వాటి ద్వారా సెలబ్రిటీలు, రాజకీయ ప్రత్యర్థులు.. వ్యక్తిగతంగా ఇతరులను బెదిరించడం, దూషణలకు పాల్పడటం సర్వసాధారణమైపోయింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ సెక్షన్లను గుర్తించదగ్గ, నాన్‌బెయిలబుల్ నేరాలుగా పరిగణించాలని నిర్ణయించింది.



నేరం కిందికి వచ్చే బెదిరింపును(క్రిమినల్ ఇంటిమిడేషన్) ఐపీసీలోని సెక్షన్ 503 నిర్వచిస్తోంది. ఎవరి వ్యక్తిత్వానికి అయినా హాని చేస్తామని కాని, పరువు లేదా ఆస్తి వ్యవహారంలో నష్టంచేస్తానని భయపెట్టడాన్ని బెదిరింపుగా పరిగణించొచ్చని పేర్కొంది. సాధారణ బెదిరింపునకు పాల్పడితే సెక్షన్ 506 కింది రెండేళ్ల జైలు, జరిమానా, లేదా ఆ రెండు విధించొచ్చని చట్టం చెబుతోంది. ఆ బెదిరింపులు హత్యకు లేదా తీవ్ర గాయాలు, అగ్నికి ఆస్తిని ఆహుతి చేయడానికి దారితీస్తే ఆ వ్యక్తికి ఏడేళ్ల జైలు, లేదా జీవితకారాగారం లేదా మరణశిక్ష విధించొచ్చు. ఐపీసీ సెక్షన్ 507 ప్రకారం అనామక/పేరులేకుండా సమాచారం(సామాజిక మాధ్యమాలు, లేఖలు, ఆకాశరామన్న ఉత్తరాలు, మెయిళ్లు, ఫోన్ నుంచి బెదిరింపులు, తదితరాలు) వెల్లడి చేయడం ద్వారా బెదిరింపులకు(పరోక్ష) పాల్పడితే రెండేళ్ల వరకు శిక్ష ఉంది. 506 సెక్షన్‌లో పేర్కొన్న అంశాలన్నీ సెక్షన్ 507కు వర్తిస్తాయి. ఈ సెక్షన్లను గుర్తించదగ్గ నేరాలుగా మార్చడం ద్వారా కోర్టు అనుమతి లేకుండా అరెస్టు చేసే అధికారం పోలీసులకు దఖలు పడుతుంది. అయితే పోలీసులు ఈ అధికారాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. స్వేచ్ఛగా తమ భావాలను వ్యక్తీకరించే అవకాశం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఉత్తరప్రదేశ్‌లో కూడా ఇది గుర్తించ దగ్గ నేరంగా పరిగణిస్తూ ప్రభుత్వం 1989లోనే నోటిఫికేషన్ జారీ చేసింది.

ప్రపంచ ఐటీ కాంగ్రెస్‌లో ప్రధాని ప్రసంగం

- వీడియో లింకేజి ద్వారా మాట్లాడనున్న మోదీ
- 19 నుంచి 21 వరకు హైదరాబాద్‌లో సదస్సు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో ఈ నెల 19 నుంచి 21 వరకు జరిగే ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సు ప్రారంభోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వీడియో లింకేజీ ద్వారా ప్రసంగించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం నాస్కామ్, ప్రపంచ ఐటీ సేవల కూటమి (విట్సా) సహకారంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ప్రధానిని ఆహ్వానించారు. ఆ రోజు అందుబాటులో ఉండటం లేదని చెప్పిన ప్రధాని వీడియో లింకేజీ ద్వారా తన సందేశాన్ని ఇస్తానని తెలిపారు. దీనికి అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 19న ఉదయం 10 గంటలకు హెచ్ఐసీసీలో సదస్సు ప్రారంభమవుతుంది. 11 గంటలకు మోదీ వీడియో లింకేజీ ద్వారా ప్రసంగిస్తారు. ఈ సదస్సుకు శ్రీలంక ప్రధాని రణిల్ విక్రమసింఘే, కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, తెలంగాణ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కెనడా ఐటీ శాఖ మంత్రి నవదీప్ బైన్స్, సద్గురు తదితర ప్రముఖులు, ఐటీ కంపెనీల అధిపతులు, సీఈవోలు, నిపుణులు పాల్గొననున్నారు. 30కి పైగా దేశాల నుంచి నాలుగువేల మందికి పైగా ప్రతినిధులు రానున్నారు. 50 చర్చాగోష్ఠులు జరుగుతాయి.

ఎర్రజొన్న రైతులకు ప్రభుత్వ భరోసా

మార్క్‌ఫెడ్ ద్వారా ప్రతి బస్తా కొనుగోలు: ఎంపీ కవిత

ఎర్రజొన్న రైతులు ధరల విషయమై ఎలాంటి ఆందోళన చెందవద్దని, రాష్ట్ర ప్రభుత్వం వారికి పూర్తి భరోసా ఇస్తుందని, మార్క్‌ఫెడ్ ద్వారా ప్రతి బస్తాను కొనుగోలు చేస్తుందని ఎంపీ కవిత చెప్పారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ' తెలంగాణ ప్రభుత్వం ఎర్రజొన్న రైతుల సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించింది. సీఎం కేసీఆర్ దృష్టికి మద్దతు ధరల విషయం తీసుకెళ్లగానే ఆయన వెంటనే మంత్రుల హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడారు. వారు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బుధవారం నేను మంత్రి హరీశ్‌రావుతో ఈ అంశంపై చర్చించాను. కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపాం. రైతులకు మేం అండగా ఉంటాం. విపక్షాల తప్పుడు మాటలు నమ్మవద్దు. మాది రైతు ప్రభుత్వం. ఇప్పటికే వారికి ఎరువులు, విత్తనాల పంపిణీతో పాటు సాగుకు అవసరమైన నీటి వసతి, నాణ్యమైన కరెంటు, మార్కెటింగు సౌకర్యాలు కల్పించాం' అన్నారు.

క్రీడాకోట అవకతవకలపై విచారణ అధికారి నియామకం

ఈనాడు, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్-2017 క్రీడా కోటా కింద ప్రవేశాల్లో జరిగిన అవకతవకలపై విశ్రాంత ఐఏఎస్ అధికారి మహ్మద్ అలీ రఫత్‌ను విచారణ అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు క్రీడాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తిస్థాయి విచారణ జరిపి, భవిష్యత్తులో ఇలాంటి అవకతవకలు జరగకుండా సలహాలు, సూచనలు పేర్కొంటూ ఈ నెల 24 లోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

షెడ్యూల్ 2లో మరో నాలుగురకాల చెట్లు

వేప, నల్లతుమ్మ, నేరేడు, రావి చెట్లను షెడ్యూల్ 2లో చేరుస్తూ అటవీశాఖ ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వనపర్తి, వరంగల్, జనగాం జిల్లాల రైతుల వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. తమ వ్యవసాయ భూముల్లోంచి పై నాలుగు రకాల చెట్లను తరలించేందుకు ఇబ్బందులు వస్తున్నాయని, రవాణా నిబంధనల నుంచి వాటిని మినహాయించాలని వారు కోరారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి వినతి

రాష్ట్రంలోని ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని పలు ఉపాధ్యాయ సంఘాలు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషికి వినతిపత్రాలు సమర్పించాయి. సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనల సమస్య, అప్‌గ్రేడెడ్ భాషా పండితులు, కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల సిబ్బంది సమస్యలు తదితరాలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాములు, చావ రవి కోరారు. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీసు నిబంధనల సమస్యను పరిష్కరించాలని, 2015 నాటి పీఆర్‌సీ కాలపరిమితి వచ్చే జులైతో ముగుస్తున్నందున కొత్త పీఆర్‌సీ కోసం కమిటీని నియమించాలని, ప్రభుత్వ బడులకు ఉచిత విద్యుత్తు సౌకర్యం కల్పించాలని పీఆర్‌టీయూ- తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, చెన్నయ్యలు వినతిపత్రంలో కోరారు.

నగరానికి పింకీ హత్య కేసు నిందితుడు

- హైదరాబాద్‌లోనే చిక్కిన వికాస్ కశ్యప్
- తల్లి హత్య కేసులో బాలుడే కీలక సాక్షి

ఈనాడు, హైదరాబాద్: రాజధానిలో కలకలం రేపిన ఎనిమిది నెలల గర్భిణి బింగీ అలియాస్ పింకీ(32) దారుణహత్య కేసులో... కీలక నిందితుడు అమర్‌కాంత్‌ఝాను సైబరాబాద్ పోలీసులు బుధవారం నగరానికి తీసుకొచ్చారు. పింకీ మృతదేహాన్ని ఎనిమిది ముక్కలుగా నరికి.. బొటానికల్ గార్డెన్ వద్ద పడేసిన ఘటనలో అమర్‌కాంత్ తల్లి మమత, తండ్రి అనిల్ ఇదివరకే పోలీసులు అరెసు చేశారు. గతనెల 31న ఈ ఘాతుకం వెలుగు చూడటం, దర్యాప్తు ముమ్మరం కావడంతో ఈ నెల 3న అమర్‌కాంత్ బిహార్‌లోని బంకా జిల్లా మోహానమల్తీకి పారిపోయాడు. అతని తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారంతో.. పోలీసులు విమానంలో బిహార్‌కు వెళ్లి అమర్‌ను అతని ఇంట్లో అరెస్ట్ చేశారు. అనంతరం బంకా చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టులో అతడిని హాజరుపరిచి, ట్రాన్సిట్ వారంట్‌పై బుధవారం విమానంలో నగరానికి తీసుకొచ్చారు. మరోవైపు- పింకీతో సహజీవనం చేసి, ఈ కేసులో నిందితుడిగా ఉన్న వికాస్ కశ్యప్‌ను బుధవారం హైదరాబాద్‌లోనే పోలీసులు అరెస్ట్ చేశారు. హత్య జరిగిన రోజు నుంచి రాత్రి సమయాల్లో స్నేహితుల ఇళ్లలో తలదాచుకుంటున్న వికాస్... స్వస్థలానికి వెళ్లేందుకు డబ్బుల్లేక ఇక్కడే ఉండిపోయాడు.

శిశు గృహానికి జతిన్: పింకీ తనయుడు జతిన్(8) ఈ కేసులో కీలక సాక్షిగా మారాడు. పింకీ మృతదేహం ఇంకా ఉస్మానియా శవాగారంలోనే ఉంది. మృతి విషయాన్ని ఉత్తరప్రదేశ్ చందౌసీలో ఉన్న ఆమె భర్త దినేశ్‌కు చెప్పినా... ఇక్కడికొచ్చేందుకు ఆయన నిరాకరించినట్లు తెలిసింది. ఇక్కడికి వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లే ఆర్థిక స్థోమత పింకీ కుటుంబానికి లేదు. జతిన్ పింకీతో కలిసి హైదరాబాద్‌కు రావడం, 45 రోజులపాటు అమర్‌కాంత్ ఇంట్లో ఉండటం, తన తల్లి నిర్జీవంగా పడి ఉన్నప్పుడు ఆరోగ్యం బాగోలేదని నిందితులు చెప్పడం తదితర విషయాలను జతిన్ వెల్లడించడంతో... చిన్నారి వాంగ్మూలాన్ని నమోదు చేయాలని పోలీసులు భావిస్తున్నారు. బాలుడిని సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలోని శిశుగృహానికి తరలించారు. కొంతకాలం పాటు బాలుడిని అక్కడే ఉంచి, కేసు విచారణ సమయంలో న్యాయస్థానంలో సాక్షిగా హాజరుపరచాలని భావిస్తున్నారు.

'ఉచిత' నిరసన..!



ధరలు ఒక్కసారిగా దారుణంగా పడిపోవడంతో టమోటా రైతులు నిలువునా మునిగారు. ప్రస్తుతం 25 కిలోల టమాటా పెట్టె ధర విపణిలో దాదాపుగా రూ. 20 పలుకుతోంది. కోత, రవాణా ఖర్చులు లెక్కిస్తే నష్టమే వస్తుండటంతో.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం వెంగంపేట రైతులు శోభనరెడ్డి, రాఘవరెడ్డి, సురేందర్, రాజా.. తదితరులు పంటనంతా ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసి తమ నిరసన తెలిపేందుకు నిర్ణయించుకున్నారు. సుమారు 50 క్వింటాళ్ల టమాటాను ట్రాక్టరు, రెండు ఆటోల్లో బుధవారం గూడూరులో జరిగిన వారపు సంతకు తీసుకొచ్చారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రజలకు పంపిణీ చేశారు.

- ఈనాడు డిజిటల్, మహబూబాబాద్

రూ.5,000 కోట్ల విలువైన నోట్లు పంపండి

అరుణ్‌జైట్లీకి ఏపీ సీఎం చంద్రబాబు లేఖ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఏర్పడిన నగదు కొరత తీర్చడానికి తక్షణం రూ.5,000 కోట్ల విలువైన నోట్లు పంపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీకి బుధవారం లేఖ రాశారు. దీని ప్రతిని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ ఉర్జిత్‌పటేల్, ప్రాంతీయ అధికారి సుబ్రమణ్యంలకు కూడా పంపారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలకు రుణం, వివిధ వర్గాలకు వితంతు పింఛన్లు, వరి ధాన్యం విక్రయించిన రైతులకు నగదు చెల్లింపులు తదితరాలకు ఇబ్బంది ఏర్పడుతోందని ముఖ్యమంత్రి లేఖలో ప్రస్తావించారు. సామాన్య జనం ఏటీఎంలు, బ్యాంకుల వద్ద గంటల తరబడి వేచిఉండాల్సి వస్తోందని, తక్షణం రూ.5వేల కోట్ల విలువైన చిన్న, పెద్ద నోట్లు పంపాలని విజ్ఞప్తిచేశారు.

సాంకేతికతతో ఈ-ప్రగతి పటిష్ఠం: చంద్రబాబు

రియల్‌టైమ్ గవర్నెన్స్‌తో ఈ-ప్రగతిని అనుసంధానించి పటిష్ఠం చేయడం ద్వారా మంచి ఫలితాలను సాధించాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. బుధవారం సచివాలయంలో ఈ-ప్రగతి పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ చేపడుతున్న చర్యలు అధికారులకు, ప్రజలకు మరింత చేరువయ్యేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరముందని తెలిపారు. రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, పారదర్శక పాలన కోసం వినియోగించే సాంకేతిక పరిజ్ఞానాన్ని చూసి రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేష్ అంబానీ కొనియాడిన విషయాన్ని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

చంద్రబాబుతో వీవీఎస్ లక్ష్మణ్ భేటీ

భారత మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. వెలగపూడి సచివాలయంలో ఆయన సీఎంను కలిసి క్రీడలు, క్రీడాకారులను ఎంతో ప్రోత్సహిస్తున్నారని అభినందించారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పనిచేసినప్పుడు జాతీయ, అంతర్జాతీయ క్రీడా అకాడమీలు రాష్ట్రంలో ఏర్పాటయ్యేందుకు కృషి చేశారని గుర్తు చేశారు.

ముఖ్యమంత్రి నాయకత్వం వహించాలి

చంద్రబాబుకు ముద్రగడ లేఖ

కిర్లంపూడి, న్యూస్‌టుడే: విభజన హామీలు, ప్రత్యేక హోదా సాధన పోరాటానికి ముఖ్యమంత్రి నాయకత్వం వహించాలని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కోరారు. తెదేపా ఎంపీలు, కేంద్ర మంత్రులతో తక్షణమే రాజీనామా చేయించాలని సూచించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో బుధవారం లేఖ ప్రతులను విడుదల చేశారు. "విభజన హామీలు, ప్రత్యేక హోదా సాధనకు పవన్‌కల్యాణ్, జగన్, నా లాంటివారు ఏ మాత్రం సరిపోరు. ముఖ్యమంత్రిగా మీకు ఆంధ్రప్రదేశ్‌పై ప్రేమ, పూర్తివిశ్వాసం ఉంటే ఓటుకు నోటు కేసులో భయపడకుండా కేంద్రంలో ఉన్న మీ పార్టీ మంత్రులు, ఎంపీలతో రాజీనామా చేయించి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాలి" అని ఆయన లేఖలో పేర్కొన్నారు.

'హోదా' కోసం వామపక్షాల ఉద్యమ కార్యాచరణ

ఈనాడు, అమరావతి: ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం అన్ని ప్రతిపక్ష, ప్రజాసంఘాలతో కలిసి దశలవారీ ఉద్యమాన్ని కొనసాగిస్తామని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, పి.మధు తెలిపారు. విజయవాడలోని దాసరిభవన్‌లో బుధవారం 10 వామపక్ష పార్టీల నేతలు భేటీ అయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్రంలో వామపక్ష పార్టీలు ఉద్యమ కార్యాచరణను రూపొందించాయన్నారు. ఈనెల 18న విజయవాడలో ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీలు పాల్గొంటాయన్నారు. విశాఖ రైల్వేజోన్, ప్రత్యేక హోదా, విభజన అమలుసాధన కోసం 24న విశాఖపట్నంలో భారీ సభ నిర్వహిస్తామన్నారు. మార్చి 6న దిల్లీలో పార్లమెంటు ముందు నిరసన తెలుపుతామని చెప్పారు.

వామపక్ష నేతలకు పవన్ ఆహ్వానం

ఈనాడు, అమరావతి: ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలకు సంబంధించి కేంద్రం ఇచ్చిన నిధులు, రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న అంశాలపై చర్చించేందుకు ఈ నెల 16న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సమావేశానికి హాజరుకావాలని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, మధులను బుధవారం పవన్ కల్యాణ్ ఆహ్వానించారు. ఈమేరకు వారికి ఆయన స్వయంగా ఫోన్ చేశారు.

కాంగ్రెస్ నేతలకు అందు'బాట'లో రాహుల్..

దిల్లీ: పార్టీ మునుపటి సంప్రదాయాన్ని కొనసాగిస్తూ.. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బుధవారం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నేతలు, కార్యకర్తలను కలిశారు. ఇక్కడి ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో వారందరితో ముచ్చటించారు. ఉదయం 10 గంటలకు కార్యాలయానికి చేరుకున్న రాహుల్ దాదాపు గంటన్నర పాటు యూపీ, హరియాణా, పంజాబ్, బిహార్, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాల నేతలతో మాట్లాడారు. ఆరుబయట ఎక్కువసేపు గడిపిన రాహుల్ అనంతరం తన కార్యాలయంలో సీనియర్లను కలిశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు అందరికీ అందుబాటులో ఉంటారా? అనేది చర్చనీయాంశమైన నేపథ్యంలో.. రాహుల్ కార్యకర్తలకు మరింత చేరువయ్యేందుకు నిర్ణయించారు. గతంలో ఇందిరాగాంధీ వంటి నేతలు పార్టీ అధ్యక్షులుగా ఉన్న సమయంలో కార్యకర్తలను 'జనతా దర్బార్' వద్ద ఇలా కలిసేవారు.



నీటి నిల్వలు మాయమైన బెళ్లందూరు చెరువు

తాగునీటికి 'బెంగ'ళూరు!

దాహం కేకలు తప్పవని హెచ్చరించిన బీబీసీ నివేదిక

ఈనాడు, బెంగళూరు: భారతీయ సిలికాన్ వ్యాలీగా పేరుగాంచిన బెంగళూరులో బిందెడు నీటికి బండెడు కష్టాలు తప్పవా? ఈ ప్రశ్నకు అవుననే సమాధానమిస్తోంది బీబీసీ. కేప్‌టౌన్ తర్వాత బెంగళూరు నాలుక దాహంతో పిడచకట్టుకుపోనుందన్న ఆ సంస్థ హెచ్చరికతో నగరవాసులు కలవరపడుతున్నారు. 2014లో జరిపిన సర్వే ఆధారంగా బీబీసీ నీటి ఎద్దడి ఎదురయ్యే నగరాల నివేదిక రూపొందించగా.. అందులో బెంగళూరు ద్వితీయస్థానంలో నిలిచింది. ప్రస్తుతం బెంగళూరు జనాభా కోటికిపైమాటే. నగరంలో ప్రస్తుతం నీళ్లున్న చెరువుల సంఖ్య 194. వాటిలో 80 శాతం నీళ్ల పంటల సాగు, పరిశ్రమలకు మాత్రమే ఉపయోగపడతాయని, తాగేందుకు పనికిరావని నిపుణులు తేల్చారు. శివార్లలోని హెసరఘట్ట, తిప్పగొండనహళ్లి జలాశయాలు రెండు, మూడేళ్ల నుంచి పాక్షికంగా దప్పిక తీరుస్తున్నాయి. ప్రస్తుతం అవీ మురికి గుంటలుగా మారడంతో పూర్తిగా మైసూరు సమీపంలోని కావేరి నదీ జలాలపైనే నగర వాసులు ఆధారపడాల్సి వస్తోంది. దీనిపై స్పందించిన నిపుణులు తాము ఏనాడో చేసిన హెచ్చరికను ఖాతరు చేయని పాలకులు ఇప్పటికైనా కళ్లుతెరవాలని హితవు పలికారు. బెంగళూరు అభివృద్ధిశాఖ మంత్రి కె.జె.జార్జి మాత్రం బీబీసీ హెచ్చరికను తోసిపుచ్చారు.

- బెంగళూరులోని వనరుల నుంచి కాకుండా 100 కిలోమీటర్ల దూరం నుంచి తాగునీటిని పొందడం నగరంలో నెలకొన్న నీటి గండానికి సూచికని పీపుల్స్ కాంపెయిన్ ఫర్ రైట్స్ సంస్థ స్థాపకుడు, నీటి నిపుణుడు క్షితిజ అర్స్ వ్యాఖ్యానించారు. నగరంలోని చెరువులు, కొలనుల పరిరక్షణ చేపట్టి ఉంటే ఈ గతి పట్టేది కాదన్నారు. నేత్రావతి నదీ జలాలను మళ్లించే ఎత్తినహొళె పథకం వల్ల ప్రజాధనం దుర్వినియోగం కావడమే తప్ప శాశ్వత నీటి పరిష్కారం ఉండదన్నారు.
- నగరానికి ఏటా 20 టీఎంసీల నీరు అవసరం. చెరువుల పునరుద్ధరణ, వాన నీటి సంరక్షణ వల్ల 15 టీఎంసీలు, మురుగు నీటి శుద్ధీకరణ వల్ల మరో 16 టీఎంసీల నీరు లభిస్తుంది. అంటే అవసరం కంటే 11 టీఎంసీలు ఎక్కువని నీటి నిపుణుడు, భారతీయ విజ్ఞాన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ టి.వి.రామచంద్ర అన్నారు.

బోళ్ల బులిరామయ్య కన్నుమూత

- నాలుగుసార్లు ఎంపీగా...
- కేంద్ర వాణిజ్యశాఖ సహాయ మంత్రిగా సేవలు
- ఆంధ్రా షుగర్స్ సీఎండీగా కొనసాగుతున్న బోళ్ల

ఈనాడు, ఏలూరు: కేంద్ర మాజీ మంత్రి, తెదేపా సీనియరు నేత, తణుకు ఆంధ్రా షుగర్స్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టరు బోళ్ల బులి రామయ్య (92) కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇటీవలి వరకూ హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. వారం రోజుల కిందట ఆయనను పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని స్వగృహానికి తరలించారు. ఇంటివద్దా వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం 7.47 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన సతీమణి కొన్ని సంవత్సరాల కిందటే మరణించారు. భౌతిక కాయాన్ని గురువారం ఉదయం ఆయన స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లా తాటిపాక సమీపంలోని పెదపట్నం అగ్రహారం గ్రామానికి తరలిస్తారు. అనంతరం ఆయన చివరి కోరిక మేరకు పి.గన్నవరం మండలం మానేపల్లి వద్ద వైనతేయ గోదావరి తీరంలో అంత్యక్రియలు నిర్వహిస్తారు. నాలుగు సార్లు ఎంపీగా, ఒకసారి కేంద్ర మంత్రిగా ఆయన సేవలందించారు. 2004 వరకూ ఎంపీగా పని చేసిన ఆయన ఆ తరువాత పోటీ చేయలేదు.



బులిరామయ్య భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న చంద్రబాబు



బోళ్ల బులిరామయ్య (పాత చిత్రం)

కుటుంబ నేపథ్యం: బోళ్ళ బులిరామయ్య తూర్పుగోదావరి జిల్లా పెదపట్నం ఆగ్రహారంలో 1926 జులై 9న బోళ్ల వీర వెంకన్న, రామలక్ష్మి దంపతులకు జన్మించారు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన వెంకటరమణమ్మను వివాహమాడారు. ఆమె ప్రముఖ పారిశ్రామికవేత్త ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్‌కు మేనకోడలు. బులిరామయ్య ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి షుగర్ టెక్నాలజీలో బీఎస్సీ ఆనర్స్, కెమికల్ టెక్నాలజీలో ఎంఎస్సీ పూర్తి చేశారు. అమెరికాలోని విస్కాన్సిన్ వర్సిటీలో కెమికల్ ఇంజినీరింగ్‌లో పీజీతోపాటు హార్వర్డ్ నుంచి మరో పీజీ చేశారు. ఆరిజోనా యూనివర్సిటీ నుంచి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో డాక్టరేట్ పొందారు. ఇస్రో భారత అంతరిక్ష పరిశోధనా కార్యక్రమానికి ద్రవరూప రాకెట్ ఇంధనాన్ని ఆంధ్రా షుగర్స్ నుంచి అందించడం ద్వారా ఆ సంస్థను, తణుకు పేరు దేశవ్యాప్తంగానే గాక అంతర్జాతీయంగా విస్తరించడానికి కారణమయ్యారు.

పార్లమెంటు సభ్యుడిగా... కేంద్ర మంత్రిగా..

1984లో ఏలూరు పార్లమెంటు స్థానం నుంచి తెదేపా అభ్యర్థిగా బులిరామయ్య పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత 1991, 1996, 1999లలోనూ ఏలూరు నుంచే గెలుపొంది 4 పర్యాయాలు ఎంపీగా పని చేశారు. యునైటెడ్ ఫ్రంట్ నేతృత్వంలోని ఐ.కె.గుజ్రాల్ మంత్రివర్గంలో వాణిజ్యశాఖ సహాయ మంత్రిగా 22 నెలల పాటు సేవలందించారు. పరిశ్రమ నిర్వహణలో ఉన్న అపార అనుభవంతో భారతదేశ వాణిజ్య ప్రయోజనాల కోసం, విద్యాసెస్ ద్వారా పాఠశాలల అభివృద్ధికి సర్వశిక్ష అభియాన్ రూపంలో నిధులు అందేందుకు విశేష కృషి చేశారు. కాన్పూర్, మద్రాసు షుగర్ కేన్ టెక్నాలజీ అసోసియేషన్‌లో ప్యాట్రన్‌గా, అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ సంస్థ సభ్యుడిగా పనిచేశారు. జవహర్‌లాల్ యూనివర్సిటీకి విజిటింగ్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. భారత ప్రభుత్వ కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చి సొసైటీ అసోసియేట్ సభ్యుడిగా, షుగర్ టెక్నాలజిస్ట్స్ ఆఫ్ ఇండియా అసోసియేషన్ అధ్యక్షుడిగా, సౌత్ ఇండియా షుగర్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గానూ పనిచేశారు. పార్లమెంటులో ఏర్పాటు చేసిన అనేక కమిటీల్లో సభ్యుడిగా పనిచేసి విలువైన సూచనలు, సలహాలు అందించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో పారిశ్రామిక ప్రగతిని అధ్యయనం చేసేందుకు అనేక దేశాల్లో విస్తృతంగా పర్యటించి పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో నూతన ఆవిష్కరణలకు కృషి చేశారు. ఎంపీ ల్యాడ్స్‌పై ఏర్పాటు చేసిన కమిటీకి ఛైర్మన్‌గా పనిచేసి ఆ నిధుల వినియోగంలో ఎదురవుతున్న సమస్యలకు ఆచరణాత్మకమైన సూచనలు అందించారు.

పార్టీ పెద్దదిక్కును కోల్పోయింది: చంద్రబాబు

బోళ్ల బులిరామయ్య మృతితో పార్టీ పెద్ద దిక్కును కోల్పోయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ముఖ్యమంత్రి తణుకు చేరుకుని బోళ్ల భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బులి రామయ్యతో ఉన్న అనుబంధాన్ని, పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పార్టీలకతీతుడు బోళ్ల: ఉపరాష్ట్రపతి

ఈనాడు, దిల్లీ: బోళ్ల బులిరామయ్య మృతిపట్ల ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సంతాపం ప్రకటించారు. పార్టీలకతీతంగా అందరితోనూ కలుపుగోలుగా ఉంటూ అందరి ప్రేమాభిమానాలు పొందుతూ, ఎల్లవేళలా అభివృద్ధి కోసం బోళ్ల తపించేవారని పేర్కొన్నారు.

న్యాయం జరిగేవరకు పోరాడదాం

- దశలవారీగా కేంద్రంపై ఒత్తిడి పెంచుదాం
- మంత్రులకు చంద్రబాబు స్పష్టం

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి న్యాయం జరిగేంత వరకూ కేంద్రంపై గట్టిగానే పోరాడదామని, అన్ని మార్గాల్లో ఒత్తిడి పెంచుదామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఆయన బుధవారం మంత్రులు యనమల రామకృష్ణుడు, అచ్చెన్నాయుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నక్కా ఆనంద్ బాబు, దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులతో సమావేశమై తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వంలో మంత్రి పదవులు కొత్త కాదని, గతంలో వాజపేయి ప్రభుత్వంలో ఐదారు మంత్రి పదవులు ఇస్తామన్నా తీసుకోలేదని ముఖ్యమంత్రి చెప్పారు. తెదేపా ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని స్పష్టం చేశారు. 'రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై మనం గట్టిగా పోరాడాం. ప్రజల్లో మనకు వచ్చిన ఆదరణ చూసి వైకాపా జీర్ణించుకోలేకపోతోంది. అందుకే ఏవో ఎత్తుగడలకు పాల్పడుతోంది. విమర్శలు చేస్తోంది. రాష్ట్ర విభజన సమయంలోనూ జగన్ ఇలాగే ద్వంద్వ వైఖరి ప్రదర్శించారు' అని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తెలిసింది. కేంద్రంలో అశోక్‌గజపతి రాజు, సుజనా చౌదరి నిర్వహిస్తున్న మంత్రిత్వశాఖలు రాష్ట్రానికి వందల కోట్ల నిధులిచ్చేవేమీ కాదని ఆయన పేర్కొన్నారు. 'మనం కష్టపడుతున్నాం. కేంద్రం ఏదో సహాయం చేస్తుందని ఎదురు చూస్తూ కష్టపడకుండా కూర్చోవాలా? మన కష్టం మనది. అదే సమయంలో పక్క రాష్ట్రాలతో సమానంగా ఎదిగేంత వరకూ చేయూతనివ్వాలని కేంద్రాన్ని కోరుతున్నాం. కానీ తగిన స్పందన లేకపోవడం సరికాదు. రాష్ట్రానికి న్యాయం జరిగేంత వరకూ దశలవారీగా పోరాడదాం. పార్లమెంటు వేదికగా మళ్లీ ఆందోళన చేద్దాం' అని చెప్పారు. పార్లమెంటు సమావేశాలు ముగిశాక రాజీనామాలు చేస్తే ఉప ఎన్నికలు జరిగే అవకాశం లేదన్న చర్చ ఈ సమావేశంలో జరిగింది. రాజీనామాలు చేసినట్టూ ఉండాలని, ఎన్నికలూ జరగకూడదూ అన్న ఉద్దేశంతో వైకాపా నిర్ణయం తీసుకున్నట్లుగా కనిపిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. ఈ సందర్భంగా రిలయన్స్ సంస్థల అధినేత ముఖేష్ అంబానీతో తన సమావేశం గురించి ముఖ్యమంత్రి ప్రస్తావించారు. రియల్ టైం గవర్నెన్స్ కేంద్రాన్ని, అక్కడ వాడుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని చూసి ఆయన ఎంతో ఆశ్చర్యానికి గురయ్యారని తెలిపారు. 'ఆయన ఆసియాలోనే ధనవంతుడు. అలాంటి వ్యక్తి మనం టెక్నాలజీని వినియోగిస్తున్న తీరు చూసి ఆశ్చర్యపోయారు. దీన్ని ఊహించలేదని చెప్పారు' అని సీఎం పేర్కొన్నారు.

ఎంపీల రాజీనామా.. డ్రామానే!

- జగన్‌పై ఏపీ మంత్రుల ధ్వజం

ఈనాడు అమరావతి: ఒక పక్క కేంద్ర ప్రభుత్వంతో అన్ని విధాలా లాలూచీ పడుతూ.. మరోపక్క ఎంపీల రాజీనామా పేరుతో వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి మరో డ్రామాకు తెరతీశారని ఆంధ్రప్రదేశ్ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కె.అచ్చెన్నాయుడు, నక్కా ఆనంద బాబు ధ్వజమెత్తారు. 'జగన్ వంటి నేరస్థుడిని ఎక్కడా చూడలేం. ప్రత్యేక హోదా ఇవ్వకపోతే రాజీనామాలు చేస్తామని 2016లోనే ప్రకటించారు. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం 3 బడ్జెట్లు పెట్టింది. ఇన్నాళ్లూ నిద్రపోతున్నారా? రాజీనామాలు ఎందుకు చేయలేదు? ఇప్పుడూ పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పుడు రాజీనామాలు చేస్తామనడం లేదెందుకు? ఏప్రిల్ 6 వరకూ గడువెందుకు? మరో సంవత్సరంలో సాధారణ ఎన్నికలు జరుగుతుండగా రాజీనామాలు చేసినా ఉప ఎన్నికలు జరగవు. ప్రత్యేక హోదా వంటి ఏదో అంశంతో ముడిపెట్టి రాజీనామాలు చేస్తే స్పీకరు ఆమోదించరు. అవన్నీ తెలిసే జగన్ ఈ కొత్త నాటకం మొదలెట్టారు' అని మంత్రులు మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం ఉదయం సచివాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులతో సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. అనంతరం మంత్రులు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై పార్లమెంటులో మొదట పోరాటం ప్రారంభించింది తమ పార్టీ ఎంపీలేనని, కేంద్రంలో మంత్రిగా ఉండీ సుజనా చౌదరి రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాల కోసం పార్లమెంటు వేదికగా గట్టిగా నిలదీశారని పేర్కొన్నారు. ప్రత్యేక హోదాతో సమానమైన అన్ని ప్రయోజనాలు, ఆర్థిక వనరులు సమకూరుస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చినందుకే ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించామేతప్ప, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీ పడలేదని స్పష్టం చేశారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని కేంద్రం సరిదిద్దకపోతే? కేంద్రంలోని మీ మంత్రులు రాజీనామా చేస్తారా? అన్న ప్రశ్నకు... కేంద్ర ప్రభుత్వం చివరి నిమిషంలోనైనా రాష్ట్రానికి న్యాయం చేస్తుందన్న నమ్మకం ఉందని, చేయకపోతే అప్పుడు నిర్ణయమేంటో ప్రకటిస్తామని బదులిచ్చారు.

కనుమరుగవుతామనే.. మంత్రి నారాయణ: రాజకీయంగా కనుమరుగవుతామని భయపడే వైకాపా అధ్యక్షుడు జగన్ వారి పార్టీ ఎంపీలతో రాజీనామాలంటూ మరో జగన్నాటకానికి తెరదీశారని ఏపీ పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. బుధవారం అమరావతిలో మాట్లాడుతూ.. "కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటిరోజునే వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి బ్రహ్మాండంగా ఉందంటూ వ్యాఖ్యానించారు. అలా అంటే తప్ప మనం కేసుల నుంచి బయటపడలేమని జగన్ చెబితే అన్నారా అనేది విజయసాయిరెడ్డి సమాధానమివ్వాలి. హోదాను తాకట్టు పెట్టారంటూ జగన్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. ఇలాగే మాట్లాడితే ప్రజలు ఆయనకు మున్ముందు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వరు. తెదేపా ఒత్తిడి, ఎంపీల పోరాటంతో మార్చి 5నాటికి కేంద్రం రాష్ట్రానికి సాయం చేసేస్తుందేమోనని జగన్ భయపడే రాజీనామాలంటూ నాటకాలాడుతున్నారు." అని ధ్వజమెత్తారు. ముకేశ్ అంబానీని ప్రత్యేకదూతగా కేంద్రం పంపిందనడంలో వాస్తవం లేదని స్పష్టంచేశారు.

రాజకీయ లబ్ధికే.. మంత్రి గంటా: ప్రతిపక్ష నేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రాజకీయ లబ్ధి పొందేందుకు మళ్లీ ప్రత్యేక హోదా విషయంలో కొత్త నాటకానికి తెరలేపారని ఏపీ మానవ వనరుల అభివృద్ధి మంత్రి గంటా శ్రీనివాసరావు ఆరోపించారు. విశాఖలో బుధవారం మాట్లాడుతూ గతంలో మూడు సార్లు తమ ఎంపీలతో రాజీనామాలు చేయిస్తానని జగన్ బీరాలు పలికారని, తర్వాత ఆ విషయాన్నే విస్మరించారన్నారు.



పట్టాలకెక్కని 'హోదా'.. సైకిలెక్కిన ఆందోళన

తిరుపతి(తాతయ్యగుంట), న్యూస్‌టుడే: ప్రత్యేక హోదా.. ఆంధ్రుల హక్కు.. భాజపా బాధ్యత.. ప్రత్యేక హోదా ఐదు అక్షరాల పదం కాదు.. 5కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవం... అనే నినాదాలతో కూడిన సైకిల్‌పై తిరుపతి నుంచి దిల్లీకి సైకిల్‌యాత్ర చేపట్టారు పశ్చిమగోదావరి జిల్లా వీరవాసం మండలం మెంటేపూడికి చెందిన కొల్లా వెంకట్. యాత్రను బుధవారం అలిపిరి శ్రీవారి పాదాల మండపం నుంచి ప్రారంభించారు. ఎన్నికల ముందు ప్రధాని మోదీ శ్రీవారి పాదాల చెంత ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించారని.. ఆ విషయాన్ని గుర్తు చేసేందుకు సైకిల్ యాత్రను శ్రీవారి పాదాల మండపం నుంచి ఆరంభించినట్లు తెలిపారు.

జగన్‌వి నాటకాలు: జేసీ

ఈనాడు, అమరావతి: ఎన్నికలొస్తున్నాయనే వైకాపా అధ్యక్షుడు జగన్ ఆయన పార్టీ ఎంపీలతో రాజీనామాలంటూ నాటకాలాడుతున్నారని తెదేపా ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి విమర్శించారు. "ఏప్రిల్ తర్వాత రాజీనామాలు చేస్తే ఉప ఎన్నికలు రావు కాబట్టే అప్పుడు చేయాలని నిర్ణయించారు. రెండేళ్ల కిందే రాజీనామాలన్నారు, తర్వాత పలకలేదు.. మాటమీద నిలబడే వ్యక్తిత్వం చిత్తశుద్ధి జగన్‌కు ఉంటే వెంటనే వారి ఎంపీలతో రాజీనామా చేయించి ప్రజల్లోకి రావాలి" అన్నారు. "మోదీ మాకు నామాలు పెట్టారు.. ఆయనలాగే ఇప్పుడు రాజీనామాల పేరుతో జగన్ నామాలు పెడతామంటున్నారు. ఉప ఎన్నికలు ఇప్పుడు జరిగితే అటు మోదీ, ఇటు జగన్ సంగతిని ప్రజలు తేలుస్తారు. కేంద్ర సాయం విషయంలో అమీతుమీ తేల్చుకునే సమయమిది. అవసరమైతే తెగతెంపులకు వెనకాడరాదని నేను ముఖ్యమంత్రికి సూచిస్తాను" అన్నారు. వైకాపా ఎంపీలు రాజీనామా చేస్తే ఆ ఒత్తిడి మాపైనా కచ్చితంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. బుధవారం ఆయన ముఖ్యమంత్రిని కలిసేందుకు వెలగపూడిలోని సచివాలయానికి వచ్చారు.

ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే ఎంవీ కృష్ణారావు కన్నుమూత



ఎంవీ కృష్ణారావు (దాచిన చిత్రం)

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు డా.ఎంవీ కృష్ణారావు (81) బుధవారం కన్నుమూశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసగృహంలో తుదిశ్వాస విడిచారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉన్న కృష్ణారావు 1983, 1985, 1989, 1999లలో ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా విజయం సాధించారు. అసెంబ్లీ ప్యానెల్‌స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

దెందులూరు ఎమ్మెల్యే చింతమనేనికి రెండేళ్ల జైలు

భీమడోలు, న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ చింతమనేని ప్రభాకర్‌కు భీమడోలులోని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. 2011 నవంబరు 26న దెందులూరులోని ఉన్నత పాఠశాలలో అప్పటి రాష్ట్ర మంత్రి వట్టి వసంతకుమార్ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో చింతమనేని ప్రభాకర్‌కు, వట్టి వసంతకుమార్‌కు మధ్య వాగ్వాదం తోపులాటకు దారితీసింది. మంత్రి గన్‌మెన్ ఎం.సుబ్బారావు ఫిర్యాదుతో దెందులూరు పోలీసులు కేసు నమోదు చేశారు. భీమడోలులోని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కె.దీపదైవకృప బుధవారం తీర్పునిచ్చారు. ప్రధాన ముద్దాయి చింతమనేని ప్రభాకర్‌కు సెక్షన్ 353 ప్రకారం ఆర్నెల్ల జైలు, రూ.1,000 జరిమానా, 7(1) సెక్షన్ ప్రకారం ఆర్నెల్ల జైలు, రూ.500 జరిమానా, సెక్షన్ 506-2 ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించారు. మొదటి రెండు సెక్షన్లలో విధించిన ఆరేసి నెలల చొప్పున జైలుశిక్షను రెండేళ్ల శిక్షలో భాగంగా ఏకకాలంలో అనుభవించాలని తీర్పు ఇచ్చారు. దీనిపై చింతమనేని ప్రభాకర్ నెలలోపు జిల్లా కోర్టుకు అప్పీల్ చేసుకునేలా ఇద్దరు వ్యక్తుల పూచీకత్తులతో బెయిలు మంజూరు చేశారు.

సర్కారు వైద్యానికి నాణ్యత పరీక్ష

- జాతీయ స్థాయి గుర్తింపునకు సన్నద్ధం
- రాష్ట్రంలో ఇప్పటికే ఒక పీహెచ్‌సీకి గుర్తింపు
- మరో 214 దవాఖానాల్లోనూ చేపట్టాలని ప్రతిపాదనలు

ఈనాడు – హైదరాబాద్

సర్కారు ఆసుపత్రిలో వైద్యం లభించడమే మహాభాగ్యం.. అలాంటిది నాణ్యతా ప్రమాణాల గురించి మాట్లాడడం అత్యాశే అవుతుందేమో! ఈ భావనను తొలగించి.. కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులకే సాధ్యమైన నాణ్యతా ప్రమాణాల గుర్తింపును ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ సాధించేలా తెలంగాణ ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోంది. 2016-17లో ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నాణ్యతా ప్రమాణాల పరిరక్షణలో జాతీయ స్థాయి గుర్తింపును సాధించింది. రాష్ట్రంలోని మరో 214 ప్రభుత్వ ఆసుపత్రులకూ 'జాతీయ నాణ్యతా ప్రమాణాల హామీ (ఎన్‌క్వాస్)' సంస్థ గుర్తింపు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఆదిలాబాద్ జిల్లా దంతన్‌పల్లి, ఇంద్రవల్లి, ఇచ్చోడ, మహబూబ్‌నగర్ జిల్లా జానంపేట, నల్గొండ జిల్లా వేములపల్లి పీహెచ్‌సీల్లో నాణ్యతా ప్రమాణాల పరీక్షకు ప్రతిపాదనలు పంపింది. మిగిలిన ఆసుపత్రుల సమాచారాన్ని ఈ నెలాఖరు నుంచి పంపిస్తామని తెలంగాణ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ కరుణ చెప్పారు.

ఏమిటీ నాణ్యత?

వైద్యసేవల్లో మెరుగైన నాణ్యతా ప్రమాణాలను పాటించే ఆసుపత్రులకు గుర్తింపునిచ్చే అంతర్జాతీయ సంస్థ ఇస్క్వా (ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ క్వాలిటీ ఆన్ హెల్త్‌కేర్). మన దేశంలో ఇందుకోసం ఆసుపత్రుల జాతీయ గుర్తింపు సంస్థ (ఎన్‌ఏబీహెచ్) పనిచేస్తోంది. దేశం మొత్తమ్మీద 437 పెద్ద ఆసుపత్రులు, 88 చిన్నతరహా ఆసుపత్రులు మాత్రమే ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు పొందాయి. కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ 2016లో ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ నాణ్యతా ప్రమాణాలను అమలు చేయడానికి 'ఎన్‌క్వాస్'ను ప్రవేశపెట్టింది. ఎన్‌ఏబీహెచ్, ఎన్‌క్వాస్ కూడా ఇస్క్వా నిబంధనలనే పాటిస్తాయి.

కొలమానాలేమిటి?

- జిల్లా/ ప్రాంతీయ ఆసుపత్రిలో 362 అంశాలను, సామాజిక ఆరోగ్య కేంద్రంలో 290, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 250, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 198 అంశాలను కొలమానాల్లో పరీక్షిస్తారు.
- రోగుల సంఖ్యకు తగ్గట్లుగా వైద్యులు, నర్సులు న్నారా? సిబ్బందికి నిరంతర శిక్షణ ఇస్తున్నారా?
- ఇన్‌ఫెక్షన్ల నియంత్రణ, జీవవ్యర్థాల నిర్వహణలో అనుసరిస్తున్న విధానాలు?
- సాంకేతికతలో నైపుణ్యం పొందడం, అమలులో ప్రగతి?
- రోగులకు సంతృప్తికరమైన సేవలందిస్తున్నారా? రెండోసారి చికిత్స అందించాల్సిన కేసులెన్ని? తదితర అంశాలను పరిశీలిస్తారు.
- రాష్ట్రస్థాయి బృందం పరిశీలించి సంతృప్తి చెందితే ఎన్‌క్వాస్‌కు ప్రతిపాదనలు పంపిస్తారు. ఎన్‌క్వాస్ బృందం పరిశీలించి అన్ని విభాగాల్లోనూ 70 శాతానికి పైగా మార్కులు సాధిస్తే గుర్తింపుపత్రం ఇస్తుంది. ఇది మూడేళ్లు చెల్లుబాటవుతుంది.

ఏమిటి ప్రయోజనం?

- కనీసం 70 శాతం మార్కులు సాధించిన జిల్లా/ ప్రాంతీయ ఆసుపత్రి/ సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఒక్కో పడకకు 10 వేల చొప్పున కేంద్రం ప్రోత్సాహకం అందిస్తుంది. ఉదాహరణకు 300 పడకలుంటే ఏడాదికి రూ.30 లక్షలు ఇస్తుంది. ప్రాథమిక/ పట్టణ ఆరోగ్య కేంద్రానికి ఏడాదికి రూ.3 లక్షల చొప్పున లభిస్తాయి.
- 65- 69 శాతం సాధించిన ఆసుపత్రులకు పడకకు రూ.7వేల చొప్పున, పీహెచ్‌సీలకు ఏడాదికి రూ.2 లక్షల చొప్పున ఇస్తారు.
- వీటిలో 75 శాతం నిధులు ఆసుపత్రి అభివృద్ధి సంస్థకు, 25 శాతం ఆసుపత్రిలో సిబ్బందికి ఇస్తారు.

రాష్ట్రంలో ప్రతిపాదిస్తున్న ఆసుపత్రులివి

జిల్లా ఆసుపత్రులు: కింగ్‌కోఠి, ఖమ్మం, కరీంనగర్.

ప్రాంతీయ ఆసుపత్రులు: కామారెడ్డి, కొత్తగూడెం, బాన్సువాడ, భద్రాచలం, జనగాం, సూర్యాపేట, కల్వకుర్తి, కొండాపూర్, వనస్థలిపురం, జహీరాబాద్, సిరిసిల్ల.

సామాజిక ఆరోగ్య కేంద్రాలు: 50

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 150

గెలుపు ఏక పక్షమే!

☛ పుతిన్ నాలుగోసారి అధ్యక్షుడు కావడం తథ్యం!! ☛ దేశాన్ని గట్టెక్కించాడని నమ్ముతున్న రష్యన్లు ☛ నియంత అంటున్న విపక్షాలు



గిట్టని వారి దృష్టిలో ఆయన మరో జార్ చక్రవర్తి. ప్రపంచ దేశాల దృక్కోణంలో ఆయనో నియంత. రష్యా ప్రతిపక్షం మాటల్లో.. ప్రజాస్వామ్య హంతకుడు. దేశంలోని మెజారిటీ ప్రజల దృష్టిలో రష్యాకు రక్షకుడు. ..ఆయనే వ్లాదిమిర్ పుతిన్!! మరోమారు రష్యా అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం ఖాయంగా కనిపిస్తున్న పుతిన్ వ్యవహార శైలిపై బోలెడన్ని విమర్శలు.. ఎన్నెన్నో వివాదాలు.. మరెన్నో పొగడ్తలు! మార్చి 18న జరిగే రష్యా అధ్యక్ష ఎన్నికల్లో 65 ఏళ్ల పుతిన్ తిరిగి ఘన విజయం సాధించడం తథ్యమన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. పుతిన్ నియంతృత్వ పాలనలో ఏకపక్ష ఓటింగ్, రిగ్గింగేనన్న విమర్శలూ వెల్లువెత్తుతున్నాయి.



పుతిన్‌ను తీవ్రంగా వ్యతిరేకించే అలెక్సీ నవల్నీ ఎన్నికల్లో పోటీచేయకుండా నిషేధం విధించారు.

రాజ్యాంగాన్ని సవరించి...

రష్యా రాజ్యాంగం ప్రకారం.. ఒక వ్యక్తి రెండు సార్లకు మించి అధ్యక్ష బాధ్యతలు చేపట్టడానికి వీల్లేదు. దీంతో 2008లో తనకు సన్నిహితుడైన దిమిత్రి మెద్వదేవ్‌ను అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టిన పుతిన్- ఆ సమయంలో ప్రధానిగా పనిచేశారు. మెద్వదేవ్ పేరుకే అధ్యక్షుడు. పెత్తనమంతా పుతిన్‌దే. తిరిగి అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు వీలుగా 2008లో రాజ్యాంగాన్ని సవరింపజేశారు. అధ్యక్ష పదవీ కాలాన్ని నాలుగు నుంచి ఆరేళ్లకు పొడిగించారు. 2012లో మళ్లీ అధ్యక్షుడిగా విజయం సాధించిన పుతిన్.. ఆరేళ్లుగా అ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఆపత్కాలంలో అధ్యక్షుడిగా..


బోరిస్ ఎల్సిన్ హయాంలో రష్యా పూర్తిగా పతనం అంచుల్లోకి వెళ్లిపోయింది. దేశంలో అంతర్యుద్ధం తలెత్తినంత పనయింది. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. ఈ పరిస్థితుల్లో సైన్యం తిరుగుబాటు చేయడంతో ఎల్సిన్ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. పుతిన్‌ను తాత్కాలిక అధ్యక్షుడిగా నియమించారు. మొదట్లో మూడునెలలు తాత్కాలిక ప్రధానిగా పనిచేసిన పుతిన్- 2000 సంవత్సరం దాకా తాత్కాలిక అధ్యక్షుడిగా ఉన్నారు. 2000లో పూర్తిస్థాయి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

మళ్లీ గెలిస్తే.. నాలుగో సారి

రష్యాను దాదాపు 18 ఏళ్లుగా ఏకఛత్రాధిపత్యంతో పాలిస్తున్న పుతిన్– ఈ మారు గెలిస్తే నాలుగోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన వ్యక్తి అవుతారు.

తొలిసారి అధ్యక్షుడిగా...	2000-2004
రెండోసారి...	2004-08
రష్యా ప్రధానిగా	2008-12
మూడోసారి అధ్యక్షుడిగా	2012-2018

జూడో యోధుడైన పుతిన్ దూకుడు నిర్ణయాలకు పెట్టింది పేరు. ఉక్రెయిన్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని.. క్రిమియాను రష్యాలో విలీనం చేయడం, సిరియాలో బాంబు దాడులు, చెచెన్యాలో తిరుగుబాటుదారుల ఏరివేత, జార్జియా బలగాల్ని తరిమికొట్టి ఆబ్కాజియా, సౌత్ ఒసేటియాలను స్వాధీనం చేసుకోవడం... ఇత్యాది చర్యల్లో పుతిన్ దూకుడుతనం కనిపిస్తాయి. చెచెన్యాలోకి యుద్ధ విమానంలో వెళ్లడం, చొక్కా విప్పి గుర్రపు స్వారీ చేయడం, బైకర్స్ గ్యాంగ్‌లో మోటార్‌సైకిల్ నడపడం,



జలాంతర్గామిలో సవారీ.. ఇత్యాదివి ఆయన సాహస మనస్తత్వాల్ని తెలియజేస్తాయి.

నిరంకుశంగా ముందుకు...

తొలిసారిగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన వెంటనే పుతిన్ మీడియాను లొంగదీసుకున్నారు. రష్యాలో అధికారాన్ని నిర్ణయించే స్థాయిలో ఉన్న చమురు, గ్యాస్ వాణిజ్యంపై పట్టు బిగించారు. కోర్టులు, ప్రాసిక్యూటర్లు తనకు ఎదురు చెప్పకుండా చేసుకున్నారు. పుతిన్ ప్రభుత్వంలో 'సిలోవికి'(సైనిక భద్రతా వ్యవస్థ) దేశంలోని రాజకీయ, ఆర్థిక వ్యవస్థల్ని నియంత్రిస్తూ ఉంటుంది. సిలోవికిలో ఎక్కువమంది పుతిన్ మిత్రులు, గతంలో నిఘా సంస్థల్లో పనిచేసిన వారు సభ్యులు. రాజకీయంగా ఉన్నతస్థానాల్లో ఉన్నవారు ఈ వ్యవస్థలో 25 శాతం మంది దాకా ఉంటారు.

ఆర్థికంగా కుదుట

పుతిన్ మొదటిసారిగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన వెంటనే సరళీకృత ఆర్థిక విధానాలకు శ్రీకారం చుట్టారు. ఆదాయపు పన్నును ఒకే శ్లాబ్ కింద 13 శాతంగా నిర్ధారించారు. కార్పొరేట్ పన్నును 35 నుంచి 24 శాతానికి తగ్గించారు. కొత్తగా భూ సంస్కరణలు, పౌరస్మృతుల్ని ప్రవేశపెట్టారు. దీంతో దారిద్ర్యం తగ్గి స్థూలజాతీయోత్పత్తి గణనీయంగా పెరిగింది. జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. 1999లో 2 శాతం ఉన్న జీడీపీ వృద్ధి రేటు 5-10 శాతానికి పెరిగింది. నెలసరి కనీస వేతనం 61 డాలర్ల నుంచి 652 డాలర్లకు, పెన్షన్లు 20 డాలర్ల నుంచి 221 డాలర్లకు పెరిగాయి. నిరుద్యోగం 13 శాతం నుంచి 5.2 శాతానికి తగ్గింది. కొనుగోలు శక్తి పరంగా చూస్తే రష్యా ప్రస్తుతం ప్రపంచంలో ఆరో ఆర్థిక వ్యవస్థ. జీడీపీ 4 లక్షల కోట్ల డాలర్లు. గత 18 ఏళ్లలో రష్యా ఆర్థిక వ్యవస్థ 600 శాతం మేర పెరిగింది. పుతిన్ అధికారంలోకి వచ్చేనాటికి 36.5 శాతం ఉన్న ద్రవ్యోల్బణం 2017 చివరి నాటికి 2.5 శాతానికి తగ్గింది. పుతిన్ గద్దెనెక్కిన 2000 సంవత్సరంలో రష్యాకు కేవలం 1200 కోట్ల డాలర్ల విదేశీ మారకపు నిల్వలున్నాయి. అప్పులు దేశ జీడీపీలో 92.1 శాతం మేర ఉన్నాయి. ఇప్పుడు పరిస్థితులు మారిపోయి అప్పులు 17.4 శాతానికి తగ్గిపోయాయి. విదేశీ మారకపు నిల్వలు 35600 కోట్ల డాలర్లకు పెరిగాయి. బంగారం నిల్వలు 1838.21 టన్నులకు పెరిగాయి. రష్యా ఆర్థిక వ్యవస్థలో చమురు, గ్యాస్ నిల్వలదే పైచేయి. ఆయుధ విక్రయాల ద్వారానూ భారీగా ఆదాయం సమకూరుతుంది. ఈ మధ్యకాలంలో వ్యవసాయమూ పుంజుకుంది. 2017లో రష్యా రికార్డు స్థాయిలో 13 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల్ని ఉత్పత్తిచేసింది. గోధుమల ఎగుమతులు 4 నుంచి 16 శాతానికి పెరిగాయి.

గూఢచారి నుంచి అధ్యక్షుడి దాకా..

- 1952 అక్టోబరు 7న లెనిన్‌గ్రాడ్(ప్రస్తుతం సెయింట్ పీటర్స్‌బర్గ్)లో జననం.
- న్యాయశాస్త్రంలో పట్టాపొందిన పుతిన్- ఆ తర్వాత సోవియట్ సీక్రెట్ సర్వీస్ కేజీబీలో చేరారు.
- తూర్పు జర్మనీలో గూఢచారిగా పనిచేశారు.
- 1997లో ఎల్సిన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అధ్యక్ష భవనం క్రెమ్లిన్‌లో చేరి.. ఫెడరల్ సెక్యూరిటీ చీఫ్‌గా పనిచేశారు. ఆ తర్వాత తాత్కాలిక ప్రధానమంత్రి అయ్యారు.
- 1999లో ఎల్సిన్ అధ్యక్ష బాధ్యతల నుంచి వైదొలిగి పుతిన్‌ను తాత్కాలిక అధ్యక్షుడిగా నియమించారు.

ఉత్పత్తి, సాంకేతిక రంగాల్లో వెనుకబాటే

చైనా, అమెరికాలాంటి దేశాలతో పోల్చిచూసినపుడు. . ఉత్పత్తి, సాంకేతిక రంగాల్లో రష్యా వెనుకబాటుతనం స్పష్టంగా కనిపిస్తుంది. ఫలానా రంగంలో రష్యా లీడర్‌గా ఉంది అని చెప్పుకునే పరిస్థితి లేదు. ఉత్పాదక రంగాన్ని విపరీతంగా విస్తరించిన చైనా- రష్యాకు అందనంత ఎత్తులో ఉంది. చైనా ఎగుమతులు 2 లక్షల కోట్ల డాలర్లయితే.. రష్యా ఎగుమతులు 52800 కోట్ల డాలర్లు మాత్రమే. ఒక్క ఆయుధ రంగంలో తప్ప.. మిగతా సాంకేతిక పరిజ్ఞానం విషయంలో రష్యా వెనుకబాటు ఉంది. ఐటీ ఉత్పత్తుల్లో అమెరికా, మరికొన్ని ఐరోపా దేశాల కన్నా రష్యా ఎంతో వెనుకబడి ఉంది.

-ఈనాడు ప్రత్యేక విభాగం

'నూతన తమిళనాడు కోసమే నా ప్రయత్నం'

- రాష్ట్రవ్యాప్త పర్యటన చేపడతా..
- 'భారతీయుడు-2' చివరి సినిమా: కమల్‌హాసన్

ఈనాడు డిజిటల్, చెన్నై: 'రాజకీయాల్లోకి ప్రవేశం జరిగిపోయింది. దానిపైనే పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాను. కొత్త పాత్రలో ఎలా ఇమడాలన్న దానిపైనే కసరత్తు చేస్తున్నా. ఇకపై సినిమాల్లో నటించలేన'ని విశ్వనటుడు కమల్‌హాసన్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన ప్రముఖ టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ.. 'విశ్వరూపం-2', ఆ తర్వాత రాబోయే 'భారతీయుడు-2' తర్వాత తన చేతిలో మరో సినిమా లేదన్నారు. ఇక తాను ఫిర్యాదులకే పరిమితం కాదల్చుకోలేదని స్పష్టం చేశారు. నూతన తమిళనాడు కోసం తాను ప్రయత్నిస్తున్నానన్నారు. ఈ నెల 21న రామనాథపురంలో పార్టీని ప్రారంభించడంతోపాటు రాష్ట్రవ్యాప్త పర్యటన కూడా చేపడతానని తెలిపారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం, వారికి మౌలిక వసతులు కల్పించడం ముఖ్యమని వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, విద్యుత్తు, స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించలేనివి కావని.. తాను దత్తత తీసుకున్న గ్రామంలోనూ వాటి కొరత ఉందని చెప్పారు. నటుడిగా ఎంతో సాధించానని, 63 ఏళ్ల వయసులో కావాల్సినంత సంపాదించానని, ఏనాడూ ఖాతాలో నగదును పెంచుకోవాలని చూడలేదని పేర్కొన్నారు. అతి త్వరలో ఎన్నికల కమిషన్‌లో తన పార్టీ పేరు కమల్ నమోదు చేయనున్నారని సమాచారం.

రజనీ సన్నాహాలు..: మరోవైపు రజనీకాంత్ కూడా రాజకీయ ప్రవేశం నేపథ్యంలో దానికి అనుగుణంగా ముందుకు సాగుతున్నారు. బుధవారం కూడా చెన్నైలో మండ్రం ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ ప్రారంభం, ఇతర అంశాలపై ప్రధానంగా వారితో చర్చించారు.

చిన్నారుల సంక్షేమానికి సాంకేతిక శక్తి

- ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న బాలల రక్షణకు ఆధునిక వనరులను ఉపయోగించండి
- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన పసివాళ్లు, ప్రమాదకర పరిశ్రమలలో పనిచేసే బాలలు, లైంగిక దోపిడీకి గురయ్యే చిన్నారులు వంటి వారిని గుర్తించి రక్షించటానికి ఆధునిక సాంకేతిక వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. ఆధునిక సాంకేతికాభివృద్ధిలో దేశం పురోగతి సాధించిందని చెప్పుకోవటం వల్ల ఉపయోగంలేదని, దానిని చిన్నారుల సంక్షేమం కోసం వినియోగించాలని జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ దీపక్ మిశ్రలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. బాలల న్యాయవిచారణ మండళ్లు, శిశుసంక్షేమ మండలి కమిటీలు ఆధునిక వసతులైన కంప్యూటర్లు, ఇంటర్నెట్ సదుపాయాలలేమిని ఎదుర్కోవటంపై విచారం వ్యక్తం చేసింది. తక్షణం ఆయా మండళ్లు, కమిటీలకు వాటిని సమకూర్చాలని ధర్మాసనం ఆదేశించింది. మూడు నెలలకోసారి సంబంధిత శాఖలు తమ వద్ద ఉన్న సమాచారాన్ని నవీకరించుకోవాలని, సమాచార, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని మహిళాశిశు సంక్షేమ మంత్రిత్వశాఖను ఆదేశించింది. బాల న్యాయచట్టం, దానిలోని నిబంధనలు సక్రమఅమలుకు సంబంధించి దాఖలైన వ్యాజ్యంపై తీర్పు సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది.

నేపాల్ తదుపరి ప్రధానిగా కె.పి.ఓలి

కాఠ్‌మాండూ: నేపాల్ తదుపరి ప్రధానిగా సీపీఎన్-యూఎంఎల్ ఛైర్మన్ కె.పి.ఓలి(65)ని పార్టీ బుధవారం ఎంపిక చేసింది. పార్టీ స్థాయీ సంఘం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఓలి గతంలో 2015, అక్టోబరు 11 నుంచి 2016, ఆగస్టు 3 వరకు ప్రధానిగా పని చేశారు. ఈయన చైనా అనుకూల వైఖరిని అవలంబిస్తారు. 275 స్థానాలున్న నేపాల్ పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో ఓలి నేతృత్వంలోని సీపీఎన్-యూఎంఎల్ వామపక్షకూటమికి, ప్రచండ నేతృత్వంలోని సీపీఎన్-మావోయిస్టు సెంటర్‌కు కలిపి 174 స్థానాలు వచ్చాయి.

8976 హెక్టార్లలో పంటనష్టం

ఈనాడు, హైదరాబాద్: అకాల వర్షాలు, వడగండ్ల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 8,976 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ బుధవారం ప్రభుత్వానికి నివేదించింది. మొక్కజొన్న 4,166, జొన్న 3,038, వరి 576, సెనగ 990 హెక్టార్లలో దెబ్బతిన్నదని, వడగండ్ల వల్ల పూత, కాత నేల రాలడంతోపాటు..నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో పైర్లు నేల వాలాయని తెలిపింది. దెబ్బతిన్న పంటలకు బీమా చేయించి ఉంటే..వెంటనే బీమా కంపెనీలకు సమాచారం అందించాలని రైతులకు వ్యవసాయశాఖ సూచించింది.

మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించండి


ప్రధానికి..సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ లేఖ

ఆసియాలో గుర్తింపు పొందిన అతిపెద్ద మేడారం ఆదివాసీ జాతరకు జాతీయ పండుగ హోదా కల్పించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ప్రధాని మోదీని కోరారు. రెండేళ్లకోసారి నిర్వహించే ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి కోటిన్నర మంది హాజరవుతారని తెలిపారు. జాతీయ హోదా కల్పించడం ద్వారా అక్కడ శాశ్వతంగా వసతులు కల్పించేందుకు సహకరించాలని కోరుతూ...బుధవారం ప్రధానికి లేఖ రాశారు.

బయోమెట్రిక్ అమలుపై మీనమేషాలు

- జేఎన్‌టీయూలో పీజీ కోర్సులకే పరిమితం
- పట్టించుకోని ఓయూ, కాకతీయ విశ్వవిద్యాలయాలు

ఈనాడు, హైదరాబాద్: విద్యార్థులు, అధ్యాపకుల హాజరుకు బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా కొన్ని విశ్వవిద్యాలయాలు బేఖాతరు చేస్తున్నాయి. పీజీ కోర్సులకు మాత్రం జేఎన్‌టీయూ గత ఏడాది నుంచి అమలు చేస్తోంది. ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర కోర్సులను జేఎన్‌టీయూ పరిధిలోని కళాశాలల్లో చదివితే మంచి డిమాండ్ ఉంటుందన్న అభిప్రాయం మొదటి నుంచి ఉంది. అయితే బయోమెట్రిక్ హాజరు కారణంగా జేఎన్‌టీయూలో ఎంటెక్, ఎంఫార్మసీ ప్రవేశాలు తగ్గిపోయాయని ఆచార్యులు చెబుతున్నారు. అన్ని విశ్వవిద్యాలయాలకు ఒకే తరహా విధానం ఎందుకు అమలు చేయరని వారు ప్రశ్నిస్తున్నారు. ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలని రెండేళ్ల నుంచి ప్రభుత్వం ఆదేశిస్తోంది. జేఎన్‌టీయూ మాత్రం 2017-18 విద్యా సంవత్సరం నుంచి తన పరిధిలోని అనుబంధ కళాశాలల్లోని పీజీ కోర్సుల్లో అమలు చేస్తుంది. రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం 82 ఎంటెక్ కళాశాలలుండగా అందులో 5,996 సీట్లున్నాయి. వాటిల్లో 4,736 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఓయూ, కేయూలో ఎంటెక్ కళాశాలలు కేవలం 15 మాత్రమే ఉండగా జేఎన్‌టీయూలో 67 ఉన్నాయి. భర్తీ అయిన సీట్లలో సగం ఓయూ, కేయూలో ఉండటం గమనార్హం. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, గవర్నర్ నరసింహన్ ఆయా విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో గత అక్టోబరులో సమావేశం ఏర్పాటు చేసినప్పుడు బయోమెట్రిక్ హాజరు అమలు చేస్తామని అన్ని వర్సిటీలు అంగీకరించాయి. ఇప్పుడు పట్టించుకోవడం లేదు.



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అంతర్జాతీయ సైకతశిల్పి సుదర్శన్ పట్నాయక్ బుధవారం ఒడిశాలోని పూరీ సముద్రతీరంలో భారీ సైకత కళాఖండం రూపొందించారు. ప్రపంచశాంతి కోరుతూ.. తన 25 మంది శిష్యులతో 8 గంటల పాటు శ్రమించి 108 శివలింగాలతో దీన్ని రూపొందించినట్టు పట్నాయక్ ఈ సందర్భంగా తెలిపారు.

– న్యూస్‌టుడే, భువనేశ్వర్ అర్బన్

రైతు సమస్యలపై జాతీయ సదస్సుకు ప్రధాని పిలుపు

ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహణ

దిల్లీ: రైతుల ఆదాయం 2022నాటికి రెట్టింపు చేసే లక్ష్యం దిశగా.. వ్యవసాయ, అనుబంధ రంగాల సమస్యలపై చర్చించేందుకు గాను జాతీయ సదస్సు నిర్వహణకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఈమేరకు కేంద్ర వ్యవసాయ శాఖ ఈనెల 19, 20 తేదీల్లో దిల్లీలోని పుసా కాంప్లెక్స్ వద్ద సదస్సు నిర్వహించనుంది. ప్రధాని రెండో రోజున పాల్గొంటారని వ్యవసాయ కార్యదర్శి ఎస్.కె.పట్నాయక్ తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి రాధా మోహన్‌సింగ్‌తో పాటు నీతి ఆయోగ్, వ్యవసాయ ఖర్చులు-ధరల సలహా మండలి ఉన్నతాధికారులు, రాష్ట్ర విశ్వవిద్యాలయాల ప్రతినిధులు, రైతులు, రైతు సంఘాలు పాల్గొంటాయి. తొలి రోజున వ్యవసాయ నిపుణులు, అధికారులు మేధోమధనం నిర్వహిస్తారు. రెండో రోజున ప్రధాని సమక్షంలో తమ సిఫార్సులను సమర్పిస్తారు.

పారిశుద్ధ్య కార్మికుల ఖర్చు రాష్ట్రానిదే

- ఉపాధి నిధులను ఇవ్వలేమన్న కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ
- ఇదే విషయంపై పలు సార్లు తెలంగాణ విజ్ఞప్తి
- రాష్ట్రంలో 20వేల త్రిచక్ర వాహనాలపై ప్రభావం

ఈనాడు – హైదరాబాద్

చెత్త సేకరణ పనులను నిర్వహించే పారిశుద్ధ్య కార్మికులకు ఇక వేతనాలను ఆయా గ్రామ పంచాయతీలు లేదా రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఆయా కార్మికులకు ఉపాధి హామీ పథకం ద్వారా నిధులను ఇవ్వలేమని కేంద్రం వెల్లడించింది. ఏదైనా రాష్ట్రం అలా నిధులను ఖర్చుపెడుతుంటే ఆపేయాలని స్పష్టం చేసింది. తెలంగాణలో స్వచ్ఛ భారత్ నిధులతో కొనుగోలు చేసిన దాదాపు 20వేల త్రిచక్రవాహనాలపై ఇప్పుడు ప్రభావం పడనుంది. గ్రామాల్లో చెత్తను తరలించేందుకు స్వచ్ఛ భారత్ నిధులతో తెలంగాణలో దాదాపు 20వేల త్రిచక్రవాహనాలను పంచాయతీలకు పంపిణీ చేసినా వాటిలో 80 శాతం మేర చోదకులు లేక నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామాల్లో చెత్త నిల్వకేంద్రాలు, మురుగు కాలువల నిర్మాణాలకు ఉపాధి హామీ నిధులను వెచ్చిస్తున్నందున పారిశుద్ధ్యాన్ని ఆ పథకానికి అనుసంధానం చేసి కార్మికులకు వేతనాలు ఇచ్చేందుకు అనుమతించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. అయితే ఇది కుదరదని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తేల్చి చెప్పింది.

పశ్చిమ్‌బంగ గ్రామాల్లో చెత్త నుంచి రాబడి

పశ్చిమ్‌బంగలోని గ్రామ పంచాయతీలు చెత్త నుంచి రాబడిని ఆర్జిస్తున్నందున అక్కడి విధానాలను అనుసరించాల్సిందిగా కేంద్రం మిగతా రాష్ట్రాలకు సూచించింది. గ్రామాల్లో చెత్తను సేకరించిన తర్వాత అందులో పనికి వస్తాయనుకున్న పదార్థాలను వేరు చేసి సేంద్రీయ ఎరువులను తయారు చేసి అక్కడి పంచాయతీలు విక్రయిస్తున్నాయి. ఇందుకు అవసరమయ్యే వర్మీకంపోస్టు యూనిట్, చెత్తను వేరు చేసే యూనిట్, త్రిచక్రవాహన షెడ్డు, ఆఫీసు, స్టోర్ రూములు, సిబ్బంది మరుగుదొడ్ల నిర్మాణాలను ఉపాధి హామీ కింద చేపడుతున్నారు. కార్మికులకు వేతనాలను రెండేళ్లపాటు మిషన్ నిర్మల్ బంగ్లా (స్వచ్ఛభారత్) ద్వారా అందజేస్తున్నారు. ఆ తర్వాత చెత్త నుంచి వచ్చే ఆదాయం నుంచి గ్రామ పంచాయతీయే వేతనాలను చెల్లించాలి.



పిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో డుటెర్టె మహిళా తిరుగుబాటుదార్లపై తీవ్ర వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన మాజీ తిరుగుబాటుదార్ల సమావేశంలో రోడ్రిగో మాట్లాడుతూ.. 'మహిళా రెబెల్స్ మర్మాంగాలపై కాల్చుతాం' అంటూ హెచ్చరించారు. దీనిపై తీవ్ర దుమారం చెలరేగింది. బుధవారం మహిళా సంఘాలు ఆయన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపట్టాయి. మనీలాలో రోడ్రిగో దిష్టిబొమ్మ నాలుకను కత్తిరిస్తూ తమ ఆగ్రహాన్ని వెలిబుచ్చారిలా..



అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి హోనోలులుకు బయల్దేరిన యునైటెడ్ ఎయిర్‌లైన్స్ విమానం ఒకటి పసిఫిక్ మహా సముద్రం మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో ఇంజిన్ కవచం ఒకటి తొలగిపోయింది. విమానంలో దాదాపు 370 మంది ప్రయాణికులు ఉన్నారు. అప్రమత్తమైన సిబ్బంది విమానాన్ని హోనోలులులో సురక్షితంగా దించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అడవి దాటితే పెనుముప్పే!

- మూడు వారాల్లో రెండు చిరుతపులుల మృతి
- వరుస ప్రమాదాలపై వ్యక్తమవుతోన్న ఆందోళన

ఈనాడు, హైదరాబాద్: చిరుతపులుల వరుస మరణాలపై ఆందోళన వ్యక్తమవుతోంది. మూడువారాల వ్యవధిలోనే తెలంగాణలో రెండు చిరుతలు ప్రమాదాల్లో మృతిచెందాయి. నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి అటవీప్రాంతంలో నెలరోజులక్రితం రైలు ఢీకొని.. ఆ తర్వాత చికిత్స పొందుతూ చిరుత మరణించిన ఘటన మరువక ముందే మూడురోజుల క్రితం ఇదే జిల్లాలో మరో చిరుత చనిపోయింది. నవీపేట మండల పరిధిలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. వన్యప్రాణులకు కొంతకాలం క్రితం వరకు ప్రధానంగా వేటగాళ్లతోనే ముప్పు ఉండేది. ఇటీవలికాలంలో మాత్రం రైలు, రోడ్డుమార్గాలు వాటికి ముప్పుగా మారాయి. ఈ ప్రమాదాల నియంత్రణపై ఏం చేయాలన్నదానిపై అటవీశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. వాహనాలకు వేగనియంత్రణ చర్యలు చేపట్టాలని కొంతకాలం క్రితం ఉన్నతాధికారులు చర్చించారు. "టైగర్ రిజర్వు ప్రాంతాల్లో వాహనాల వేగాన్ని కట్టడి చేయడానికి అవకాశంఉంది. చెక్‌పోస్టులు లేని అటవీ ప్రాంతాలు, అడవులు లేని రోడ్డు, రైలు మార్గాల్లో ఏం చేయాలన్న ప్రతిపాదనలపై దృష్టి పెట్టాం" అని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. రైల్వే ట్రాక్, రహదారి మార్గాలు వందల కిలోమీటర్లు ఉంటాయి. అంతదూరం వరకు రక్షణ చర్యలు ఎంత మేరకు సాధ్యమన్నదానిపై అధికారులు చర్చిస్తున్నారు. పెద్దపులులు, చిరుతలు, ఇతర వన్యప్రాణులు రోడ్డు దాటే, దాటేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను డీఎఫ్‌ఓల ద్వారా గుర్తించాలని అటవీశాఖ భావిస్తోంది. ఆ తర్వాత ఆయా ప్రాంతాల్లో అడవులు ఉన్న చోట వన్యప్రాణులు లోపలి నుంచి రోడ్డుపైకి రాకుండా కంచె(ఫెన్సింగ్) ఏర్పాటుచేయించడం, అటవీయేతర రహదారి మార్గాల్లో జీబ్రాక్రాసింగ్‌లు, వేగనియంత్రణ బోర్డుల ఏర్పాటు ఆలోచన ఉందని అటవీశాఖ ఉన్నతాధికారి తెలిపారు. ఈ మేరకు సంబంధిత జిల్లాల అటవీ అధికారుల ద్వారా రైల్వేశాఖకు, రహదారులు భవనాల శాఖకు లేఖలు రాయిస్తామని చెప్పారు. మరోవైపు చిలుకూరు మృగవని జాతీయవనం, గచ్చిబౌలి కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రాంతాల్లో జింకలను, నెమళ్లను శునకాలు బలిగొంటున్నాయి. ఇక్కడ రక్షణ చర్యలు సరిగా లేకపోవడంతో చుట్టుపక్కల నుంచి శునకాలు వస్తూ దాడి చేస్తున్నాయి.

పుట్టిన రోజని పిలిపించి... విద్యార్థినిపై సామూహిక అత్యాచారం

సోనార్‌పుర్: పుట్టిన రోజు వేడుకకు రావాలంటూ ఆహ్వానించిన స్నేహితుడే ఆమె పాలిట కీచకుడయ్యాడు. మరో ముగ్గురు మిత్రులతో కలసి ఆమెపై సామూహిక అత్యాచారం చేయటంతో పాటు హత్యకు ప్రయత్నించాడు. ఈ ఘటన పశ్చిమ్‌బంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలోని రత్‌టాలాలో మంగళవారం రాత్రి జరిగింది. 12వ తరగతి చదువుతున్న బాలిక... స్నేహితుడి పుట్టిన రోజు ఆహ్వానం నిజమేనని నమ్మి అతడి ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో యువకుడి ముగ్గురు స్నేహితులు మినహా కుటుంబ సభ్యులెవరూ లేరు. వారిచ్చిన మత్తు కలిపిన శీతల పానీయం తాగిన ఆమె స్పృహతప్పి పడిపోగా...నలుగురు యువకులు అత్యాచారం జరిపారు. రక్తపు మడుగులో పడిఉన్న బాధితురాలిని ఆస్పత్రిలో చేర్చగా ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతోంది.

అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే హత్య

ఈనాడు డిజిటల్ చెన్నై: తమిళనాడులోని దిండిగల్ జిల్లాకు చెందిన అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే ఆండివేల్ బుధవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యారు. గార్డెన్ హౌజ్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి హతమార్చారు. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలిసి స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చారు.

ప్రేమికురాలు కానరాక మాజీ 'మిస్టర్ కర్ణాటక' ఆత్మహత్యాయత్నం

హొసపేటె (కర్ణాటక), న్యూస్‌టుడే: ప్రేమించిన యువతి ప్రేమికుల రోజున కనిపించలేదు. తమ ప్రేమ పెళ్లికి యువతి ఇంట్లో అంగీకరించలేదన్న బాధతో ఓ యువకుడు కత్తితో ఎదపై పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించాడు. సంఘటన బుధవారం బళ్లారి జిల్లా హొసపేటెలో చోటుచేసుకుంది. హగరిబొమ్మనహళ్లికి చెందిన దేహదారుఢ్య క్రీడాకారుడు వీరేశ్(26), హొసపేటెలోని ఓ యువతి కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకున్నారు. వీరి ప్రేమ వ్యవహారం యువతి ఇంట్లో తెలిసింది. కులాలు వేరు కావడంతో ఆమె కుటుంబ సభ్యులు వారి పెళ్లికి ఒప్పుకోలేదు. ప్రేమికుల రోజు ఆమెను కలిసేందుకు బుధవారం హొసపేటెకు వచ్చిన యువకుడికి నిరాశే మిగిలింది. యువతిని ఇంట్లోనే నిర్బంధించారన్న సమాచారం తెలుసుకున్నాడు. బాధ తట్టుకోలేక కత్తితో ఛాతీపై పొడుచుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం దావణగెరె ఆసుపత్రికి తరలించారు. దీనిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ శివారెడ్డి తెలిపారు. దేహదారుఢ్య పోటీల్లో వీరేశ్ ఒకసారి 'మిస్టర్ కర్ణాటక' పురస్కారం తీసుకున్నాడు.



గుండెలో కత్తితో పొడుచుకున్న వీరేశ్

మిత్రుల నడుమ 'ప్రేమ' చిచ్చు

యువతి కోసం గొడవలో ఒకరి హతం

దొడ్డబళ్లాపుర (కర్ణాటక), న్యూస్‌టుడే: ఒక యువతిని ఇద్దరు స్నేహితులు ఒకరికి తెలియకుండా మరొకరు ప్రేమించారు. చివరకు ఆమె వారిలో ఒకరినే ఇష్టపడటంతో రెండో వ్యక్తి స్నేహితుని హతమార్చాడు. కర్ణాటక రాష్ట్రం దొడ్డబళ్లాపుర తాలూకా కంచిగనాళ చెందిన హరీశ్ కుమార్(19), సంతోష్ స్నేహితులు. వీరు అదే ఊరికి చెందిన యువతిని ఒకరికి తెలియకుండా మరొకరు ఇష్టపడ్డారు. ఆ యువతి హరీశ్‌ను ఇష్టపడుతోందని, వారిద్దరూ ప్రేమికుల దినోత్సవం జరుపుకొనేందుకు సన్నద్ధం అవుతున్నారని సంతోష్‌కు తెలిసింది. స్నేహితుడు అని కూడా ఆలోచించకుండా హరీశ్‌తో గొడవకు దిగాడు. కత్తితో దాడి చేసి విచక్షణా రహితంగా పొడిచి పరారయ్యాడు. వెంటనే గ్రామస్థులు బాధితుడిని చికిత్స నిమిత్తం దొడ్డబళ్లాపుర ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు కోసం గాలిస్తున్నారు.



ధనాధన్ ఎప్పట్లానే..

ఐపీఎల్ సమయాల్లో మార్పుల్లేవ్: బీసీసీఐ

ముంబయి: ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రారంభ సమయాల్లో ఎలాంటి మార్పులు లేవు. గతంలోలానే సాయంత్రం 4, రాత్రి 8 గంటలకు మ్యాచ్‌లు మొదలవుతాయి. ఈ మేరకు బీసీసీఐ ఒక ప్రకటన విడుదల చేసింది. ఐపీఎల్‌లో తొలి, తుది మ్యాచ్‌లకు ముంబయిలోని వాంఖడే స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. తొలి మ్యాచ్ ఏప్రిల్ 7న డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరగనుంది. ఫైనల్ మే 27న ఉంటుంది. మ్యాచ్‌ల సమయాల్లో మార్పులకు సంబంధించి గతంలో బీసీసీఐ ఒక ప్రతిపాదన పరిశీలించింది. 8 గంటల మ్యాచ్‌లను ఏడింటికి, వారాంతాల్లో 4 గంటల మ్యాచ్‌లను 5.30కి మార్చాలని భావించింది. ఐతే అన్ని ఫ్రాంచైజీలు తిరస్కరించడంతో పాత సమయాలనే బీసీసీఐ ప్రకటించింది.

5

దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌ను టీమ్‌ఇండియా సొంతం చేసుకున్న నేపథ్యంలో ఐసీసీ అధికారికంగా ర్యాంకింగ్స్‌ను ప్రకటించింది. సిరీస్‌కు ముందు 119 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్న భారత జట్టు.. ప్రస్తుతం 122 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. 2017 అక్టోబరు తర్వాత భారత జట్టు వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరడం ఇదే తొలిసారి. మొత్తంమీద ఐదోసారి. భారత్ తొలిసారి 2013లో నం.1 స్థానాన్ని సొంతం చేసుకుంది.

ఛాంపియన్స్



మాయగాళ్లు..

ఎక్కడైనా తిప్పేస్తారు

ఛాంపియన్స్ ట్రోఫీ 2017

అదిరే ప్రదర్శనతో టీమ్ ఇండియా ఫైనల్ చేరినా.. ఓ లోటు, ఓ లోపం, ఓ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. స్పిన్ జోడీ అశ్విన్, జడేజాలది మరిచిపోదగ్గ ప్రదర్శన. ఆ టోర్నీ వాళ్లకు పీడకలే. ప్రభావ శూన్యంగా మారిన ఈ జంట ఉపఖండం బయట భారత స్పిన్ మంత్రం పారదని రుజువు చేయాలని కంకణం కట్టుకున్నట్లు కనిపించింది. పూర్తిగా తేలిపోయిన ఈ జోడీ 71 ఓవర్లలో దాదాపు ఆరు రన్‌రేట్‌తో పరుగులిచ్చి కేవలం ఐదు వికెట్లే పడగొట్టింది.

కానీ ఆరు నెలల్లో ఎంత మార్పు?

ఓ యువ మణికట్టు స్పిన్ జోడీ విదేశీ గడ్డపై భారత స్పిన్ ముఖచిత్రాన్నే మార్చేసింది. గిరాగిరా తిప్పేస్తూ అద్భుత విజయాలకు బాటలు వేస్తోంది. పేస్ పిచ్‌లకు పెట్టింది పేరైనా దక్షిణాఫ్రికాలో సంచలన ప్రదర్శనతో ఐదు వన్డేల్లో 30 వికెట్లు పడగొట్టిన కుల్‌దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్ ద్వయం.. విదేశీగడ్డపై వన్డే సిరీస్‌లో అత్యుత్తమ ప్రదర్శన (స్వదేశంలో కూడా) చేసిన భారత స్పిన్ దళంగా రికార్డు సృష్టించింది. సీనియర్ స్పిన్నర్ల ప్రపంచకప్ ఆశలకు చెక్ పెడుతూ, టెస్టు స్థానాలకూ పెను సవాలు విసురుతూ.. భవిష్యత్తుపై ఆశలు రేకెత్తిస్తోంది.

ఈనాడు క్రీడావిభాగం

విశ్రాంతి పేరుతో సీనియర్ స్పిన్నర్లు అశ్విన్, జడేజాలను పక్కన పెట్టడం ఏ క్షణాన మొదలెట్టారో తెలియదు కానీ.. పరిమిత ఓవర్ల క్రికెట్లో భారత స్పిన్ దశ తిరగడం కూడా మొదలైంది. కుల్‌దీప్-చాహల్ జోడీ.. వాళ్లకు దాదాపుగా శాశ్వత విశ్రాంతినిట్లే! శ్రీలంక, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంకతో సిరీస్‌ల్లో సత్తా చాటిన కుల్‌దీప్, చాహల్ సెలక్టర్ల విశ్వాసాన్ని నిలబెట్టారు. ఎలా వేస్తారో తెలియదు. ఎక్కడ వేస్తారో తెలియదు. ఎటుపడి ఎటు తిరుగుతుందో తెలియదు. బ్యాట్స్‌మెన్‌కు వాళ్ల మణికట్టు బౌలింగ్ ఓ పెద్ద మిస్టరీ. అంచనా వేయడం.. అర్థం చేసుకోవడం కష్టమవుతోంది. ఎదురుదాడి చేయలేక, డిఫెన్స్ ఆడలేక వికెట్లు సమర్పించుకుంటున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత భారత్ ఆడిన ప్రతి వన్డేలోనూ ఈ ఇద్దరు లేదా ఇద్దరిలో ఒకరైనా ఉన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 26 మ్యాచ్‌ల్లో వీళ్లిద్దరు ఏకంగా 73 వికెట్లు పడగొట్టారు. అన్నీ ఓ ఎత్తయితే దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ఓ ఎత్తు. ఎందుకంటే ఉపఖండం బయట గతంలో ఏ భారత స్పిన్నర్లూ విజృంభించని విధంగా వీరు విజృంభించారు. గిర్రున తిరిగే పిచ్‌లు కాకున్నా.. బౌన్స్‌ను ఉపయోగించుకుని ఆతిథ్య బ్యాట్స్‌మెన్‌ను ఉక్కిరిబిక్కిరి చేశారు. అత్యంత కట్టుదిట్టంగా, పొదుపుగా బౌలింగ్ చేసిన ఈ జంట ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌ల్లో 4.92 ఎకానమీ రేట్‌తో ఏకంగా 30 వికెట్లు పడగొట్టింది. గతంలో ఏనాడూ భారత స్పిన్నర్లు సొంతగడ్డపై కూడా ఓ ద్వైపాక్షిక సిరీస్‌లో ఇన్ని వికెట్లు పడగొట్టలేదు. కుల్‌దీప్ 16 తీస్తే.. చాహల్ 14 తీసుకున్నాడు. సిరీస్‌లో ఐదు మ్యాచ్‌లు పూర్తయినా దక్షిణాఫ్రికా వీళ్లను అర్థం చేసుకోలేకపోతోందంటే.. కుల్‌దీప్, చాహల్ మణికట్టు మాయ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఎటాక్ ఎటాక్: క్రికెట్‌కు భారత్ ఎందరో మేటి స్పిన్నర్లను అందించి ఉండొచ్చు. కానీ ఉపఖండం బయట వారి రికార్డు అంత గొప్పగా లేదు. కానీ ఈ యువ చైనామన్, లెగ్ స్పిన్ జోడీ అసాధారణ ప్రదర్శనతో ఆ రికార్డులను సరి చేసే పనిలో పడింది. పరుగులను నియంత్రించడంపై కాకుండా, అందీ అందకుండా బంతులేస్తూ నిరంతరం వికెట్ల కోసం ప్రయత్నించడమే కుల్‌దీప్, చాహల్ విజయ రహస్యం. తక్కువ వేగంతో గాల్లో ఎక్కువసేపు బంతిని ఉంచుతూ బ్యాట్స్‌మెన్‌ను అయోమయానికి గురి చేస్తున్నారు. అదే సమయంలో బంతి మరీ ఫుల్ కాకుండా జాగ్రత్త పడుతున్నారు. మణికట్టు స్పిన్నర్లు కావడంతో.. పిచ్ ఎలా ఉన్నా సహజంగానే బంతిని తిప్పగలుగుతున్నారు. కళ్లు చెదిరే గూగ్లీలతో బ్యాట్స్‌మెన్ గుండెల్లో గుబులు రేపుతున్నారు. ముఖ్యంగా పేస్, ఫ్లైట్‌లో వైవిధ్యం వారిని అత్యంత ప్రమాదకర స్పిన్నర్లుగా మారుస్తోంది. దక్షిణాఫ్రికా పిచ్‌లపై బౌన్స్ కూడా వారికి ఉపయోగపడింది. కెప్టెన్ కోహ్లి మద్దతు వారిలో ఆత్మవిశ్వాసాని పెంచుతోంది. అందుకే ఎప్పుడైనా ఎదురుదాడికి గురైనా ఎటాకింగ్ బౌలింగ్ విషయంలో వెనక్కి తగ్గట్లేదు. వాళ్లు ప్రధానంగా మిడిల్ ఓవర్లలో వికెట్లు తీయడం, రన్‌రేట్‌ను బాగా తగ్గించడం మ్యాచ్ స్వరూపాన్నే మార్చేస్తోంది. "ఎప్పుడూ వికెట్ల కోసమే ప్రయత్నించమని చెప్పాం. వికెట్ల కోసం ప్రయత్నిస్తే.. బ్యాట్స్‌మెన్‌కు ఇబ్బంది కలిగేలా సరైన ప్రాంతాల్లో బంతులేస్తారు. వారికి ఎక్కువ సార్లు డిఫెన్స్ ఆడాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. దూరంగా బంతులేస్తూ, పరుగులను నియంత్రించడానికి ప్రయత్నిస్తే బ్యాట్స్‌మెన్‌కు సింగిల్స్ తీసే అవకాశం దక్కుతుంది. కుల్‌దీప్, చాహల్‌ల విజయానికి పూర్తిగా వాళ్లే కారకులు. కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌లో బౌలింగ్ చేశారు. బ్యాట్స్‌మెన్‌కు ప్రతి బంతినీ సవాల్‌గా మార్చారు. వాళ్ల నైపుణ్యం అసాధారణం. ఇంతకుముందు నేనెప్పుడూ ఇంత పదునైన స్పిన్‌ను బౌలింగ్‌ను చూడలేదు" అని కోహ్లి చెప్పాడు. సారథి విశ్వాసాన్ని ఇంతగా చూరగొన్న ఈ కుర్రాళ్లు తమ అమ్ముల పొది నుంచి ఇంకెన్ని అస్త్రాలు తీస్తారో.. ఇంకెన్ని రికార్డులు సృష్టిస్తారో చూడాలి.

2019 ప్రపంచకప్.. ఇక టీమ్ ఇండియా ప్రధాన లక్ష్యం ఇదే. టోర్నీ జరిగేది. భారత స్పిన్నర్లు విఫలమైన ఛాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యమిచ్చిన ఇంగ్లాండ్‌లోనే. కానీ ఈసారి పరిస్థితి భిన్నంగా ఉండనుంది. దక్షిణాఫ్రికాలో కుల్‌దీప్, చాహల్‌ల అద్వితీయ ప్రదర్శన.. ఈ టోర్నీలో భారత్ బలాన్ని పెంచుతుందనడంలో సందేహం లేదు. ఇంగ్లాండ్‌లో పరిస్థితులు స్పిన్నర్లకు అనుకూలంగా ఏమీ ఉండవు. కానీ సత్తా చాటడానికి తమకు గిరగిరా తిరిగే పిచ్‌లే అవసరం లేదని ఈ మణికట్టు స్పిన్ ద్వయం ఇప్పటికే నిరూపించింది. కాబట్టి ఈ జోడీ ఇంగ్లిష్ నేలపైనా విజయాలనందిస్తుందని జట్టు నమ్మడం అతి విశ్వాసమేమీ కాదు.

ఈ సిరీస్‌లో చాహల్, కుల్‌దీప్

తొలి వన్డే	: 20-0-79-5
రెండో వన్డే	: 14.2-1-42-8
మూడో వన్డే	: 18-1-69-8
నాలుగో వన్డే	: 11.3-0-119-3
ఐదో వన్డే	: 19.2-0-100-6

- దక్షిణాఫ్రికా ఐదు వన్డేల్లో కుల్‌దీప్, చాహల్ జంట 4.92 ఎకానమీ రేట్‌తో 30 వికెట్లు పడగొట్టింది. సొంతగడ్డపైనైనా, విదేశాల్లోనైనా ఓ ద్వైపాక్షిక సిరీస్‌లో భారత స్పిన్నర్ల అత్యుత్తమ ప్రదర్శన ఇదే. తర్వాతి అత్యుత్తమం 27 వికెట్లు. 2006లో స్వదేశంలో ఇంగ్లాండ్‌పై ఆరు వన్డేల్లో ఆ ప్రదర్శన చేశారు.

"నైపుణ్యాన్ని తీసేస్తే వారిలో ఏమీ లేదు. భయపెట్టేలా కనిపించరు. కళ్లలోకి చూస్తూ భయపెట్టలేరు. కానీ మాయ చేస్తారు. ఇంత తేలిగ్గా ఔటయ్యానేంటి అనుకుంటూ, ఆయోమయానికి గురవుతూ బ్యాట్స్‌మన్ మైదానం నుంచి నిష్క్రమిస్తే ఆశ్చర్యం లేదు" – హర్ష భోగ్లే



"కుల్‌దీప్, చాహల్ ఎంత గొప్ప స్పిన్నర్లో దక్షిణాఫ్రికన్లు గ్రహించలేకపోయారు. వాళ్ల బౌలింగ్‌లో మా వాళ్ల బ్యాటింగ్ చూసి నేను కూడా ఆశ్చర్యపోయాను. ఒక్క ఆమ్లా తప్ప ఎవరూ సరిగా ఆడలేకపోయారు" – కెప్లర్ వెసల్స్, దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్

రోహిత్ అందుకే సంబరాలకు దూరం



పోర్ట్ ఎలిజబెత్: సెంచరీ చేసిన వెంటనే ఎగిరి గంతేయడం చాలా మంది బ్యాట్స్‌మెన్‌కు అలవాటు. అందుకు టీమ్‌ఇండియా స్టార్ బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ మినహాయింపేం కాదు. కానీ ఐదో వన్డేలో మాత్రం పూర్తిగా భిన్నమైన రోహిత్ కనిపించాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో వరుస వైఫల్యాల తర్వాత తీవ్ర ఒత్తిడిలో సెంచరీ చేసినా అతడిలో ఏమాత్రం ఆనందం కనిపించలేదు. సంబరాలకు దూరంగా ఉన్న అతడు మరోవైపు ఉన్న శ్రేయస్ అయ్యర్ అభినందనలు అందుకుని తిరిగి బ్యాటింగ్ చేశాడు. అసలు తాను ఎందుకలా చేయాల్సి వచ్చిందన్న సంగతిని రోహిత్ విలేకరుల సమావేశంలో చెప్పాడు. "నా ముందే ఇద్దరు బ్యాట్స్‌మన్ రనౌటయ్యారు. అందుకే సెంచరీ చేసినా సంబరాల ఆలోచన నా మదిలో రాలేదు. మనం ఎలాంటి మానసిక స్థితిలో ఉన్నామన్నదానిపై అది ఆధారపడివుంటుంది" అని రోహిత్ వివరించాడు.

రితికకు రోహిత్ కానుక!: ప్రేమికుల రోజు సందర్భంగా తన భార్య రితిక సజ్దేకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపాడు రోహిత్ శర్మ. ఐదో వన్డేలో సెంచరీ సాధించిన అతడు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డును గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఆ ట్రోఫీని పట్టుకుని ఉన్న చిత్రాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన రోహిత్.. 'వాలెంటైన్స్ డే శుభాకాంక్షలు రితిక' అంటూ సందేశాన్ని కూడా ఉంచాడు. నిరుడు శ్రీలంకపై ద్విశతకం సాధించిన రోహిత్.. అదే రోజు తమ వివాహ రెండో వార్షికోత్సవ రోజు కావడంతో.. ఆ ద్విశతకాన్ని రితికకు అంకితం ఇచ్చిన సంగతి తెలిసిందే.

క్వార్టర్స్‌లో హైదరాబాద్

విజయ్ హజారే ట్రోఫీ



ఈనాడు, హైదరాబాద్: అఖిల భారత విజయ్ హజారే ట్రోఫీ వన్డే క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. బుధవారం జింఖానా మైదానంలో జరిగిన గ్రూపు-డి చివరి మ్యాచ్‌లో హైదరాబాద్ 84 పరుగుల ఆధిక్యంతో చత్తీస్‌గఢ్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 280 పరుగులు చేసింది. సందీప్ (79; 95 బంతుల్లో 4×4, 1×6), కెప్టెన్ అంబటి రాయుడు (46; 65 బంతుల్లో 2×4, 2×6), రవితేజ (45; 35 బంతుల్లో 4×4, 1×6) మెరిశారు. అనంతరం చత్తీస్‌గఢ్ 44.3 ఓవర్లలో 196 పరుగులకు ఆలౌటైంది. పేసర్ మహ్మద్ సిరాజ్ (5/37) విజృంభించి జట్టుకు విజయాన్ని అందించాడు. మొత్తం 20 పాయింట్లతో హైదరాబాద్ గ్రూపు-డి పట్టికలో అగ్రస్థానం కైవసం చేసుకుంది. మరో మ్యాచ్‌లో సౌరాష్ట్ర 8 వికెట్ల తేడాతో విదర్భను కంగుతినిపించింది. సౌరాష్ట్ర (1.017), విదర్భ (0.718), చత్తీస్‌గఢ్ (-0.103) 16 పాయింట్లతో సమంగా నిలిచినా.. మెరుగైన రన్‌రేట్‌తో సౌరాష్ట్ర క్వార్టర్స్ బెర్తు సొంతం చేసుకుంది. ఈనెల 21న క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి.

ఆంధ్ర అజేయం: ఆంధ్రకు ఎదురులేకుండా పోయింది. ఆరింటికి ఆరు మ్యాచ్‌లు నెగ్గిన ఏకైక జట్టుగా నిలిచింది. బుధవారం గ్రూపు-సి మ్యాచ్‌లో 29 పరుగుల ఆధిక్యంతో ముంబయిని చిత్తుచేసింది. మొదట ఆంధ్ర 5 వికెట్లకు 344 పరుగుల భారీ స్కోరు సాధించింది. భరత్ (105), కెప్టెన్ హనుమ విహారి (169) సెంచరీలతో కదంతొక్కారు. బదులుగా ముంబయి 9 వికెట్లకు 315 పరుగులు చేసింది. సిద్దేష్ (118) ఒంటరి పోరాటం చేశాడు. 24 పాయింట్లతో ఆంధ్ర గ్రూపు-సిలో అగ్రస్థానంలో నిలిచి క్వార్టర్స్ చేరింది.

తిప్పేసింది వాళ్లే

మొహిందర్ అమర్‌నాథ్

విరాట్ సేన అద్భుత విజయమిది. సఫారీ గడ్డపై దక్షిణాఫ్రికాను ఓడించడం ఎప్పటికీ ప్రత్యేకమే. అద్భుతమైన బ్యాటింగ్, ఫీల్డింగ్.. నాయకత్వ పటిమతో మరోసారి కెప్టెన్ జట్టును ముందుండి నడిపించాడు. ఐదో వన్డేలో రోహిత్‌శర్మ సెంచరీ సానుకూలాంశం. ఆ మ్యాచ్‌లో రోహిత్ భిన్నంగా కనిపించాడు. ఇక స్పిన్‌కు పెద్దగా అనుకూలించని విదేశీ



వికెట్లపై మణికట్టు స్పిన్నర్లే కీలకం. సిరీస్ ఆసాంతం కుల్‌దీప్, చాహల్ అద్భుతంగా రాణించారు. వారిద్దరు తీసిన వికెట్లు సిరీస్‌లో సమీకరణాల్ని మార్చేశాయి. ఆమ్లా, డివిలియర్స్‌లపై దక్షిణాఫ్రికా అధికంగా ఆధారపడింది. వారిద్దరు మాత్రమే కుల్‌దీప్, చాహల్ బౌలింగ్‌ను అర్థం చేసుకోగలరు. మిగతా బ్యాట్స్‌మెన్‌కు అసలు అవగాహనే లేదు. చాలావరకు గుడ్డిగా ఆడారు. అన్ని సార్లు అది ఫలితాన్నివ్వదు. నాణ్యమైన స్పిన్నర్ల బౌలింగ్‌లో అసలే కుదరదు. సఫారీ బ్యాట్స్‌మెన్‌ను బోల్తాకొట్టించడంలో కుల్‌దీప్, చాహల్ నూటికి నూరు శాతం సఫలమయ్యారు.



దొరకునా.. ఇటువంటి ఆతిథ్యం


సియోల్: దక్షిణ కొరియా ఆతిథ్యం చూసి ఉత్తర కొరియాకు మతి పోతోంది. దొరుకునా.. ఇటువంటి ఆతిథ్యం అంటూ మురిసిపోతుంది. శత్రుదేశమని తెలిసి కూడా తమకు రాచ మర్యాదలు చేయడంపై ఉబ్బితబ్బిబ్బవుతోంది. వింటర్ ఒలింపిక్స్ పాల్గొనేందుకు వచ్చిన ఉత్తర కొరియా ఆటగాళ్లకు ఏ లోటూ లేకుండా.. దక్షిణ కొరియా సకల ఏర్పాట్లు చేసింది. ఖరీదైన హోటళ్లలో వారిని ఉంచింది. 22 అథ్లెట్లతో వచ్చిన 229 ఉల్లాసినులకు కూడా సకల వసతులు కల్పించింది. వాళ్లతో పాటు వచ్చిన సిబ్బందికీ ఏ లోటూ లేకుండా చూసుకుంటోంది. తాజాగా ఉత్తరకొరియా బృందానికి అయిన రానూ.. పోనూ ఖర్చులను మొత్తం తామే భరించాలని దక్షిణ కొరియా నిర్ణయించింది. ఇందుకు 2.6 మిలియన్ డాలర్ల బడ్జెట్ కూడా కేటాయించింది. ఇప్పటికే.. ఆరంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న తమ ప్రతినిధి బృందానికి లభించిన ఘన స్వాగతంపై ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ సంతోషం వ్యక్తం చేశాడు కూడా. ఆ బృందంలో కిమ్ జాంగ్ సోదరి యో జాంగ్ కూడా ఉంది. మొత్తానికి వింటర్ ఒలింపిక్స్ పుణ్యమా అని రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగవ్వడంపై విశ్లేషకులు మాత్రం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాండ్య అంటే కోహ్లికి ప్రేమ!

పోర్ట్ ఎలిజబెత్: విరాట్ కోహ్లికి నచ్చేలా హార్దిక్ పాండ్య ఉంటాడని.. కాబట్టి అతడి భవిష్యత్తుకు ఢోకా లేదంటున్నాడు దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ షాన్ పొలాక్. కోహ్లి నాయకత్వంలో పాండ్యకు వీలైనన్ని ఎక్కువ అవకాశాలే వస్తాయనేది పొలాక్ అభిప్రాయం. అందుకు కారణం కూడా చెబుతున్నాడు. "మైదానంలో కోహ్లిలానే పాండ్య కూడా ఉంటాడు. కోహ్లికి ఆ తరహా దృక్పథం నచ్చుతుంది. కచ్చితంగా తన స్థానం సుస్థిరం చేసుకునేందుకు అవసరమైన అవకాశాలైతే విరాట్ కెప్టెన్సీలో పాండ్యాకు లభిస్తాయి" అని పొలాక్ చెప్పాడు. చాలా మంది ఆటగాళ్లకు సామర్థ్యముంటుంది గానీ.. దాన్ని తర్వాతి స్థాయికి ఎలా తీసుకువెళ్లాలో తెలియదని.. ఈ విషయంలో పాండ్య జాగ్రత్త వహించాలని పొలాక్ సూచించాడు. "ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లలో రాణించాలంటే ఏం చేయాలో పాండ్య తెలుసుకోవాలి. దూకుడును మిళితం చేసి ఆడాలనుకుంటాడు. అయితే అంతర్జాతీయ క్రికెట్లో కొంత సమయం నిలదొక్కుకోగలిగితే కచ్చితంగా పాండ్య కుదురుకుంటాడు" అని పొలాక్ అన్నాడు.



అలా చేసింది ప్రేమికుల రోజున



ప్యాంగ్‌చాంగ్: అసలే చలి.. ఆపై ప్రేమికుల రోజు.. ఉన్నదేమో ఊరుకాని ఊరు. బోరు కొడుతోంది. ఏం చేయాలని ఆలోచించింది అమెరికా స్కీయింట్ అథ్లెట్ లిండ్సే వాన్. తన ఫోన్ తీసుకుంది. ట్విటర్‌లో తనను అనుసరిస్తున్న దాదాపు పది లక్షల మంది అభిమానులకు ఒక సందేశం పెట్టింది. అదేంటంటే.. "ఈరోజు ప్రేమికుల రోజు. వింటర్ ఒలింపిక్స్‌లో ఒంటరిగా ఉన్నా.. ఈ రోజుకి ఎవరైనా అవుతారా నా ప్రేమికుడు" అని సందేశం పెట్టింది. అంతే వేలల్లో అభిమానులు స్పందించారు. ఇందులో ఎవరిని డేటింగ్ పిలిచిందో తెలియదు గానీ.. అభిమానులకు మాత్రం కృతజ్ఞతలు చెప్పింది. లిండ్సే వాన్ గతంలో గోల్ఫర్ టైగర్ వుడ్స్‌తో రెండేళ్లు పాటు డేటింగ్ చేసింది. 2015లో విడిపోయారు.

రబాడకు జరిమానా



దుబాయ్: దక్షిణాఫ్రికాతో ఐదో వన్డేలో శిఖర్ ధావన్‌ను ఔట్ చేశాక శ్రుతి మించి ప్రవర్తించిన కగిసో రబాడపై ఐసీసీ చర్యలు తీసుకుంది. అతడి ఖాతాలో ఓ అయోగ్యత పాయింటును జత చేసిన ఐసీసీ.. మ్యాచ్ ఫీజులో 15 శాతం కోతనూ విధించింది. ఎనిమిదో ఓవర్లో రబాడ బౌలింగ్‌లో బంతిని పుల్ చేయబోయి బౌండరీ వద్ద ధావన్ ఫీల్డర్‌కు చిక్కిన సంగతి తెలిసిందే. వెంటనే అతడికి బైబై చెబుతూ ఇక వెళ్లు అంటూ సంజ్ఞలు చేసిన రబాడ.. అసభ్య పదజాలంతో దూషించాడు కూడా. అతడి చర్యలు బ్యాట్స్‌మన్‌ను రెచ్చగొట్టేలా ఉన్నాయంటూ ఫీల్డ్ అంపైర్లు ఇయాన్ గౌల్డ్, షాన్ జార్జి, మూడో అంపైర్ అలీమ్ దార్, నాలుగో అంపైర్ బొంగాని జెలె అభియోగాలు మోపగా వాటిని రబాడ అంగీకరించాడు. తనపై జరిమానాకు కూడా ఎలాంటి అభ్యంతరం తెలపలేదు. మొత్తంమీద రబాడ ఖాతాలో ఐదు అయోగ్యత పాయింట్లున్నాయి. నాలుగు పాయింట్లు వచ్చిన వెంటనే అతడిపై ఓ టెస్టు మ్యాచ్ నిషేధం పడింది. 24 నెలల్లోపు పాయింట్లు ఎనిమిదికి చేరితే.. అతడిపై ఐసీసీ రెండు టెస్టులు లేదా ఓ టెస్టు, రెండు వన్డే/టీ20ల నిషేధం విధిస్తుంది.

ఆ పానీయాలు రోజూ తాగితే..
సంతాన సాఫల్యతకు ముప్పు!



బోస్టన్: దంపతుల్లో ఎవరికైనా ప్రతి రోజూ తీయని పానీయాలు (సుగర్-స్వీటెన్డ్ డ్రింక్స్) తాగే అలవాటుంటే గర్భధారణ అవకాశాలు తగ్గిపోతాయని తాజాగా ఓ అధ్యయనం హెచ్చరించింది. ఇలాంటి పానీయాలను సేవించడానికి.. సంతానసాఫల్య అవకాశాలు తగ్గడానికి మధ్య సంబంధం ఉన్నట్లు అమెరికా శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈమేరకు బోస్టన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ఉత్తర అమెరికా జంటలపై 12 నెలలపాటు అధ్యయనం జరిపారు. 3,828 మంది మహిళలు, వారిలో కొందరి భాగస్వాములపై సర్వే నిర్వహించారు. గర్భం దాల్చాలని కోరుకుంటే తీయని పానీయాల వినియోగాన్ని పరిమితం చేయాలని ప్రధాన అధ్యయన రచయిత, విశ్వవిద్యాలయానికి చెందిన ఎలిజబెత్ హేచ్ సూచించారు. అలాగే కెఫిన్ తీసుకోవడం, ఆల్కాహాల్ సేవించడం, ధూమపానం, ఆహార నియమాలు, స్థూలకాయం వంటివి కూడా గర్భధారణపై ప్రభావం చూపుతున్నట్లు వెల్లడించారు. పురుషులు, మహిళల్లో తీయని పానీయాలు సేవించే అలవాటుంటే సగటున 20శాతం గర్భం దాల్చే అవకాశాలు తగ్గిపోయినట్లు గుర్తించారు. మహిళలు రోజుకు కనీసం ఒక సోడా తీసుకుంటే 25 శాతం.. అదే పురుషులు తీసుకుంటే వారి భాగస్వాములకు 33 శాతం గర్భధారణ అవకాశాలు తగ్గిపోయినట్లు అధ్యయనంలో తేలింది. శక్తి పానీయాలు (ఎనర్జీ డ్రింక్స్) తీసుకుంటే ముప్పు మరింతగా ఉన్నట్లు గుర్తించారు. అలాగే సంతానసాఫల్య అవకాశాలు మెరుగుపడాలంటే దంపతులు మానసిక ఒత్తిళ్లు, ఆర్థికపరమైన ఇబ్బందులు కూడా తగ్గించుకోవాల్సి ఉంటుందని శాస్త్రవేత్తలు సూచించారు.

గుండెజబ్బుల నుంచి 'జన్యు' రక్షణ!



లాస్ ఏంజిలెస్: గుండెజబ్బుల నివారణలో కీలక పాత్ర పోషించగల ఓ జన్యువును అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. 'మెక్సిస్'గా పిలుస్తున్న ఈ జన్యువు రక్తనాళాల్లో అదనపు కొలెస్టరాల్‌ను తొలగించేందుకు దోహదపడుతుందని వెల్లడించారు. సాధారణంగా మన శరీరంలో కొన్ని జన్యువులు ప్రోటీన్ల సంశ్లేషణలో పాల్గొనవు. కోడింగ్ రహిత ఆర్ఎన్ఏలుగా పిలవబడే ప్రత్యేక అణువులను మాత్రమే అవి ఉత్పత్తి చేస్తాయి. మెక్సిస్ ఈ కేవకు చెందిన జన్యువేనని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. రక్తనాళాల్లో పేరుకుపోయే కొలెస్టరాల్‌ను తొలగించే ఓ ప్రోటీన్ వ్యక్తీకరణను అది నియంత్రిస్తుందని పేర్కొన్నారు. సాధారణ స్థాయిలో మెక్సిస్‌ను కలిగి ఉన్న ఎలుకలతో పోలిస్తే.. ఆ జన్యువు లేని ఎలుకల రక్తనాళాల్లో కొలెస్టరాల్ అడ్డంకులు రెట్టింపు స్థాయిలో ఉంటున్నట్లు తమ పరిశోధనల్లో తేలిందన్నారు. గుండె-రక్తనాళాల సంబంధిత వ్యాధులను నిలువరించడంలో మెక్సిస్‌ను ఉపయోగించుకోవడంపై తాము దృష్టిసారించినట్లు తెలిపారు.

ఓజోన్ ఛత్రం మెరుగుపడుతోంది!



వాషింగ్టన్: హానికర అతినీలలోహిత కిరణాల నుంచి ప్రాణకోటికి రక్షణ కల్పిస్తున్న ఓజోన్ పొర పరిస్థితి ఇటీవల కాస్త మెరుగుపడినట్లు నాసా శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఏటా సెప్టెంబరులో అంటార్కిటికాపై వాతావరణ పొరలో ఓజోన్ పొరకు ఏర్పడే రంధ్రం గతేడాది చాలా తక్కువ పరిమాణంలో కనిపించిందని తెలిపారు. 1988 తర్వాత ఇంత కనిష్ఠ వైశాల్యంలో చీలిక ఏర్పడటం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. 2005-2016 మధ్యకాలంతో పోలిస్తే గతేడాది ఓజోన్ పొర క్షీణత దాదాపు 20 శాతం తక్కువగా నమోదైందని వెల్లడించారు. ప్రమాదకర క్లోరో ఫ్లోరో కార్బన్ల(సీఎఫ్‌సీలు)పై ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలు విధించిన నిషేధమే ఈ శుభ పరిణామానికి కారణం కావొచ్చని అభిప్రాయపడ్డారు.

ఇంధనమే ఇరుసుగా మోదీ దౌత్యం

- దేశానికి చమురు భద్రత కల్పించేలా విదేశాలతో ఒప్పందాలు
- మిత్ర దేశాలకు పొసగని వారితోనూ వాణిజ్య బంధం
- నేటి నుంచి భారత్‌లో ఇరాన్ అధ్యక్షుడి పర్యటన

ఈనాడు - దిల్లీ



ఇరాన్ అధ్యక్షుడు రౌహానీ

ఈనాడు, దిల్లీ: ఇంధన అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడుతున్న మనదేశానికి చమురు భద్రత కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకొంటోంది. మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానంలో ఇంధన దౌత్యం అత్యంత కీలకంగా మారింది. ప్రధాని మోదీ ఇటీవలి పశ్చిమాసియా సందర్శన, భారత్‌కు విచ్చేస్తున్న ఇరాన్, అమెరికా, సౌదీ అరేబియా నేతలు, మంత్రుల పర్యటనల్లోని ద్వైపాక్షిక చర్చల్లోనూ ఇదే ప్రధాన అంశం. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇజ్రాయిల్, సౌదీ అరేబియా, అమెరికాలతో సంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అదే సమయంలో ఆ దేశాలతో ఏ మాత్రం పొసగని ఇరాన్‌తోనూ సన్నిహితంగా ఉంటోంది. ఇదేవిధంగా ఇజ్రాయిల్-పాలస్తీనాలతోనూ భారత్ సమదూరం పాటిస్తూనే రెండు దేశాలకు స్నేహ హస్తాన్ని అందిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ గురువారం నుంచి మూడు రోజుల పాటు మనదేశంలో పర్యటించనున్నారు. 2013లో అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఇక్కడకు రావటం ఇదే ప్రథమం. హైదరాబాద్ నుంచి రౌహానీ పర్యటన ప్రారంభమవుతుంది. అధ్యక్షుడవ్వటానికి ముందు గతంలో ఒకసారి హైదరాబాద్‌ను సందర్శించారు. వచ్చే వారంలో సౌదీఅరేబియా చమురుశాఖ మంత్రి ఖలీద్ అల్ ఫలిహ్, ఆ తర్వాత అమెరికా ఇంధనశాఖ మంత్రి రిక్ పెర్రీ కూడా దిల్లీకి రానున్నారు.

ఇరాన్ నుంచి సహజవాయువు

గత వారం ప్రధాని మోదీ పశ్చిమాసియా పర్యటనలో భాగంగా పాలస్తీనా, యూఏఈ, ఒమన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా కుదిరిన కీలక ఒప్పందాలు దేశ ఇంధన అవసరాలు తీర్చుకోవటం, చమురు నిల్వల పెంపునకు ఉద్దేశించినవే. ఓఎన్‌జీసీ నేతృత్వంలోని భారత చమురు కంపెనీలు యూఏఈకి చెందిన జకుమ్ చమురుక్షేత్రంలో 10శాతం వాటా కొనుగోలుకు ఈ సందర్భంగానే ఒప్పందం కుదిరింది. ఇరాన్ అధ్యక్షుడు రౌహానీ భారత పర్యటన సందర్భంగా తమ దక్షిణ తీరంలోని ఛాబహార్ పోర్టు నుంచి గుజరాత్‌లోని పోరుబందర్‌కు సముద్రం అడుగున నిర్మించే 1300 కి.మీ పొడవైన గొట్టపు మార్గంపై కీలక చర్చలు జరపనున్నారు. ఈ మార్గం ద్వారా సహజవాయువును భారీ మొత్తంలో నేరుగా భారత పశ్చిమతీరానికి తరలించవచ్చు. పర్షియన్ గల్ఫ్‌లోని ఫర్జాద్ బి చమురు క్షేత్రం వివాదాన్ని రెండు దేశాలు పరిష్కరించుకొనే అవకాశం ఉంది. 2017 సెప్టెంబరులో ఈ చమురు క్షేత్రం అభివృద్ధి పనులను భారత్‌కు చెందిన ఓఎన్‌జీసీకి అప్పగించేందుకు ఇరాన్ తిరస్కరించింది.

భారత్‌లో సౌదీ అరేబియా రిఫైనరీ

ఈనెల 23-24 తేదీల్లో సౌదీ అరేబియా చమురు శాఖ మంత్రి ఖలీద్ మన దేశంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సౌదీ అరేబియా ప్రభుత్వ ఇంధన కంపెనీ ఆరామ్‌కో(ఏఆర్ఏఎంసీఓ) భారత పశ్చిమ తీరంలో చమురుశుద్ధి కర్మాగారం(రిఫైనరీ) నిర్మించే ప్రతిపాదనపై ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. అమెరికా చమురుశాఖ మంత్రి రిక్ పెర్రీ రాక సందర్భంగా బొగ్గు, పౌర అణు ఇంధనం, హైడ్రోకార్బన్ల సరఫరాకు సంబంధించి రెండు దేశాల మధ్య మరిన్ని ఒప్పందాలకు అవకాశం ఉందని చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.

విమాన ప్రమాదంలోనే నేతాజీ మృత్యువాత

తాజా పుస్తకంలో ఆయన మేనల్లుడి వివరణ

దిల్లీ: నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రాణాలను బలితీసుకున్నది విమాన ప్రమాదమేనని ఆయన మేనల్లుడు ఆశిష్ రే స్పష్టం చేశారు. 11 వేర్వేరు దర్యాప్తుల వివరాలను క్రోడీకరించి.. 'లెయిడ్ టు రెస్ట్' అనే పుస్తకాన్ని తాజాగా ఆయన వెలువరించారు. నేతాజీ మరణానికి సంబంధించి కొనసాగుతున్న సందిగ్ధతకు తెరదించేందుకు అందులో యత్నించారు. 1945 ఆగస్టు 18న తైపీలో చోటుచేసుకున్న విమాన ప్రమాదంలో బోస్ మృత్యువాతపడ్డారని తెలిపారు. నాడు నేతాజీ జపాన్ వైమానికదళ విమానంలో ప్రయాణించారని.. విమానంలో కొన్ని లోపాలుండటంతో.. తైపీ నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే కుప్పకూలిపోయిందని వెల్లడించారు. ప్రమాదం అనంతరం కొన్ని గంటలపాటు నేతాజీ ప్రాణాలతో ఉన్నారని.. అదేరోజు సాయంత్రం నన్మాన్ సైనిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారని వివరించారు. నాడు విమానంలో నేతాజీతోపాటు మరో 12 మంది ఉన్నారని.. వారిలో ఆరుగురు మృతి చెందారని తెలిపారు. మిగిలిన ఆరుగురు ప్రమాదానికి సంబంధించి వాంగ్మూలాలు ఇచ్చారని.. వాటిని ఏమాత్రం తోసిపుచ్చలేమని తెలిపారు. భారతీయ(4 దర్యాప్తులు), జపాన్(3), బ్రిటన్(3), తైవాన్(1) దర్యాప్తుల వివరాలను తాజా పుస్తకంలో ఆశిష్ వెల్లడించారు.

నెతన్యాహుపై నేరాభియోగాలు!

- ప్రభుత్వ విచారణకు పోలీసుల సిఫార్సు
- తగిన ఆధారాలున్నాయని వెల్లడి
- రాజీనామా డిమాండ్లను తోసిపుచ్చిన ఇజ్రాయెల్ ప్రధాని



జెరూసలెం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు(68)కు ఎదురుదెబ్బ. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయనపై రెండు కేసుల్లో నేరాభియోగాలు నమోదు చేయాలని పోలీసలు బుధవారం సిఫార్సు చేశారు. 14 నెలల పాటు దర్యాప్తు చేసిన పోలీసులు.. నెతన్యాహుకు వ్యతిరేకంగా తగిన ఆధారాలు లభించాయని ప్రకటించారు. ప్రభుత్వ విచారణకు సిఫార్సు చేశారు. రెండు కేసుల్లో ఒక కేసు.. కేసు-1000గా పిలుస్తారు. అనుకూలంగా పనులు చేసిపెట్టడానికి కానుకలు స్వీకరించాన్నది ఇందులో ఆరోపణ. పదేళ్ల కాలంలో దాదాపు 3లక్షల డాలర్లు స్వీకరించారని పోలీసులు ఆరోపించారు. మరో కేసును కేసు-2000గా పిలుస్తారు. నెతన్యాహు తనకు అనుకూలమయిన కవరేజ్ కోసం ఒక ప్రముఖ వార్తా పత్రిక ప్రచురణకర్తతో తెరవెనక లావాదేవీలు జరిపారన్నది ఇందులో ఆరోపణ. పోలీసుల తాజా సిఫార్సుల నేపథ్యంలో నెతన్యాహు రాజీనామా చేయాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయి. వీటిని ఆయన తోసిపుచ్చారు. పోలీసుల దర్యాప్తును విమర్శించారు. పోలీసు నివేదిక తప్పుదోవ పట్టించేలా ఉందని, వాస్తవానికి విరుద్ధంగా ఉందని అన్నారు. తన సంకీర్ణ ప్రభుత్వం సుస్థిరంగా ఉందన్నారు. తదుపరి ఎన్నికల్లోనూ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటానని చెప్పారు. పోలీసులు తమ వద్ద ఉన్న ఆధారాలను అటార్నీ జనరల్‌కు అందజేస్తారు. ప్రధానిపై నేరాభియోగాలు మోపాలా వద్దా అన్న నిర్ణయాన్ని అటార్నీ జనరల్ తీసుకుంటారు. ఇజ్రాయెల్ చట్టం ప్రకారం దోషిగా నిర్ధారణ అయి, అప్పీలు ప్రక్రియలోనూ దోషిగానే నిరూపణ అయితేనే ప్రధాని పదవి నుంచి వైదొలగాల్సి ఉంటుంది. ఇందుకు చాలా ఏళ్ల సమయం పడుతుంది. అయితే పదవికి రాజీనామా చేయాలని రాజకీయంగా ఒత్తిడి పెరుగుతుంది. సంకీర్ణ భాగస్వాములు మాత్రం ఇప్పటి వరకు ఆయకు మద్దతుగానే ఉన్నారు. పోలీసుల నివేదిక ఆధారంగా ప్రభుత్వాన్ని గద్దె దింపబోమని స్పష్టం చేశారు.

ట్రంప్ తరఫున శృంగార తారకు 1.30 లక్షల డాలర్లు చెల్లించా...

- ఆ డబ్బు నాకు తిరిగి ఇవ్వలేదు
- అమెరికా అధ్యక్షుడి న్యాయవాది వెల్లడి



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరఫున ఓ శృంగార తారకు 1,30,000 డాలర్లు (సుమారు రూ. 87 లక్షలు) చెల్లించానని ఆయన వ్యక్తిగత న్యాయవాది మైఖేల్ కోహెన్ వెల్లడించారు. ఇది చట్టబద్ధమైన చెల్లింపేనని చెప్పారు. దేని నిమిత్తం అంత డబ్బు చెల్లించారో వెల్లడించడానికి మాత్రం నిరాకరించినట్లు 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక తెలిపింది. ట్రంప్‌తో తనకు సంబంధం ఉందని ఆ శృంగార తార గతంలో చెప్పడం ఇక్కడ గమనార్హం. స్టార్మీ డేనియల్స్‌గా ప్రసిద్ధురాలైన ఆ తార అసలు పేరు స్టీఫెన్ క్లిఫర్డ్ అనీ, తాను ఆమెకు చెల్లించిన డబ్బును ట్రంప్ ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ తిరిగి ఇవ్వలేదనీ మైఖేల్ చెప్పారు. ఒక సాధారణ పౌరుడిగా ట్రంప్ ఉన్నప్పుడు 2006లో నడిచిన వ్యవహారం గురించి బయటపెట్టకుండా ఉండేందుకే 2016 నవంబరులో ఎన్నికలకు ముందు ఈ భారీ మొత్తాన్ని శృంగార తారకు కట్టబెట్టారని అమెరికా ప్రసార మాధ్యమాలు ఇప్పటికే కథనాలు వెలువరించాయి. తొలిసారిగా 'వాల్‌స్ట్రీట్ జర్నల్'లో గత నెలలో ఇవి వెలుగుచూశాయి. తమ మధ్య అసలు 'అలాంటి'దేమీ జరగలేదని ట్రంప్ ఖండిస్తూ వస్తున్నారు. క్లిఫర్డ్ కూడా తొలుత ఇదే మాట చెప్పారు. తమ మధ్య ఉన్న సంబంధం గురించి 2011లో ఒక ముఖాముఖిలో డేనియల్స్ సవివరంగా చెప్పిన విషయాలను 'ఇన్ టచ్' అనే పత్రిక గత నెలలో మళ్లీ ప్రచురించింది.

రాజీనామాకు జుమా ససేమిరా

జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్‌జుమా పదవికి రాజీనామా చేయడానికి తిరస్కరించారు. అవినీతి ఆరోపణలతో పాటు... దేశంలో నిరుద్యోగితను పరిష్కరించలేకపోయారని, ఆర్థికమాంద్యాన్ని చక్కదిద్దలేకపోయారని జుమా ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. పదవి నుంచి వైదొలగాలని లేదంటే పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానానికి సిద్ధం కావాలన్న అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ ఆదేశాలను ధిక్కరించారు. తాను ఎందుకు రాజీనామా చేయాలో పార్టీ కారణాలు చెప్పలేదని ఒక టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మరోవైపు జుమా సంక్షోభం నేపథ్యంలో దక్షిణాఫ్రికా పోలీసులు భారత సంతతి గుప్తా కుటుంబం నివాసంలో సోదాలు నిర్వహించారు. ఈ వివాదాస్పద వ్యాపార కుటుంబంతో జుమాకు సంబంధాలున్నాయి. సోదాల సందర్భంగా ముగ్గురిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు లొంగిపోయే అవకాశాలున్నాయి. గుప్తా సోదరులు దక్షిణాఫ్రికాలో రాజకీయాలపై విస్తృత ప్రభావం చూపిస్తున్నారు. వారి వ్యాపార ప్రయోజనాల కోసం ప్రభుత్వాన్ని తమ గుప్పిట్లో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నది విమర్శకుల ఆరోపణ. జుమా,ఆయన కుమారుడు, కుమార్తె, జుమా భార్యల్లో ఒకరితో గుప్తా కుటుంబానికి స్నేహసంబంధాలున్నాయి. పేద నల్లజాతి రైతుల కోసం ఉద్దేశించిన డైరీ ప్రాజెక్టు నుంచి గుప్తా సోదరులు భారీ ఎత్తున సొమ్ము పోగేసుకున్నారని ఆరోపణలు వచ్చాయి.

గురక పెడుతున్న ప్రయాణికుడి చేత జాగారం చేయించారు!

ముంబయి: సాటి ప్రయాణికుడొకరు పెడుతున్న గురక ధాటికి చుట్టుపక్కల బెర్త్‌ల మీదున్న వారెవరికీ కంటిమీద కునుకు రాలేదు. చాలా సేపు ఓపిగ్గా చూశారు. అయినా సరే...గురక జోరు తగ్గలేదు. చివరకు అంతా కలిసి కూడబలుక్కుని గురక పెడుతున్న రామచంద్ర అనే ఆ ప్రయాణికుడిని నిద్రలేపారు. ఆయన మూలంగా కలుగుతున్న ఇబ్బందిని తెలియచేశారు. ఆ సందర్భంగా తీవ్ర వాగ్వివాదాలే జరిగాయి. చివరకు అంతా కలిసి ఓ నిర్ణయానికి వచ్చారు. గురక ప్రయాణికుడిని నిద్రపోనీయకుండా కొన్ని గంటలపాటు ఆపగలిగితే అక్కడున్న మిగిలిన వారంతా కాసేపు నిద్రపోవచ్చనుకున్నారు. అదే విషయాన్ని ఆయనకు చెప్పారు. కోపాలు...వాగ్వాదాలు...నచ్చచెప్పడాలు...బెదిరింపులూ అన్నీ అయ్యాక రామచంద్ర సాటి ప్రయాణికుల మాట విని...ఓ అయిదారుగంటల పాటు నిద్రపోకుండా అలాగే మేలుకుని ఉన్నారు. తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో జబల్‌పూర్ స్టేషన్‌లో విధినిర్వహణకు వచ్చిన గణేశ్ వి. విర్హా అనే టికెట్ ఇన్స్పెక్టర్ ఈ విషయాన్ని వెల్లడించారు. రామచంద్ర ఏ మాత్రం కోపం తెచ్చుకోలేదు. తనను నిద్రపోనివ్వకుండా అడ్డుకున్న ప్రయాణికులపై ఫిర్యాదు చేయలేదన్నారు. తెల్లారేసరికి అంతా కలిసి కబుర్లు చెప్పుకొన్నారన్నారు. ఈ ఘటన ఇటీవల ఎల్‌టీటీ-దర్భంగా పవన్ ఎక్స్‌ప్రెస్ రైలు త్రీటైర్ ఏసీ బోగీలో చోటు చేసుకుంది.

ప్రేమకు అసలు నిర్వచనం

- ప్రేమికుల రోజున ఆమ్లదాడి
- బాధితురాలి నిశ్చితార్థం

లఖ్‌నవూ: ప్రేమికుల రోజున ప్రేమకు అసలైన నిర్వచనాన్ని.. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ జంట చాటిచెప్పింది. ఆమ్లదాడి బాధితురాలైన ప్రమోదినికి.. తన స్నేహితుడు సరోజ్ సాహుతో బుధవారం లఖ్‌నవూలో నిశ్చితార్థం జరిగింది. ప్రమోదిని స్వస్థలం ఒడిశా. తన ప్రేమను నిరాకరించిందన్న కారణంతో 2009లో ఓ ఉన్మాది ఆమెపై ఆమ్లదాడికి ఒడిగట్టాడు. ఘటనలో 80% కాలిన గాయాలు కావడంతోపాటు.. ప్రమోదిని కంటిచూపూ పోయింది. తొమ్మిది నెలలపాటు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆమెను.. డబ్బు లేకపోవడంతో కుటుంబసభ్యులు ఇంటికి తీసుకువెళ్లారు. ఆ తర్వాత ఐదేళ్లు ఆమె మంచానికే పరిమితమయ్యారు. 2014లో తిరిగి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రమోదినిని చేర్పించారు. ఇక్కడే మెడికల్ రిప్రజంటేటివ్‌గా పనిచేస్తున్న సాహు ఆమెకు పరిచయమయ్యారు. ప్రమోదిని నడిచేందుకు కనీసం పది నెలలు పడుతుందని వైద్యులు వెల్లడించగా.. సాహూ సాయంతో ఆమె నాలుగు నెలల్లోనే తన కాళ్లపై తాను నిలబడగలిగారు. ఆమెను జాగ్రత్తగా చూసుకునేందుకు సాహూ ఉద్యోగం కూడా మానేశారు. 2016లో 'స్టాప్ యాసిడ్ అటాక్స్ క్యాంపెయిన్' సంస్థ చేయూతను అందించడంతో.. మెరుగైన చికిత్సల కోసం ఆమె దిల్లీకి వచ్చారు. అప్పుడే ప్రమోదిని లోటు తనకు తెలిసిందని. . పెళ్లి చేసుకుంటానని ప్రతిపాదించానని సాహు చెప్పారు. అయితే తానున్న పరిస్థితి కారణంగా సాధారణ జీవితం గడపటం కష్టమని భావించిన ప్రమోదిని.. సాహు ప్రతిపాదనను అంత త్వరగా అంగీకరించలేదు. సాహు పట్టువిడవలేదు. ఆయన ఒత్తిడితో కంటి చికిత్సలు చేయించుకున్న ప్రమోదినికి.. తిరిగి 20% మేర కనుచూపు వచ్చింది. ఇటు పెళ్లి ప్రతిపాదనకు ప్రమోదిని అంగీకారం తెలిపింది. దీంతో లఖ్‌నవూలోని 'షీరోస్ హ్యాంగవుట్ కెఫే'లో ప్రేమికుల రోజున వీరిద్దరూ నిశ్చితార్థం చేసుకున్నారు. వచ్చే ఏడాది ఇదే రోజున.. పెళ్లి చేసుకోవాలని కూడా నిర్ణయానికి వచ్చారు. వివాహం తర్వాత తిరిగి ఒడిశాకు వెళ్లి.. 'స్టాప్ యాసిడ్ అటాక్ క్యాంపెయిన్' నడుపుతున్న ఇలాంటి కెఫెనే రాష్ట్రంలోనూ ఏర్పాటుచేసి ఆమ్లదాడి బాధితులకు ఉపాధి కల్పించాలని భావిస్తోంది ఈ ప్రేమజంట.



నిశ్చితార్థ ఉంగరాలతో ప్రమోదిని, సరోజ్ సాహు

అమెరికా గూఢచర్య సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద కాల్పులు

వాషింగ్టన్: అమెరికా గూఢచర్య సంస్థ జాతీయ భద్రత విభాగం (ఎన్ఎస్ఏ) ప్రధాన కార్యాలయం బయట.. బుధవారం ఉదయం కాల్పులు చోటుచేసుకున్నాయి. సంకెళ్లు వేసిన ఓ వ్యక్తిని పోలీసులు చుట్టుముట్టి ఉన్న దృశ్యాలను అక్కడి వార్తా ఛానెళ్లు ప్రసారం చేశాయి. తూటాలు తగిలి, కాంక్రీటు దిమ్మెకు ఢీకొట్టుకొని ఆగిపోయిన ఒక ఎస్‌యూవీ వాహనం కూడా వీటిలో కనిపించింది. ఈ కార్యాలయం వాషింగ్టన్‌లో ఉంది. కాల్పుల ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడని.. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారని వార్తా ఛానెళ్లు పేర్కొన్నాయి. ప్రస్తుతం పరిస్థితి నియంత్రణలోనే ఉందని ఎన్ఎస్ఏ ప్రకటించింది. ఘటనపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సమాచారం తెలియజేసినట్లు శ్వేతసౌధం పేర్కొంది.

వారణాసి వ్యూహకర్తే.. త్రిపురలోనూ మార్గదర్శి

వామపక్ష కంచుకోటలో భాజపా బలోపేతానికి కృషిచేస్తున్న దేవ్‌ధర్



అగర్తలా: వారణాసిలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రచార కార్యక్రమ బాధ్యతలను నిర్వర్తించిన వ్యక్తే.. ఇప్పుడు త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లోనూ భాజపాను గెలిపించేందుకు కృషి చేస్తున్నారు. ఆయనే మహారాష్ట్రకు చెందిన 53ఏళ్ల సునీల్ దేవ్‌ధర్. ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన.. ఆ తర్వాత సంస్థలో పలు కీలక విధులను నిర్వర్తించారు. 2014 పార్లమెంటు ఎన్నికల్లో వారణాసిలో మోదీ ప్రచార కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను.. సమర్థంగా పూర్తి చేశారు. దీంతో వామపక్ష కంచుకోట అయిన త్రిపురలో.. భాజపాను బలోపేతం చేసే పనిని కూడా ఆయనకే పార్టీ అప్పజెప్పింది. మూడేళ్ల క్రితం దేవ్‌ధర్ త్రిపురకు వచ్చేనాటికి.. భాజపాకు రాష్ట్రంలో పునాదులైనా సరిగ్గా లేవు. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. భాజపా ఇక్కడ గట్టి ప్రతిపక్షంగా అవతరించింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ చొచ్చుకువెళ్లేలా చేయడంలో దేవ్‌ధర్ కీలకపాత్ర పోషించారు. 1993 నుంచి ఇక్కడ అధికారంలో ఉన్న వామపక్షానికి.. ఫిబ్రవరి 18న జరిగే ఎన్నికలు సవాలే. మెజార్టీ సీట్లు ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో.. దేవ్‌ధర్ విస్తృతంగా పర్యటించి భాజపాకు మద్దతును కూడగట్టారు. అన్ని వర్గాల సమస్యలు, ఆందోళనలను తెలుసుకున్నారు. వరుసగా వివిధ రాష్ట్రాల్లో భాజపా సాధిస్తున్న విజయాలు.. త్రిపురలో పార్టీ పట్ల జనాలు ఆకర్షితులయ్యేలా చేశాయని దేవ్‌ధర్ చెప్పారు. "60 అసెంబ్లీ నియోజకవర్గాల్లో చాలాసార్లు పర్యటించి.. క్షేత్రస్థాయి కమిటీలు ఏర్పాటు చేశాం. మొదట కొంతమంది యువకులు పార్టీలో చేరారు. ఆ తర్వాత వెల్లువ మొదలైంది. ప్రస్తుతం 30 వేల మంది యువ నాయకులు మాతో పని చేస్తున్నారు" అని ఆయన అన్నారు. రాష్ట్రంలో ప్రతిసారీ ప్రభుత్వ వ్యతిరేకత ఉన్నప్పటికీ పోలింగ్ 95% దాటుతోందని.. దొంగ ఓట్ల వల్లే ఇది సాధ్యమైందని దేవ్‌ధర్ ఆరోపించారు. ప్రస్తుతమున్న సాంకేతికత కారణంగా ఈసారి ఎన్నికల్లో అక్రమాలు కుదరవని.. వామపక్షం పట్ల ప్రజలు విసుగు చెంది ఉన్నారని ఆయన చెప్పారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.

GH